

ళ్ళల్లో చిలిపిదనం వయసులో వయ్యారం
టికొచ్చిందొక రూపం... సరిత శారీస్
35759
SARITA®
FABRICS
BOMBAY-1
DRESS MATERIALS, PUNJABI SUITS.
ముఖ్య షాపులలో లభించును.
Filmstar Bhanupriya in Sarita Fabrics – Mayuri

ఆంధ్రసచిత్రవారపత్రిక

దీపావళి కథల బ్యాలట్ ఫలితాలు!

పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లుకు, ప్రకటనకర్తలకు అందరికీ ఆంధ్రసచిత్ర వారపత్రిక సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సంక్రాంతి సమాజాన్ని క్రాంతిలోకీ, శాంతిలోకీ నడిపించాలని ఆకాంక్షిస్తున్నాం!


అవధానుల విజయలక్ష్మి

ఆంధ్రసచిత్ర వారపత్రిక 1988 దీపావళి కథల పోటీలో రు. 700/- బహుమతి పొందిన ఆరు కథలపై నిర్వహించిన పాఠకుల బాలట్, వ్యాస రచన పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని వాటిని జయప్రదం చేసిన వారందరికీ మా కృతజ్ఞతలు!

ప్రతిఫలాపేక్ష లేకుండా వ్యక్తమయ్యే మానవతా స్పర్శను ప్రకటించిన 'గడ్డి గులాబీ' కథ పాఠకుల బాలట్‌లో ప్రథమ స్థానాన్ని అలంకరించింది. రచయిత్రి శ్రీమతి అవధానుల విజయలక్ష్మి అదనపు బహుమతిగా రు. 750/- అందుకుంటారు.

వ్యాపార బంధాలు ప్రబలమై తల్లిదండ్రులకూ పిల్లలకూ మధ్య నెల కొంటున్న సంబంధాలలో దౌష్ట్యానికి అద్దం పట్టిన 'శేషప్రశ్న' కథకు పాఠకులు ద్వితీయ స్థానాన్ని ఇచ్చారు. రచయిత శ్రీ 'జగన్ మిత్ర' (శ్రీ కె. జగ్గారావు) అదనపు బహుమతిగా రు. 650/- అందుకుంటారు.

తండ్రులకు, కొడుకులకు మధ్య కొనసాగుతున్న సంబంధాలకే మరో కోణాన్ని చూపి తారతమ్య విశ్లేషణకు అవకాశం కలిగించిన 'కర్తవ్యం నీవంతు' కథకు పాఠకులు తృతీయ స్థానాన్ని ఇచ్చారు. రచయిత శ్రీ కన్నేపల్లి గోపాల కృష్ణ అదనపు బహుమతిగా రు. 550/- అందుకుంటారు.

ఇక మిగిలిన 'విద్యాదేవి', 'పులి', 'నిప్పులేని పొగ' వరుసగా నాలుగు , ఐదు, ఆరవ స్థానాల్ని పొందాయి. 'విద్యాదేవి' రచయిత్రి కుమారి నందివాడ సుబ్బలక్ష్మి, 'పులి' రచయిత శ్రీ వక్కలంక రామారావు, 'నిప్పు లేని పొగ' రచయిత్రి శ్రీమతి గోగినేని మణి అదనంగా రు. 350/- చొప్పున ప్రత్యేక బహుమతులు అందుకుంటారు.

ప్రథమ బహుమతి విజేత శ్రీమతి అవధానుల విజయలక్ష్మి ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకు సుపరిచితులే. గత సంవత్సరం దీపావళి కథల పోటీలో కూడ ఆమె బహుమతి గెలుచుకున్నారు. ఆమె పుట్టింది, పెరిగింది, చదువుకున్నదీ ఆంధ్ర రాష్ట్రంలోనే అయినా పదకొండేళ్ళుగా నాగపూర్‌లో స్థిరపడ్డారు. వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటికి వివిధ పత్రికలలో ఐదు కథలకు బహుమతులు అందుకున్నారు. "ఉద్యోగం, ఇల్లు, పిల్లలు..... వీటి మధ్య నన్నగిల్లి పోతున్న రచనా వ్యాసంగానికి నాన్నగారు శ్రీ సామవేదుల సీతారామ శాస్త్రిగారు, అమ్మ శ్రీమతి వెంకట రత్నం, శ్రీవారు శ్రీ జగన్నాథ రావుగారు, ఇంకెందరో సాహితీ మిత్రులు ఇచ్చే ప్రోత్సాహం ఊపిరి పోస్తుంటుంది" అంటున్నారు. "సాహితీరంగాన్ని వ్యాపార రంగంగా మార్చేస్తున్న ఈ నవలా రాజ్యంలో ఓ వారం రోజులు మాత్రం పాఠకుల మధ్య తిరిగే ఓ కథ వారి హృదయాలలో చిన్న కదలిక కలిగించినా చాలునని నమ్ముతాను" అని తన ఆశయాన్ని ప్రకటిస్తున్నారు.

ద్వితీయ బహుమతి గ్రహీత శ్రీ 'జగన్ మిత్ర' తనను తాను పరిచయం చేసుకుంటూ—

విశాఖపట్నం దగ్గర్లోని వేపాడ గ్రామంలో, కిలపర్తి సూర్యనారాయణ- అప్పల నరసమ్మ దంపతులు జన్మనిస్తే, శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆదరించి, నా జీవితపంథానే మార్చివేసింది. మొట్ట మొదటిగా నాతో నాటకాల్ని రాయించిందీ, వేయించిందీ, మా 'అంతరిక్ష కళాసమితి' వారే.


జగన్ మిత్ర

గత ఎనిమిదేళ్ళుగా, కార్మికుల సమస్యల పరిష్కారార్థం, కాలాన్ని సద్వినియోగ పరుచుకుంటున్న కార్మిక జీవితం.

'నవల రాయడానికి ఉపక్రమించే నాకు, కాలం దాటని కథను రాయడానికే. కాలాన్ని కేటాయించే ఓర్పుగల కళత్రం హైమ, వంశాంకురం సింధు.

నా మొదటి కథను (లచ్చి) ప్రచురించి, పాఠకలోకానికి పరిచయం చేసిందీ.... పత్రికా ప్రపంచంలో మొట్టమొదటి సారిగా నాకథకు బహుమతినిచ్చి, నాలోని రచయితపై, సాహితీ సాగరంలోని చిటికెడు నీటి తుంపరను చిలకరించి, ఉక్కిరిబిక్కిరి చేసేసిందీ 'ఆంధ్రసచిత్ర వారపత్రికే' అంటున్నారు.

తృతీయ బహుమతిని గెలుచుకున్న శ్రీ కన్నేపల్లి గోపాలకృష్ణ షోలాపూరులో ఇన్‌కమ్‌టాక్స్ ఇనస్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇరవై తొమ్మిది సంవత్సరాల గోపాలకృష్ణ సాహిత్య జీవితాన్ని ప్రారంభించి పది సంవత్సరాలయింది. శ్రీమతి రామలక్ష్మి, బాబు రవి రూపేష్‌లతో పాటు "ఆదరంగా మాట్లాడి, ఆప్యాయంగా ప్రవర్తించే ప్రతివారినీ" ఆయన ఆత్మీయులుగానే లెక్కిస్తారు. "సేల్సు కోసం చవకబారు రచనలను ప్రచురిస్తూ సాహి- ప్రమాణాలను దిగజారుస్తున్న పుస్తకాలను


కన్నేపల్లి గోపాలకృష్ణ

చూసినపుడు "ఆవేదన చెందుతూ, 'అతికొద్ది వ్యవధిలోనే పుంఖానుపుంఖాలుగా రచనలు చేసి, పేరు తెచ్చుకున్న వాళ్ళను చూసినపుడు, వీళ్ళకింత సమయం ఎలా దొరికిందా అని" ఆశ్చర్య పోతారు "సాహితీ చరిత్రలో కలకాలం నిలిచి పోయే మంచి రచన చేయాలనేది" ఆయన ఆశయం.

నాలుగో బహుమతిని గెలుచుకున్న కుమారి నందివాడ సుబ్బలక్ష్మి ఎం. ఎస్‌సి. బి. ఎడ్. చదివారు. జన్మస్థలం, కృష్ణా జిల్లా తాడంకి, తల్లిదండ్రులు, శ్రీమతిగాయత్రి శ్రీ వెంకటసీతారామారావు గారలు. "ప్రత్యేకంగా చెప్పుకోవల్సిన ప్రత్యేకతలు ఏమీ లేవు. 1941 నుండి ఇప్పటి వరకు ప్రొద్దున్నే మా ముంగిటకు వచ్చి, మా చేతుల్లో వుండేది ఆంధ్రపత్రిక (డైలీ). నాకు వ్రాయాలనే ఊహ, ఉత్సాహాన్ని ఇచ్చింది, మొదటగా నాకథలు, వ్యాసాలు ప్రచురించి నన్నొక రచయిత్రిగా చేసి ప్రోత్సహించినది కూడ ఆంధ్ర పత్రిక డైలీ.


రేడియోలో కథానికలు, ఆంధ్రజ్యోతి, శ్రీవాణీలలో కథలు వచ్చినా, ఆంధ్రసచిత్ర వారపత్రికలో కథ ప్రచురింప. బడలేదనే అసంతృప్తిని పోగొట్టటమే కాక, నా కథకు బహుమతినిచ్చి ప్రోత్సహిం ఆంధ్రసచిత్ర వారపత్రికకు కృతజ్ఞురాలిని.

మంచి సాహిత్యాన్ని చదవటం, చ



సంభాషణలలో పాల్గొనటం ఇష్టం. చక్కని పౌరులను తీర్చిదిద్దే ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరు పొందాలని ఆకాంక్ష?" అంటున్నారు.

పాఠకుల బాలెట్‌లో ఐదవస్థానం పొందిన శ్రీ వక్కలంక రామారావు పూర్తి పేరు శ్రీ వక్కలంక విజయ భాస్కర రామారావు. 1941 డిసెంబర్ 23న అయినవిల్లి గ్రామంలో జన్మించిన శ్రీ రామారావు కాకినాడ, ముక్తేశ్వరం, అమలాపురంలలో చదువుకొని ప్రస్తుతం అనపర్తిలో ఉపాధ్యాయుడుగా ఉన్నారు. తన గురించి పరిచయం చేసుకుంటూ-


శ్రీ వక్కలంక రామారావు

"బాల్యంలో బలపం పట్టించి అక్షరాలు గుండ్రంగా వ్రాయటం నేర్పిన గురువు కీ. శే. శ్రీ ముక్కు సత్యనారాయణ శాస్త్రిగారు. కరణీకం చేస్తూ కరణీకాలు రద్దు కాకపూర్వమే కాలం చేసిన మా తండ్రి గారి తరువాత నన్ను తన బిడ్డగా భావించి, చదువు చెప్పించి, నన్ను మనిషిగా చేసినవాడు మా అన్నయ్య, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ బహుమతి గ్రహీత శ్రీ వక్కలంక వెంకట్రావు. అమ్మ తరువాత తనలో మరో అమ్మను చూపించి ఈనాటికీ నన్ను తల్లిలా ఆదరించే మా వదినగారు శ్రీమతి సక్కుమాంబ.

1962లో నా తొలి కథను ప్రచురించి నా లోని రచయితను వెలికి తీసినది ఆంధ్ర సచిత్ర వారపత్రిక. బాల్యం నుంచీ నాకు బాల సాహిత్యం అంటే మక్కువ ఎక్కువ. వివిధ బాలల మాస పత్రికలలో ఇప్పటికి సుమారు 60 కథల దాకా వెలుగు చూశాయి.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రతి ఏటా దీపావళి బహుమతి కథలపై నిర్వహించే వ్యాసరచన పోటీలో వరుసగా, 1985, 1986 లలో రెండవ బహుమతి, 1987లో మొదటి బహుమతి వచ్చింది. ప్రముఖ కవి శ్రీ వక్కలంక లక్ష్మీపతిరావుగారితో కలసి వ్రాసిన 'వసంతోదయం' నవల ప్రగతి వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది.

శేషగిరీ రామారావ్ 'నా శ్రీమతి. మేం ఇద్దరమైతే మాకు ఇద్దరు. పెద్దబ్బాయి చి. వి. వి. ఎన్. కిషోర్, చిన్నబ్బాయి చి. వెంకట రమణారావు.

పాఠకుల బాలెట్‌లో ఆరవ స్థానం పొందిన శ్రీమతి గోగినేని మణి తమగురించి రాస్తూ


గోగినేని మణి

"నా జీవితంలో చెప్పుకోదగ్గ విశేషాలు లేవు. చాలామందిలాగే గ్రాడ్యుయేషన్ వరకూ చదువు, వివాహం, ఇద్దరు పిల్లలు..... ఈ వరుసక్రమంలోనే జీవితం సాగిపోతోంది. స్వస్థలం రాజమండ్రి. ప్రస్తుతం మా వారి ఉద్యోగరీత్యా ఏలూరులో వుంటున్నాం. మావారు సురేష్‌బాబు యూనియన్ బ్యాంక్ ఏలూరు బ్రాంచి మానేజరు.

నా మొదటి కథ ప్రచురింపబడినది ఆంధ్రపత్రికలోనే. ఆంధ్రపత్రిక ద్వారా బహుమతి నందుకోవటం నాకు చాలా సంతోషాన్ని కలుగచేసింది. ముందు ముందు మంచి రచనలు చేయాలనే ఉత్సాహాన్ని కలుగజేసింది" అంటున్నారు.

బహుమతి పొందిన వ్యాసాలు

దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథలపై మేము నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి రు. 250/-లను శ్రీమతి యన్నంరెడ్డి పార్వతీదేవి (మద్రాసు), రెండవ బహుమతి రు. 150/-లను శ్రీ ఆర్. విశ్వనాథరెడ్డి (అనంతపురం), మూడవ బహుమతి రు. 100/-లను శ్రీమతి జి. సత్యవతి (కొవ్వూరు) రాసిన వ్యాసాలకు లభించాయి. ఈ ముగ్గురు వ్యాస రచయిత(త్రు)లకు, వ్యాస రచన పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న వారందరికీ మా అభినందనలు. బహుమతి పొందిన మూడు వ్యాసాలనూ పైసంచికలో ప్రచురిస్తున్నాం!

-సం



చిట్టిపొట్టి చిన్నారి బొమ్మల పేరంటానికి రారండి!
కొలువును ఆప్కో చేనేతలతోనే జరపండి.



సంక్రాంతి... మనోహరమైన పండుగ ... పండుగ వేళ పసందైన సందర్భాల్లో ఒకటి ... ఎందరో దేవుళ్ళు, మరెందరో మహనీయులు, ఇంకా ఎన్నోరకాల బొమ్మలు కొలువైన కమ్మని ప్రదేశం బొమ్మలు కొలువైన పేరంటం — అంతేకాదు అందాల ఆప్కో చేనేత చీరలెన్నో దర్శనమిచ్చే కమనీయ ప్రదేశం కూడ ఈ సంక్రాంతికి, బొమ్మల కొలువు పేరంటానికి ఆప్కో చేనేతలతోనే విచ్చేయండి — ధగధగలాడే ధర్మవరం, నాజూకు నారాయణపేట్, గద్వాల్, అందానికి కొత్త నిర్వచనాన్నిచ్చే కొత్తకోట, పోతపోసుకున్న అందాలు పోచంపల్లి, పుట్టపాక, సిల్కు చేనేతలు, సాదా, మరియు ప్రింటెడ్‌లలో దొరుకుతున్నాయి. ఇంకా పురుషులకోసం రెడీమేడ్ చొక్కాలు, లుంగీలు, ధోవతులు, స్త్రీలకోసం ఎన్నోరకాల చేనేతలు, కుటుంబానికంతటికీ పనికొచ్చే ఎన్నో రకాల గృహాలంకరణ సామాగ్రులు కూడ దొరుకుతున్నాయి. నేడే మీ సమీప ఆప్కో కేంద్రాన్ని దర్శించండి, అందాల చేనేతల్ని ధరించండి--

20% పండుగ తగ్గింపుతో

ఆప్కో

ముచ్చటైన రంగుల్లో మెరిసే మనోహరం
ముప్పై లక్షల చేనేత కళాకారుల శ్రమఫలం

AKSHARA(H)/APCO/811/88

వీక్లీ పోస్ట్

ఆకాంక్ష

మొట్ట మొదట ప్రపంచాని కల్లా వార్తా పత్రికను స్థాపించుకున్న ఘనత 10 వ శతాబ్దమున వెనిస్ నగరానికి దక్కింది భారత దేశాన "ఇండియన్ గెజిట్' తొట్ట తొలి ఆంగ్లపత్రిక క్రైస్తవ మత ప్రచారకులు క్రీ శ 18వ శతాబ్దములో "సమాచార దర్పణి'ని వెలువరించారు ఆ శ్రేణిలో తెలుగు నాట ఆంధ్ర పత్రిక'ను ఒక మహనీయుడు, "దేశోద్ధారకు'డుగా కీర్తిబడసిన ఒక పంతులు గారు వ్యవస్థాపించారు ఆ జనకుడు వెలిగించిన ఈ చిరుదీపం ఎన్నో ఆటుపోట్లను, ఒడిదుడుకులను, పెనుగాలులను తట్టుకుని నేటికీ కాంతివంతంగా ప్రకాశించడం సంతోషకరం ఆ ప్రమిదలో నాడు పోసిన తైలం ఎప్పటికప్పుడు వెలితి పడకుండా నింపబడుతుండడం ఆనంద దాయకం నిన్న మొన్న విజయవాడలో విసరబడ్డ బాంబును, నాడు హిరోషిమా, నాగసాకి నగరాలపై రాల్చిన అణుబాంబులను చూచిన ఈ ఆంధ్రపత్రిక పాఠకులతో వర్తకం చేయకూడదనీ, తగిన విధాన వారిని కూడా పత్రిక నడకలో, గమనంలో, నిర్వహణలో భాగస్తులుగా చేయాలనీ నా ఉప్పితం'

– మన్నెమాల సుందర రామిరెడ్డి, లేబూరు, (ఇందుకూరు పేట మండలం)

బహుమతి పొందిన లేఖ

అభిలాష

ఎనభైఒక్క సంవత్సరాలు పైబడ్డ మన పత్రిక కొందరి దృష్టిలో 'వృద్ధురాలయిపోయింది' అనే భావాన్ని ఈమధ్య కలిగించిన మాట వాస్తవమయినా - తిరిగి క్రొత్త శక్తితో, ఉజ్వలిస్తూ, క్రొత్త గెటప్‌తో వెలువడటం, ప్రతి అవయవం యవ్వనంతో స్పందిస్తూన్న ఆవ్వనిలా పత్రిక సాక్షాత్కరించడం - మాకే కాక రచయితలకు, రసజ్ఞ పాఠకులకు ఎంతో సంతోషకరమయిన విషయం. పత్రిక నడపడం వ్యాపారంగా మారిపోయిన ఈ రోజుల్లో - ఇంకా పాత పద్ధతులలోనే నడపడం అసాధ్యం. అందుకని అతి సామాన్య పాఠకుడి స్థాయికి పూర్తిగా దిగజారిపోకూడదు కూడా. దిగినట్లే కనిపిస్తూ, అతన్ని పైకి లాగవలసిన అవసరం వుంది. రచయితలకేకాక, ఆలోచించగలిగిన పాఠకులందరి మెదళ్లకుదుళ్లు కదిలే చక్కటి ప్రయోజనాత్మకమయిన లేక మనోరంజకమయిన చిన్న చిన్న సమస్యలను యిచ్చి, చక్కటి బహుమతులను ప్రకటించండి. ముఖ్యంగా మీ ప్రోత్సాహంతో రచయితల ఆలోచనలు క్రొత్తమోసు లెత్తాలి హాస్యానికి ప్రస్తుతం చాలా విలువ వుంది. అలసిపోయిన మెదళ్లకు హాస్యమే టానిక్. మీరు ప్రారంభించిన క్రొత్త శీర్షికలన్నీ త్వరలోనే మంచి ప్రతిస్పందనని పొందుతాయి. ముఖచిత్రం గెటప్‌లోనూ, కథలకు వేసే బొమ్మలలోనూ యింకొంత శ్రద్ధ అవసరమేమో!

పత్రికారంగంలో ఒకప్పటి ప్రథమ స్థానాన్ని తిరిగి త్వరలోనే "ఆంధ్ర సచిత్ర వార పత్రిక" పొందాలని అభిలషిస్తూ -

– తులసి బాలకృష్ణ, హైదరాబాద్

క్రికెట్ ముఖ చిత్రాలూ?

క్రీడల గూర్చీ క్రీడాకారుల గూర్చీ తెల్సుకోవాలనుకొనే పాఠకులకు, పత్రిక రమ్యమైన వేదిక కాకూడదా? "క్రీడాదీపిక శీర్షికన 'క్రికెటర్స్'తో అక్కడక్కడ ఇంటర్వ్యూలూ వారి గురించిన వివరాలూ ప్రచురిస్తే క్రీడాప్రియుల కెంతో ఉత్సాహభరితంగా ఉల్లాసంగా ఉంటుంది కదా!' కేవలం సినీ తారలే కాకుండా జనతనూ యువతనూ క్రేజ్‌లో ఊపుతోన్న 'కపిల్‌దేవ్', 'రవిశాస్త్రి' లాటి క్రికెటర్స్‌నూ ముఖ చిత్రాలుగా వేస్తే మరింత కొత్త ఒరవడిని తెచ్చిన వారవుతారు

– వేములవాణి (నెల్లూరు)

విషయానుక్రమణిక

విడి ప్రతి వెల రు. 1-50

ఆంధ్రసచిత్రవారపత్రిక



ముఖచిత్రం: పోసిని సుహాసిని

ఈ వారం ప్రత్యేకం:–

సీరియల్ నవలలు :–

కథలు :–

వ్యాసాలు, శీర్షికలు :

ఆంధ్రసచిత్రవారపత్రిక

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు నా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

సంపుటము 81 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 20

6-1-1989

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు

సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్ (1938 - 1972)

శ్రీ విభవ నామ సం. మార్గశిర బ. చతుర్దశి

మనలో మాట

కాంగ్రెసు పార్టీ (ఐ) ఎమ్. ఎల్ ఏ శ్రీ రంగా హత్యానంతరం సంభవించిన ఘోరకలిలో కనీవినీ ఎరుగని ఆస్తి నష్టం పొందిన విజయవాడ నగరంలో డిసెంబర్ 26 సోమవారం చీకటి సోమవారంగా నిలిచిపోయింది ఒక భూకంపమో, మరొక ఉప్పెనో లేదా యుద్ధమో యిందుకు కారణమైతే ఆ సంగతి వేరు కాని యీ విలయం వేరు పది రోజులైనా యింకా "కర్ఫ్యూలో" మూలుగుతున్నారు ప్రజలు. విజయవాడ నగరంలో సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే - బట్టల వ్యాపారం, సినిమాల సందడి యెంతో గొప్పగా యినుమడించి వుండేది గాని యిప్పుడు నగరంలో సినిమా పంపిణీ కార్యాలయాలున్న ప్రాంతం బోసిపోయి వున్నది- వస్త్ర వ్యాపారానికి "హైవే" అయిన బీసెంటు రోడ్డు బుగ్గిపాలైంది అందరిదీ అయి విజయవాడకు ప్రత్యేక అలంకారాలైన "ఆనంద నిలయాలు" సినిమా థియేటర్లు మంటల మధ్యల మధ్య కూలి వుండగా విజయవాడ నగరం రోదిస్తున్న దీనవదన సదృశంగా వున్నది- దీంతో పాటే కోస్తా ఆంధ్రలోని "నిత్య కళ్యాణం పచ్చతోరణంగా" వుండే గుంటూరు, ఉభయ గోదావరి, కృష్ణాలోని యితర ప్రాంతాలు యిప్పుడు తరని ఆస్తినష్టం, జననష్టంతో కుమిలి పోతున్నాయి. ఇక్కడ అంతా సంక్రాంతి లేదు - "విక్రాంతి"యే!.

రాజకీయ పార్టీల నాయకులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 'ప్రతినిధులు, మంత్రులు, మాజీ మంత్రులు, పత్రికల వారూ అంతా బృందాలు బృందాలుగా, తండోప తండాలుగా వచ్చి యీ ప్రాంతాలను చూసి "పరస్పర నిందారోపణలు" మర్మర భాషలతో- చేసి పోతున్నారు. పరశురామ ప్రీతియైన వ్యాపార సంస్థలలోను- సినిమా పంపిణీ ప్రదర్శన శాలల్లోను పని చేస్తూ పొట్ట పోషించుకునే సుమారు రెండు వేల మంది అతిసామాన్యులు నిరాశ్రయులైనారు వారి కన్నీరు తుడిచే వారెవ్వరు? ఏనుగుకి "మక్క" విరిగితే యెంతో దోమకి "రెక్క" విరిగితే అంత అన్నట్లుగా వున్నది వీరి దీనావస్థ.

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని హామీలు చేసింది పన్నుల మినహాయింపు లన్నది- పునర్నిర్మాణా లన్నది- కేంద్రం కూడా కూలిపోయిన అంతస్తుల విషయంలో ముందుకు రావచ్చును లేదా వీరిలో కొందరు తిరిగి స్వయం కృషితోనే యీ కట్టడాలను "భౌతికం"గా పునర్నిర్మించుకోవచ్చును కాని గాయపడ్డ మనసులు, చెదిరిపోయిన ఆత్మస్థైర్యం మాటేమిటి? ఆ "దిశ"లో జరుగుతున్న కృషి యేమున్నది? ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకొనే తీరును అందరూ అతిగా ప్రదర్శిస్తున్నారు. యిది మరీ అనాగరికం. శ్రీ రంగా అతని అనుయాయులిద్దరి హత్య మీద సమగ్ర దర్యాప్తును అందరి అనుమానాలు నివృత్తి అయ్యే విధంగా సత్వరమే జరగాలి- అదే విధంగా తదనంతరం జరిగిన దుస్సంఘటనల మీద కూడా

"విష బీజాలు పెకలించండి"

దర్యాప్తు జరగాలి- పోలీసు బలగ వైఫల్యం మీద కేవలం పత్రికల ప్రకటనల వల్ల 'ముందు కాలానికి' జరిగే ప్రయోజనమేమీ లేదు ప్రజల ప్రాణమాన ధన సంరక్షణకు ముమ్ముందు తీసుకోనదగ్గ 'చర్యల'ను 'అందరూ" కలిసి కూర్చొని పటిష్ఠంగా రూపొందించాలి పోలీసు కార్యకలాపాలలో 'నిపుణుల' యిన వారిని కూడా సమావేశపర్చి- 'నువ్వే-- నువ్వే' అంటూ "వ్రేలెత్తి" చూపే ధోరణికి స్వస్తి చెప్పి- భవిష్యాంధ్ర జన సముజ్జ్వల జీవన స్థాపన లక్ష్యంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకొని- ఆనక అవి ఆచరించాలి

రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంత యెక్కువగా రాజకీయ పార్టీల కక్షలూ, కార్పణ్యాలూ పెరిగి పోతున్నాయి పార్టీలకి "సిద్ధాంతం ప్రాతిపదిక కావాలన్న" విషయం అందరూ విస్మరించారు. "అధికార"మే లక్ష్యంగా అడ్డదారులు త్రొక్కి కులమతాదుల ప్రాతిపదిక మీద గమ్యం చేరాలన్న దుష్ట సంప్రదాయం యివాళ పడగలెత్తి బుసలు కొడుతున్నది-

"వ్యక్తి" శాశ్వతం కాదు "సంఘం" నిరంతరం. "పార్టీ" కన్నా "ప్రజాస్వామిక పరిపాలనా వ్యవస్థ" శాశ్వతం కావాలి అన్నది ఆదర్శం కావాల్సిన తరుణంలో యిరవై ఒకటో శతాబ్దానికి నిచ్చెనలు వేస్తామన్న పెద్దలంతా ఆత్మ విమర్శ చేసుకోవాలి! "దొందు దొందే"- యిక్కడ ఏ ఒక్కరినో వ్రేలెత్తి చెప్పబోవటం లేదు. ఇప్పుడు జరిగిన దానికి నాయకుల మనుకుంటున్న వారంతా మొదట "తలలు దించుకోవాలి- పిదప తలలు ఏకం చేసి" యీ భౌతిక మానసిక గాయాలను తొలగించే పునర్నిర్మాణ కార్యక్రమానికి నడుం కట్టాలని సంస్కారవంతులైనపౌరులంతా ఉద్ఘోషిస్తున్నారు

ఆధునిక కవితా వైతాళికుడు గురజాడ అన్నట్లు "పూను స్పర్థను విద్యలందే", "వైరము వాణిజ్య మందే" నన్న సూత్రాన్ని "పార్టీ"లు ఎన్నిక అయిన వెంటనే- జ్ఞాపకం పెట్టుకోవాలి! సంయమనం "సేవా ధర్మం" త్యాగం లాంటివి అన్యులకి చెప్పటానికే కాదు బాధితుల కన్నీరు తుడిచేవి పత్రికలలో "ప్రకటనలు"- "పరనింద ఆత్మస్తుతి కావు" అని నలభై సంవత్సరాల పవిత్ర స్వాతంత్ర్యాన్ని భ్రష్టు పట్టించిన పార్టీల నాయకులకు తెలియకనా?- సిద్ధాంతపరమైన పోరాటానికి పునరంకితమై- రాష్ట్ర వ్యాప్తంగా యిప్పుడు "నాటబడుతున్న" "కుల, మత, ప్రాంతీయ విభేధాలను సమూలంగా పెకలించండి! అవి వటవృక్షాలై రాష్ట్ర వ్యాప్తం కాకముందే అందరూ కలిసి జాగ్రత్త పడండి! ఈ దేశం యీ రాష్ట్రం యీ స్వర్గం యీ సౌభాగ్యం మీ ఒక్కరి సొత్తే కాదు- అది భావితరాల వారిది! దయ చేసి మేల్కొనండి!- మీతోనే యీ ప్రపంచం ముగిసి పోదు!-" అని రాజకీయ వాదులను హెచ్చరిస్తున్నాం! రెండు అగ్రరాజ్యాలు యివాళ "శాంతి" కోసం చేతులు కలిపాయి తల్చుకుంటే అసాధ్యం ఏదీ కాదు. అటువంటి సంఘీభావమే ఆంధ్రప్రదేశ్‌లో మొలకెత్తాలని ఆశిస్తున్నాము

(5-1-'89)

ముఖ్య సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ | అచ్చుయిజరి సంపాదకుడు : వీరాజీ

ముద్రాపకుడు ప్రచురణకర్త శివలెంక నాగేశ్వరరావు

ఆంధ్రపత్రిక ప్రెస్; గాంధీనగరం, విజయవాడ 3. ఫోన్లు: 75667, 61247, 61248, 75569

తెలుగువారి నిరంతర సేవలో మాకిది 81వ సంవత్సరం


అందానికి అద్దంపట్టే చీరలు
బొమ్మన వారి చీరలు!
బొమ్మన
శారీ మందిర్
రాజధాని సూటింగ్ హౌస్
సూర్య థియేటర్ ఎదురుగా, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్. Ph: 241504
హోల్ సేల్ ధరలకే రిటైల్ అమ్మకం. పట్టు చీరలకు మా ప్రత్యేకత.
Alfavision



నాయక సప్తకం : దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకారం కోసం రూపొందిన సార్క్ నాయకుల సమావేశం ఈ మధ్య ఇస్లామాబాద్‌లో జరిగింది. పై ఫొటోలో ఈ నాయక సప్తకాన్ని చూడవచ్చు. ఎడమ నుంచి వరుసగా : శ్రీలంక అధ్యక్షుడు శ్రీ జె. ఆర్. జయవర్ధన, నేపాల్ రాజు శ్రీ బీరేంద్ర, భూటాన్ రాజు శ్రీ జిగ్మె సింగ్యే వాంచుక్, పాకిస్తాన్ ప్రధాని శ్రీమతి బేనజీర్ భుట్టో, మాల్దీవుల అధ్యక్షుడు శ్రీ మౌమూన్ అబ్దుల్ గయూమ్, బంగ్లాదేశ్ అధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ ఎచ్. ఎమ్. ఎర్షాద్, భారత ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ.

1988 ఫ్లాష్ బ్యాక్!

ఆంధ్రప్రదేశ్‌లోని 30 నగరాలలో మరి కొన్ని గ్రామాల్లో ఆరని మంటల మధ్య రగులుతున్న 'కడుపు చిచ్చు'తో వున్న "కర్ఫ్యూ" క్రింద 1989 మవునంగా ప్రవేశం చేసింది– కోట్ల కొలది రూపాయిల ఆస్తిని– రాష్ట్ర ప్రగతి "అంతస్తుల"ను శిధిలం చేసి మంటల మచ్చలు మిగిల్చి వెళ్ళిపోయింది 1988– సోవియట్ యూనియన్‌లోని ఆర్మీనియా రాష్ట్రం డిసెంబర్ నెలలో భూకంపంతో దద్దరిల్లి శిధిలాల మధ్య మరు భూమిగా మిగిలిపోయింది– ఒకటి మనిషి చేసుకున్న ఘోరమైతే రెండోది దేవుడు చేసిన ప్రళయం– నష్టకష్టాలు మాత్రం ఒక్కలాంటివే. కాంగ్రెసు(ఐ) ఎమ్. ఎల్. ఏ. శ్రీ "రంగా" హత్యానంతర దగ్ధ కాండ– నలభై సంవత్సరాల స్వాతంత్ర 'భారతి' గుండెల్లో ఆరని జ్వాల!

ఈ రెండు అపశ్రుతులు మినహాయిస్తే 1988 – ఎంతో మంచి సంవత్సరం. మానవాళికి ప్రపంచ యుద్ధ భయాన్ని తొలగించిన యీ ఏడాది– ఆరంభంలోనే జనవరి 2వ తేదీనాడే– ఇంత కాలం





పిడికిళ్ళు బిగించి– పరస్పరం "ఝళిపించు" కుంటున్న అగ్రరాజ్యాల మధ్య "నిరాయుధీకరణ మార్గంలో "కరచాలనం" జరిగింది!

"పెరిస్త్రోయికా" "గ్లాస్‌నోస్త్"లతో ఉప్పొంగుతున్న సోవియట్ యూనియన్‌లోని లెనిన్ విగ్రహం క్రింద నిలబడ్డ అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ శాంతి కపోతాలను ఎగురవేస్తే, రష్యా నూతన అధ్యక్షుడు మిహయిల్ గోర్బచేవ్ లిబర్టీ విగ్రహం క్రింద నిలబడి అణ్వస్త్ర యుద్ధ మేఘాల్ని తొలగిపొమ్మని ఆదలించాడు–

ఉగ్రరాజ్యాలు ఇరాన్ ఇరాక్‌ల మధ్య ఎనిమిది సంవత్సరాల అనంతరం తుపాకీ చప్పుళ్ళు – ఆగిపోయాయి. ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఈ ఫిబ్రవరి 15 నాటికి పూర్తిగా తొలగిపోయే విధంగా, రష్యా సైన్యాలు "మూటా ముల్లె" సర్దుకున్నాయి– దక్షిణాఫ్రికా "నమీబియా" మీద నుంచి తన యినప పాదం తొలగించుతానన్నది. అంగోలాకి "క్యూబన్"లు "గుడ్‌బై" చెప్పేస్తామన్నారు

మన పొరుగునున్న దేశం పాకిస్తాన్ జియా ఉల్‌హక్ మరణానంతరం– కొంతమంది అనుకున్నట్లు అల్లకల్లోలం కాకపోగా పదకొండు సంవత్సరాల తరువాత ప్రజాస్వామ్య పాలన క్రింద స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ– విద్యావతి, సాహసి యువతి అయిన శ్రీమతి బేనజీర్ భుట్టో ఆధ్వర్యాన "సార్క్" సభలను దిగ్విజయంగా నిర్వహించింది!

"టెర్రరిస్టు" యాసర్ అరాఫత్" అంతర్జాతీయ స్థాయి దౌత్య నీతి వేత్త అయిపోయి స్వతంత్ర "పాలస్తీనా"ను ప్రకటించటమే గాక– ఇజ్రాయిల్‌ని

తాజాకాలమ్ _వీరాజీ

"నేను గుర్తిస్తానం"టూ ప్రకటించాడు. ఐక్య రాజ్య సమితి సైన్యాలకి నోబుల్ ప్రయిజు అందుకున్న ఆనందం లభించింది– అంతేనా? అమెరికాని యించుమించు ఏకాకిగా వదిలి ఐక్యరాజ్య సమితి కదిలి వెళ్ళి జెనీవాలో సమావేశం పెట్టి, యాసర్ అరాఫత్‌కు పాలస్తీనా వాదాన్ని వినిపించే అవకాశం యిచ్చింది!

1988లో అనుకోని విచిత్ర వింత సంఘటన లిలాంటివి యెన్నో జరిగాయి.

శ్రీలంకలో అంతర్యుద్ధ మంటల మధ్యనే –ఎన్నికలు జరిగాయి– జయవర్ధనే ప్రియ అనుయాయుడు ప్రేమదాస అధ్యక్షుడైనాడు. మొత్తం మీద ప్రపంచం అంతటా విద్వేషాగ్ని చల్లారుతూ వుండగా భారతదేశంలో మాత్రం పంజాబ్ టెర్రరిస్టుల ఆగడాలు అట్లాగే కొనసాగాయి.

అయితే నెహ్రూ మనుమడు "విదేశాంగ



విధానం"తో శ్రీ రాజీవ్ తాత పోలికలు వచ్చిన వాడిలాగే వున్నాడు. దేశంలో కాలు నిలవని మన భారత యువ ప్రధానమంత్రి సోనియా గాంధీ సమేతుడై 34 సంవత్సరాల తరువాత "చైనా" యాత్ర చేసి వచ్చాడు. అంతేనా ముచ్చటగా మూడు ఒప్పందాలు చేసుకుని వస్తూనే, "సార్క్" (దక్షిణాశియా దేశాల సహకార సంఘం) సభలకి వెళ్ళి పాకిస్తాన్ కొత్త మహిళా ప్రధాన మంత్రి శ్రీమతి భుట్టోతో మూడు విడతల చర్చలు జరిపి, మళ్ళీ మూడు వొప్పందాలు చేసుకొని వచ్చాడు– అక్కడ చైనాతో సరిహద్దు సమస్య– యిక్కడ "యిస్లామాబాద్"లో కాశ్మీర రగడని అంటీ ముట్ట కుండా వదిలిపెట్టి– "దౌత్య వేత్త"గా తన ఖ్యాతిని యినుమడింప చేసుకున్న రాజీవ్‌గాంధీ– దేశంలో "తమిళనాడు" "నాగాలాండ్" "మిజోరమ్" లలో ఎన్నికలు ప్రకటించి "సాహసివయ్యా డింభకా" అనిపించుకున్నాడు!

అయితే పోయిన ఏడాదంతా ప్రతిపక్షాలు, పార్లమెంట్ లోపల వెలుపలా కూడా– "బోఫోర్స్ గన్"ని రాజీవ్ గాంధీ మీద ప్రేలుస్తూనే వున్నాయి. "ఫ్రంట్"గా ఏర్పడ్డా కూడా నేషనల్ అపోజిషన్ పార్టీలు ప్రాంతీయ పార్టీల ఆధిక్యతని పెత్తనాన్ని త్రోసిరాజన లేక పోతున్నాయి!

రాష్ట్రంలో యీ ఏడాది ఆరంభంలోనే "హైకోర్టు" ముందు నిందితునిగా నిలబెట్ట పడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. ఆర్. గారు ఏడాది చివరలో కనీవినీ ఎరుగని విధ్వంస కాండను– కర్ఫ్యూల స్థితిని ఎదుర్కొన వలసి వచ్చింది. ఐనా దేశంలో మాత్రం వి. పి. సింగ్ సరసన సమాన హోదాగల నాయకుడిగా – కొందరి దృష్టిలోనైనా "షాడో ప్రధాని"గా తన ప్రతిష్ఠను నిలబెట్టుకోగలిగారు శ్రీ ఎన్. టి. ఆర్.

"పత్రికల" విజయం

పత్రికల నోళ్ళు కుట్టి వేయడానికి కేంద్రం తలపెట్టిన "పరువునష్టం బిల్లు" కి వ్యతిరేకంగా సెప్టెంబర్ 5న దేశంలో పత్రికలు వెలువడలేదు– యజమానులు సిబ్బంది కలసి సత్యాగ్రహం చేసిన ఏకైక "సంఘటనగా" చారిత్రాత్మకమైన ఈ సంఘటనకు దేశ ప్రజల సంపూర్ణ మద్దతు లభ్యం కావటంతో – గవర్నమెంట్ తోక ముడిచింది!

దేశంలో చాలాకాలంగా రాజకీయ వాదులు కోరుకుంటున్న "ఓటర్ల" సంఖ్య పెరిగే విధంగా, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ "వోటు హక్కు" లభించింది!

డార్జిలింగ్‌లోని హింసాత్మక సంఘటనల తర్వాత జరిగిన ఎన్నికలలో కొత్తగా ఏర్పాటయిన "హిల్ కౌన్సిల్" ఎన్నికల్లో 28 కి 20 సీట్లు గెలిచి, జ్యోతిబసు పార్టీని చిత్తు చేసింది!




ఈ విధంగా 1988 చాలా విధాలుగా విశేషాలను – హింసను అరికట్టేందుకు దోహదిస్తూనే క్రిస్మస్ మర్నాడు విజయవాడ నగరం మీద ఘోర కలివి దింపి పోయింది! శ్రీ వంగవీటి మోహనరంగారావు అతని అనుచరులిద్దరు ఘోర హత్యకి గురైనారు. రాజకీయ, హత్యల చరిత్రలోనే అతి ఘోరమైన– యీ శాసన సభ్యుని హత్య– దరిమిలా చెలరేగిన విధ్వంస కాండ కనీ వినీ ఎరుగనిది! – లోగడ ఎన్నోరకాల అల్లర్లు, ఉద్యమాలు, భీభత్సాలు, దహనకాండలు, ఆందోళనలు, ఉప్పెన కూడా తట్టుకున్న మహానగరాన్ని "మట్టు" పెట్టి– బూడిద కుప్పలు మిగిల్చి పోయిందీ ఘోరకలి!

ఈ ప్రాణనష్టం, యీ ఆస్తి నష్టం– కుల విద్వేష నగ్నసత్యం నాగరిక ప్రపంచానికి తలవొంపులు తెచ్చాయి! ఈ శతాబ్దాంతానికి కూడా తిరిగి విజయవాడ 1988 క్రిస్మస్ నాటి స్థితికి– లేచి నిలబడగలదా? అన్న విషాద ప్రశ్నగా 1988 యిక్కడ 1989కి రక్త కన్నీటి స్వాగతం యిచ్చి వెళ్ళిపోయింది!– విజయవాడ లాగే తూర్పు గోదావరి, గుంటూరు మున్నగు యితర జిల్లాలు కూడా అవకాశ వాద గూండాల, దొంగల పాశవిక దౌర్జన్య లూటీలకు గురి అయిపోయినాయి! ●

శ్రీ వంగవీటి మోహనరంగారావు దారుణ హత్యానంతరం రాష్ట్రంలోని పలు పట్టణాలలో, ముఖ్యంగా నాలుగు కోస్తా జిల్లాలలో కనీవినీ ఎరగని విధ్వంస కాండ జరిగింది. హతుడికి రక్షణ కల్పించడంలోనూ, హత్య తర్వాత జరిగిన బీభత్సాన్ని అరికట్టడంలోనూ పోలీసు శాఖ విఫలమయింది. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర హోంశాఖ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు తన పదవికి రాజీనామా చేశారు. (జనవరి 4)

విజయవాడ (తూర్పు) నియోజక వర్గం శాసనసభ్యుడు శ్రీ వంగవీటి మోహనరంగారావు హత్య కేసులో ప్రధాన నిందితుడు, కంకిపాడు శాసనసభ్యుడు



అయిన శ్రీ దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) జనవరి 4న హైదరాబాదు పోలీసు కమిషనర్ ముందు 'లొంగిపోయారు. హత్యతో తనకు సంబంధం లేదని, కాని పార్టీ ఆదేశానుసారం, క్రమశిక్షణకు బద్ధుడినై లొంగిపోతున్నానని ఆయన ప్రకటించారు. (జనవరి 4)

అన్వేషి

చెక్కలం విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ– 2: అమూల్య సెలవుల్లో జానకి, రామంల దగ్గరికి వస్తుంది. జానకి రామంతో తన దాంపత్యం సుఖంగా సాగిపోతున్నదని చెపుతుంది. తామిద్దరి అభిప్రాయాలు ఏకీభావం గురించి చెపుతుంది. అమూల్య తిరిగి వచ్చేసరికి కుసుమకు సంబంధం కుదురుతుంది. కుసుమకు ఎంతో అందగాడు కుదిరాడని అందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది.

కుసుమక్క పెళ్ళికి ముహూర్తం పెట్టారు. ఇంతలో విమలక్క ఉత్తరం రాసింది.

'కుసుమకు పాతిక వేలు కట్నం ఇస్తున్నారట. సూటనీ, బూటనీ, ఉంగరాలనీ మరో ఐదు వేలు. మనం ఏం పాపం చేశాం? మీ నాన్న ముష్టి పదివేలు నా ముఖాన పడేసి చేతులు కడుక్కున్నారు. న్యాయానికి ఇంకో ఇరవైవేలు రావాలి మనకు. కనీసం స్కూటరైనా కొని పెట్టమను. లేకపోతే పెళ్ళికి పంపేది లేదు అంటున్నారు మీ అల్లుడుగారు' అంటూ రాసింది.

ఇంతవరకూ కుసుమక్కకు కట్నం ఇస్తున్న విషయం నాకు తెలీదు. ఇదివరకు కమలక్క, విమలక్క పెళ్ళి అయినప్పుడు నేను చిన్నదాన్ని. ఆ తర్వాత జరిగిన జానకి అత్తయ్య పెళ్ళికి మామయ్య కట్నం తీసుకోలేదు.

"ఇదేమిటి నాన్నా! బావగారు మనస్ఫూర్తిగా ఇష్టపడే చేసుకుంటున్నారని అంటున్నారు కదా? మళ్ళీ కట్నం ఇవ్వడం ఎందుకు?" అని అడిగాను.

"ఇష్టపడ్డానికీ, కట్నానికీ ఏం సంబంధం వుందమ్మా? అది పెళ్ళికి అంగీకారం. ఇది ఆచారం" అన్నారు నాన్నగారు.

"ఆవేదనను పెంచేవి ఏం ఆచారాలు నాన్నా! మనం అనుసరిస్తూ వుంటే అవి మనను పట్టుకుని వేళ్ళాడుతూనే ఉంటాయి. వదిలించుకోవాలంటే వదిలించుకోలేమా? ఇదివరకు కన్యాశుల్కం వుండేది. ఆ ఆచారం రూపుమాసి పోయిందా లేదా" అన్నాను ఆవేదనగా.

నవ్వారు నాన్నగారు.

"కాలేజీ డిబేట్లలో అయితే నీవు చెప్పింది విని సంతోషంగా చప్పట్లు కొడ్తారు. కానీ ఇది వేరు. అయినా నీవు చెప్పేది వాస్తవమే. కానీ ఆడపిల్లలు గల తండ్రికి కట్నం ఇవ్వవలసి రావటం ఎంత బాధాకరమో 'కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేయాలి' అన్న ఆశయం వుండటం అంతకంటే సమస్యాపూరితం. తల తాకట్టు పెట్టి అయినా కట్నం డబ్బు సమకూర్చుకోవచ్చు. కానీ ఈ కాలంలో కట్నం తీసుకోని వరుణ్ణి పట్టుకోవటం తలకు మించిన పని".

"నిజమే నాన్నా. కానీ ఎవరికి వాళ్ళు ఇలాగే ఆలోచిస్తే పిల్లి మెడలో గంట కట్టే వాళ్ళెవరు? ఎవరికి వాళ్ళు తమ నుంచి ప్రారంభిస్తేనే ఇలాంటి వాటికి దారి పడేది".

నిస్సహాయంగా చూశారు నాన్నగారు.

"సరే అమూల్యా. నీ వివాహం కట్నం ఇవ్వకుండా చెయ్యడానికి ప్రయత్నిస్తాను. కాని ఇప్పుడు అన్ని నిర్ణయాలూ జరిగిపోయి ముహూర్తం కూడా పెట్టుకున్నాక మనం ఇలాంటి వ్యవహారం ప్రారంభిస్తే మర్యాదగా వుండదు. ఈ తెలివి ముందుండాలని నవ్విపోతారు. ఎలాగోలా కుసుమ పెళ్ళి జరిగిపోనీ" అన్నారు.

నిట్టూర్చాను. ఒక్కోసారి మనం చేస్తున్న పనులు సవ్యమైనవి కావని తెలిసినా వాటిని సరిదిద్దుకోలేని ఇరకాటంలో పడిపోతుంటాము.

అయితే, ఈ విషయంలో అసంతృప్తిగానే మనసును సరిపెట్టుకున్నా విమలక్క భర్తకు ఇవ్వవలసిన స్కూటర్ విషయం పెద్ద తలనొప్పిగా తయారయింది.

"ఇదేమిటి నాన్నా కట్నం తీసుకున్నందుకు సిగ్గుపడేది మాని పైగా ఈ అలకలూ, సతాయింపులూ ఏమిటి! ఈ బావకు స్కూటర్ ఇప్పిస్తే కమలక్క భర్త మోటార్ బైక్ అడగరని గ్యారంటీ ఏమిటి?" అన్నాను విసుగ్గా.

"తప్పదమ్మా. ఖర్చులు పెట్టుకో లేకపోతే కుసుమ పెళ్ళి మానుకోవచ్చు గానీ వీళ్ళ కోరికలు తీర్చక తప్పదు. ఎందుకంటే ప్రయత్నిస్తే కుసుమకు ఇంకో సంబంధం కుదుర్చుకో వచ్చు. కానీ పెద్దక్కలు ఆదే భర్తలతో వేగాలి కదా" అన్నారు బాధగా.

మనిషి ఎక్కడికక్కడ మనసును సరిపెట్టుకోక పోతే, ఆత్మ వంచన చేసుకోకపోతే తప్పదేమో!

అయినా కుసుమక్క భర్తకు ఇచ్చే పాతిక వేల కట్నం కాక లాంఛనాలనీ, పెళ్ళి ఖర్చులనీ మరో పది పదిహేను వేలు కావచ్చు. ఎంత వ్యాపారస్తులయినా డబ్బు వ్యాపారంలో వుంటుంది గానీ ఇంట్లో వుండదు. ఈ నలభైవేలు సర్దుబాటు చేయడానికే నాన్నగారు తల్లక్రిందులవుతున్నారు. మరో పదివేలు సమకూర్చటం మాటలతో అయ్యే పనేనా!

నా చదువు నిమిత్తం నాన్నగారు నా పేరున బ్యాంకులో వేసిన డబ్బు, చాలావరకు స్కాలర్‌షిప్‌తో చదువుకోవడం వల్ల ఓ నాలుగు వేలదాకా ఇంకా బ్యాంకులో వుండిపోయింది. అది తీసుకొమ్మని నాన్నగారితో చెప్పాను.

"నీ డబ్బు తీసుకోవడం ఎందుకమ్మా! నిదానంగా ఇప్పిస్తామని బావకే ఎలాగో నచ్చచెబుదాం" అన్నారు.

"ఆ మాత్రం అర్థం చేసుకొనే మనుషులయితే సమయం చూసి ఎందుకు డిమాండ్ చేస్తారు నాన్నా? మీరన్నట్లు ఈ తలనొప్పి భరించక తప్పదు. ఈ నాలుగు వేలూ తీసుకొని మిగిలింది ఎలాగో అడ్జస్ట్ చేయండి" అన్నాను.

అతి బలవంతం మీద నాన్నగారు ఆ డబ్బు తీసుకోవడానికి అంగీకరించారు.

* * * * * *

ఆ రోజు పెళ్ళివారొస్తున్నారు. వాళ్ళను ఎదుర్కోవడానికి వెళ్ళే వాళ్ళతో నేను కూడా స్టేషన్‌కు వెళ్ళాను. బావగారిని చూడాలని నాకు చెప్పలేనంత కుతూహలంగా వుంది. అక్కకు అంత అందమైన భర్త దొరుకుతున్నందుకు ఓ వైపు ఆనందం, అర్థంలేని సంశయంతో మరో వైపు ఆందోళన.

స్టేషన్ చాలా కోలాహలంగా వుంది. పెట్టెల్తో బుట్టల్తో వున్న రకరకాల మనుషులు వందల సంఖ్యలో కోలాహలంగా మాట్లాడుకుంటూ రాబోయే రైలు కోసం ఎదురు చూస్తూ వున్నారు.

ఇన్ని రకాల మనుషులను ఒక్కసారిగా చూడ్డం సరదాగానే వున్నా ఇంత గోలను భరించడం కొంచెం కష్టమే. రైల్వే స్టేషన్స్, బస్‌స్టాండ్, సినిమాహాల్స్ లాంటి కొన్ని ప్రదేశాలలో కనిపించే ఈ గుంపు, గోల మరి కొన్ని సంవత్సరాలు పోతే ప్రత్యంగుళంలోనూ ఎదుర్కోవలసి వస్తుందేమో! అప్పుడు మనుషులు కూర్చోవడానికి కూడా స్థలం లేక నిల్చుని, నిల్చుని..... కాళ్ళు పీకి, పీకి.... నవ్వు వచ్చింది.

ఆలోచనల్లోంచి తేరుకుని మళ్ళీ జనంకేసి చూశాను.

రైలు వచ్చే సమయం తెలుసు. అయినా అందరూ రైలు రాబోయే వైపు ఆత్రుతగా చూస్తూ వున్నారు. ఈ సృష్టిలో మనిషి అంత తెలివిగల ప్రాణి మరోటి లేదు. మళ్లీ మనిషి అంత తెలివిలేని ప్రాణి కూడా మరోటిలేదు.

ఇలా ఆలోచిస్తూనే నేను కూడా ఓసారి అనాలోచితంగా రైలు రాబోయే దిక్కుకేసి చూశాను.

మళ్లీ నవ్వు వచ్చింది.

మనిషిలోని ఆపుకోలేని ఆనందం, ఆవేదన, ఆతృతల్లాంటివి మనిషిని ఇలా కోతిలా ఆడిస్తాయి కాబోలు! ఇంత మంది జనం! ఎందరు ఆనందంతో తబ్బిబ్బవుతున్నారో. ఎందరు ఆవేదనతో,



ఆందోళనతో కృంగిపోతున్నారో, ఎందరిని ఆతృత నిలువనీయకుండా చిందులు వేయిస్తోందో ఎవరికి తెలుసు? అసలు ఈ ప్రపంచంలో ఆనందం ఎక్కువా? ఆవేదన ఎక్కువా? ఎవరైనా ఈ విషయం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఎన్నో విషయాల గురించి పరిశోధనలు చేస్తున్నారు; సర్వేలు జరుపుతున్నారు. ఆనందమో, ఆవేదనో మనిషిని నీడలా అనుక్షణం అంటి పెట్టుకొనే వుంటుంది. మరి అతి కీలకమయిన ఈ విషయాల హెచ్చు తగ్గుల పరిమాణం గురించి ఎవరూ ఎందుకు పరిశోధన చేయటం లేదు.? ఎందుకు సర్వే జరపటంలేదు?

"చిన్న దానివి. ఇంత పెద్ద ఆలోచనలు నీకెందుకు? మానెయ్" అన్నట్టుగా దూరంగా రైలు కూత వినిపించింది.

మళ్ళీ మనసు అనే కోతి ఆతృత అనే అద్దం పట్టుకుని గంతు లేయటం ప్రారంభించింది.

రైలు ఆగీ ఆగకముందే మా వాళ్ళంతా ఒక కంపార్టుమెంటు వైపు పరిగెత్తడం ప్రారంభించారు. బహుశా అందులోని పెళ్ళి కొడుకు కనిపించి వుండాలి.

నేను వున్న చోటనే నిలబడి మా వాళ్ళు వెళ్తున్న కంపార్టుమెంటుకేసి చూస్తూ నిలబడ్డాను.

కంపార్టుమెంటు గుమ్మంలో మెరుపు మెరిసినట్లు అయింది. ఆశ్చర్యంతో నా నోరు తెరుచుకుంది. కళ్ళు పత్తి కాయల్లా అయ్యాయి. ఎడమ చేయి గుండె మీద ఆనింది.

మన్మథుడు మోడర్న్ డ్రస్ వేసుకున్నట్టుగా, నలకూబరుడు నల్ల సూట్‌లో దిగివచ్చినట్టుగా....

కాదు, కాదు....

"మీ బావగారు నలకూబరుడు కూడా కాదే. కానీ.... ఇంకేం చెప్పాలో కూడా నాకు తోచడం లేదు" అన్న కుసుమక్క మాటలు గుర్తొచ్చాయి.

అక్క అలా అనటంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు.

ఇదేమి అందం!

మగవాడికి ఇంత సౌందర్యమా!

ఇంత సొగసును చూస్తూ ఇన్నాళ్ళూ ఈ ప్రపంచం ఎలా వూర్కుంది! ఎవరూ ఎందుకు ప్రేమించలేదు! ఎవరూ ఎందుకు పెళ్ళాడలేదు! ఎవరూ ఎందుకు ఎగరేసుకు పోలేదు!

ఛ ఛ! ఈ రోజు నా ఆలోచనలెందుకిలా విపరీతంగా వున్నాయి! నన్ను నేను మందలించుకుని, తేరుకుని చూసేసరికి పెళ్ళికొడుకు ప్లాట్ ఫారం మీదికి దిగి వున్నాడు. మెడలో పూలమాల వుంది. మెడ మీద జరీ అంచున్న తెల్లని ఉత్తరీయం వుంది. ఓ ముత్తయిదువ నుదుట కుంకుమబొట్టు పెడ్తోంది. ఫుల్ సూట్‌లో వున్న అతనికి ఉత్తరీయం, కుంకుమబొట్టు చాలా తమాషాగా వున్నాయి. అయినా అందంగానే వున్నాయి: విలక్షణమైన అందం!

అంతలో పెళ్ళి కొడుకు చూపు నా మీద పడింది. అది కాసేపు స్థిమితంగా వుండటంతో నేను స్థిమితం తప్పినదానిలా కొంచెం కదిలి పక్కకు జరిగాను. అంతలో ఎవరో నా వైపు చూసి పెళ్ళికొడుకుతో ఏదో చెప్తున్నారు. అతని పెదిమల మీద చిన్న చిరునవ్వు పాడ్యమినాటి నెలవంకలా మెరిసింది. మెరుపులోని ఓ చిన్న ముక్క జారి అతని పెదిమల మీద చింది పడినట్టుగా అనిపించింది.

నా గుండెలో ఎక్కడో కలుక్కుమంది. అది ఆనందమో, ఆవేదనో తెలీదు. ఈ ప్రపంచంలో ఆనందానికీ, ఆవేదనకూ పెద్ద దూరం లేదు. ఒక్కోసారి రెంటికీ తేడా తెలుసుకోవడం కూడా కష్టమే అవుతుంది, ఇప్పటి నా అంతరంగానుభూతి లాగ. ఆనందానికీ కన్నీళ్ళే. ఆవేదనకూ కన్నీళ్ళే. రెండు కన్నీళ్ళూ వెచ్చగానే వుంటాయి. ఉప్పగానే వుంటాయి!

కొంచెం సేపటి క్రితపు నా ఆలోచన గుర్తు వచ్చింది. ఆనందాన్ని, ఆవేదననూ వేరుపరచి గుర్తించటమే సమస్య అయినప్పుడు వాటి వాటి హెచ్చు తగ్గుల్ని అంచనా వేయటం ఎంత హాస్యాస్పదం! బాధలో సౌఖ్యాన్ని వెదుక్కునే వారెందరో! విరహంతో ఆనందాన్ని పొందేదెందరో! ఆనందంలో అసంతృప్తి ఫీలయ్యేవారూ వున్నారు! సుఖదుఃఖాలూ, ఆనందావేదనలూ ఒక దానిలో ఒకటి అంతర్లీనమై వున్నాయి కాబోలు! పరస్పరాధారంతోనే వాని మనుగడ సాగేది కాబోలు! పరస్పర విరుద్ధ భావాలైన వాని సరిహద్దులు ఒకే శిఖపై వున్నాయి!

"అదేమిటమ్మా! అందరూ వెళ్ళిపోతూంటే నీవిలాగే నిలబడ్డావ్!" నాన్నగారు భుజం తట్తూంటే ఉలికిపడి "ఆ!" అన్నాను.

"బావను చూశావా?" నవ్వుతూ అన్నారు.

"ఆ, ఆ"

"ఎలా వున్నాడు?" నాన్న ఆ అడగటంలోనే తెలుస్తోంది "చాలా అద్భుతంగా వున్నారు కదూ?" అన్న ప్రశ్న, ప్రశంస.

మాసిపోయే అందాన్ని చూసుకుని ఈ మనుషులెందుకింతగా మురిసి పోతారు! కానీ వెంటనే, బావను చూడగానే నా మనసులో కలిగిన సంచలనం గుర్తు వచ్చింది.

అక్క భర్తగా అతని అందం నాకు అసంతృప్తి కలిగిస్తోందా? ఆ అందాన్ని నా మనసు కోరుతోందా?

ఉలిక్కిపడ్డాను.

తర్వాతి క్షణమే నన్ను నేను సంభాళించుకుని నాన్నగారి ప్రశ్నకు సమాధానంగా మెల్లగా నవ్వాను. ఇద్దరం స్టేషన్ బయటకు వచ్చాము.

* * *

పెళ్ళికి జానకి అత్తయ్య, రామం మామయ్య ఇద్దరూ వచ్చారు.

"నీవు ప్రయాణం అవుతూ వుంటే మీ అత్తగారికి గుండెల్లో దడ మొదలవ్వలేదా?" అన్నాను వ్యంగ్యంగా.

నవ్వింది అత్తయ్య.

"వృద్ధాప్యంలో వుండి, రోగంతో తీసుకుంటూన్న

క్రీడారంగం - క్విజ్ 3

(1) వేసవి ఒలింపిక్స్, శీతాకాలపు ఒలింపిక్స్ రెంటిలో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడెవరు?

(2) మహిళా టెస్ట్ క్రికెట్‌లో మొట్ట మొదటిసారిగా "సిక్సర్" కొట్టింది ఎవరు?

(3) ఇప్పటి వరకు మహిళలల టెన్నిస్‌లో ఒక సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన ఎవరిది?

(4) వాలీబాల్ ఆటను కనిపెట్టినది ఎవరు?

(5) శీతాకాలపు ఒలింపిక్స్ జరిగిన ఒకే ఒక ఆసియా నగరం ఏది?

(6) బిలియర్డ్స్ ఆటలో ప్రపంచ టైటిల్ సాధించిన ప్రథమ భారతీయుడు ఎవరు?

(7) పురుషుల టెన్నిస్‌లో అత్యధిక సంఖ్యలో టైటిల్స్ సాధించినది ఎవరు?

(8) ఫుట్‌బాల్ కింగ్ 'పీలే' 'సిల్వెస్టర్ స్టాలన్' కలిసి నటించిన చిత్రం పేరు?

(9) ఛెస్ ఇన్ మై లైఫ్ అనేపుస్తకం వ్రాసినదెవరు?

(10) వన్‌డే క్రికెట్‌లో మొట్టమొదటి "హ్యాట్రిక్" తీసుకొన్నదెవరు?

\- జె. కె.

(జవాబులు ఈ సంచికలో నే....)

వాళ్ళు మనుషుల సామీప్యం కోసం ఎంత తపించి పోతారో నీకు తెలీదు" అంది.

"నీకు తెలిసినట్టు పేద్ద" అన్నాను.

"తెలుసు, అలాంటి మనిషి సామీప్యంతో వున్నాను కాబట్టి" అంది.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"అందరి తప్పుల్నీ క్షమించేసేయటం గొప్ప క్యారెక్టర్ అని భ్రమ పడకు. మనసులోని వుద్రేకాల్ని ప్రతిసారీ అణచి వేయటం ఆరోగ్యానికి మంచిది కాదు. కష్ట సుఖాల సహజ స్వభావాల్ని అనుభూతి పొందాలి" అన్నాను కొంచెం కోపంగా.

పకపక నవ్వింది అత్తయ్య.

"నీవు చెప్పింది నిజమే కానీ అది పూర్తిగా పని మనసులు చేసే పని. కష్టసుఖాల్ని, బాధ, ఆనందాన్ని సమభావంతో స్వీకరించే నిగ్రహం మనసు అలవర్చుకోవాలి".

"మనం తాపసులం కాదు కదా అత్తయ్యా! రాగద్వేషాల రుచి వాటి సహజ స్వభావాలను యథాతథంగా అనుభవించటంలోనే వుంది" అన్నాను.

"దేవుడు ప్రకృతిని, మనిషిని సృష్టించాడు. మనిషి జీవించటానికి. అంటే దేవుడు సృష్టించినప్పటి దశలోనే యథాతథంగా జీవించటానికి కావలసిన హంగులన్నీ ప్రకృతిలో వున్నాయి. అంటే తినటానికి తిండి (ఆకుల అలుములు, కాయ కసరులు, పచ్చి మాంసం), వుండటానికి నీడ (గుహలు, చెట్టు తొర్రలు) వున్నాయి. అయినా మనిషి ప్రకృతిని ఎన్ని రకాలుగా మలుచుకున్నాడు? ఎంత లౌక్యంగా లొంగ దీసుకున్నాడు? అనుగుణంగా, సుఖంగా....

మన మనసూ, రాగద్వేషాలూ అంతే. వాటి సహజ స్వభావాలను మనసు మీద అధికారం తీసుకోనిస్తే మనసు కళ్ళాన్ని పట్టుకుని కదం తొక్కిస్తాయి. గుండెను పిండి, పిడిచి కన్నీళ్లను కక్కిస్తాయి. ఆనందమే అయితే గుండెను వూది, వుబ్బించి, రక్తనాళాలను తెంపేస్తాయి. మనిషి జీవితంలో క్షణం క్షణం ఎదురయ్యే ఈ రాగద్వేషాలకు, సుఖ దుఃఖాలకు మనసిలా క్షణ క్షణం విలవిల్లాడిపోతే మనోబలం మిద బ్రతికే ఈ మనిషి శరీరం ఎన్నాళ్ళు తట్టుకుంటుంది"

అత్తయ్య మాటలకు నేను దిగ్భ్రమలో మునిగి వుండగానే ఎవరో పిలిస్తే అత్తయ్య లేచి పోయించి.

కుసుమక్క పెళ్ళి నిరాటంకంగా జరిగిపోయింది. వేయి వూహలతో, కోటి కోర్కెలతో కాపురానికి కూడా వెళ్ళిపోయింది.

అక్క వెళ్తూ వుంటే అందరికీ గుండెల్లో బరమా పెట్టి తొలిచినట్లుగా అయింది. మహా ఋషి కణ్వునికే తప్పని బాధ ఇది! సామాన్య మానవాళ్ళకులెంత!?

★ ★ ★ ★ ★ ★

ఈ హడావుడి ముగిసేసరికి నా రిజల్ట్సు వచ్చాయి. నేను ఫస్టు క్లాసులో పాస్ అయాను.

అమ్మ దిగులుపడిపోయింది.

"ఇన్నాళ్ళూ అమూల్య చదువుకుంటూ వుండేది. కుసుమ పెళ్ళికి వుండేది. ఇప్పుడది వెళ్ళిపోయింది. ఇది పొయ్యి కూర్చుంది. అంటే అమూల్యకు పెళ్ళి చేయాలి కదా" అంది నాన్న గారితో.

నాకు నవ్వు వచ్చింది. ఈ అమ్మలందరూ ఒకే మూసలో పోసినట్లుగా వుంటారు. ఒకటే భావాలు, ఒకటే కోరికలు, ఒకటే దిగుళ్ళు! పిల్లల్ని కనటం, వాళ్లను పెంచటం, పెళ్ళిళ్ళ గురించి దిగులుపడటం, తలకు మించిన భారాన్ని నెత్తిన మోసుకొని పెళ్ళి అయిందనిపించటం, ఆ తరువాత ఆ భారాన్ని దింపుకొనే ప్రయత్నంలోనే బ్రతుకు తెల్లవారిపోవటం!

నాన్నగారేమీ అనలేదు. ఆలోచనలో పడి పోయారు. బహుశా అమ్మ మాట నిజమే అనిపించి వుంటుంది.

ఈ మధ్య అకస్మాత్తుగా, వూహించనంతగా వ్యాపారం దిగదీసింది. నాన్నగారు బయట పడటం లేదు గానీ పెద్ద ఎత్తునే నష్టం సంభవించిన సూచనలు కానవచ్చాయి. ఈ వ్యాపారపు దిగుళ్ళతో, తల మోసిన పెళ్ళి అప్పులతో కృంగిపోతున్న నాన్నగారి మీద నా పెళ్ళి బరువు ఇప్పుడప్పుడే పెట్టాలనిపించలేదు.

"నేను చదువుకుంటాను నాన్నా" అన్నాను.

"ఇంటర్ చదివావు. బి. ఏ. మొగుణ్ని తేవాలి. ఇక బి. ఏ. చదివితే ఎవరిని తేవాలో కూడా నాకు తెలియదు. చదివింది చాలు గానీ ఇక ఇంట్లో వుండి వంటా వార్పు నేర్చుకో" అమ్మ కసురుకుంది

అమ్మ మాటలకు నవ్వుకుంటూ నాన్నగారితో నే అన్నాను–

"మొన్ననేగా అక్క పెళ్ళి చేశారు? అప్పుడే నా పెళ్ళికి తొందరేమొచ్చింది? ఊపిరైనా తీసుకోవాలి కదా? అంతవరకూ నేను ఇంట్లో వూర్కే వుండి ఏం చేస్తాను?"

"తన పెళ్ళి గురించి తండ్రితోనే మాట్లాడే కాలం వచ్చింది! కలికాలం" అమ్మ సణుగుతూంది.

నాన్నగారు సాలోచనగా అన్నారు "బి. ఏ. అంటే మూడేళ్ళు చదవవలసి వుంటుంది. పైగా పై వూరు వెళ్ళి చదువుకోవాలి. ముఖ్యంగా.... ముఖ్యంగా... నీ చదువు కోసం కేటాయించిన డబ్బు.... వాడుకున్నాం కదా?"

నాన్న పరిస్థితి నాకు ఆవేదన కలిగింది. అయినా చదువు మీదున్న ఆసక్తి ఇలా పలికించింది "ఊహించనంత ఖర్చేమీ వుండదు నాన్నా. ఎటూ నాకు స్కాలర్‌షిప్ వస్తుంది. ఇక భోజనం అక్కడున్నా, ఇక్కడున్నా తినవలసిందే కదా?" అన్నాను.

"చూద్దాం" అన్నారు నాన్నగారు.

నాన్నగారితో అలా అన్నాను గానీ బి. ఏ. అంటే నిజంగా మాటలు కాదు. మా వూర్లో జూనియర్ కాలేజీ మాత్రమే వుంది. బి. ఏ. చదవాలంటే బయటి ఊళ్లో మూడేళ్ళు వుండి చదువుకోవాలి. స్కాలర్‌షిప్ డబ్బు ఫీజులకూడా సరిగ్గా సరిపోదు. అయితే ఈ మధ్యనే నేను గాంధీజీ ఆత్మకథ చదివాను. గాంధీజీ తన అన్నగారు పంపే అతి తక్కువ డబ్బుతో ఇంకా పొదుపు చేసి, విదేశంలో గడిపిన నిరాడంబర విద్యార్థి జీవితం నాకు ఏదో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది

విద్య లక్ష్యం జ్ఞాన సముపార్జన, గ్లామర్ కాదు,



డూ...డూ...బసవన్నా!

(ఫొటో : కె. పి. ఎ. స్వామి, విశాఖపట్నం)

భోగీ భోగీ వచ్చింది

భోగి భోగి వచ్చింది
భోగ భాగ్యాలు తెచ్చింది
సంబరాల సంక్రాంతి
అందరికీ నవ క్రాంతి
ధాన్యలక్ష్మి ధరణిపై
దరహాసం చేయగా
జియ్యారయ్య తీయగా
గీతం వినిపించగా
గంగిరెద్దు గంతులతో
గడప గడప అలరిల్లగా
గొబ్బెమ్మల కొలిచే
చిరునవ్వుల చిన్నారులు
కొత్త అల్లుళ్ళ కోరికల
ఆడపిల్లల అలకల
సంబరాలతో
భోగి భోగి వచ్చింది
భోగ భాగ్యాలు తెచ్చింది.

–వెంపలి రామకృష్ణ

విద్య అంటే టాలెంట్ వృద్ధి చేసుకోవటం; టాయిలెట్ కాదు.

ఈ ప్రాతిపదిక మీద, ఈ బేసిస్ మీద ఆధారపడి చదువు సాగించాలనుకున్నాను.

నా లేత వయసును మూడేళ్ళు ముదరబెట్టడానికి అమ్మ గోల చేసింది. ఇది నా మనసును, మెదడును సానబెట్టడం అని ఎంత చెప్పినా ఆమె బుర్రకెక్కలేదు. అమ్మే అయినా ఆమె అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని లెక్కపెట్ట దలచుకోలేదు.

అప్లికేషన్ పెట్టడం, సీట్ రావటం, హైదరాబాద్‌లో బి. ఏ. లో చేరిపోవడం వెంట వెంటనే జరిగిపోయాయి. చేరిన వెంటనే అత్తయ్యకు ఉత్తరం రాశాను.

పెద్ద అక్కలిద్దరితో నాకు బొత్తిగా పనుపులేదు. కుసుమక్కతో ఫరవాలేదు. కానీ కుసుమక్క అక్క అనిపించదు. ఆమెది పసి మనసు. బొత్తిగా అమాయకురాలు. నేను వాత్సల్యం చూపవలసిన చెల్లెలుగా, బుజ్జగించవలసిన పాపాయిగా మాత్రమే అనిపిస్తుంది. కానీ అత్తయ్యతో నాకున్న అనుబంధం అర్థం చెప్పలేనిది. మేమిద్దరం అత్తా కోడళ్ళం కాదు. అక్కా చెల్లెళ్ళం, స్నేహితులం, సన్నిహితులం. ఆమె నాకంటే పదేళ్ళు పెద్ద కానీ మా మధ్య వున్న ఈ వయోభేదం మా సామీప్యానికి అవరోధం కలిగించలేదు.

అత్తయ్య నుంచి జవాబు వచ్చింది.

"వయసులో అందర్లోకీ చిన్నదానివి. విద్యలో అందర్లోకీ పెద్దదానివవుతున్నావు. నాకెంతో సంతోషంగా వుంది. అయితే ఇన్నాళ్ళూ ఆకు చాటు పిందెలా తల్లిదండ్రుల చాటున వున్నావు. వయసు వచ్చింది. ఊరు విడువవలసి వచ్చింది. నీ ప్రస్తుత పరిస్థితి ఆచ్ఛాదన లేని పండులా వుంది. చిలుక కొట్లుంటాయి; రాళ్ళ దెబ్బలుంటాయి. చూసుకోవాలి. కాచుకోవాలి. ప్రభు పాద సన్నిధిని ప్రసాదంఅయ్యే భాగ్యానికి నోచుకోవాలి. ఇంతకంటే ఏం చెప్పను? జాగ్రత్త" అని రాసింది.

* * *

బి. ఏ. లో కో ఎడ్యుకేషన్. ఇది నాకెదురైన క్రొత్త పరిణామం. మా వూర్లో గర్ల్స్ స్కూల్లో, వుమెన్స్ కాలేజీలో చదివాను. ఇంట్లో అయినా మేమందరం ఆడపిల్లలమే. నాన్నగారితో తప్ప మగ వాళ్ళతో పెద్దగా సాన్నిహిత్యమూ, సామీప్యమూ లేదు. ఇక్కడ మగవాళ్ళను చూసి నేను జడుసుకోలేదు. కానీ అలవాటు లేని మనుషుల మధ్య వున్నట్లు కొంచెం బెరుకు. అంతే.

స్కూలుకు, కాలేజీకీ చాలా తేడా. ఇక్కడ పాఠాలు చెప్పడంలో లెక్చరర్లు అంతగా శ్రద్ధ చూపరు చెప్పినా వినేవాళ్ళుండరు. నామ మాత్రపు క్లాసులు నామమాత్రపు లెక్చర్లు. కాలక్రమేణా విద్యార్థుల వల్ల వచ్చిందో, మరి అధ్యాపకుల వల్ల వచ్చిందో గాని, విద్యకీ అధోగతి వచ్చింది. చదువూ, దాని ఫలితాలూ కేవలం లైబ్రరీలో దొరికే పుస్తకాల మీదా, లెక్చరర్ల దయాదాక్షిణ్యాల మీదా ఆధారపడి ఉంటాయి. కొండొకచో విద్యార్థుల 'కాకా' అనే బలహీనతా, 'బెదిరింపు' అనే బలప్రయోగమూ పని చేయటం కద్దు. ఈ పద్ధతులేమీ నాకు నచ్చలేదు. అక్రమ పద్ధతుల ద్వారా డిగ్రీలు పొందితే ఆ అసంపూర్ణ పరిజ్ఞానం భవిష్యత్తుకు ఏ విధంగా ఉపకరిస్తుంది? అసలే మన విద్యా విధానానికి, మన జీవనసరళికి సంబంధం లేకుండా వుంది. ఏది ఏమయినా సిస్టమాటిక్‌గా చదివి సిన్సియర్‌గానే పరీక్షలు రాయదలచుకున్నాను. మరి ఇదైనా నెరవేరుతుందో లేదో నాకు తెలీదు. ఎందుకంటే మనిషికి సదుద్దేశాలు, సదాశయాలు వుండే వుంటాయి. కానీ వాటిని నెరవేర్చుకొనే మార్గాలు చాలా తక్కువ. కంటకావృతం కూడాను.

(ఇంకా ఉంది)

అన్వేషణ • చిలుకూరి దేవపుత్ర

రాజారావు ఆవేళ పెందలాడే తన గదికి చేరుకున్నాడు. అప్పటికే గదిలో తనకోసం కాచుకునివున్న శ్రీనాథ్‌ని చూసి మందహాసంచేశాడు.

"ఆలస్యం అయిందికదూ. దార్లో వచ్చేటప్పుడు రంగారావుగారు ఏదో కోర్టుకేసులో గొడవలన్నీ ఏకరువుపెడితేనూ....." అంటూ తన ఆలస్యానికి సంజాయిషీ యిచ్చుకుంటున్న ధోరణిలో రాజారావు చెప్పుకుపోతోంటే.....

"సర్లే మొహంకడుక్కురా. అలా వెళ్ళి కాఫీ తాగివద్దాం" అని అడ్డుతగిలాడు శ్రీనాథ్.

"కాఫీకోసం అలా ఏం వెళ్ళనవసరంలేదులే. పాలున్నాయి - స్టౌపైన ఎంతసేపూ, రెండు నిమిషాల్లో చేసేస్తాను" అంటూ రాజారావు బాత్రూమ్‌వేపు దారితీశాడు.

శ్రీనాథ్ అంతకుముందు చదివేసిన దినపత్రికనే మళ్ళీ తిరగేయటం మొదలెట్టాడు.

కాసేపయ్యాక "ఇదిగో కాఫీ" అంటూ కప్పునిండుగా వున్న కాఫీని అందించాడు రాజారావు శ్రీనాథ్‌కి.

"ఎంత తొందరగా తయారుచేశావురా రాజా!"

"నీ కన్నీ ఆశ్చర్యాలే! 'ఇన్‌స్టాంట్ కాఫీ' తయారుచేయడం ఎంతసేపూ" అంటూ శ్రీనాథ్ ఎదురుగా కూచున్నాడు రాజారావు కాఫీని చప్పరిస్తూ.

"ఒరే రాజా! ఎన్నాళ్ళిలా వుంటావురా? పెళ్ళీ పెటాకులూ లేకుండా..... ఇంటికొస్తే పలకరించే దిక్కు కూడా లేదుకదా.... కనీసం కాఫీలు, టీలూ అందించి, చల్లగా రెండు మాటలు మాట్లాడే అతదిక్కులేకుండా ఎలా బతుకుతున్నావురా?" శ్రీనాథ్ మాటల్లో ధ్వనిస్తున్న బాధని రాజారావు గమనించకపోలేదు.

"కాఫీ, టీలు అందించడానికి, ఇంటికొస్తే చల్లగా రెండు మాటలు పలకరించడానికేనట్రా పెళ్ళి చేసుకోవటం?" అంటూ జోక్‌గా మాటాడబోయి, తన మాటల్లో జోకేమిటో తనకే బోధపడక పళ్ళన్నీ కనిపించేట్టు ఓ వెర్రినవ్వు నవ్వాడు రాజారావు.

"నీ ఆదర్శాల నుంచి, ఆశయాలనుంచి యిప్పటికీ బయటపడలేదా నువ్వు?"

"ఏం..... అంత నిలకడలేనిమనిషిలా అనిపిస్తున్నానా నీకు?"

"ఎలా అనిపిస్తేనేంలే రాజా! నీకు మాత్రం ఈ జన్మకి పెళ్ళికాదని నాకు స్పష్టంగా అనిపించిందోయ్!" అన్నాడు శ్రీనాథ్ ఖాళీచేసిన కప్పుని కిందపెడుతూ.

మళ్ళీ తనే అన్నాడు శ్రీనాథ్ - "ఒరే రాజా! యిప్పటికయినా మించిపోయిందేమీ లేదుకాని, ఎవరో ఒకరికి తాళి కట్టెయ్యి! నీ క్కావలసింది పెళ్ళాం..... పెళ్ళా వుంటేనేనోయ్ సంతోషం, ప్రేమా, ఆత్మీయతా వీటికి అర్థాలు తెలుస్తాయి. ఇక పిల్లలు పుట్టటం అంటావా అందతా సెకండరీలే" నచ్చచెప్పుతోన్న ధోరణిలో శ్రీనాథ్ చెబుతోంటే మౌనంగా సిగరెట్‌పొగని గాలికిఊది - అది వయ్యారాలు పోతూంటే అలా చూస్తూ వుండిపోయాడు రాజారావు.

కొన్నిక్షణాల నిశ్శబ్దం తరువాత అన్నాడు శ్రీనాథ్ "ఇంకో రెండునెలల్లో నేను ఈ ఆర్ట్స్ కాలేజీకి ఎట్లాగూ బదిలీ అయివస్తానుగా, అప్పుడుపడతా నీపని".

"సంతోషం.... ఇక్కడేం బావుకుందామని?"

"చచ్చుప్రశ్న వేయకు.... సొంత ఊరినుంచి దూరంగా వుంటే నీకూ తెలిసేది. సరేకానీ ఈ ఆర్ట్స్ కాలేజీలో ఎవర్రా ఇంగ్లీషు లెక్చరరు?"

"నీరజ."

"నీరజ! ఎవరూ? సన్నగా, కోలమొహం, పెద్దకళ్ళూ....."

"ఆఁ సంపెంగముక్కు.... శంఖం లాంటి మెడ.... దొండపండు పెదవులు... ప్రబంధనాయికావర్ణనలు చాల్లేరా.... నీరజంటే నీరజే - సింప్లీ సూపర్బ్ - మొత్తమ్మీద అందగత్తెలే" అన్నాడు రాజారావు చివరివాక్యం చెబుతోవుంటే ఎంత తృప్తో మొహంలో!

"అందానికి తగ్గ అహంకారని కూడా విన్నాను. మనవాడు కోటేశ్వరరావులేడూ! ఇప్పుడు మెద్రాస్ యూనివర్సిటీలో ఇంగ్లీషురీడర్‌గా వున్నాడే - అతనూ, ఈవిడ....."

"ఆఁ.... అతనూ..... ఈవిడా..... " ఆత్రంగా అడిగాడు రాజారావు.

"వాళ్ళిద్దర్ని గురించి చాలా పుకార్లు వున్నాయిలే.... ఆమెని బాగా వాడుకున్నాడని వినికిడి."

"నోర్మూయరా వెధవా! ఒహాళ్ళ గురించి యిలా





"ఆంధ్రపత్రిక" సంస్థ నుండి వెలువడిన మరో కొత్త ప్రచురణ "నవచిత్రకథ" తొలి సంచికను హైదరాబాద్‌లో కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ జలగం వెంగళరావు జనవరి 6న ఆవిష్కరించారు. సంస్థ ఛైర్మన్ శ్రీ టి. జి. వెంకటేష్, ప్రచురణకర్త అమృతాంజనం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎస్. నాగేశ్వరరావు, ఆంధ్రపత్రిక డైరెక్టర్లు డాక్టర్ పి. ఎస్. ఎన్. మూర్తి, శ్రీ సి. సత్యనారాయణ గార్లను చిత్రంలో చూడవచ్చు.

చీప్‌గా అనుకోవటానికి ఎలాబుద్ధిపుడుతుందిరా నీకు?"

ఒరే..... ఒరే..... నేనేం చీప్‌గా అనుకోవటంలేదు. అందరూ అనుకున్నవి విన్నాను గాబట్టి నీతో అన్నాను అంతే.... అదిసరే.... నీరజని అలా వెనకేసుకొస్తున్నావ్..... కొంపదీసి ప్రేమించడం లేదుకదా! అవిణ్ణి ప్రేమిస్తే యిక ఏ జన్మకీ బాగుపడవు నువ్వు."

నీరజ ప్రస్తావన రావడంతోనే యిబ్బందిగా ఫీలయినాడు రాజారావు. అందుకే మాటమారుస్తూ అలా బజార్లోకి వెళ్దాంపద!" అంటూ లేచాడు.

శ్రీనాథ్ అన్నట్టు రాజారావు నీరజను ప్రేమించడం లేదుకాని ఆమెని బాగా అభిమానించాడనే చెప్పాలి. కారణం - అందమైన అమ్మాయికి చదువూ సంస్కారం వుండీ, అన్ని కళల్లోకాకున్నా కనీసం సాహిత్యంమీదయినా అభిలాష కలిగివుండాలనీ - అలాంటి అమ్మాయినే పెళ్ళిచేసుకోవాలని రాజారావు చిరకాల వాంఛ కావటమే. ఆ వాంఛ కిప్పుడు యిరయ్యేళ్ళు నిండాయి. అయినా ఏమాత్రం నిరుత్సాహపడకపోవడమే రాజారావు ప్రత్యేకత. అంతేకాదు, తన నిరంతర అన్వేషణ కొనసాగిస్తూనే వచ్చారు. ప్రస్తుతం ఆ అన్వేషణ ఫలితమే నీరజ. తన ఆశల, ఆశయాలమూర్తి నీరజ! తన కలలపంట నీరజ!

ఆరునెలలక్రితం ఆర్ట్స్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా జాయినయింది నీరజ. ఆ మరుసటి రోజే హిస్టరీ లెక్చరర్ ప్రకాశం, తెలుగు లెక్చరర్‌గా

అన్వేషణ

రాజారావుని పరిచయంచేశాడు. ఆ తర్వాత అనతి కాలంలోనే తనని సాహిత్య విమర్శకుడిగా

మీ జి. కె. ఎంత? -1

జవాబులు

దురదృష్టం ఒక్కటీ కరెక్టు ఎంట్రీరాలేదు. జవాబులు యిక్కడ యిస్తున్నాము. -సం.

1. అరుజుమండ్ బానుబేగం
2. ఆచార్య జె. బి. కృపలాని
3. విలియం హెన్రీ హారిసన్
4. ఫాబ్రికా ఇటాలియానా ఆటో మొబైలి టొర్నియా
5. రాల్ఫ్ జాన్సన్
6. 12 మంది
7. 1859వ సం. జూన్ 3వ తేదీ 11 గంటలకు
8. ఐర్వాణుడు, శృతికీర్తుడు
9. బొంబే సమాచార్ (గుజరాతీ)
10. బియాస్

-సమర్పణ : జై కి.

పరిచయంచేశాయి పత్రికలు. అప్పటినుంచి తన వ్యాసాలమీద చిన్నచిన్న విమర్శలూ, చర్చలూ జరుగుతూవుండటంలతో యిద్దరూ మరింత సన్నిహితమయ్యారు.

2

భోజనాలయ్యాక మిత్రులిద్దరూ ఓ గంటసేపు పిచ్చాపాటి మాటాడుకున్నారు. అయితే రాజారావు మనసు దిగులుతో నిండివున్నట్టు శ్రీనాథ్ గమనించలేదు. కడప నుంచి శ్రీనాథ్ రావడంతో తనకి ఆరోజు ఎనలేని ఆనందంతో గడిచిపోతుందని ఆశించాడు రాజారావు. అయితే యిలా దిగులూ, గుండెనిండా గుబులూ పెడతాడని అనుకోలేదు.

మరో నెలకి శ్రీనాథ్ ట్రాన్స్‌ఫరయి నీరజస్థానంలోకి వచ్చేస్తాడు. మరి నీరజ? తనకి దూరంగా కడప కాలేజీకి వెళ్ళిపోతుంది.

ఆ రాత్రి నిద్రని వెలివేశాడు రాజారావు.

రాజారావు చదువుకునే రోజుల్లో వాళ్ళ ఎదురింట్లో వున్న ఝాన్సీ తనని ప్రేమించడానికి ఎంతెంతో ప్రయత్నించింది. చివరికి తనులేంది బతకలేనంది. అయినా చలించలేదు రాజారావు. "ఇలా నన్ను మరోమారు యిబ్బందిపెడితే మీ నాన్నతో చెబుతాను.... బుద్ధిగా చదువుకో....", అన్నాడు కూడా.

ఇంకోమారు తన క్లాసమేట్ గిరిజ పార్కులో తనని కలుసుకోవలసినదిగా రాజారావుకి ప్రేమలేఖ రాసింది ఓ రోజు ప్రవరాఖ్యుడి సోదరుడికిమల్లే

మీ పాపాయికి
అందించండి సెరిలాక్ లాభం



తొలిసారిగా ఘన పదార్థాలను ఇస్తూ

4 నెలల నుంచీ మీ పాపాయికి, పాలతో బాటు ఘన పదార్థాలు కావాలి. సెరిలాక్ లాభాన్ని అందించండి.

పోషకాహార లాభం : సెరిలాక్ ప్రతి మోతాదులోనూ మీ పాపాయికి కావలసిన పోషక పదార్థాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలూ అన్నీ వున్నాయి. అన్నీ సమ పాళల్లో వున్నాయి.

రుచి లాభం : పాపాయిలకు సెరిలాక్ రుచి ఇష్టం.

సమయం ఆదా లాభం : సెరిలాక్ ముందుగా వండినది. దానిలో పాలూ పంచదార వున్నాయి. దానిని వెచ్చటి నీటితో కలిపితే చాలు.

ఎంపిక లాభం : ఎంచుకునేందుకు మూడు రకాల సెరిలాక్ వుంది.

మీ పాపాయికి సమతూకంలో పోషకాహారాన్ని అందించేందుకూ తయారుచేయటంలో పరిశుభ్రతను పాటించేందుకూ డబ్బా మీది సూచనలను జాగ్రత్తగా పాటించండి.



6 మాసాలు నించి

4 మాసాలు నించి

6 మాసాలు నించి

ఉచితం
సెరిలాక్ బేబీ కేర్ బుక్
వ్రాయండి. సెరిలాక్
పోస్ట్ బాక్స్ నెం 3
న్యూ ఢిల్లీ 110008

Nestlé

సెరిలాక్ రక్షణ. పోషకాహారంతో పరిపూర్ణం-ఎంతో రుచికరం

RK SWAMY/FSL/5112/TEL

క్రీడారంగంలో రాజకీయాలు



భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి శివాంతి ఆదిత్యన్ చేతిలో 15 వోట్లతో ఓడిపోయిన సురేష్ కల్మాడి తన ఓటమిని న్యాయ స్థానంలో సవాల్ చేస్తున్నారు.

క్రీడల మంత్రి శ్రీమతి మార్గరెట్ ఆల్వా బహిరంగంగా ఆదిత్యన్‌కు అనుకూల ప్రచారం చేశారని, ప్రభుత్వేతర సంస్థల్లో ప్రభుత్వ జోక్యం తగదని సురేష్ కల్మాడి వాదిస్తున్నారు. ఈ జోక్యం వల్ల ఎన్నికలు సక్రమంగా జరగలేదని ఆయన వాదిస్తున్నారు.

నిజానికి కల్మాడికి, ఆల్వాకు మధ్య తగాదా ఇప్పటిది కాదు. పవార్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరినప్పుడు తనకు క్రీడల పట్ల ఉన్న ఆసక్తి వల్ల మంత్రి పదవి ఇస్తారని కల్మాడి ఆశించారు. ఆయన ఆశ నిరాశ అయింది– రాజకీయాలలో క్రీడల బదులు, మనకు క్రీడల్లో రాజకీయాలు సాగుతున్నాయి' అని సునిల్ గవాస్కర్ అన్న మాట నిజమే లాగుంది!

అన్వేషణ

పార్కులో ఎవరూ వినకుండా మెత్తమెత్తగా చివాట్లుపెట్టి చక్కావచ్చేశాడు రాజారావు.

వలచివచ్చింది ఎవరయితేనేంలే – పెళ్ళి చేసుకుందామనో, లేదా ప్రేమించినట్లు నటించి పబ్బం గడుపుకుందామనో అని అనుకునుంటే రాజారావు గండుతుమ్మెదలా బతికేవాడు – తాజా పూలపైవాలుతూ. కానీ అలా బతకడం అంటే రాజారావుకి పరమసహ్యం.

అందుకే నాలుగు దశాబ్దాలు శరీరంమీద ముసురుకుంటున్నా, తలలోనూ, మీసాల్లోనూ అక్కడక్కడ తెల్లని వెంట్రుకలు వయసుతో సరసాలు ఆడుతోన్నా, తన ఆశయం చంపుకోలేకపోయాడు రాజారావు.

ఎక్కడో, ఎవరింట్లోనో ఘ్హాడుగంటలు కొట్టిన శబ్దం.....

తల బరువెక్కిపోతోంది. అప్పటికే – తెచ్చుకున్న రెండు సిగరెట్టుపాకెట్లు తగలేశాడు రాజారావు: చివరికి శ్రీనాథ్ షర్ట్‌జేబులోంచి మరో సిగరెట్ తీసి వెలిగించాడు. శ్రీనాథ్ గుర్రుపెట్టి నిద్రపోతూ వుండటంచూసి అదోలా నవ్వుకున్నాడు రాజారావు.

నీరజే తన జీవితంలోకి వస్తే!

తనకిక నిత్య వసంతం!!

ఉదయాలూ, అస్తమయాలూ అన్నీ ఉత్సవాలే!!!

అయితే నీరజ తనని అంగీకరిస్తుందా అన్నదే ప్రశ్న.... 'ప్రశ్న' అనడంకంటే 'అనుమానం' అనడం సరిగ్గావుంటుందేమో! ఈ 'అనుమానం' అరగంట కోమారు తలలోదూరి మెదడ్ని కెలికేస్తోంది. అయితే ఎక్కడలేని ధీమా వచ్చేస్తుంది – ఎందుకు అంగీకరిచదూ, తనకేం లోటు – అందంలేదా? డబ్బులేదా? అదీకాక తను సాహిత్య విమర్శకుడు కూడాను. అసలు నీరజకి అదే పెద్ద ప్లస్ పాయింటని రాజారావు వుద్దేశ్యం.

మరైతే.... ఆ కోటేశ్వరరావు ఇంగ్లీషు లెక్చరర్‌తో ప్రేమకలాపాలు అంటూ శ్రీనాథ్ చెప్పాడే...... ఆ(ఎవరో గిట్టని వెధవలు అలా ప్రచారంచేసివుంటారు. అలాంటివాటిని ఎలా నమ్మడం. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళమీద పుకార్లు లేకుంటేనే ఆశ్చర్యపోవాలి కానీ, ఉంటే ఆశ్చర్యమేముంది? అలాసాగిపోతోంది అతని ఆలోచనాధోరణి

3

ఆవేళ క్లాసు అయిపోగానే లెక్చరర్స్‌హాల్లోకి వెళ్ళిపోయాడు రాజారావు. నీరజ ఒక్కతే కూచునివుంది. దినపత్రికని తిరగేస్తూ.

రాజారావు నీరజని చూసి పలకరింపుగా నవ్వి "మీకు క్లాసులేదా?" అన్నాడు.

"ఊహూ(" అంది తనచేతిలో వున్న పత్రికని అతనికి అందిస్తూ.

రాజారావు పత్రికని చదువుతూ వుండిపోయినట్లు కనిపిస్తున్నాడే కానీ, లోపల 'తనకు నీరజ నచ్చినట్లు చెప్తేనో' అని బలంగా అనుకుంటూ వున్నాడు. అందుకే అతని గుండె రెట్టింపువేగాన్ని పుంజుకుంది.

"మీ కింకా పెళ్ళికాలేదటగా..... మొన్న ఏదో మాటలసందర్భంలో చెప్పారు నరసింహంగారు" అంది నీరజ.

తన విషయం అలా చెప్పినందుకు మనసులోనే నరసింహంకి కృతజ్ఞతలు చెప్పుకుని "అవునండీ" అన్నాడు చిరుమందహాసంతో రాజారావు.


"ఎందుకుసార్! మీరు కోరి కట్నాలూ, కానుకలూ యిచ్చుకోగల అమ్మాయి దొరక్కేనా?"

"నన్నలా అర్థంచేసుకున్నందుకు చాలా బాధగా వుంది మేడమ్!" అంటూనే మొహం చిన్నబుచ్చుకున్నాడు రాజారావు.

"తమాషాకన్నానులెండి సార్! మరీ అంత బాధపడిపోతారే!" అంటూ నవ్వింది నీరజ.

ఆ నవ్వంటే రాజారావుకి యిష్టం.

విజయవాడలో "నవచిత్రకథ" తొలి సంచికని ఆంధ్రపత్రిక బిజినెస్ మేనేజర్ శ్రీ వి. రమేష్‌బాబు స్థానిక ఏజంట్ శ్రీ వి. శివరామరాజుకు అందజేస్తున్న దృశ్యం.



గెల్చుకోండి రు.200/-

గళ్ళ నుడి కట్టు -2

ఆధారాలు

నిలువు


1 కంటి కెదురుగా
2 నలువ వంటి వాడు బ్రహ్మ
3 సూర్యుడు కలిగించేది
4 కోపగించి
5 పాండవులలో తొలేలు పాట్ట వుంది
7 రెండు వకారాలతో పువ్వు
9 చిన్నయసూరిగారి నక్క
12 ఇది వెంటనే పూయమవుతుంది
14 రఘునాథ నాయకుడు ఆవిష్కరించిన వాయిద్యం
15 నరు
16 రెండు గకారాలతో ముంత
17 చూడము

అడ్డం

1 ఉత్తములు ఇది పడితే ఆ పని అయినట్లే
3 రాముడి చేతిలో మరణించిన స్త్రీ
5 సీత నిచ్చేది
6 5, అడ్డాలు దీనిలో వుంటాయి
8 ఈ యుగం తిరగబడింది
10 ఈ వైపు యమలోకం
11 ప్రేలేది అటు నుంచి
13 పట్టణం తిరగబడింది
15 ఇది పటితే వదలదు
17 ఎక్కువ
18 యోగికి ఇది అవసరం
19 కృష్ణార్జునుల తగాదాకు కారణం

ఆధారాలున్నాయి. నుడి కట్టు గళ్ళు నింపండి! కూపన్ కత్తిరించిమీ చిరునామా రాసి పంపండి! ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు.|200/-లు బహుమతి లభిస్తుంది-ఒకరి కన్నాఎక్కువమంది కరెక్టు ఆన్సర్‌లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే! -సం

గడువు : 28-1-1989



ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపిన వారిపేరు : ....

పూర్తి చిరునామా : ....

....

..............................పిన్‌కోడ్ : ....



కన్నబిడ్డల్ని కడుపులో పెట్టుకుని కాపాడే ఆస్ట్రేలియన్ జంతువు కంగారూ తెలుసు గదూ?!

అమ్మకి 'కంగారూ' ఆదర్శం

ఇప్పుడు కొలంబియాలో తల్లులు కూడ కంగారూల్ని అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ కొత్తరకం ప్రయత్నాన్ని కంగారూ మాతృత్వం అని పిలుస్తున్నారు. ముఖ్యంగా తగిన బరువు లేకుండా పుట్టిన శిశువుల్ని, ఇంకా గర్భస్థ రక్షణ అవసరమయిన శిశువుల్ని ఇలా కాపాడుతున్నారు. కంగారూ మాతృత్వంలో కంగారూకు సహజంగా ఉండే సంచీ లాంటి దాన్నే తయారు చేసి దానిలో శిశువును ఉంచుకుని రాత్రింబవళ్ళు రొమ్ముల కింద ఉంచుకుంటారు.

నెలలు నిండకుండా పుట్టిన శిశువులు ఎదుర్కొగల ప్రమాదాలను నివారించేందుకు గాను వారిని ఇన్‌క్యుబేటర్లలో, తగిన ఉష్ణోగ్రతలో ఉంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. తగిన బరువు లేకుండా పుట్టే శిశువులకు కంగారూ మాతృత్వం ద్వారా ఈ ఇన్‌క్యుబేటర్ స్థితిని కల్పించవచ్చు.

కొలంబియా వైద్యులు ఈ కంగారూ మాతృత్వ పథకాన్ని 1980 లోనే తయారు చేశారు. కంగారూలకు వర్తించే నియమాలు మనుషులకు కూడ వర్తించగలవని వాళ్ళు ఊహించారు. సహజంగానే కంగారూలన్నీ కూడ నెలలు నిండకుండానే జన్మిస్తాయి. కంగారూ పిల్లలు పుట్టినప్పుడు కేవలం ఒక అంగుళం పొడవు ఉంటాయి. కావలసిన ఉష్ణోగ్రతను, పోషణను తల్లి కడుపు కింద ఉండే సంచీలోనే పొందుతాయి. ఈ ఉదాహరణ నుంచి స్త్రీలలో కూడ రొమ్ముల కింద సంచీని ఏర్పాటు చేయగలిగితే కంగారూలలో పొందే ఫలితాన్నే పొందవచ్చునని వైద్యులు ఊహించారు. ఈ పథకం మొదలయిన తర్వాత నెలలు నిండకుండా పుట్టిన శిశువుల మరణాలు తగ్గిపోయాయి. రోజుకు 79 డాలర్లు ఖరీదు చేసే ఇన్‌క్యుబేటర్ల ఖర్చు కూడ తగ్గిపోయింది.

కొలంబియా నమూనాను తీసుకుని తమతమ దేశాల్లో కూడ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడానికి బొలీలియా, హైతీ, పెరూ, ఈక్వడార్, ఎల్ సాల్వడార్, బ్రిటన్, ఇటలీ, నార్వేలు కూడ ముందుకొచ్చాయి.

కంగారూ మాతృత్వం అనుభవం గురించి ఒక తల్లి "రోజంతా పాపను నా ఒంటికి తగులుతూ ఉండడం అద్భుతంగా ఉండింది... నేను ఎక్కడికైనా వెళ్ళడానికి బస్సు ఎక్కినప్పుడు మాత్రం, నా కడుపు మీద ఈ మూట ఏమిటా అన్నట్టు అందరూ చూసేవాళ్ళు. వాళ్ళను వాళ్ళ ఆశ్చర్యానికే వదిలేసి నేను నవ్వుకునే దాన్ని" అంది. ●

అన్వేషణ

ఇష్టమా? .... ప్రాణం!!!

"అట్టే బాధపడలేదుకానీ – కాబోయే భార్య ఎలా వుండాలన్న దానిపైన నాకు కొన్ని అభిప్రాయాలున్నాయండీ!"

"ఆ అభిప్రాయాలకి సరిపోయిన వ్యక్తి దొరకలేదు... అందుకని మీరు పెళ్ళిచేసుకోలేదు" అంటూ నీరజ తన మాటలకి అడ్డువచ్చి, తక్కింది తనే పూర్తిచేస్తోంటే నవ్వేశాడు రాజారావు.

"మంచిదే.... యిప్పటికీ మీ అన్వేషణ సాగుతోనే వుందా?" అంది నీరజ.

"లేదండీ.... దాదాపు పూర్తయిందిగా!"

"ఈజిట్! కంగ్రాచ్యులేషన్స్..... దొరికిందా మీకు నచ్చిన భార్య...." ఆత్రంగా అడిగింది నీరజ.

ఇంతకంటే మంచిఅదను మరెప్పుడూరాదనీ. వెంటనే అసలువిషయం చెప్పేయమనీ రాజారావు మనసు ఒకటే తొందరపెడుతోంది.

"అంత ఆత్రంగా అడిగితే ఎలాగండీ! నే నసలే పిరికివాణ్ణి" సిగ్గుపడుతున్నట్టు తల వంచేసుకున్నాడు రాజారావు.

"మీరా పిరికివాళ్ళు? రచయితలపై బారడేసి విమర్శనా బాణాలువేస్తారు! మీ రెంత ఆత్మనిందకు పాల్పడినా నేను నమ్మనండోయ్!"

"అవునండీ.... అట్టే కాదండీ.... నాకు కాబోయే భార్య మీరే! మీ గురించే దొరికారని చెబుతోంది" చివరివాక్యాన్ని బిగ్గరగా అరిచి చెబుతున్నట్టే అనిపించింది రాజారావుకి – మరి ఆమె వినివుంటే మొహంలో రియాక్షన్ వచ్చివుండేదికదూ..... తనని మామూలుగానే చూస్తోందే!

"అప్పుడే చూడండి! కాబోయే భార్య మాట వచ్చేసరికి ఎలా తడబడుతున్నారో – మాటల్లో" అంటూ నవ్వింది నీరజ.

హాల్లోకి యిద్దరు లెక్చరర్లు ప్రవేశించడంతో దినపత్రికలోకి తలదూర్చేశాడు రాజారావు.

రాజారావు మనసు మనసులో లేదు. తన యిష్టాన్ని నీరజతో చెప్పేసుకోడానికి మంచి ఛాన్సువచ్చినా, అనవసరంగా తను మిస్ చేసుకున్నాడు. నిజంగా తను నూటికి నూరుపాళ్ళూ పిరికివాడే. తీరా తన మనసువిప్పి నీరజకు చెప్పాక తనని అక్కడికక్కడే ఎక్కడ తిరస్కరిస్తుందో నని ఒకటే భయం. ఒకవేళ తిరస్కరించడమే జరిగితే జీవితాంతం అది తనని వెన్నాడుతూవుంటుందన్న మధ్యతరగతి మనస్తత్వమే తనని అలా తయారు చేసింది.

ఓ నెల తర్వాత నీరజ కడపకు బదిలీఅయి వెళ్ళిపోయింది. ఆమె స్థానంలో శ్రీనాథ్ వచ్చి చేరాడు.

4

ఎదురుగా మనసువిప్పి చెప్పుకోలేని విషయాల్ని ఉత్తరంలో ఎంత సూటిగానైనా చెప్పవచ్చుకదా అని మూడు రోజుల్నించి ఓ రీము తెల్లకాయితాల్ని ఖరాబుచేసి చించేశాడు రాజారావు. ఎట్టకేలకు ఓ రెండు పేజీల ఉత్తరాన్ని ఆ రోజు మధ్యాహ్నానికి తయారుచేశాడు. దాన్ని పోస్టుచేయడానికని డ్రెస్ వేసుకొని యింటికి తాళం వేస్తుండగా పోస్టుమెన్ రాజారావుచేతిలో ఓ కవరుంచి వెళ్ళిపోయాడు. ఆ కవరు మీద ఫ్రమ్ అడ్రసులో 'నీరజ' అనివుంది. దాన్నిచూసి రాజారావు గుండె క్షణకాలం ఆగి, తీవ్రస్థాయిలో కొట్టుకోనారంభించింది. వణుకుతున్న వేళ్ళతో, కవర్ని చించి లోపలున్న కాగితాన్ని మడతలువిప్పాడు.

తెల్లనికాగితంమీద ముత్యాల సరాలులా ఆరు పంక్తులున్నాయి.

"మీ భార్యాన్వేషణ ఫలించినట్టు మీరు చెప్పినప్పుడు నాకు చాలా సంతోషంవేసింది..... గొప్ప అదృష్టవంతులు మీరు. అయితే..... మీలాగే నేనూ చాలా ఏళ్ళుగా నా అభిరుచులకు తగ్గ భర్తకోసం వెదకుతూనేవున్నాను – యింతవరకూ నాకు తారసపడనేలేదు – దురదృష్టవంతురాల్ని –

కంగ్రాచ్యులేషన్స్ – నీరజ

రాజారావు చేతిలో పోస్టుచేయని ఉత్తరం నలిగిపోతూ మూలిగింది. ●

సీరియల్

చల్లా సుబ్రహ్మణ్యం

పవిత్రపాపి





(గత సంచిక తరువాయి)

రాత్రి ఎనిమిది గంటలు–

ముఖ్య మంత్రి అఫీషియల్ ఛాంబర్స్–

అప్పుడే లోపలికి ప్రవేశించిన డి. జి. పి. కళ్యాణ్‌రాం సి. యమ్. కి. వినయంగా సెల్యూట్ చేశాడు.

"రండి కళ్యాణ్‌జీ! మీ కోసమే ఎదురు చూస్తున్నాను...." అన్నాడు సి. యమ్.

"సారీ ఫర్ ద డిలేసర్! మదర్ కేథరిన్ హైదరాబాదొస్తున్న సందర్భంగా సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ అరున్నరకు ఆమె ఫ్లైట్ దిగిన దగ్గర్నుంచీ..." అంటూ ఏదో చెప్పబోతున్న కళ్యాణ్‌రాం మాటల్ని కట్ చేస్తూ–

"ఆగండాగండి! మీరు చేసే సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ ఏవీ కూడా ఆమెని రక్షించడానికి ఉపయోగపడవు..." అన్నాడు ముఖ్యమంత్రి.

"వ్వాట్!?" ఆశ్చర్యంగా చూశాడు కళ్యాణ్‌రాం.

"అవునండీ! ఆమెకి ఏ సెక్యూరిటీ అవసరం లేదట. తానొక అజాత శత్రువుననీ తనకి హాని తలపెట్టేవాళ్ళు ఈ భూమ్మీద ఉండరనీ ఆమె నమ్మకం..."

జరిగిన కథ– 25: మోహనరావు సీతాదేవిని హత్య చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వచ్చి అతణ్ణి పట్టుకుంటారు. రాకాపై విచారణ ముగుస్తుంది. శిక్ష విధించడమా, లేదా అన్న ధర్మసందేహంలో ఉండగా, అగస్త్యశాస్త్రి పోనెక్కి రాకా జీవిత కథను వివరిస్తాడు. రాకా పవిత్ర పాపిఅని, శిక్షార్హుడు కాడని వాదిస్తాడు. రాష్ట్రానికి మదర్ కేథరిన్ రాబోతున్నారనే విషయంపై ముఖ్యమంత్రికి, హోంమంత్రికి విభేదాలు కలుగుతాయి. అగస్త్యశాస్త్రి వాదనలపైపై ఎత్తు వేయడానికి అగ్నిమిత్ర ప్రయత్నిస్తుంటాడు.

"నిజమే సర్! ప్రపంచ శాంతి దూతైన ఆమెకెవరూ శత్రువులుండరనే విషయం మనకి తెలుసు. కానీ..."

"కానీ... ఏం చెయ్యమంటారండీ! మన బాధలు ఆమెకెలా అర్థమౌతాయి? అసలే ఈ మధ్య 'బ్లాక్ థండర్' గ్యాంగ్ దురాగతాలు ఎక్కువయిపోయాయి. అసలు ఆ గ్యాంగ్ వాళ్ళు అనే కాదు... ఎవరో అకతాయితనంగానో లేదా అంత పెద్ద ఇంటర్నేషనల్ డిగ్నిటరీని ఎటాక్ చేసి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలనే క్రేజ్‌తోనో...

ఎవరైనా ఏమైనా చెయ్యొచ్చు. అలా జరగకూడనిదేదైనా జరిగిందనుకోండి మనం ఏమైపోవాలి...? ఈ ప్రపంచంలో మనల్నెవరూ క్షమించరు. మా ప్రభుత్వాలూ ఉండవ్– మీ పోజిషన్లూ మిగలవ్... అంతే కాదు.... ప్రజలు మనల్ని బహిరంగంగా ఉరి తీసినా తీస్తారు..." అన్నాడు ముఖ్యమంత్రి.

"మరీ అంత ఆవేశపడకండిసార్! ఆలోచిస్తే ఏదో ఒక సొల్యూషన్ దొరక్కపోదు అవసరమనుకుంటే నేనే మఫ్టీలో వెళ్ళి..."

అంటున్న కళ్యాణ్‌రాం మాటల్ని కట్ చేస్తూ–

"మఫ్టీలో వెళ్ళాల్సొస్తే మీరేంటి? నేనూ వెళ్ళగలను. అవసరమైతే ఢిల్లీ నుంచి కమెండోలని తెప్పించగలను. ప్రైవేట్ డిటెక్టివ్‌లను పిలిపించగలను. కానీ– మనకా అవకాశం లేదు....." అన్నారు. ఏకాంబరం. ముఖ్యమంత్రి మఫ్టీలో వెళ్ళడం అంటే ఏమిటో అర్థం కాక–

"అదేం?" అన్నాడు డి.జి.పి.

"ఎయిర్ పోర్ట్ దగ్గరా– శాంతిరత్న అవార్డు ఫంక్షన్ దగ్గరా కావలసినంత సెక్యూరిటీ అరేంజ్ చేసుకోండి. కానీ హరిజన కాలనీలో మాత్రం ఏ సెక్యూరిటీ అవసరం లేదనీ– కనీసం మఫ్టీలో కూడా ఎవరూ తన చుట్టు ప్రక్కల ఉండకూడదనీ గట్టిగా చెప్పిందామె.

పేద ప్రజలకు భూమి పంచి పెట్టడానికొస్తున్న నన్ను ఎవరేం చేస్తారు? నేను ప్రజల మనిషిని ప్రజలంటే నాకేం భయం? ఒకవేళ ఎవరైనా హత్యా ప్రయత్నం చేసినా బాధపడాల్సిందేం లేదు. ప్రజాసేవలో బలికావడాన్ని మించిన దేముంది? అని కూడా అన్నారట ఆమె.

"మరిప్పుడు ఏం చేద్దామంటారు సార్?"

"అది చెప్తారనేగా మిమ్మల్ని పిలిపించింది..."

"చూడండి సార్! నిజానికి అమెలాంటి 'శాంతి కపోతానికి' హాని తలపెట్టే దుర్మార్గులుండరు. ఒక్క సిటీలోనే కాదు– మొత్తం రాష్ట్రంలో ఉన్న గూండాల నుంచీ– రౌడీ షీటర్స్ నుంచీ ఏ ప్రమాదమూ ఉండదు. ఎందుకంటే వాళ్ళంతా రేపట్నుంచి పోలీస్ లాకప్పుల్లోనే ఉంటారు. పోతే రాజకీయపరంగా ఏదైనా కుట్ర జరిగే అవకాశం

మాసుకుని వచ్చేసరికి లేటయింది." చెప్పాడు కళ్యాణ్‌రాం.

"ఇట్స్ ఆల్‌రైట్! మీతో అదే విషయం మాట్లాడ్డానికే పిలిపించాను"

"యు డోంట్ హావ్‌టు వర్రీ సర్! ఆమె సిటీలో ఉండే మూడు గంటలూ– ఎప్పుడూ లేనంత టైట్ సెక్యూరిటీ ఏర్పాటు చేశాను. ఎల్లుండి రాత్రి తొమ్మిది గంటల నుంచి పోలీసుల దృష్టిని దాటి ఏ మనిషీ ఎయిర్ పోర్ట్‌లో ప్రవేశించలేడు. బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్‌ని కూడా ఎలర్ట్ చేశాము. మన పోలీసు ఫోర్సుతో పాటు అదనంగా ఒక బెటాలియన్ స్పెషల్ పోలీసు– ఒక ప్లేటూన్ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ బలగాల్ని– రప్పించాను. ఆ రోజు ఉదయం

హెత్రీ హౌం ప్రొడక్ట్స్ ప్రై. లిమిటెడ్, సికింద్రాబాద్ సమర్పిస్తున్న స్పెషల్ సీరియల్

ఉండచ్చేమో! అలాంటి దేదైనా వుంటే మీకే తెలియాలి..." అంటూ ఆగాడు కళ్యాణ్‌రాం.

"ఓ...కే... ఆ విషయం నేను చూసుకుంటాను. మీ అరేంజ్‌మెంట్సు- అంచనాలూ- అన్నీ బాగానే ఉన్నాయ్! కాకపోతే ఆ రోజు ఉదయం ఏడు గంటల నుంచీ ఎనిమిది పది వరకూ ఆ కాలనీలో గడుపుతారామె.

అంటే ఆ గంట సేపూ సెక్యూరిటీ లేకుండా వుంటుందామె. సో... ఆ గంట పాటూ ఆమె రక్షణ కోసం మనం ఏం చెయ్యగలమో ఆలోచించండి" చెప్పారు ముఖ్యమంత్రి. కొన్ని క్షణాల తర్వాత ఏదో ఐడియా వచ్చిన వాడిలా- "ఆ కళ్యాణ్‌రాంజీ.. మనకి నమ్మకస్తులైన మెరికల్లాంటి కిరాయి రౌడీల్ని మామూలు ప్రజల వేషంలో ఆమెతో పాటు ఉంచితే ఎలా ఉంటుందంటారు?" అడిగారు ఏకాంబరం.

అవసరమైతే కొందరు రాజకీయ నాయకులు ఏ స్థాయికైనా- దిగజారగలరని తెలిసిన కళ్యాణ్‌రాం లోలో పలే నవ్వుకుని,

"ఏం బావుందదు సార్!" అన్నాడు.

"మరెలా?" అంటూ ఆలోచిస్తుండి పోయాడు ఏకాంబరం.

అంతలో టేబుల్ మీది ఇంటర్- కం రింగ్ అవడంతో రిసీవరెత్తి

"నన్నిప్పుడు డిస్టర్బ్ చెయ్యొద్దని చెప్పానా?" విసుగ్గా అన్నారు ముఖ్య మంత్రి.

"సారీ సార్! 'బ్లాక్ థండర్' గ్యాంగ్ లీడరట. మీతోటే మాట్లాడాలట" చెప్పాడు సెక్రటరీ హఠాత్తుగా. రిసీవర్ చెయ్యి అడ్డంపెట్టి.

"కళ్యాణ్‌జీ... "బ్లాక్ థండర్" గ్యాంగ్ లీడర్ లైన్లో ఉన్నాడట. మీరు మాట్లాడుతారా?" కంగారుని అణుచుకుంటూ అడిగాడు ముఖ్యమంత్రి.

"లేదు. మీరే మాట్లాడండి. నేను ఎక్స్‌టెన్షన్ ఫోన్లోంచి అవతలి వ్యక్తి ఎవరో ట్రేస్ చెయ్యడానికి ట్రై చేస్తాను." అంటూ లేచి పక్క రూంలో కెళ్ళాడు కళ్యాణ్ రాం.

"హలో... సూర్యం... వాడెవడో మాట్లాడమను. లైన్లో ఉన్న సెక్రటరీకి చెప్పాడు.

"హలో మైడియర్ చీఫ్ మినిస్టర్... నువ్వూ- నీ ప్రభుత్వమూ ఆ కళ్యాణ్‌రాం- వాడి పోలీస్ ఫోర్స్ అన్ని ఏర్పాట్లూ చేసుకున్నా మదర్ కాథరిన్‌ని రక్షించడం అసంభవం...." అంచవతలి బొంగురు కంఠం.

"ష....ట....ప్...." అరిచాడు ఏకాంబరం.

"నన్ను షటప్ అన్నావంటే నువ్వు పర్మనెంట్‌గా షటప్పై పోగలవు జాగ్రత్త. మరో విషయం.... కాథరిన్ చావు- నీ పతనం రెండింటికీ ముహూర్తం ఒకే రోజు.... బి రెడీ..."

ఫోన్ డిస్ కనెక్ట్ అయింది.

ఫోన్ పెట్టేసి ముఖ్యమంత్రి ఛాంబర్స్‌లో కొచ్చాడు కళ్యాణ్‌రాం.

ఇద్దరి మధ్యా నాలుగు నిముషాల నిశబ్దం...

కళ్యాణ్‌రాం బుర్రలో ఫ్లాష్ లాంటి ఆలోచన మెరిసింది. వెంటనే-

"సార్.... మీరేం కంగారు పడకండి! నా మేధస్సు నంతా ఉపయోగించి నా ప్రాణాలు అడ్డుపెట్టయినా సరే! మదర్ కాథరిన్‌ని రక్షిస్తాను." ప్రామిస్ చేశాడు.

కళ్యాణ్‌రాం శక్తి సామర్ధ్యాల మీద నమ్మకమున్న ముఖ్యమంత్రి మరేం మాట్లాడలేదు.

* * * * * * *

మర్నాడు-

ఉదయం పదకొండు గంటలు-

కోర్టు హాలు కిక్కిరిసి వుంది. కోర్టు ఆవరణంతా ఇసుక వేస్తే రాలనంతగా ప్రజలతో నిండి పోయింది.

తీర్పు చెప్పడానికి ఉపక్రమించాడు జస్టిస్ చంద్రశేఖర్.

కేసు పూర్వాపరాలు పరిశీలించిన మీదట ముద్దాయి తాత ఆగస్త్యశాస్త్రి చెప్పిన విషయాలు వాస్తవాలేనని కోర్టు నమ్ముతోంది.

అలాగే ఆయన వాదనన- తర్కాన్ని- సమాజం పట్ల ఆయన అవగాహననీ ప్రాకృతిక న్యాయపరంగా నేను వ్యక్తిగతంగా అర్థం చేసుకో గలను. ఆయన ఆవేదనను మానవత్వం దృష్ట్యా సానుభూతితో అర్థం చేసుకుంటున్నాను.

అయితే వ్యక్తిగతంగా నేనెన్ని గ్రహించినా అర్థం చేసుకున్నా భారత రాజ్యాంగానికి ఆ సార్వభౌమత్వంలో తయారైన చట్టాలకీ న్యాయ శాస్త్రాలకీ నేను బద్ధుడిని.

ధర్మాసనం తరఫున ధర్మదేవత సాక్షిగా నేను చెప్పబోయే తీర్పుని ఆ న్యాయదేవత హర్షిస్తుందో- గర్హిస్తుందో నాకు తెలీదు. కానీ.... నన్ను ఈ పదవిలో నియమించిన రాజ్యాంగ ప్రామాణికంగానే తీర్పు చెబుతున్నాను."

అంటూ ఒక్క క్షణం ఆగి-

"ఎంతటి శ్రేయస్సు కొసమైనా న్యాయా న్యాయ విచక్షణాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం రాజ్యాంగం దృష్టిలో నేరం. కనుక



న్యాయశాస్త్రం గీసిన గీత దాటినందుకూ రాజ్యాంగ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించి తనే న్యాయాధికారిగా న్యాయదేవత ప్రతినిధిగా ప్రవర్తించిన ఈ ముద్దాయి "రాకా"కు ధర్మాసనం "ఉరి" శిక్ష విధిస్తోంది.

అయితే- గత స్మృతి కోల్పోయి కనీసం తనెవరో కూడా తెలియని మానసిక స్థితిలో వున్న వ్యక్తికి "ఉరి శిక్ష" విధించటాన్ని న్యాయ శాస్త్రం అంగీకరించదు.

అందుకే ముద్దాయి తిరిగి తన జ్ఞాపక శక్తిని పొంది- మానసికంగా ఆరోగ్యవంతుడైన తర్వాత మాత్రమే ఈ ఉరి శిక్ష అమలు జరపాల్సిందిగా కోర్టు ఆదేశిస్తోంది."

అంటూ ఒక్క క్షణం ఆగాడు.

ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా-

"ఐ అబ్జెక్ట్ మిలార్డ్..." అంటూ లేచాడు ప్రాసిక్యూటర్ అగ్నిమిత్ర.

"మిలార్డ్.... ఈ స్మృతి కోల్పోవడం అనేది ఏదో ఒక విధంగా శిక్ష నుంచి తప్పించుకోవడానికి ముద్దాయి ఆడుతున్న నాటకం అని నా అభిప్రాయం. నా అభిప్రాయమే కాదు మిలార్డ్... స్మృతి కోల్పోయాడనడానికి సాక్ష్యంగా వున్న ఆ మెడికల్ రిపోర్ట్సు సరైనవి కావని ప్రాసిక్యూషన్‌కు విశ్వసనీయంగా తెలిసింది" అన్నాడు.

"మిలార్డ్.... దిసీజ్ టూమచ్.... మతిలేని స్థితిలో వున్న వ్యక్తిపై ఇలాంటి నిందవేయడం అమానుషం..."

లేచి అరిచినట్లుగా అన్నాడు డిఫెన్స్ లాయర్ శాండిల్య.

అంతలో జస్టిస్ రణధీర్ అందుకుని-

"వాటీజ్ దిస్ ప్రాసిక్యూటర్.... తీర్పు చెప్పే స్టేజ్‌లో ఈ అబ్జెక్షన్సన్నీ.... అసలు మీరేం చెప్ప దల్చుకున్నారో నాకేం అర్థం కావడం లేదు." అన్నాడు.

"అయాం సారీ మిలార్డ్.... ఈ సమయంలో అభ్యంతరం చెప్పడం నాది పొరపాటే! అందుకు కోర్టు వారిని క్షమాపణ వేడుకుంటున్నాను. ముద్దాయి మానసిక స్థితి ఆరోగ్యకరంగా వున్నా- అతనికి శిక్ష వేయించడం నా అభీష్టం కాదు. అయితే- ముద్దాయి మానసిక పరిస్థితిని పునఃపరిశీలించే అవకాశం కల్పించ వలసిందిగా కోర్టును అభ్యర్థిస్తున్నాను." అన్నాడు అగ్నిమిత్ర.

"మిలార్డ్! భారతీయ వైజ్ఞానిక సంస్థకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత డాక్టర్లిచ్చిన రిపోర్ట్సును అనుమానించడం సమంజసం కాదు" చెప్పాడు శాండిల్య.

"ఆ రిపోర్ట్సులు సంవత్సరం క్రితం ఇచ్చినవనే విషయం కోర్టువారు గమనించాలి. అయినా ముద్దాయి స్మృతి కోల్పోయాడనే విషయాన్ని డిఫెన్స్ వారు అంత గట్టిగా నమ్ముతున్నప్పుడు మరోసారి మెడికల్ చెకప్ చేయిస్తామంటే ఎందుకంత భయపడు తున్నారో నాకు అర్థం కావడం లేదు మిలార్డ్!" అన్నాడు అగ్నిమిత్ర తీవ్రంగా.

"మిలార్డ్.... అది భయం కాదు. మళ్ళీ చెకప్ అంటే గతంలో రిపోర్టిచ్చిన డాక్టర్లను అవమానించడమే అవుతుందని నా అభిప్రాయం" చెప్పాడు శాండిల్య.

"మైడియర్ డిఫెన్స్ లాయర్.... ఇందులో అవమానాలూ అనుమానాల ప్రసక్తి లేదు. సంవత్సరం గడిచింది గనుక మళ్ళీ పరీక్ష చేయించడం వల్ల నష్టమేమీ లేదు. ప్రత్యేకించి మీకేదైనా అభ్యంతరం వుంటే చెప్పండి!" అడిగాడు జస్టిస్ రణధీర్.

"ఒకే మిలార్డ్! మీ ఇష్టం...." అన్నాడు శాండిల్య.

"మిస్టర్ అగ్నిమిత్రా! ముద్దాయిని ఏ డాక్టర్లకి రిఫర్ చేయాలని మీ అభిప్రాయం?" అడిగాడు జస్టిస్.

"ఇందులో అభిప్రాయ మేముంది మిలార్డ్.... సిటీలో వున్న మూడు ప్రభుత్వాసుపత్రుల్లో వున్న న్యూరాలజీ డిపార్ట్‌మెంటల్ హెడ్స్ అందరూ ప్రముఖ న్యూరో సర్జన్లే. వాళ్ళలో ఎవరికి రిఫర్ చేసినా కరెక్ట్ రిపోర్ట్ వస్తుంది...." చెప్పాడు అగ్నిమిత్ర.

"ఓ. కే.... దెన్.... ముద్దాయి రాకా మానసిక పరిస్థితి మీద తాజా నివేదిక కోసం అతన్ని మూడు ఆస్పత్రుల న్యూరాలజిస్టులకు, జాయింట్‌గా రిఫర్ చేయాలని కోర్టు అభిప్రాయ పడుతోంది." చెప్పాడు జస్టిస్ రణధీర్.

"మిలార్డ్.... ఆ ముగ్గురు డాక్టర్లు సమర్పించే నివేదిక మీదే ముద్దాయి జీవితం ఆధారపడి వుంటుంది కనుక ఆ డాక్టర్లపై ఎలాంటి ఒత్తిడులు, కలగకుండా వారికీ- నాకూ పోలీస్ రక్షణ కల్పించవలసిందిగా కోరుతున్నాను.

అలాగే సామాన్య ప్రజల్లో రాకాకి ఉన్న మంచిపేరు దృష్ట్యా శాంతిభద్రతల దృష్ట్యానాది మరో మనవి.

నివేదికను వెంటనే సమర్పించాల్సిందిగా ఆ డాక్టర్లను ఆదేశించమని కోర్టు వారిని అభ్యర్థిస్తున్నాను" అన్నాడు అగ్నిమిత్ర.

"సరే.... సరే... మరో ఇరవైనాలుగ్గంటల్లో నివేదిక అందించ వలసిందని న్యాయస్థానం ఆ డాక్టర్లని కోరుతోంది. అంతవరకూ వారికీ- ప్రాసిక్యూటర్‌కీ గన్‌మాన్ సౌకర్యాన్నివ్వ వలసిందిగా హోంశాఖను ఆదేశిస్తున్నాను. దట్సాల్...." అంటూ లేచాడు జస్టిస్ రణధీర్.

ఆ రోజుకి కోర్టు వాయిదాపడింది.

* * * * * * * * *

"లాయర్‌గారూ! మన కేసు ఇలా రోజుకో మలుపు తిరుగుతుంటే అసలు ఏం జరుగుతుంది అనేది నా ఊహకి అందడం లేదు." అంది దేదీప్య దిగులుగా.

"నిజమేనమ్మా! న్యాయం అనేది పిల్లి చేతిలో త్రాసు లాంటిది. అది ఎటు మొగ్గు చూపుతుందో ఏమీ చెప్పలేం. ఆఖరి క్షణంలో తీర్పుని కాయితం మీద పెట్టేవరకూ తామేం తీర్పు చెప్పబోతున్నారో ఈ రోజుల్లో చాలా మంది న్యాయమూర్తులకే తెలీదమ్మా! ఏది ఏమైనా ఆఖరి నిముషంలో రాకాని మళ్ళీ మెడికల్ బోర్డుకి రిఫర్ చెయ్యడంలో అగ్నిమిత్ర ఆంతర్య మేమిటో నాకర్థం కావడం లేదు" అన్నాడు శాండిల్య సాలోచనగా.

"అతని ప్లాన్ ఏదైనప్పటికీ ఇందులో మనం భయపడాల్సిం దేముంది? రాకాకి స్మృతి లేదు

అన్నది నిజం. ఆ వాస్తవాన్ని ఏ డాక్టర్ మాత్రం కాదన గలడు?"

అని అమాయకంగా అంటున్న దేదీప్యను క్షణం జాలిగా చూశాడు శాండిల్య.

"పిచ్చిపిల్లా....! మామూలు పరిస్థితుల్లో నువ్వు చెప్పేది కరక్టేనమ్మా! కానీ ఈ కేసువేరు. రాకాకి శిక్షపడాలి అని కోరుకునే వాళ్ళు కేవలం పోలీసులూ- ప్రభుత్వమే కాదు, పేదల కన్నీళ్ళనీ- రక్తాన్నీ డబ్బుల రూపంలో హరిస్తూ ఆ అక్రమ సంపాదనతో సజావుగా బతికే ఘరానా పెద్ద మనుషులు కూడ... అదే నా భయం."

"అంటే.... పవిత్రమైన వైద్య వృత్తిని చేపట్టిన ప్రఖ్యాత డాక్టర్లు కూడా ఇంత అన్యాయానికి దిగజారి తప్పుడు రిపోర్టు లిస్తారని మీ అనుమానమా సార్?"

"అదేకదా మన దౌర్భాగ్యం... వృత్తి పవిత్రమైనదైనా డబ్బు అంతకంటే పవిత్రమైనదని నమ్మేవాళ్ళు సమాజంలో చాలా మంది ఉన్నారు. ఒకవేళ డబ్బుకి లొంగని నిజాయితీ పరులున్నా- అధికార బలానికి తల వంచక తప్పదమ్మా!"

"అంటే దేనికీ తలవంచని డాక్టర్లు ఉండరంటారా? అగ్నిమిత్ర ఆ ముగ్గురు డాక్టర్లనే మేనేజ్ చెయ్యగలడంటారా లాయర్‌గారూ....?"

"ఇది కేవలం అగ్నిమిత్ర ప్లాన్‌లాగా లేదమ్మా! పోలీస్ వ్యవస్థకు తల నొప్పిలా తయారైనరాకా అడ్డు తొలగించు కోవడానికి హోం మినిష్టర్ త్రిభువనరావు విశ్వ ప్రయత్నం చేస్తాడు. దానికి తోడు ఆరోగ్య శాఖా మంత్రి త్రిభువనరావు బావమరిది. సో.... ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే ఏ డాక్టరైనా సాధారణంగా అధికార ఒత్తిడికి తలవంచక తప్పదు. ఒకవేళ వృత్తి పట్ల నిజాయితీతో ఎదురు తిరిగి రాజీనామా చేసినా మర్నాటి నుంచి ఆ డాక్టర్‌కి మనుగడే కష్టమయేలా చెయ్యగలదు హోంశాఖ.

చూస్తూ చూస్తూ ఆ రాజకీయ విషవలయంలో చిక్కుకోవడానికి ఏ డాక్టరు సాహసించ గలడు. చెప్పు...?"

"మరిప్పుడెలా సార్...? ఈ సాయంత్రమే రాకాని జైలు నుంచి న్యూరాలజీ డిపార్ట్‌మెంట్‌కి తరలిస్తారట!"

"ఓహో.... రాకా విషయం ఎప్పటికప్పుడు "ప్రాంప్ట్"గానే ఫాలో అవుతున్నావన్నమాట...."

"ఫాలో అవడమేంటి లాయర్ గారూ! రాకా నా ఊపిరి. నా ప్రాణం. రాకా కోసం ఉరికంబం ఎక్కడానికైనా సిద్ధమే. నేనేకాదు సార్! రాకాని దేవుడిలా పూజించే ప్రజలున్నారు. మీకు మరో విషయం తెలుసా? జైల్లో రాకాకి ఎంత మంచి పేరుందో వింటే మీరే ఆశ్చర్య పోతారు. రాకాని చూడ్డానికి జైలు కొచ్చే జనాల్ని చూసి ఖైదీలు ఆశ్చర్య పోతున్నారు. బతుకంటే రాకాదేనని రాకా గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. ఖైదీలకి రాకా దేవుడితో సమాన మయ్యాడు. జయరాజ్ దాదా చెబితే మొదట నేను నమ్మలేదు. కానీ మొన్న కళ్ళారా చూశాను. రియల్లీ సార్.... రాకా ఒక హీరో.... అసలు సిసలైన ప్రజల హీరో...." భావావేశంతో చెప్తోంది దేదీప్య.

"అసలీ సంగతులన్నీ ఎలా తెలుస్తున్నాయ్? ఇరవై నాలుగ్గంటలూ జైల్లోనే గడుపు తున్నావా ఏం?" నవ్వుతూ అడిగాడు శాండిల్య.

"నిజమే లాయర్ గారూ! ఉదయం ఆరు నుంచి పది వరకూ జైలు- పది నుంచి ఐదు వరకూ రాకాతో పాటు కోర్టు- మళ్ళీ రాత్రి పదివరకూ జైలు దగ్గరే కాపురం. ఆ తర్వాతే ఇంటి కెళ్ళడం- ఎందుకోగానీ- మమ్మీ నా విషయాలు పట్టించు కోవడం మానేసింది. కారిచ్చింది, డ్రైవర్నిచ్చింది. అడక్కుండానే నా అవసరాలకి డబ్బిస్తోంది. ఏ టైంకి ఇంటి కెళ్ళినా పట్టించుకోవడం లేదు. బహుశా రాకాపట్ల అమ్మకి కూడా సదభిప్రాయమే ఉండి ఉంటుంది. మంచి చెడు నిర్ణయించుకునే తెలివి తేటలు నా కొచ్చేశాయని అనుకుంటుంది కాబోలు. ఆమె నాకు అమ్మగా దొరకటం నా అదృష్టం లాయర్‌గారూ!

"నిజమేనమ్మా! రాకా పట్ల నీ ఆరాధననీ- అతన్ని రక్షించుకోవాలనే నీ అకుంఠిత దీక్షనీ- అతన్ని కాపాడుకో గలననే నీ ఆత్మస్థైర్యాన్నీ చూసి మీ అమ్మగారు కూడా మాలాగే ఫీలవుతున్నారేమో! రియల్లీ యు ఆర్ ఎ వండర్‌ఫుల్ గర్ల్ దేదీప్యా!" అన్నాడు శాండిల్య మెచ్చుకోలుగా.

"థాంక్యూ సర్...!"

"మిస్ దేదీప్యా.... నా ప్రయత్నం నేను చేస్తాను. ఆ తర్వాత నీ అదృష్టం..." అన్నాడు. కొన్ని క్షణాలు ఆగి-

"సరే.... డాక్టర్లు తమ రిపోర్టుని ఈ పాటికి ఇచ్చేసి ఉంటారంటారా?" అనడిగింది.

"అంత తొందరగా ఇలాంటి పనులవ్వవమ్మా! ఇలాంటి కేసుల్లో నిర్ణయాలు అర్ధరాత్రో.... తెల్లవారు ఝామునో తీసుకోవడం జరుగుతుంది. అంతా ఏకాభిప్రాయానికి రాలేరు. అందరూ మేధావులే కదా! ఏది ఏమైనా విధి నిర్ణయం ఎలా ఉంటే అలా జరుగుతుంది"

"నో...." గట్టిగా అరిచింది దేదీప్య.

"అన్నీ సక్రమంగా జరిగి రాకాకి శిక్ష కనీసం వాయిదా పడిందా సరి! లే.... దా...." అంటూ ఆగింది.

ఆమె ముఖం ఆవేశంతో ఎర్రబడింది. కళ్ళు నిప్పులు కక్కడానికి సిద్ధంగా వున్నాయి. టెన్షన్‌తో ముక్కుపుటాలు అదురు తున్నాయి!

"కమాన్ దేదీప్యా.... కూల్‌డౌన్.... అంత ఆవేశం పనికి రాదు...."

"ఇది ఆవేశం కాదు సార్.... నాప్రతిజ్ఞ....

నాకు తెలిసిన నేరం!

అవి నా చిన్నతనం రోజులు. మా ఊరిలో రామిరెడ్డి అనే భూస్వామి ఉండేవాడు. అతడు పచ్చి త్రాగుబోతు. తాగి అందర్ని కొడుతూ ఉండేవాడు. ధనవంతుడు కావడం వల్ల ఆయనని ఎవ్వరు ఏమి చేయలేక పోయేవారు. చాకలి చెంద్రాయుడు భార్యకి భూస్వామికి అక్రమ సంబంధం ఉండేది. చెంద్రాయుడు ఎంత చెప్పినా అతని



భూస్వామి హత్య!

భార్య తన పద్ధతి మార్చుకోలేదు. చెంద్రాయుడు అతని స్నేహితుడు ఓబులేసు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం పొరుగూరికి భూస్వామితో బాకీ వసూలుకై వెళ్లినట్లు వెళ్లి తిరుగు ప్రయాణంలో భూస్వామికి బాగా సారా తాగించి గ్రామం పొలి మేరకు చేరుకోగానే కూడ తెచ్చుకున్న మచ్చు కొడవళ్లతో నరికి హత్య చేసారు. ఈ హత్య చెంద్రాయు, ఓబులేసులే చేయించి ఉంటారని అందరూ ఊహించినా చెడ్డవాడైన రామిరెడ్డి తరపున సాక్ష్యం చెప్పను ఎవ్వరు ముందుకు రాలేదు. అందువలన తగిన సాక్ష్యాధారాలు లేక ఈ కేసు కొట్టి వేయబడినది.

ఎ. రామలింగారెడ్డి,
పులివెందుల

జరగరానిదే జరిగితే.., రేపు కోర్టులో రాకాకి శిక్ష నిర్ణయమే అయితే... ఈ అగ్నిమిత్రులూ - త్రిభువనరావులూ కాదుసార్... ఆ సృష్టికర్తే అడ్డమొచ్చినా నా రాకాని నేను రక్షించుకో గలను.

వా ఈజ్ డైనమైట్. .

ఆ డైనమైట్‌ని ఎలా కాపాడుకోవాలో - ఎలా హాండిల్ చెయ్యాలో ఈ దేదీప్యకు బాగా తెలుసు సార్ . అని ట్రాన్స్‌లోంచి బయటి కొచ్చినదానిలా ఒక్కసారిగాకూల్‌డౌన్ అయిన దేదీప్య–

'ఎనవే. ఐ సిన్సియర్లీ విషయు ఆల్ ది బెస్ట్ సర్' మీ ప్రయత్నం మీరు చెయ్యండి. మీ ఋణం తప్పకుండా తీర్చుకుంటాను" అంటూ లేచింది చెప్పి ఆమె ఎక్కిన కారు సెంట్రల్ జైలు వైపు దూసుకు పోయింది.

* * * * * * *

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలు–

హోం మినిస్టర్ గెస్ట్ హౌస్–

తన రివాల్వింగ్ సీట్లో అసహనంగా కదిలాడు త్రిభువనరావు. మూడో పెగ్ జానీవాకర్ కూడా అతనికేమాత్రం మత్తుని కలిగించలేక పోతోంది అంతలో –

కంగ్రాచ్యులేషన్స్ బావగారూ.' అంటూ వచ్చాడు హెల్త్ మినిస్టర్ ఆనందరావు

"అంతా.ఓకేనా?"

'ఓకే ఏంటి బావగారూ అంతా హేపీ ... హేపీ.... ఈ ఆనందరావు వెళ్ళాడంటే పనులన్నీ ఆనందంగా ముగించుకొస్తాడు డబ్బాల్ ...'

"ఇంతకీ ఆ డాక్టర్లు...." అంటూ ఆగాడు త్రిభువనరావు.


'అవన్నీ మీ కెందుకు బావగారూ ఆ ముగ్గురిచేతా జాయింట్‌గా రిపోర్ట్ రాయించాం ఈ రోజుతో ఆ రాకాగాడు అవుట్. వాడిక ఉరిశిక్ష ఖాయం. వాడి పీడ ఇవాల్టితో." అంటున్న ఆనందరావు మాటల్ని కట్ చేస్తూ–

కొంచెం వివరంగా చెప్పవయ్యా బాబూ! డాక్టర్ల చేత మనక్కావలసిన రిపోర్టు రాయించడం ఏమీ కష్టం కాలేదు కదా! ఆ విషయం లీక్ అయితే మన పరువు గంగలో కలుస్తుంది. అన్నాడు త్రిభువనరావు. "కష్టంఅంటే.... వాస్తవానికి విరుద్ధంగా రిపోర్టివ్వలేమని ముందు పోజ్ కొట్టారు నేను గట్టిగా చెప్పేసరికి చచ్చినట్లు ఒప్పుకున్నారు. రిపోర్టిచ్చాక ఇద్దరు డాక్టర్లు వాళ్ళ సొంత వూళ్ళకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఇంకో డాక్టర్ రాజీనామా చేశాడు ఏది ఏమయినా మన పని 'అయిపోయింది అంతే చాలు' అంటూ విస్కీ గ్లాసులో పోసుకున్నాడు ఆనందరావు.

"వెరీగుడ్... మైడియర్ బామ్మర్దీ! రాకాగాడి పీడ వదిలితే నా హోం మినిస్ట్రీకి భంగం లేదు.... మదర్ కాథరిన్‌ని లేపడంతో కళ్యాణ్ రాం... ఏకాంబరంల పని ఫినిష్..... ఒక్క దెబ్బకి మూడు పిట్టలు. . హ్హ... హ్హా..." నవ్వుతూ చీర్స్ కొట్టి వెంటనే ఏంఘుదాదాకి ఫోన్ చెయ్యసాగాడు హోం మినిస్టర్ త్రిభువనరావు. (ఇంకాఉంది)

"అవినీతి భారతంలో కాదు చూసేవారి మనసుల్లో వుంది"

రాహీ మాసూమ్‌రజా ప్రత్యారోపణ



మహాభారత సంగ్రామంలాగే వివాదమూ సులభంగా ముగిసేటట్టు లేదు. టెలివిజన్ తెర మీద మహాభారత చిత్రీకరణ గురించి రేగిన వివాదాలు చాలా వున్నాయి. టెలివిజన్ మహాభారత్ సంభాషణల రచయిత రాహీ మసూమ్ రజా అభిప్రాయాలు కొన్ని యిలా ఉన్నాయి:-

ప్రశ్న: మీరు ముస్లిం కదా. హిందువుల ఇతిహాసంగా ప్రముఖమైన మహాభారత చిత్రీకరణతో మీకు సంబంధం ఎలా కలిగింది?

రజా: హిందూ అంటే భారతదేశం అని అర్థం. నేను ముస్లింను ఐనప్పటికీ మొట్టమొదట భారతీయుణ్ణి కద. కనుక నా చిత్రంలో మతానికి ఏమీ జోక్యం లేదు. ఒక పౌరుడిగా నాకుండే హక్కుని మతం తొలగించజాలదు గదా.

మరో కారణం ఏమంటే, మహాభారతం ఒక మహాకావ్యం. అపూర్వమైన రచన. సాహిత్య విద్యార్థిగా సహజంగానే నాకు అది చాల ఇష్టమైన కావ్యం.

ప్రశ్న: సీయల్‌లో చాల ఎక్కువగా అవినీతి చిత్రితమవుతున్నదనే అభిప్రాయం ఉంది. ఎంతో గౌరవనీయమైన మహాపురుషులు అసహ్యాకరమైన చర్యలు చేస్తూ ఉండడం ప్రేక్షకుల మనసుల మీద ప్రతికూల ప్రభావాన్ని వేయదా?


రజా: అవినీతి ఎక్కడ ఉంది? సీయల్‌లో అవినీతిని ఎక్కడా చిత్రించలేదు. ఉంటే అది ప్రేక్షకుడి మనసులోనే ఉండాలి. సీయల్ నుంచి ఎవరికి వారు గ్రహించే సారాంశంలోనే అది ఉంటుంది. ఇటువంటి చిల్లర ఆరోపణలు చేసేవారు మానసిక వ్యాధిగ్రస్తులని నా ధ్వేశ్యం. అవినీతి అనేదే లేని దగ్గర వాళ్ళు అవినీతిని చూస్తున్నారు.

ప్రశ్న: మహాభారత కులం ఆధారంగా జరిగే వివక్షను సమర్థిస్తున్నదనే అభిప్రాయం ఉంది. కర్ణుడి పట్ల, ఏకలవ్యుడి పట్ల వివక్ష అమలయింది. మీ అభ్రాయం ఏమిటి?

రజా: ఆ రోజుల్లో వాస్తవికత అది. ఆ రోజుల్లో మన సమాజంలో ఏవో కొన్ని లోపాలు ఉంటే, వాటిని మూసిపెట్టి ఉంచడానికి మనం ఎవరం? నిజానికి

'స్టేట్ రౌడీ"లో మహాభారత్





మహాభారత్ మహాగ్రంథం

మహాభారతం అన్ని భాషలలో అనువదించబడింది. జాతి, మత, కుల, భాషా విబేధాలు లేకుండా అతి పవిత్రమైన, పూజనీయమైన గ్రంథంగా ఒక ప్రత్యేక స్థానం అలంకరించింది.

మందరగిరి కవ్వంతో సముద్రంలో చిలికితే ముందు హాలాహలం పుట్టింది. ఆ తర్వాత అమృతం పుట్టింది. హాలాహలం పుట్టిన మాట సెన్సారులో కట్ చేసి అమృతం పుట్టింది మాత్రం ప్రదర్శనకు అనుమతించాలి అన్నట్లుగా వుంది ఈ టి. వి. సీరియల్ మహాభారతం మీద ఉత్పన్నమైన వివాదం.

తండ్రి కోసం ఆజన్మ బ్రహ్మచారిగా వుంటానని శపథం చేసిన భీష్ముడు చరిత్రలో నిలిచిపోయాడు అంటే పట్టుదల వుంటే సాధించలేనిది లేదు అని నిరూపించాడు.

గాంధారికి నూరుగురు సంతానం, శకునికి రెండు తొమ్మిదుల సోదరులు వున్నారు అన్నది అందరికీ తెలిసిందే. అలాగే కుంతీదేవికి ఆరుగురు సంతానం ఆరుగురి ద్వారా కలిగిందని చెప్పడం కూడా అసత్యం కాదు. అందువల్ల కుంతి కులట కాదు. తపోబలంతో జ్ఞానులు అవుతారు. ఋషులవుతారు. ముక్కోపి విశ్వామిత్రుడు పౌరుషానికి పోయి త్రిశంకు స్వర్గం స్థాపించలేదా? అలాగే హరిశ్చంద్రుని చేత అబద్ధమాడించాలని తన శక్తినంతా ధారపోసి చివరకు బలహీనుడయ్యి అందరి సమక్షంలో తల దించుకోలేదా? దీనిని బట్టి చూచినా ఎంతటి తపోబల శక్తి అయినా లేక దైవబలం అయినా అది లోక కళ్యాణానికి శక్తివంతంగా పని చేస్తుంది. కాని అందుకు విరుద్ధంగా పని చేయలేక పోతుంది. అంటే నీతికి, న్యాయానికి బలం వస్తుంది. అన్యాయానికి ఉన్న బలం బలి అయిపోతుంది.

ఈ సారాంశం మనం గ్రహించాలి. అదే వివేకం. చెప్పాలంటే "తన కోపమే తన శత్రువు" అన్నదే ఇందులోని అంతరార్థం. ఆ కోపం వల్లనే బ్రహ్మర్షి కాలేకపోయాడు విశ్వామిత్రుడు. చివరకు కోపాన్ని త్యజించి కూతురు కాపురం నిలబెట్టడానికి తలపెట్టిన నాడు బ్రహ్మర్షి అయినాడు విశ్వామిత్రుడు.

పూర్వకాలంలో తపోబలంతో దైవబలంతో అలాంటి మహిమలు చెయ్యగలిగారు. గాంధారికి అబార్షన్ అయిన పిండాన్ని మునులు నూరు భాగాలుగా చేసి దానికి ప్రాణం పోశాడు వ్యాసమహర్షి. ఇది విడ్డూరంగా లేదూ!

ప్రస్తుతం టెస్ట్ ట్యూబ్ బేబీలు పుడుతున్నారు. ఈ రోజు సైన్సుతో జరుగుతున్నది. ఆ రోజు తపోబలంతో జరిగింది. ఇందులో విడ్డూరం లేదే!

"వంశ పారంపర్యం వచ్చింది" అని ఒక రాజకీయ రంగు పూస్తున్నారు. ప్రస్తుతం వంశపారంపర్యం అనే మాటకు అర్థమే లేదు. ప్రజల చేత ఎన్నుకోబడుతున్నారు రాష్ట్రపతి, ప్రధానుల దగ్గర నుంచి కార్పొరేటర్ వరకు. ఇక్కడ ఆ ప్రసక్తికి తావు లేదు. "కామెర్లున్న కంటికి అంతా పచ్చగా కనపడినట్లు" గిట్టని వారు గీత పుట్టడానికి మహాభారతం అని, కమలం పుట్టింది బురదలో అని గ్రహించే శక్తి కోల్పోయి అర్థరహితంగా ప్రవర్తించడం సహజం. అది ప్రకృతి.

శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించిన గీత కోసం మహాభారతం వుండాలి అని అంటారు. మహాభారతం లేదంటే గీత లేదు. భారతదేశంలో అందరి మన్ననలను పొందిన గ్రంథం మహాభారతం. "తింటే గారెలు తినాలి", "వింటే భారతం" వినాలి అనే సామెత కూడా ప్రచారంలో వున్నదే కదా- కాబట్టి మహాభారతం ప్రసారం ఆపాలనేది అర్థరహితంగానే మిగిలి పోతుంది.

ఎం. డి. వీరభద్రం

మనం వాటి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. అవే తప్పులు మళ్ళీ చేయకుండా ఉండాలి.

ప్రశ్న: మీ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేందుకు గాను మహాభారతాన్ని వక్రీకరించారని మీపై అభియోగం....

రజా: వక్రీకరణ అంటే ఏమిటి? నేను వక్రీకరించానని ఆరోపించే వాళ్ళు బహిరంగంగా స్పష్టంగా చెప్పాలి.

అవినీతి భారతంలో కాదు..

ప్రశ్న: కర్ణుడు మారు వేషంతో ఉన్నందుకు శిక్షకు గురయ్యాడని మీరు అన్నారు. కాని ఆ తర్కాన్నే అనుసరిస్తే ప్రవాసంలో ఉన్న పాండవులు కూడ శిక్షార్హులే కదా?

రజా: ఇద్దరి మధ్య పోలికే లేదు. ప్రవాసంలో ఉన్న కాలంలో ఎవరికీ తెలియకుండా అజ్ఞాతంగా ఉండాలి గనుక మారు పేర్లు పాండవుల మీద బలవంతంగా రుద్దబడ్డాయి. కనుక వాళ్ళకు గత్యంతరం లేదు. అజ్ఞాతంలో జీవించడానికీ, ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధం చెప్పడానికి హస్తిమశకాంతరం ఉంది.

ప్రశ్న: ఏకలవ్యుడి విద్యార్జన సల్లక్షణం లాంటిదని, అతను ద్రోణాచార్యుడి సైనిక విద్యలను అనుకరించాడని మీరు అన్నారు. కాని వాస్తవానికి గురువే ఏకలవ్యుడి బొటన వేలు అడగడంలో దురుద్దేశ్యంతో ఉన్నాడనిపిస్తుంది......

రజా: మీరు పరీక్షల్లో మరొకరి నుంచి చూసి రాస్తూ దొరికారనుకోండి. మిమ్మల్ని పరీక్ష నుంచి బహిష్కరిస్తారా లేదా? ఏకలవ్యుడు కూడ అట్లా అనుకరించాడు. కనుకనే ఆ విద్య మీద అతనికి హక్కు లేదు. మరే ఆచార్యుడైనా చేసి ఉండేటట్లుగానే, ద్రోణాచార్యుడు కూడ, ఇలా అక్రమంగా ఆర్జించిన విద్యను ఉపయోగంలోకి రాకుండా చేయదలచుకున్నాడు. ద్రోణాచార్యుడు దురుద్దేశ్యంతో ఉన్నాడనడం ఆ మహా ఆచార్యుని పట్ల అపచారం.



ధర్మపథం

కొందరు తమదే ఉత్తమ కులమని, తక్కిన వారిది తక్కువ కులమని భావిస్తారు. కులాల ఎక్కువ తక్కువలు మానవులు కల్పించుకొన్నవే కాని వాస్తవాలు కావు. ఆ రీతిగానే గుణమే ప్రధానం కాని పుట్టుక కాదు. ఈ విషయాన్ని మనకు ప్రకృతియే తెలియ జేస్తూ ఉన్నది.

జన్మస్థానము నీచమైన దైనను, దాని నుండి మిక్కిలి ప్రశస్తములైన వస్తువులు లభించు చున్నవి. పట్టు పరమ పవిత్రమై, ప్రశస్తమై, విలువ గలిగి ఉన్నది కదా! అది ఒక పురుగు నుండి లభిస్తున్న సంగతి అందరికీ తెలిసినదే కదా! మిక్కిలి విలువైన బంగారము గనులలో రాళ్ళనంటివే యుండి, మనకు లభించు చున్నది. మిక్కిలి అందముగా ఉండి, పూజార్హమయి కమ్మని పరిమళము గల తామర పూవు హేయమైన బురద నుండియే పుట్టు చున్నది. బురద లేనిదే తామర మొలవదు. అమూల్యము లైన రత్నములు మట్టిలోనే లభించు చున్నవి. పరమ పవిత్రమయి, వంటకే కాక యాగాదులకు అవసరమైన అగ్ని కాష్ఠముల నుండియే కలుగు చున్నది. పూజకు తగిన దూర్వాంకురములు హేయమగు గడ్డి నుండియే స్వీకరింప బడుతూ ఉన్నవి. పవిత్రమైన విభూతి గోమయము నుండియే తయారగు చున్నది.

కీర్తి ప్రతిష్ఠలు పొందడానికి, నలుగురిలో "ఔరా!" అని అనిపించు కోవడానికి గుణాలే ప్రధానాలు. జాతి, మతాలుకాని, స్త్రీ పురుష విచక్షణ కాని, వయస్సు కాని ముఖ్యం కావు. భవభూతి మహాకవి ఉత్తర రామ చరిత్ర నాటకంలో ....

"గుణాః పూజాస్థానం
గుణిషు న చ లింగం న చ వయః"

అని చెప్పి యున్నాడు.

శివుడే తనకి భర్తగా కావలెనని ఆ దేవదేవుని గూర్చి పార్వతీదేవి ఘోరమైన తపస్సు చేయసాగినది. వేరే ఆహారం తీసుకోకుండా, ఆకులను మాత్రమే తిని, చేసే తపస్సు ఉత్తమ మైనదని విజ్ఞుల భావన. ఆమె ఆ ఆకులు కూడా తినకుండా జలాన్ని మాత్రం పానం చేస్తూ తపస్సు చేసినది. అందువల్లనే ఆమెకు అపర్ణ అనే పేరు వచ్చినదట! ఏ మహర్షులూ అంత ఘోరంగా తపస్సు చెయ్యలేదు. అందువల్ల ఆమె తపస్సున కాశ్చర్యపడినారు, వయోవృద్ధులైన మహామునులు కూడా. ఆ అపర్ణాదేవిని చూడడానికి వచ్చారట. ఈ విషయాన్నే తెలుపుతూ కాళిదాస మహాకవి "న ధర్మ వృద్ధేషు వయః 'సమీక్ష్యతే'" అని వయస్సులో చిన్న వారయినా ధర్మ నిర్వహణలో వృద్ధులతో సమాన మైన వారి పట్ల వయస్సు లెక్కలోనికి రాదని దీని అర్థ [illegible].

దీనిని బట్టి గుణమే ప్రధాన [illegible] ఉన్నప్పుడు జాతి భేదం గాని వయోవ్యత్యాసం గాని, లింగ విచక్షణ గాని ఉండరాదని తెలుస్తున్నది. [illegible]

— [illegible] వెంకట రమణయ్య

"బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయాని కొచ్చానండీ" అన్నాడు సిద్ధార్థ.

పైపంచెతో కళ్ళు వత్తుకొని మెరిసే కళ్ళతో చూస్తూ అన్నాడాయన "నీ ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేనుబాబూ. అది పుట్టినప్పట్నుంచి మా కందరికీ యిదొక్కటే దిగులు.

"ఇహ ఎటువంటి దిగులూ మీ మనసులో వుంచుకోకండి. తనకంటే ముందుగా నేనేపోతే చెప్పలేనుగానీ, నేను బ్రతికున్నంతవరకూ తనను నా ప్రాణంలా చూసుకుంటానని హామీ యివ్వగలను" అన్నాడు సిద్ధార్థ.

సిద్ధార్థమాటల కాయన తడబడి అన్నాడు "అహహ..... అంతమాటనకుబాబూ! నా ఆయుస్సు పోసుకునైనా నువ్వు కలకాలం చిరంజీవిగా వుండాలి."

అంతవరకూ ఆ గదిలో మౌనంగా నిలబడివున్న వర్ధనమ్మ ఒకడుగు ముందుకువేసి సిద్ధార్థ రెండుచేతులూ పట్టుకుంటూ "చిన్నవాడివై పోయావుగానీ లేకపోతే నీ కాళ్ళు కడిగి, ఆ నీళ్ళు నా నెత్తిన జల్లుకుని వుందును నాయనా. నువ్వు చేస్తున్న మహోపకారానికి!" అంది.

ముందుగదిలో జరుగుతోన్న సంభాషణ వింటోంటే నరనరమూ తీయని ఉద్వేగంతో నిండిపోయింది కృష్ణవేణికి. తన కళ్ళముందు జరుగుతోంది వాస్తవమేననే విషయాన్నర్థం చేసుకుంద కామె మెదడామెతో సహకరించడం లేదు. ఎప్పటికీ చిగురించని మోడులానే జీవితమంతా నిస్సారంగా గడిచిపోతుందేమోననే నిరాశతో, వయసొచ్చినప్పట్నుంచి రోజులు బరువుగా వెళ్ళదీస్తోన్న కృష్ణవేణికి – సిద్ధార్థ మాటలు వింటోంటే గట్టిగా అరుస్తూ కేరింతలు కొట్టాలనిపించింది.

కానీ ఎదిగిన తన శరీరమూ, మీదపడిన వయసూ అందు కభ్యంతరకరమనే విషయం గుర్తొచ్చి వున్నచోటే కదలకుండా నిలబడి, కన్నీళ్ళు జలజలా కారుతోన్నా వాటిని తుడుచుకునే ప్రయత్నంకూడా చేయలేదామె.

* * *

"ముదనష్టపు సంత. దారినపోయే దరిద్రాన్ని తెచ్చి నెత్తినపెట్టుకుంటే యిలాగే వుంటుంది" తన ఉక్రోషాన్ని మాటలతోనూ, కోపాన్ని గిన్నెలమీదా చూపిస్తూ లౌడ్‌స్పీకర్‌లా అరుస్తోన్న అత్తగారి గొంతు వినబడి మంచంమీద కూర్చున్నదల్లా లేచినిలబడి, ఆ గదిలోంచి బయటకునడిచింది కృష్ణవేణి.

పెరట్లో గిన్నెలు తోముతోన్న అత్తగారిముందు కూర్చుని "ఇటివ్వండత్తయ్యా నేను తోముతాను" అంటూ ఆమె చేతిలోని పాత్ర నందుకోబోయింది కృష్ణవేణి.



కోడలివైపు పురుగును చూసినట్టు చూస్తూ అందావిడ "నువ్వేం సాయంచేయనక్కర్లేదులే తల్లీ. దేముడి దయవల్ల నాకు కాళ్ళూ, చేతులూ యింకాసరిగానే వున్నాయి."

కృష్ణవేణి కళ్ళలో సుళ్ళు తిరిగాయి నీళ్ళు. "నే నేవన్నానన త్తల్లీ! మీ నాన్న కానుకలేవీ యివ్వలేక-పోయినా నెత్తిమీద నీళ్ళకుండ మాత్రం పెట్టి పంపించాడునిన్ను."

చల్లటిగాలి తగిలి మేఘాలు వర్షించినట్టుగా అత్తగారి వెచ్చటివిసుర్లకామె కళ్ళలో సుళ్ళు తిరుగుతోన్న నీరు ధారాపాతంగా కారడం ప్రారంభించింది.

"వెళ్ళు తల్లీ, వెళ్ళు. నీ గదిలో కూర్చో. నా ఎదురుగా కూర్చొని నా పనెందుకుపాడుచేస్తావు?"

చేసేదేమీలేక కన్నీళ్ళ నదిమిపెట్టి లోపలకు నడిచింది కృష్ణవేణి.

* * *

'ఏం వేణీ! అమ్మేమైనా అందా నిన్ను?" లాలనగా అడుగుతున్న భర్త పాదాలమీదవాలిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది కృష్ణవేణి.

ఆమెను పైకి లేవనేత్తుతూ అన్నాడు సిద్ధార్థ "చిన్నప్పుడు మా యింటిపక్క వో అమ్మాయుండేది. నీలానే ఆ అమ్మాయి కూడా నల్లగా వుండేది. వాళ్ళమ్మ ఆ అమ్మాయినెప్పుడూ కసురుకుంటూ వుండేది. మా అమ్మ మాత్రం ఆ అమ్మాయిని దగ్గరకు చేరదీసి , ఎంతో అనునయంగా లాలించి బుజ్జగించేది. నాకిప్పటికీ గుర్తే!

అటువంటిది మా అమ్మ యిప్పుడు నిన్నుచూసి సూటీపోటీ మాటలంటోందంటే నా కో విషయం స్ఫురిస్తోంది. సమస్య తమది కానపుడు ఎదుటి వారిమీద ఎంతో జాలిచూపిస్తారు మనుషులు. తీరా విషయం తమవరకూ వచ్చేసరికి ఆ విశాలదృక్పథం అదృశ్యమైపోతుందికాబోలు!

స్వతహాగా తమవారిమీద తమకు మనసులో సానుభూతివున్నా, ఎదుటివారు తమను కూడా గేలిచేస్తారేమోననే భావంతో బాహాటంగా తమవారిని తామే అసహ్యించుకోవడం ప్రారంభిస్తారనుకుంటాను. మా అమ్మ కూడా అదే ఉద్దేశ్యంతో నిన్ను తరచూ ఈసడించుకుంటూ వుంటుండొచ్చు.

అందుకు నువ్వేమీ బాధపడకు! మా అమ్మ తరఫున నేను క్షమార్పణ కోరుకుంటున్నాను. నిన్నెప్పటికీ నేను ప్రేమగా చూసుకుంటాను. ఇది నా వాగ్దానం! లే... లేచి మొహం కడుక్కో. సినిమాకు వెళ్దాం చాలారోజులైంది చూసి.

"నాకు సినిమాలూ, షికార్లూ వద్దండీ. మీ సాన్నిధ్యంలో ఎప్పుడూ యిలాగేవుంటేచాలు" అందామని నోటి చివరివరకూ వచ్చినా, భర్త నొచ్చుకుంటాడేమోనని "అలాగేనండి అయిదు నిమిషాల్లో తయారైతాను" అంటూ పెరట్లోకి నడిచింది కృష్ణవేణి.

చీర మార్చుకుని, ముస్తాబై భర్తతో కలిసి యింటిగేటు దాటేవరకూ ఆమె గుండెలు గుబగుబలాడుతూనేవున్నాయి. అత్తగారే సమయంలో తనమీద విరుచుకుపడుతుందోనని.

శాపం – వరం

వీధి చివరివరకూ నడిచి రిక్షా ఎక్కినతర్వాతగానీ ఆమె మనసు కుదుటపడలేదు. రిక్షా కుదుపులకు ఆమె మనసు గాలిలో తేలియాడసాగింది. పచ్చని ఛాయతో, ఎంతో అందంగా, హుందాగా వుండే సిద్ధార్థకు తను భార్యకావడాన్ని మించిన విశేషమేముంటుందీ ప్రపంచంలో? అనిపించిందామెకు.

అతడు పెళ్ళిచూపులకు వచ్చిననాడు, అతడి స్ఫురద్రూపం చూసి తన కానందం కలగడానికి బదులు అంతులేని నైరాశ్యం కలిగింది. కొందముచ్చుల్లా వున్న పెళ్ళికొడుకులే గతంలో తన వంటి రంగును వంకగా పెట్టి తనను తిరస్కరించడం గుర్తుకు రావడంవల్లనే అతడిని చూడగానే అంత బాధగా మూలిగిందామె మనసు.

కానీ పెళ్ళిచూపులైన రెండురోజుల కతడు తమ యింటికివచ్చి – తనతడికి నచ్చాననీ, తన తల్లి దండ్రులను కూడా ఒప్పించాననీ చెప్పినపుడు – ఒహపట్టాన అతడి మాటల్ని నమ్మలేకపోయిందామె. అప్పుడికీ తన కర్థంకాదు. తనలో ఏం చూసి అతడంతగా ఇష్టపడ్డాడో! తనూ అందరిలానే అతడిలో ఏదైనా లోపముండడంవల్లనే తనను చేసుకుందుకొప్పుకున్నాడా? అని ఆలోచించింది చాలాసార్లు, పెళ్ళికి ముందూ, తర్వాత కూడా!

కానీ ఈ రోజువరకూ అతడిలో ఎన్నదగిన లోపమేదీ తనకు కనిపించలేదు. ఎప్పటికీ కనిపించకూడదనే కోరుకుంటోందికూడా! రిక్షా థియేటర్ ముందు ఆగడంతో ఆమె ఆలోచనలకంతరాయం కలిగింది. "దిగువేణీ" అంటూ చేతినందించి చిన్న పాపాయిని దింపినట్టు, తను దిగేందుకతడు సహాయపడుతోంటే మనసుపులకరిస్తోండగా, సిగ్గుపడుతూ, చీర కుచ్చిళ్ళునెత్తి పట్టుకొని రిక్షాలోంచి దిగిందామె.

సినిమా విడుదలై చాలా రోజులైందేమో! అంతగా జనం లేరు థియేటర్ ఆవరణలో. ఎందుకో బుకింగ్ ముందున్న జనం తమవైపే చూస్తున్నట్టుగా అనిపించిందామెకు.

ఆ ఊహ మనసులోకి వచ్చినవెంటనే హఠాత్తుగా ఆమె మొహం మ్లానమైంది. అంతవరకూ అతడితో సమానంగా పక్కనే నడుస్తున్నదల్లా అప్రయత్నంగానే వెనుకబడిందామె.

తనూ నడక వేగం తగ్గించి "నేను మరీ వేగంగా నడుస్తున్నానా?" అంటూ, ఆమె చేయందుకొని ముందుకు నడిచాడు సిద్ధార్థ. మరింతగా ముడుచుకుపోయిందామె.

భర్త టిక్కెట్ల కోసం క్యూలో నిలబడినపుడేం చేయాలో తెలియక దిక్కులు చూస్తూ ఇబ్బందిగా నిలబడింది కృష్ణవేణి. పదడుగుల దూరంలో నిలబడిన ఇద్దరు యువకులు తన వైపే చూస్తూ ఏదో మాట్లాడుకోవడాన్ని గమనించిన ఆమెకు ఒళ్ళంతా చిరు చెమటలు పట్టడంతో వెంటనే తల మరో వైపుకు తిప్పుకుంది.

ఈసారి... రంగుల చీరల్లో మెరిసిపోతూ హొయలొలకబోస్తూ నిలబడి తమలో తామే నవ్వుకుంటోన్న ఇద్దరు ముగ్గురాడవాళ్ళు ఆమెవైపే చూస్తూ కనబడి ఆమె మానసిక స్థితిని మరింత దిగజార్చారు. తల ఎటూ తిప్పే సాహసం చేయలేక మెడవంచి, తన కాలి వేళ్ళు చూసుకుంటూ గడిపిందామె భర్త తన వద్దకు వచ్చేటంత వరకూ.

అయిదు నిముషాల్లో టిక్కెట్లు తీసుకొని వచ్చాడు సిద్ధార్థ. అతడు పక్కనలేని ఆ అయిదు నిముషాలూ అయిదు యుగాలుగా గడిచాయామెకు.

"కూల్‌డ్రింక్స్ తాగుదామా!!" అని సిద్ధార్థ ఎంతో ప్రేమగా అడిగినా ఆ విషయం పట్టించుకోకుండా, "పదండి, లోపలకు వెడదాం." అందామె. తన మనసులోని అలజడిని కప్పిపుచ్చుకుందుకు ప్రయత్నిస్తూ.

హాలులోకి వెళ్ళికూర్చున్న పది నిముషాలకు సినిమా ప్రారంభమైంది. థియేటర్‌లోని లైట్లార్పి, సినిమా ప్రారంభించేంత వరకూ చిత్రవధ ననుభవించిందామె. తన మొహం సాధ్యమైనంత వరకూ పక్క వారికి కనబడకుండా ఉండేలా ఎడమ



"ఏయ్! మైఖ్!

నీకెవరంటే యిష్టం!!

"పాప్" మ్యూజిక్ లవర్స్‌కి మైఖేల్ జాక్సన్ పేరు జున్ను ముక్కలాంటిది!

మైఖేల్ గొంతెత్తితే చాలు అతని అభిమానులు శివమెత్తిపోతారు!

"ఏయ్ మైఖ్! వాట్ యె గ్రేట్ మాన్ యూ ఆర్" అంటూ పిచ్చెత్తిపోతారు.

అతనిష్టాయిష్టాలిట్లా వుంటాయ్!

– నీకు "బ్యాడ్" (BAD) అంటే యిష్టమేనా?

– ఓ యా! నాకు "బాడ్" (లేటెస్ట్ హిట్ పాటలు యివే) అంటే చాలా యిష్టం. కాని ఓ మాట చెప్పనా? తృప్తిలేని మనిషిని నేను – యింకా మంచి పాటలు పాడతాను.

– నీకిష్టమయిన గీతాలేంటి మైఖ్!

– దర్టీ డయానా, మ్యాన్ యిన్ ది లిథర్‌లు నాకిష్టం అయితే నాకు "బాడ్" మరీ యిష్టం.

– పాటలు సంగీతం అంటే యిష్టం సరే! యింకా ఏమిటి ఏమిటి యిష్టం?

– అంతా యీ మ్యూజిక్‌లోనే గడిచిపోతుంది – కాని పాటలు రాయాలన్నది నా సరదా. యిక మిగతా అటలంటే నో "స్మోకింగ్" "నో డ్రింక్" కూడా.

– నీకు తెల్సిన హాలీవుడ్ స్టార్స్ ఎవరు గురూ?

– బాప్ రే! చాలామంది వున్నారు– ఎలిజబెత్‌టేలర్, లిజా మిన్నెల్లి, బ్రూక్‌షీల్డ్స్ లాంటి ఎందరో) ఎరుగుదును.

– "క్లాసికల్" యిష్టమేనా?

– ఓ యస్ క్లాసికల్ యిష్టమే.... అన్ని రకాల మ్యూజిక్ నాకు ఆనందాన్నిస్తుంది.

– రాక్ అండ్ రోల్ మాటేమిటి?

– వో యమ్మో! నాకు ఆ డామ్ అంటే రాక్ అంటే మహా యిది. అతనికి నేను ఫ్యాన్ ఫ్రెండ్‌ని. అతను డ్రమ్ము వాయిస్తూ.... ఉమ్మ్.. గొప్పగా వుంటుంది.

– ముందు ఎవరెవరితో నువ్వు నటించాలనుకుంటున్నావు మైక్.

– నేను బార్బరా స్ట్రీసాండ్‌తో నటించాలని ఉవ్విళ్ళూరుతున్నాను. ఆవిడ పాటలంటే నాకు చాలా యిష్టం.

– ప్రయాణాలంటే యిష్టమేనా?

– చాలా యిష్టం– నా యిష్టం వచ్చినట్లు నేను పిచ్చిగా డ్రయివింగ్ చేస్తూపోతే– ఎక్కడికైనా ఎగిరి వెళ్ళాను అంటే నాకో సొంత జెట్ విమానం వుంది బ్రదర్! అది సంగతి!

☆☆☆

అరచేతిని పూర్తిగా చెంపకాన్చి, మరోచేత్తో కర్ఛీఫ్‌ను మాటి మాటికీ మొహం మీద రుద్దుకుంటూ కాలక్షేపం చేసిందామె.

ఇంటర్వెల్ అయ్యేంత వరకూ కాస్త విశ్రాంతిగా గడిపిన కృష్ణవేణికి– ఇంటర్వెల్‌లో తిరిగి థియేటర్‌లో లైట్లు వెలగడంతో నీరసం తిరిగి ఆవరించింది దానికితోడు సిద్ధార్థ లేచి బయటకు వెళ్ళడంతో మరింతగా కుంచించుకుపోయింది

సిద్ధార్థ బయటకు వెళ్ళేటంత వరకూ అతడినే చూస్తూ ఉండిపోయిందామె అంతలో "నల్ల బంగారం రోయ్!" అనే మాటలు వినబడి వెనక్కి తిరిగి చూసింది వెనక సీట్లో టీన్స్‌లో ఉన్న ఇద్దరు యువకులామెకు కనిపించారు గిరుక్కున తలతిప్పుకుందామె

"ఫర్వాలేదురోయ్, కళగానే ఉంది. రంగంటే లేదుగానీ, అచ్చమైన ఆడదానిలానే ఉంది" అన్నాడో యువకుడు వెనుకనుంచి రెండు చెవులూ మూసుకుందామె, ఇంకా ఎటువంటి మాటలు వినవలసి వస్తుందోనని

బయట నుంచి సిద్ధార్థ వచ్చి రాగానే, "ఇంటి కెళ్ళిపోదామండీ, నాకు తలనొప్పి విపరీతంగా వస్తోంది" అంటూ అతడి సమాధానం కోసం ఎదురు చూడకుండా సీట్లోనుంచి లేచి నిలబడిందామె

* * * * * * *

[illegible] అలాగే [illegible] [illegible] [illegible] సిద్ధార్థ ఆఫీస్ [illegible] [illegible] పుట్టిన రోజు సందర్భంగా సాయంత్రం పార్టీకి వెళ్ళాలని ఉదయం ఆఫీస్‌కు వెడుతూ చెప్పి వెళ్ళాడు సిద్ధార్థ ఆమెతో

సాధారణంగా పేరంటాలకు వెళ్ళాలన్నా, పార్టీలకు హాజరు కావాలన్నా మగవారికంటే ఆడవారే ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు ఎంతో ఖరీదుపెట్టి కొనుక్కున్న చీరల్ని, విలువైన నగల్ని, తమ అలంకరణలోని ప్రత్యేకతను నలుగురి ముందూ వ్యక్తపరిచేందుకే మాత్రం అవకాశం దొరికినా అంత తేలిగ్గా వదులుకోరు ఆడవాళ్ళు.

కానీ కృష్ణవేణి పరిస్థితి వేరు!! ఆ విషయం సిద్ధార్థకూ తెలుసు. కానీ ఆమెను తరచూ బయట తిప్పటంలో అతడి ఉద్దేశం కూడా వేరు

నలుగురిలో తిరగడం మొదట్లో ఇబ్బందిగా ఉన్నా, క్రమేణా, తనలో వాన్ని మరిచిపోయి అందరిలా ఉండగలిగే అలవాటు నామె సంతరించుకుంటుందని అతడి ఆశ.

భర్త మనసును కష్ట పెట్టడం ఇష్టం లేక, అతడు ఎంపిక చేసిన దుస్తుల్ని, నగలనూ ధరించి అతడితో బయలుదేరిందామె. ఎలిమెంటరీ స్కూలు స్థాయి నుంచి కాలేజీ వరకూ ఆమె అవమానాలనే ఎదుర్కొంది అందరూ ఎగతాళి చేసే రంగును తనవంటికి పూసిన దేవుణ్ణామె ఎన్నోసార్లు నిందించుకుంది మనసులో రంగువల్ల జనించిన ఆత్మ న్యూనతాభావం రోజు రోజుకూ పెరుగుతోందే తప్ప తగ్గుముఖం పట్టడంలేదామెలో

వారిద్దరూ సిద్ధార్థ కొలీగ్ ఇంటికి చేరుకునేసరికి, చాలా మంది అప్పటికేవచ్చి ఉన్నారు గుండె దిటవు పరచుకొని లోపలకు నడిచిందామె భర్తతో లోకంలోని ఐశ్వర్యమంతా ఆ గదిలోనే ఉన్నట్టుగా ఉందక్కడి వాతావరణం.

ఆడవాళ్ళ పక్కవారి చీరలనూ, నగలనూ పరిశీలించడంలో చాలాహడావుడిగా ఉన్నారు కృష్ణవేణి వారిమధ్యకు చేరుకోవడంతో అందరి చూపులూ ఆమె పైన పడ్డాయి. సంతలో బేరం చేసే పశువును పరీక్షించినట్టుగా ఆమె ప్రతి అవయవాన్నీ కళ్ళతో సర్వే చేశారు.

కొందరాడవాళ్ళు చనువుగా ఆమె చీరకొంగు అందుకొని, నాణ్యాన్ని పరీక్షిస్తే మరికొందరు తమ చూపుల నామె చెవులకూ, మెడకూ ఉన్న ఆభరణాల మీద కేంద్రీకరించారు కృష్ణవేణి కాపరిస్థితి ఎంతో ఇబ్బందికరంగా ఉంది. ఒక్కరూ ఆప్యాయంగా తనను పలకరించరేం? అనుకుందామె.

ఇంతలో సిద్ధార్థ కొలీగ్ భార్య ఆమె వద్దకు వచ్చి, "నమస్తే!! నా పేరు మాధవి. మీ పెళ్ళికి రాలేక పోయాం. అయినా ఎంతో అభిమానంతో మా అమ్మాయి పుట్టినరోజుకు వచ్చారు. నాకెంతో సంతోషంగా ఉంది" అంటూ ఆమె చేయందుకుంది.

అంత ఆప్యాయంగా తనను పలకరించిన వారంతవరకూ కనబడక పోవడంతో, ఆనందంతో ఆమె మనసు పులకరించింది.

"మీ అమ్మాయిని చూపించరూ" అందామె అప్రయత్నంగా. పది మందిలో మనసారా నోరువిప్పి మాట్లాడడం అదే మొదటిసారామెకు.

"రండి... పాపను చూద్దురుగాని" అంటూ ముందుకు నడిచింది మాధవి. ఆమె వెనకే నడిచిన

శాపం– వరం

కృష్ణవేణికి నాలుగడుగులు ముందుకు వేశాక వెనుక నుంచి మాటలు వినిపించాయి.

"ఈవిడగారికి బొగ్గు ముక్కేగానీ మనమెవరమూ నచ్చలేదు కాబోలు..."

"అంతేలే... దాని కూతురూ మసిబొగ్గులానే ఉందికదా?? అందుకనే ఈవిడంతగా నచ్చి ఉంటుంది..."

వెనుదిరిగి, ఆ మాటలన్న వారిని చూద్దామనే కోరిక నతి కష్టం మీద అపు చేసుకుని ముందుకు నడిచింది కృష్ణవేణి.

"చిన్న కుర్చీలో ఒద్దికగా కూర్చొని ముచ్చటగా ఉందో పాపాయి చామన ఛాయగా ఉన్నా ఎంతో అందంగా ముద్దులొలికిస్తూ ఉందాపాప.

పాలు తాగే పసి పిల్లను గురించే అంత అనాగరికంగా వ్యాఖ్యానించిన వాళ్ళు, తనను సంస్కారహీనంగా వ్యాఖ్యానించడంలో ఏమీ వింతలేదనిపించిందామెకు. ఎందుకో అలా అనుకోగానే ఆమె మనసు తేలికపడింది.

ఇన్నాళ్ళూ- నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించే మనుషుల మాటలకు విలువిచ్చి తనను తాను కించ పరచుకున్నందుకు తన మీద తనకే కోపం వచ్చిందామెకు.

ఇంటికి తిరిగొచ్చాక అందామె భర్తతో – "ఇంత కాలంగా నాలో ఉన్న ఆత్మన్యూనతాభావం ఈ రోజుతో పూర్తిగా అంతరించి పోయింది. అయినా నా మనసులో ఎప్పట్నుంచో ఉన్న అనుమానం ఇంకా తీరలేదు. నిజానికా అనుమానం తీరకపోయినా ఇప్పుడొచ్చిన నష్టమేమీ లేదు. కానీ ఆ విషయం కూడా తెల్సుకుంటే నాకెంతో తృప్తిగా ఉంటుంది. అడగమంటారా?"

మురిపెంగా అడుగుతోన్న భార్యవైపు ముచ్చటగా చూస్తూ - "నువ్వడగబో యేదేమిటో నాకు తెలుసు నేను కూడా ఆ విషయం ఎప్పట్నుంచో నీకు చెప్పాలనే అనుకుంటున్నాను." అని చెప్పసాగాడు సిద్ధార్థ.

* * * * * * *

ఆఫీస్‌కు టైమ్ కావడంతో వడివడిగా నడుస్తున్నాడతడు. ఆఫీస్ ఇంటికి దగ్గర కావడంతో రోజూ అతడు నడిచే వెడతాడు. ఆ రోజూ ఎప్పటిలానే జనసమ్మర్దంగా ఉన్న ఆ రోడ్డు మీద, హడావుడిగా నడుస్తోన్న మనుషుల్నీ, మనుషుల మధ్య కలిసిపోయి అటూ ఇటూ తిరుగుతోన్న జంతువుల్నీ తప్పించుకుంటూ నడుస్తున్నాడతను.

ఆదివారం బజారులో నడుస్తుండగా జరిగిందో సంఘటన. ఆ పరిసరాల్లో తిరుగాడే మదించిన ఆబోతు ఒకటి ఉన్నట్టుండి రోడ్డు కటువైపు నుంచి ఇటువైపు దూసుకొచ్చింది.

రోడ్డు కిటువైపు ఉన్న మావుళ్ళమ్మ గుడికెదురుగా ఉన్న పళ్ళదుకాణాల వద్ద, వచ్చే పోయే జనంతో ఎప్పుడూ తూడతొక్కిడిగా, హడావుడిగా ఉంటుంది. ఆ రోజు.. ఎవరో భక్తురాలు తినిపారవేసిన అరటిపండు తొక్కల్ని తినేందుకు, ఆ వైపుకు వచ్చిందో ఆబోతు.

ఆబోతు అరటిపండు తొక్కల్నందుకునేలోగా రోడ్డు కడ్డంగా ఉన్న అయిదారేళ్ళ కుర్రవాడొకడు దాని కాళ్ళ క్రిందపడి కెవ్వుమని అరిచి, దిక్కులు పిక్కటిల్లేలా ఏడవసాగాడు.


హడావుడిగా నడుస్తోన్న జనం ఆ అరుపులకు తమ దృష్టి నటుసారించి మరుక్షణంలో అంతా ఆ పసివాడి చుట్టూ మూగారు. ఆ కుర్రవాడి కాళ్ళు రెండూ బాగా నలిగిపోయి రక్తం ధారకట్టి రోడ్డు మీద ప్రవహిస్తోంది.

బాధతో విలవిల్లాడుతున్నాడా కుర్రవాడు చుట్టూ ఉన్న జనంలో కొంత మంది ఆవేశపడి ఆబోతును కొట్టే ప్రయత్నంలో పడ్డారు. మరి కొంతమంది, ఆ కుర్రవాడిమీదుగా వంగి, ఏ మేరకు గాయాలయ్యాయో, అని చూస్తున్నారు.

అంతా 'అయ్యో, అయ్యో' అని అరుస్తున్నారే తప్ప, ఒక్కరూ ఆ కుర్రవాడి బాధను ఉపశమింప జేసే ప్రయత్నం చేసేందుకు ముందుకు రాలేదు ప్రతివారూ, ఆ కుర్రవాడి తాలూకు వారెవరైనా ముందుకొస్తారేమోనని చూస్తున్నారు అలాగే అయిదు నిముషాలు గడిచాయి.

ఈలోగా ఒక యువతి ఆ గుంపులోకి జొరబడింది. నేలమీద పడిఉన్న కుర్రవాడిని రెండు చేతులతోనూ భుజాల మీదికెత్తుకుంది. ఇంతలో ఆ గుంపులో ఎవరో అన్నారు, "మరీ అంత నిర్లక్ష్యమేవిటమ్మా, పిల్లాడినంత అజాగ్రత్తగా వదిలేస్తే ఎలా"

ఆమె సమాధానం చెప్పకుండా గుంపును తప్పించుకొని ముందుకు నడిచింది. అప్పుడా గుంపులోని వారు కొందరామె ననుసరించారు



అతడు కూడా వారి వెనకగా నడిచాడు. వడివడిగా నడిచి దగ్గర్లో ఉన్న ఒక హాస్పటల్‌కు చేరుకుందామె. అప్పటికే చాలామంది తిరుగుముఖం పట్టారు.

అతడు కూడా తేలికపడిన మనసుతో ఆఫీస్‌వైపు నడిచాడు.

* * * * * * *

అంత వరకూ చెప్పి ఆగాడు సిద్ధార్థ.

"అరే.. సరిగ్గా నాకెదురైన అనుభవంలానే ఉందేవిటి?" ఆశ్చర్యంగా భర్తవైపు చూస్తూ అంది కృష్ణవేణి.

"అవును వేణీ, ఆ రోజు నువ్వాకుర్రాడి నెత్తుకొని హాస్పటల్‌కు తీసుకు వెళ్ళినపుడు నీవెనుకగా నడిచిన వాళ్ళలో నేనూ ఉన్నాను. అందరిలానే నేను కూడా నువ్వా కుర్రవాడి తాలూకు మనిషివనే అనుకున్నాను...." అని ఆగాడు సిద్ధార్థ.

ఆసక్తిగా భర్త కళ్ళలోకి చూసింది కృష్ణవేణి.

"... కానీ తర్వాత ఆరాతీస్తే తెలిసింది నాకు. నీకా కుర్రాడేమీ కాడని, కేవలం మానవతా దృష్టితో, ఆ రోజు నువ్వో ఇంటర్వ్యూకు వెళ్ళవలసి ఉన్నా కూడా ఆ విషయాన్ని విస్మరించి ఆ కుర్రవాడిని హాస్పటల్‌కు తీసుకుని వెళ్ళి అతడి ప్రాణాన్ని కాపాడావని. నీలో సౌందర్యాన్ని ఆ నాడే చూసాను నేను.

ఎదుటివారి దైన్యస్థితిని చూసి చాలామంది జాలిపడతారు. కానీ అలా జాలిపడే వాళ్ళలో నీలాంటి బహుకొద్ది మంది మాత్రమే తమ జాలికి అర్థం ఉందని నిరూపించగలరు.

పై చర్మం వలిచి వరుసగా నిలబెడితే మనుషులందరూ ఒకే రంగులో ఉంటారు. ఆ మాత్రం దానికి నలుపూ, తెలుపూ అని పేరెందుకు పెడతారో నాకర్థం కాదు. సంసారాలు సజావుగా జరగడానికి కావల్సింది అందచందాలు కాదు. కరుణను మించిన సౌందర్యంలేదు. అందుకే నిన్ను కోరి నా దాన్ని చేసుకున్నాను." అన్నాడు సిద్ధార్థ ప్రేమగా భార్యవైపు చూస్తూ.

ఆనంద పారవశ్యంతో భర్త కళ్ళలోకి చూస్తూ అనుకుంది కృష్ణవేణి– 'మంచి మనసుతో ఒకరికి సహాయం చేస్తే మనకూ మంచే జరుగుతుందని పెద్దలనడలో అర్థం ఇదే కాబోలు! ఆ రోజు తనాదుకున్న కుర్రవాడు తనకూ, సిద్ధార్థకూ ఏమీ కాడు. కానీ తామిద్దరూ జీవితాంతం కలిసి ఉండడానికి కారణభూతుడయ్యాడు. ఇది కాకతాళీయమా?? భగవత్ప్రేరకమా?

తనవంటి రంగు తనకు శాపమని భ్రమ పడిందిన్నాళ్ళూ. కానీ తనలోని జాలిగుణం ఆ శాపాన్ని వరంగా మార్చింది. సాటివారి పట్ల మమతానురాగాలు ప్రదర్శించే వ్యక్తుల నెంతటి శాపాలూ ఏమీ చేయలేక పోగా, అవే శాపాలు వారిపట్ల వరంగా 'మారతాయనడానికింతకంటే నిదర్శనమేం కావాలి??

సినిమా సినిమా సంక్రాంతి స్పెషల్

తారకరామా ఆర్ట్ పిక్చర్స్ "భలేదొంగ" ఫిబ్రవరిలో

"డిసెంబర్ 15 నుంచి 26 వరకు చిదంబరం పరిసరాలలో, డిసెంబర్ 27 నుంచి మద్రాసులో చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఆరు లక్షల రూపాయల వ్యయంతో విజయవాహినీ స్టూడియోస్‌లో వేసిన బ్రహ్మాండమైన సెట్‌లో చిత్రీకరించిన 'బ్రేక్ డాన్స్' ఈ చిత్రంలో హైలైట్", అన్నారు కె. దేవీవరప్రసాద్. ఈయన సమర్పణలో డి. సుజాత నిర్మించిన పై చిత్రంలో బాలకృష్ణ, విజయశాంతి, ఊర్వశి శారద, రావు గోపాలరావు, మోహన్‌బాబు, చరణ్‌రాజ్, రాళ్ళపల్లి, బ్రహ్మానందం, పి. ఎల్. నారాయణ, శ్రీ లక్ష్మి పాత్రధారులు. సత్యమూర్తి రచన, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, వి ఎస్. ఆర్. స్వామి ఛాయ. శ్రీనివాసరాజు శిల్పం, కె. అజయ్‌కుమార్ సంయుక్త దర్శకత్వం, లిజియన్ సాహసాలు, తార నృత్యాలతో ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు

శ్రీదేవి



"ఇటీవల విమాన ప్రమాదాల గురించి ఎక్కువగా వార్తలు వస్తున్నాయి కదా? అసలు మొదట్నుంచీ విమాన ప్రయాణమంటే నేను ఎంతో జాగరూకతతో ఉంటాను. తుఫాను వచ్చే సూచనలుంటే అసలు విమానంలో బయలుదేరను. న్యూమరాలజీపై నాకు నమ్మకం ఎక్కువ. అంచేత, బయలుదేరే టైమ్, విమానం నెంబరు– నా అదృష్ట సంఖ్యతో సరిగా లేనప్పుడు ప్రయాణం రద్దు చేసుకుంటాను. ఇలా ఎన్నో సార్లు విమానంలో వెళ్ళకుండా ట్రెయిన్‌లో వెళ్ళాను గాని, ట్రెయిన్‌లో వెళ్ళేటప్పుడు మాత్రం ఇవేవీ పట్టించుకోను సుమండీ!"

* * *



జయప్రద

"విమానం కనిపెట్టిన రైట్ సోదరులకు తరచు మనసులో కృతజ్ఞతలు చెప్పుకుంటుంటాను. ఎందుకంటే... ఉదయం బొంబాయి... మధ్యాహ్నం హైదరాబాద్.... రాత్రి మద్రాసు – ఇలా నేను ఒక్కోసారి రెక్కలు కట్టుకున్న పక్షిలా ఎగరవలసి వస్తుంది... విమానంలో కూర్చున్నప్పుడు కొందరు నా వంక రెప్పలార్పకుండా చూస్తుంటే నాకేదో ఇబ్బందిగా ఉంటుంది. ఒక్కోసారి కొందరు అల్ట్రా మోడరన్ లేడీస్ స్మోక్ చేస్తుంటే ఎంతో ఎబ్బెట్టుగా ఉంటుంది. అయినా నాకు విమాన ప్రయాణమే తప్పనిసరి".

* * *

అమల



విమానం ఎక్కగానే చిన్న పాపలా అయిపోతాను.... ఏదో ఉత్సాహం.... ఏదో సంబరం... ఎర్ హోస్టెస్‌లు పలకరిస్తే చాలు– నాతో ఇట్టే ఫ్రెండ్స్ అయిపోతారు. షూటింగ్‌ల గురించి గాని, నే ధరించబోయే పాత్రల స్వభావాల గురించి గాని విమానంలో ఉన్నప్పుడు అసలు ఆలోచించను. పత్రికలు, పుస్తకాలు చదవను. కునుకు అసలే తీయను. విమానం దిగే వరకు కిటికీ గుండానే చూస్తుండి పోతాను తమాషాగా!"

–(సేకరణ: జి. వి. జి.)

వేలు కొరుక్కున్న వేళ



సంక్రాంతి రోజు వేకువ ఝామున వేలు టెలిఫోన్ డయల్ చేశారు.

"హల్లో! సంక్రాంతి శుభాకాంక్షలు! తలార స్నానం చేశారా? పూజాపునస్కారాలు ముగించారా?" అని అడిగారు.

"హలో! ఎవరండీ మాట్లాడేది!" అడిగింది అటు చివరి కంఠం కాస్త విసుగ్గా.

వేలు ఉలిక్కిపడ్డారు. "జంధ్యాలగారి కంఠంలా లేదే!" అని గొణిగారు.

"రాంగ్ నెంబర్‌కు డయల్ చేయడమే కాకుండా ఆ గొణుగుడు ఏమిటండీ?"

"అయ్యా! ఈ వేళ సంక్రాంతి – మనందరి పండుగ. మీరెవరైతేనేం – మీరు మాత్రం పెందలకడనే లేచి తలార స్నానం చేసి, పూజ చేసుకో రేమిటీ? చెబితే తప్పేముందీ? మీకు మరో మారు నా శుభాకాంకలు", అంటూ వేలు రిసీవర్‌ను పెట్టేశారు.

సినిమా

"సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ అక్ట్ సెక్షన్ –3"

"ఒక సినిమా తార యదార్థ గాథ. ఆమెను ఒక ఇన్‌స్పెక్టర్, లాయర్, డాక్టర్ కలిసి బ్లాక్ మెయిల్ చేస్తారు. లొంగక పోయేసరికి వ్యభిచార నేరం సెక్షన్ కింద అరెస్ట్ చేస్తారు. దాంతో ఆ అమ్మాయి కోర్టుకు అప్పీల్ చేస్తుంది. ఎన్నో మలపులతో సాగుతుంది కథ. తారగా ఉమామహేశ్వరి అనే మలయాళీ వనిత నటిస్తోంది," అన్నారు బ్రిజ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంతో పై చిత్రానికి కథ సమకూర్చి నిర్మిస్తున్న జాకబ్ బ్రిజ్. కొమ్మినేని మాటలు. ఆత్రేయ పాటలు, గుణసింగ్ సంగీతం, బెర్నార్డ్ చాయ, నంబిరాజ్ నృత్యాలు, జూడో రత్నం సాహసాలు, కురుప్ ప్రొడక్షన్, కాటా సుబ్బారావు సంయుక్త దర్శకత్వం, కందస్వామి కూర్పుతో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేసే కె. వి. ఫణీంద్ర "కొత్త తారలు చాలా మందిని పరిచయం చేసే ఈ చిత్రం మలయాళంలో కూడా తయారవుతోంది. నవంబర్ 11 నుంచి 16 వరకు మద్రాసులో షూట్ చేశాం. డిసెంబర్ 15 నుంచి 31 వరకు కేరళలో జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు.

కృష్ణ, క్రాంతికుమార్‌లతో వర్మ ప్రొడక్షన్స్ చిత్రం

"క్రాంతికుమార్ దర్శకత్వంలో కృష్ణ పని చేసే తొలి చిత్రం. ఇది ఏక్షన్, ఫిక్షన్‌తో కూడిన చిత్రం", అన్నారు డాక్టర్ డి వి. ఎన్. రాజు. ఈయన నిర్మించే వర్మ ప్రొడక్షన్స్ చిత్రం త్వరలో మొదలవుతుంది క్రాంతికుమార్ కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, దర్శకత్వం వహిస్తారు

అన్నపూర్ణ స్టూడియోస్ చిత్రంలో నాగార్జున, అమల

"ఫిబ్రవరి 11న మా స్టూడియోస్‌లో ప్రారంభం", అన్నారు అక్కినేని వెంకటరత్నం ఈయన "విజయ్" అనంతరం నిర్మిస్తున్న అన్నపూర్ణ స్టూడియోస్ చిత్రంలో నాగార్జున, అమల, రఘువరన్, హైదరాబాద్‌లోని కళాకారులు పాల్గొంటున్నారు. తనికెళ్ళ భరణి మాటలు, ఇళయరాజా సంగీతం, ఎస్. గోపాలరెడ్డి చాయ, అక్కినేని వెంకటరత్నం నిర్వహణలో రామ్‌గోపాల్ వర్మ దర్శకుడు. శ్రీమతి అక్కినేని అన్నపూర్ణ సమర్పణ


శ్రీలక్ష్మి ప్రకటన



కనిపించకుండా పోయిన తన భర్త గురించి ఒకామె దిన పత్రికలలో ఇలా ప్రకటన వేయించింది:

"ఏమండీ! మీరు నన్ను వదలి వెళ్ళినప్పటినించీ గొంతులో పచ్చి మంచినీళ్ళయినా పోసుకు ఎరుగను ఇప్పుడు నాకు బుద్ధొచ్చింది. సంక్రాంతి పండుగకు పట్టు చీర కొనివ్వమని మిమ్మల్ని వేధించను గాని, దయచేసి వెంటనే ఇంటికి తిరిగొచ్చేయండి".

–(సేకరణ : జి. వి జి)



ఈ సంతకాలు ఏఏ తారలవో పోల్చుకో గలరా? లేకపోతే 58 పేజీ చూడండి. -(సమర్పణ: జి. వి. జి.)

"ఇంద్రజిత్"కి దర్శకుడు గిరిబాబు

"సినిమా స్కోప్ కౌబాయ్ చిత్రం. మా రెండో అబ్బాయి బోసుబాబు హీరో. జనవరి 1న పాటల రికార్డింగ్, జనవరి 14న షూటింగ్ ముహూర్తాలు. ఫిబ్రవరి 10 వరకు వండలూరు, చెంగల్పట్టు, పాండిచ్చేరి, మద్రాసులలో మొదటి షెడ్యూల్. ఫిబ్రవరి నెలాఖరు నుంచి మార్చి 20 వరకు తలకోన అడవుల్లో జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది. వెంజెన్స్, ఎడ్వెంచర్, ట్రెజర్‌హంట్‌లతో ఎంతో సస్పెన్స్‌తో నడిచే చిత్రం," అన్నారు గిరిబాబు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించే జయభేరి వారి చిత్రంతో సుధాకర్, శుభలేఖ సుధాకర్, గొల్లపూడి మారుతీరావు, త్యాగరాజు, నర్రా, హరిబాబు, ప్రదీప్‌శక్తి, చలపతిరావు, బొంబాయి ఫైటర్ మాణిక్ ఇరానీ, దేవిక, ఇందిరతో బాటు గిరిబాబు ఒక కీలకమైన పాత్రను నిర్వహిస్తారు. కొంపెల్ల విశ్వం సంభాషణలు, రాజ్‌కోటి సంగీతం కబీర్‌లాల్ ఛాయ, రంగారావు శిల్పంతో వై. రఘు నిర్మాత.

సినిమా

"అశోక చక్రవర్తి"లో బాలకృష్ణ, అంజలీదేవి



అక్కినేని నాగార్జున చిత్రాలు

ఈ స్పీడ్ యుగంలో ఎక్కువ కాలంలో తక్కువ చిత్రాలు చేసినా సమర్థుడైన నటుడనిపించు కున్నాడు అక్కినేని నాగార్జున. కథ, పాత్ర విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తూ అలనాటి మేటి హీరోలకు దీటు అనిపించు కున్నాడు. 1989 ఫిబ్రవరిలో ఈయన నటించిన "విక్కీదాదా" చిత్రం విడుదల అవుతుంది. మణిరత్నం దర్శకత్వం వహించే భాగ్యలక్ష్మీ ఎంటర్‌ప్రైసెస్ చిత్రం ఉగాది కానుక.

ఈయన కొత్త చిత్రాలు : ఎ. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్, ఎస్. ఎస్. క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం.... ఛాయాగ్రాహకుడు కె. ఎస్. ప్రకాష్ చిత్రం.... క్రాంతి కుమార్ నిర్మించే క్రాంతి చిత్ర చిత్రం.... ప్రతాప్ పోతన్ డైరెక్ట్ చేసే తిరుమలేశ్ పిక్చర్స్ చిత్రం.... మోహన్‌గాంధి దర్శకత్వంలో ప్రసాద్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రం ... కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో స్రవంతి మూవీస్ చిత్రం.... మురళీ మోహన్ సమర్పణలో డి. కిశోర్ నిర్మించే జయభేరీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రం.

సీరియల్



సూపర్ గర్ల్

వింజమూరి విజయ శాంభవి

టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో నుండి బయటికి వచ్చి టైమ్ చూసుకుంది కార్తి! ఐదు గంటలయింది! అప్పటికి వాతావరణం బాగా చల్లబడి హాయిగా గాలి వీస్తోంది! ఇన్‌స్టిట్యూట్ ముందు పార్క్ చేసి వున్న మోటార్ సైకిల్‌ని స్టార్టు చేసుకుని బయలుదేరింది!

ఆ దారంట పొయ్యేవాళ్ళు ఒక క్షణం కార్తి వైపు చూడకుండా వెళ్ళటం లేదు!



...పదిహేడేళ్ళ వయసులో వున్న పరిమళం కార్తి. చురుకైన కళ్ళు... తీర్చైన ముక్కు... పసిమి ఛాయ... ముగ్ధమోహనంగా ముద్దుగా వున్న కార్తి అందరి చూపులని నిలవెయ్యటంలో ఆశ్చర్యం లేదు.

అందులో ఈ రోజు స్పెషల్ కార్తి మరీ... అద్భుతంగా వుంది! ఈ రోజు ఆమె హ్యాపీ బర్త్ డే! మరో మెట్టు యవ్వనం ఎక్కింది. అయితే ఆమె ప్రతీసారిలా ఈ రోజు తన ఫ్రెండ్స్ అందరినీ పిలిచి గొప్పగా పెద్ద పార్టీ ఇవ్వలేదు. తను ఇంకా చిన్నపిల్ల కాదని పెద్దదాన్ని అయ్యానని కార్తికి అనిపించింది.

ఇంకా సినిమాలూ, షికార్లూ అంటూ... పార్టీలు అంటూ జాలీగా ఎంజాయ్ చెయ్యటం ఒక్కటే లైఫ్ కాదు. ఈ ప్రపంచంలో నేర్చుకోవలసింది ఎంతో వుంది... అందుకే ఆమె తన ఫ్రెండ్స్ ఎంత బలవంత పెట్టినా ఈ సారి "గాలా" పార్టీ ఇవ్వలేదు.

అంకుల్ చెప్పిన మాటలు చెవిలో రింగు రింగుమంటున్నాయి!

...అంకుల్ మాటలివి:

"బేబీ! మన సరదాల కోసం వేలకు వేలు ఖర్చు పెడుతుంటాం! అది గొప్ప కోసం! దానివల్ల ఏమయినా వుందా? ప్రయోజనం వుందా? పేరు వుండదు! అసలు గొప్ప కోసం అంత ఖర్చు ఎందుకు చెయ్యాలి మనం? ఎంతో మంది కడుపు నిండా తిండి లేని నిర్భాగ్యులు జీవిస్తున్నారు! అలాంటి వాళ్ళ కోసం మనిషికో రెండు రూపాయలు ఖర్చు చెయ్యి! కుటుంబానికో పది రూపాయల చొప్పున ఖర్చు పెట్టు! అలా నీ పుట్టిన రోజు నాడో పండగ నాడో వాళ్ళని పిలిచి కడుపు నిండా భోజనం పెట్టించు! ఎంత సంతోషిస్తారో, నిన్ను ఎంతగా దీవిస్తారో! వాళ్ళు అల్ప సంతోషులు. నీ ఫ్రెండ్స్ వున్నారే, డబ్బులో పుట్టి డబ్బులో పెరిగిన వారికి, ఇలాంటి పార్టీలకి గొప్పలకి అలవాటు పడిన వారికి ఇదంతో [illegible] ఈ రోజు నీ కోసం [illegible] కోసం ఖర్చు చేస్తారు! మరో రోజు ఇంకో రూపంలో నీ నుండి [illegible] లాగుతారు!"


"నేను చెప్తున్నానే ఈ దరిద్రులు.. అలా కాదు! నువ్వు చేసిన ఏ చిన్న సాయాన్నీ మర్చిపోరు. నీ పట్ల ఎంతో విశ్వాసం చూపిస్తారు. బేబీ! నువ్వు ఇలా చెయ్యాలని నేను అనుకోవటం లేదు. కాని అలవాట్లకి సరదాలకి స్వస్తి చెప్పి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. ఈ విషయం నీ తల్లిదండ్రులకి తెలియని కాదు. తెలివైన దానివి నువ్వు గ్రహిస్తావని వూరుకున్నారు. ఇదంతా నువ్వు తెలుసుకోలేవని కాదనుకో.... ఇప్పుడు కాకపోయినా మరో రెండేళ్ళ తరువాతయినా నువ్వు గ్రహిస్తావు. కానీ బేబీ... ఒక వ్యక్తిత్వం అనే దాన్ని ఇప్పటి నుండే అలవరచుకుంటూ పోతే పునాదులతో బలంగా లేచిన గోడలా కొంత కాలానికి నీ వ్యక్తిత్వం స్థిరంగా

కార్తీ ఉలిక్కి పడింది! ఆశ్చర్యంగా తలెత్తి చూసింది. తన మీదకో కవర్ వచ్చి పడ్డది. పై కిటికీలో నుంచి ఆమె తననా కవర్ తీసుకోమని కంగారుగా సైగలు చేస్తోంది?... ఏమిటా కవరు? అదేమైనా కవర్ బాంబా?

ఈ అమ్మాయి పుణ్యానికి పోతే ఛాలెంజ్ ఎదురైంది

మెరుగులు దిద్దుకుంటుంది! అర్థమైంది కదూ?" అన్నాడతను.

ఆ మాటలు కార్తి మనసులో బలంగా నాటుకున్నాయి.



"థాంక్యూ అంకుల్! మీరు చెబుతూంటే ఇప్పుడు అనిపిస్తోంది నాకు.... ఎంత మూర్ఖత్వంలో అజ్ఞానంలో వుండి పోయ్యానాఅని! ఇకనుండి ఒక వ్యక్తిత్వం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తాను! నా కర్తవ్యాన్ని నాకు బోధపరిచారు..." థాంక్స్ అంటూ అంకుల్‌ని షేక్ హ్యాండిచ్చింది!

ఆతరువాత కార్తి తన మిత్ర బృందానికి ఖచ్చితంగా చెప్పేసింది! ఇకపై తనకి సినిమాలూ, షికార్లూ, పిక్నిక్కులూ బంద్ అంటూ వాళ్ళు ఆశ్చర్య పొయ్యారు!


అంకుల్‌కి మాట ఇచ్చినట్టు గానే ఆమె ఈసారి చాలాసింపుల్‌గా తన బర్త్‌డేని జరుపుకుంది! ఓ పదిమందికి వస్త్రదానం చేసింది! మరో వంద మందికి కడుపుకాలే వాళ్ళకి కడుపునిండా పిండి వంటలతో భోజనం పెట్టించింది! వాళ్ళు సంతోషంగా తనని వెయ్యినోళ్ళ దీవించి

వెళుతోంటే ఎప్పుడులేనంత సంతృప్తిని పొందింది!

కూతురిలో వచ్చిన మార్పుని చూసి తల్లి దండ్రులు మురిసి పోయారు.

అమ్మ ప్రత్యేకంగా తెప్పించిన షెల్వార్ కమీజు వేసుకుంది ఆరోజు

చక్కని వెండి జరీ పనితో ఎంతో ఖరీదయిన ఆ డ్రెస్‌ని తల్లి బొంబాయి నుండి తెప్పించింది! కార్తికి అదుస్తులు ఎంతో చక్కగా నప్పాయి! రెండు జడలు....



ఒక జడలో అందమైన పెద్దగులాబీ... నుదుట నల్లని చిన్ని బొట్టు కార్తి చాలా అందంగా వుంది ఈరోజు! అందుకే ఒక్కక్షణమైనా ఆగి ఆమె వైపు చూసి షాక్‌తిని పోతున్నారు జనాలు!

ఓ కిక్ ఇచ్చింది "మోబైక్"కి రంయ్‌మని ముందుకి దూకించింది! అందరిలాంటి అమ్మాయికాదు కార్తి. తెగువ సాహసం జాస్తి! మొండి తనం కూడా కాస్త ఎక్కువే! ఆమె డిగ్రీలో 'లా' చదవాలని కోరికతో ఉవ్విళ్ళూరుతోంది. భవిష్యత్తులో గొప్ప పేరు తెచ్చుకోవాలని వుంది!

తల్లి దండ్రులకి ఏకైక సంతానం కార్తి! తండ్రి ఆనంద్‌కి కూతురంటే పంచప్రాణాలు! తల్లి సుమిత్రకి ఆమె గారాల పట్టి! వాళ్ళిద్దరూ కూతురి మాటకి ఎదురు చెప్పరు! అడిగితే కొండమీది కోతినిదింపు కొస్తారు! అదే కార్తికి చక్కని క్రమశిక్షణ అయింది!

ఇక ఆనంద్ సంగతి గొప్ప ఇండస్ట్రియలిస్ట్! అయితే ఆ దంపతులకి

కూతుర్ని గురించి ఒక్కటే దిగులు! అది.... కార్తిలో మొండితనం... సాహసం జాస్తి! పెంకె తనంతో ఏం నెత్తికి తెచ్చుకుంటుందో అనే! అందుకే ఆమెని వెయ్యి కళ్ళతో కనిపెట్టి వుంటారు వాళ్ళు!

తల్లి సుమిత్రకైతే మరీను.... కార్తిలోని చురుకుతనం ముక్కోపం ఆమెకి తగని ఖంగారుని భయాన్నీ కలిగిస్తుంది!

రయ్యి మని మోబైక్ మీద వెళుతున్న కార్తి ఓ లూనా తనని దాటి పోవడం గమనించి కావాలని అతడు తనను ఓవర్ టేక్ చేసాడని గ్రహించింది! కోపంగా తలెత్తి చూసిన ఆమెకి ఆకుర్రాడు తల వెనక్కి తిప్పి వెక్కిరింతగా నవ్వటం కనిపించింది! కార్తికి రోషం వచ్చింది!

అర్జంటుగా స్పీడు పెంచి నిముషంలో అతన్ని ఓవర్‌టేక్ చేస్తూ అతనివైపు విజయ గర్వంగా చూస్తూ నవ్వింది!

ఈసారి ఆ కుర్రాడి మొహం మాడి పోయిన అప్పడంలా అయింది!

ఆ రోడ్డు మీద నడిచే జనాలు ఆదృశ్యాన్ని చూసి నవ్వుకున్నారు... "ఈ కాలం పిల్లలు..." అనుకుంటూ!

అదే వేగంతో రెండు ఫర్లాంగులు ముందుకి వచ్చిన కార్తి తరువాత కాస్త వేగం తగ్గించి బండిని ఓ వీధిలోకి మళ్ళించింది! అక్కడ ఆమె అంకుల్ ఇల్లుంది! అతని ఇంట్లో పెద్ద లైబ్రరీ రూమ్‌వుంది! దాంట్లో ఆయన సేకరించిన బుక్స్ ఎన్నో! కార్తి ప్రతి నిత్యం అతని ఇంటికివెళ్ళి అతనితో ఓ అరగంట కబుర్లు చెప్పి తనకి కావలసిన బుక్స్ తెచ్చుకుంటుంది! అది ఆమె దినచర్యలో ఒకభాగం! కానీ, ఈ రోజు ఆమె అంకుల్ ఇంటి ముందు.... బయటి గేటుకి కూడా తాళం వేసి వుంది!

"అంకుల్ ఎక్కడికి వెళ్ళారు?" కార్తి ఓ కాలు క్రింద ఆనించి సాలోచనగా చూసింది ఇంటివైపు!


అంకుల్ బ్రహ్మచారి! నౌకర్లు కూడా ఆయన వుంటేనే వస్తారు! అంకుల్ వూళ్ళో లేనట్టే! కార్తికి ఎంతో వెలితిగా అనిపించింది! నిన్న కూడా తనకి చెప్పలేదే ఆయన? బహుశః అనుకోకుండా వెళ్ళాల్సి వచ్చివుంటుంది!

ఆరోజు వుదయాన్నే అతను ఫోన్ చేసి ఆమెకి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పాడు! ప్రతీ సారికి భిన్నంగా ఆమె తన పుట్టిన రోజుని జరుపుకుంటోంది కాబట్టి అతను తనకి ఎలాంటి గిఫ్టు ఇవ్వకూడదని కండిషన్ పెట్టింది కార్తి! ఒప్పుకున్నాడు అతడు! ఆ మధ్యాహ్నం అతడు తనకి తీరిక వుండదని చెప్పడంతో కార్తి తల్లి అతని ఇంటికే భోజనం కారియర్ పంపింది!

కార్తి తన వాహనాన్ని వెనక్కి తిప్పింది! సరిగ్గా అదే సమయంలో... అంకుల్ ఇంటికి ఎదురుగా వున్న ఓ మేడమీది కిటికీలో నుండి గులాబిరంగు కవర్ ఒకటి గిరికీలు తిరుగుతూ వచ్చి కార్తి ముందు క్రింద పడింది!

కార్తి మొదట ఉలిక్కి పడింది! ఆశ్చర్యంగా తలెత్తి ఎదుటి మేడ వైపు చూసింది! పైన కిటికీలో నుండి ఓ స్త్రీ తన వైపే చూస్తూ ఆ కవర్ తీసుకోమన్నట్లు సంజ్ఞ చేస్తోంది! కార్తి విచిత్రంగా చూసింది!

ఆమె వయస్సులో వున్న స్త్రీ మూర్తి. బాబ్డ్ హెయిర్... గౌనులో వుంది!



బుల్లి తెరపై గంటకో హత్య!

అన్నిటికీ సంపన్నమైన దేశం అమెరికా హింసాకాండలోనూ సంపన్నమైనదే! అమెరికాలో పిల్లలు సగటున [illegible] వయసు వచ్చే [illegible] కేవలం [illegible] తెరమీదనే [illegible] కళ్ళారా చూసేస్తా[illegible] కార్యక్రమాల్ని కూ[illegible] సంఖ్యకు మరో [illegible]

ఈ మధ్యనే [illegible]న్‌లో [illegible] మవుతున్న హింస గురించి అ[illegible] వేసిన 'నేషనల్[illegible] టెలివిజన్ పయ్యో[illegible] అమెరికన్ టెలివిజన్‌లో గ[illegible] హింసా చర్యలు కనబడుతున్నాయని, వీటిలో 1.1 హత్యలనీ, 1.1 హత్యా ప్రయత్నాలనీ ప్రకటించింది.

మరే పాత తరం కన్న కూడ ఎక్కువగా ఈతరం బాల బాలికలు హింసాత్మక, బీభత్స దృశ్యాలను చూస్తున్నారని, [illegible] ఈ ఐదుకోట్ల మంది [illegible]లు [illegible] పూరితంగా, [illegible]యారవుతారని ఆ సంస్థ [illegible]స్తోంది.

ఈ సమస్య టెలివిజన్‌కు మాత్రమే [illegible]రిమితం కాదని, సినిమాల పరిస్థితి కూడ అ[illegible] ఆ సంస్థ పరిశీలనలో తేలి[illegible] 1987లో హాంగ్‌కాంగ్, అమెరికా, [illegible] అతి [illegible]ంసాత్మక [illegible] నిర్మించాయి [illegible]క వినోద సాధనాలను ఎగుమ[illegible] చేయడంలో అమెరికా అగ్రభాగాన ఉంది.

గోధుమరంగు జుట్టు! ఆమె విదేశీ వనిత అని గ్రహించింది కార్తి! మళ్ళీ ఆమె కార్తిని కవర్ తీసుకోమన్నట్టు.... వెంటనే అక్కడి నుండి వెళ్ళి పొమ్మన్నట్టు సంజ్ఞ చేసింది!

అప్పటికీ ఆశ్చర్యం నుండి తేరుకున్న కార్తి చప్పున ఆ కవర్‌ని అందుకుని చుట్టూ ఓ సారి చూసింది! ఆ చుట్టుప్రక్కల జనసంచారం లేదు! ఎవరూ తనని గమనించటం లేదని పించింది కార్తికి! మళ్ళీ తలెత్తి ఆమె వైపు చూసింది కార్తి!

ఆ కవర్‌ని అక్కడ ఓపెన్ చెయ్యవద్దని వెంటనే ఇక్కడి నుండి వెళ్ళి పొమ్మని సంజ్ఞ చేసిందామె మళ్ళీ!

వెంటనే కిటికీ తలుపు మూసుకుంది కూడా! కార్తికి ఏదో అర్థమైనట్టు అనిపించింది! ఆ కవర్‌ని హేండ్‌బేగ్‌లో వేసుకుని మరుక్షణం అక్కడి నుండి కదిలిందామె! కార్తి ఆ సందుని దాటుతూండగా ఓ రాయల్ ఫీల్డ్ ఎదురు వచ్చిందామెకి! దాని మీద వున్న వ్యక్తి తననే గమనించడం కార్తికి తెలీదు!

ఒక్క విషయం అర్థమైంది కార్తికి! ఆ యువతి సంజ్ఞలని బట్టి ఆమె ఆ ఇంట్లో బందీగా వుందని.... ఆమె తన నుండి ఏదో సాయం కోరుతోందని!

ఏమయి వుంటుంది ఆ సాయం?

కార్తి తల పంకించింది! అది ఏదైనా సరే.... తను చేసి తీరుతుంది! ఎంత చిత్రం... తను ఎప్పుడూ ఆమెని గమనించక పోయినా ప్రతి రోజూ అంకుల్ ఇంటికి వచ్చే తనని ఆమె గమనిస్తూనే వుందన్నమాట?

పదిహేను నిముషాల తరువాత తమ ఇంటికి చేరుకున్న కార్తి తన కీలుగుర్రాన్ని గారేజ్‌లో పెట్టేసి లోపలికి వచ్చేసి తన రూమ్‌లోకి వెళ్ళడానికి మేడ మెట్లు ఎక్కుతూండగా తల్లి సుమిత్ర తన గదిలో నుండి బయటికి వచ్చి అడిగింది....

"అంకుల్ లేడా యింట్లో బేబీ?"

"ఔను మమ్మీ అంకుల్ లేరు! వూరెళ్ళినట్టున్నారు అనుకోకుండా...." క్షణం ఆగి సమాధానం ఇచ్చింది కార్తి!

"సరే! నేను గుడికి వెళుతున్నాను! వస్తావా?"

"సారీ మమ్మీ! తలనొప్పిగా వుంది! కాసేపు పడుకుంటాను..." కార్తికి ఎంత తొందరగా తన గదిలోకి చేరుకుని ఆ కవర్‌ని విప్పి చదువు దామా.... అనివుంది!

"తలనొప్పా? ఏమయింది? దిష్టి తగిలిందేమో....." ఆతృతగా దగ్గరకి వస్తూ ఆదుర్దాగా అంది సుమిత్ర!

"ఓష్! గోరంతని కొండంతగా చేస్తావు మమ్మీ! ఎండలో వెళ్ళి వచ్చేసరికి అలా అనిపిస్తోంది! దిష్టి తీస్తానంటూ నానా తతంగాలు చేసి నన్ను చంపకు! నువ్వు గుడికెళ్ళు!"

చిరాగ్గా అంటున్న కూతురివైపు చూస్తూ...." సరే అయితే! నిన్నూ తీసుకెళదామనుకున్నాను...." అంది సుమిత్ర!

కార్తి ముందుకి ఒంగి తల్లి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది!

"థాంక్యూ మమ్మీ! ఈపూటకి నన్ను వదిలేసి నందుకు! మరో సారి వస్తానుగా! నువ్వెళ్ళిరా....." అంటూనే చకచక మెట్లెక్కి తన గదివైపు నడిచింది!

క్రిందనుండి సుమిత్ర కేకేసి చెప్పింది....


"బేబీ! ఫ్లాస్కులో కాఫీ వుంది! శారిడాన్ వేసుకుని తాగు!"

"కాస్త తలనొప్పి అంటేనే ఎంత కంగారో మమ్మీకి" నవ్వుకుంటూ తన గదిలోకి వచ్చింది కార్తి!

వెంటనే గదితలుపులు బంధించి హేండ్ బేగ్‌లో నుండి ఆ కవర్ బయటికి తీసి సోఫాలో కూర్చుని దాన్ని ఓపెన్ చేసింది! ఆ కవర్లోఓ లెటర్‌తో పాటు ఓ చిన్న తాళం చెవి కూడా వుంది! కార్తి ఆశ్చర్యంగా చూసింది!

తరువాత ఆ కాగితం మడత విప్పి ఆతృతగా చదవ సాగింది!

చిన్న లెటర్ అది! "డియర్! నాకో



రా. రా. కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

1988 వ సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ప్రకటించారు. ఈ సంవత్సరం తెలుగు బహుమతిని శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి రాసిన 'అనువాద సమస్యలు' గెలుచుకుంది. రారాగా సుప్రసిద్ధులైన శ్రీ రాచమల్లు కొద్దికాలం కిందనే మరణించారు. 'అనువాద సమస్యలు' తెలుగులో అనువాద కళపై వెలువడిన మొట్టమొదటి సమగ్ర గ్రంథం. గత సంవత్సరం వెలువడిన ఈ పుస్తకం చాల చర్చనీయమైంది. తెలుగులో ఎన్నదగిన సాహిత్య విమర్శకుడిగా పేరొందిన రా. రా. 'అనువాద సమస్యలు'లో అనువాదానికి సంబంధించిన ఎన్నో విషయాలను కూలంకషంగా విశ్లేషించారు. రా. రా. 1966-68 ల మధ్య' సంవేదన' పేరుతో ఒక సాహిత్య త్రైమాసికను వెలువరించారు. మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకుడిగా కొంత కాలం పనిచేశారు. 'అలసిన గుండెలు' అనే కథా సంకలనాన్ని, 'సారస్వత వివేచన' అనే సాహిత్య విమర్శా వ్యాసాల సంకలనాన్ని కూడ ఆయన ప్రచురించారు.



సంక్రాంతి
శుభాకాంక్షలందజేస్తున్న జీవిత
ఫోటో : ఈశ్వర్

అదృశ్యమవుతున్న సంక్రాంతి సంబరాలు

సూర్యుడు ఒకరాశి నుంచి మరొక రాశిలో ప్రవేశించడం సంక్రమణం అవుతుంది. పన్నెండు రాసులలో సంచరించడం పన్నెండు సంక్రమణాలను కలిగిస్తుంది. కాని మకర రాశిలో ప్రవేశించడం మాత్రమే మనకు పెద్ద పండుగ. సూర్యుడు మకర రాశి నుంచి కటకరాశిలో ప్రవేశించే వరకు ఆరు నెలల కాలము ఉత్తరాయణమని అంటారు. ఉత్తరాయణం పుణ్యకాలమనే భీష్ముడు అంపశయ్యపై వుండి ఉత్తరాయణం ప్రవేశించగానే స్వచ్ఛంద మరణం పొందాడు.

ఇంటింట కాంతిని ఎనలేని శాంతిని ఇచ్చేమకర సంక్రాంతి నిజంగా మధుర సంక్రాంతే. ధాన్యం ఇంటికి వచ్చే సరికి పుష్యమాసం వస్తుంది కాబట్టి పౌష్యలక్ష్మి అని, సంక్రాంతి లక్ష్మిఅని అంటారు.

"వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి
వచ్చింద వచ్చింది లచ్చి సంక్రాంతి"

—అంటూ సంక్రాంతికి స్వాగతం పలుకుతూ సంబరాలు ప్రారంభిస్తారు.

సూపర్ గర్ల్

సాయం చేస్తావుగదూ...." అంటూ ప్రారంభమయిన ఆ లెటర్....

"...నీ గురించి నాకు చాలా బాగా తెలుసు! నీలోని సాహసం... తెగింపు... కష్టాల్లో వున్న వారికి సాయం చెయ్యాలన్న ఉదారబుద్ధీ.... వీటిని గురించి నాకు తెలుసు! నెలరోజులుగా నిన్ను గమనిస్తున్నాను! నీ వయసు చిన్నదే అయినా నువ్వు నాకు సాయం చెయ్యగలవనే నమ్మకంగా అనిపిస్తోంది! నేను భయంకరమైన ఒక ప్రమాదంలో చిక్కుకుని వున్నాను! నన్ను ఇందులోనుండి ఎవరూ రక్షించలేరు.... ఒక్క నువ్వు తప్ప! నువ్వు ప్రతీ సాయంత్రం ఈ వైపు వస్తావని తెలుసు కాబట్టి ముందుగా ఈ లెటర్ వ్రాసి పెట్టుకుంటున్నాను! రాక్షసుల మధ్య చిక్కుకు పోయివున్న నేను.... ఎవరికంటా పడకుండా ఈ లెటర్ వ్రాయడం కోసం ఓ అయిదు నిముషాల టైమ్ కేటాయించడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది! నా పరిస్థితి అర్థం చేసుకుంటావు గదూ? నాకు సాయం చేస్తావుగదూ?"

"...నాకు నువ్వు చెయ్యాల్సిన సాయం.... ఇక్కడికి ఐదు మైళ్ళ దూరంలో కొత్తగా కడుతున్న కాలనీకి దగ్గరగా ఓ పాడుబడిన పెంకుటిల్లు ... సులభంగా గుర్తుపట్టగలవు నువ్వు! అక్కడ గుడిసెలు తప్ప మరే ఇళ్ళులేవు! ఆ పాడుబడిన పెంకుటింటి దగ్గరికి ఈ రాత్రి పది గంటల సమయంలో వెళ్ళాలి నువ్వు! నువ్వు వెళ్ళగలవనీ ఆ ధైర్యం నీకు వుందనీ నాకు తెలుసు! ఈ కవర్‌లో వున్న తాళం చెవితో ఆ ఇంటితాళం తెరిచి లోపలికి ప్రవేశించాలినువ్వు! ఆ

రంగవల్లులు : ధనుర్మాసమంతా ఇంటి ముంగిట పేడ కళ్ళాపిజల్లి రంగు రంగుల రంగవల్లికలతో వనితలు తమ కళానైపుణ్యానికి నాంది పలుకుతారు ముగ్గులలో భక్తి సంబంధాలు, ఐసాల సంబంధాలు అయినవి పెడతారు అష్టదళ పద్మం భోగి కుండలు, మారేడుదళం, నాగబంధం పెళ్ళిపీటల ముగ్గు శివుని ముక్కన్ను అని రకరకాల పేర్లతో చుక్కలు కలుపుతూ తమ కళాచాతుర్యంతో వాకిలిని తీర్చిదిద్దుతారు పండుగ పర్వదినాలలో ఆరోజుకు తగ్గట్టుగా ముగ్గులు పెడతారు చివర కనుమ రోజున రథం ముగ్గు వేస్తారు ఇది ఉత్తరాయన పయనం సాగించిన సూర్యునిరథంగా బావిస్తారు

'చందనంబు కలయంపి వల్లివారు
వ్రాసి వారించు రజమున రంగవల్లి

-అంటూ శ్రీనాధుడే ముత్యాల రత్నాల ముగ్గులను అభివర్ణించాడు

గొబ్బెమ్మలు : ఇంటి ముంగిట ముగ్గులలో 'ఆవు పేడతో గొబ్బెమ్మలను పెట్టి పసుపు కుంకుమలతోను, గుమ్మడి, గొబ్బి పూలతో వాటి నలంకరించి చెరుకు ముక్కలు, రేగి పండ్లు, అటుకులు, క్రొత్త బెల్లం నైవేద్యం పెట్టి పూజిస్తారు పెళ్ళికాని ఆడపిల్లలు

'మొగలి పువ్వంటి మొగుడ్నివ్వవే
సన్నజాజి లాంటి చిన్న నవ్వుకి

-అంటూ చప్పట్లు కొడుతూ, గొబ్బి పాటలు పాడుతూవుంటె చూడ ముచ్చటగా వుంటుంది

బొమ్మల కొలువు : ఆంధ్రుల కళాభిరుచిని తెలిపే చక్కని నిదర్శనం బొమ్మలకొలువు ఇది వారి వారి అభిష్టాన్ని 9, 5, 3 రోజులు ఏర్పాటు చేసి పేరంటం పెట్టి కన్నుల విందుగా సంక్రాంతి బొమ్మల కొలువును తీర్చిదిద్దుతారు

'పులి ప్రక్క మేక, ఏనుగు మధ్య కుందేలు,
పూరిల్లు మేడ, మోటారు ఎద్దుబండి,

రాజు బంటును- సామరస్యంబు సమకూర్చ
కనువిందయ్యే సంక్రాంతి బొమ్మల కొలువు

-అంటూ కరుణశ్రీ ఎక్కువ తక్కువల బేధభావం లేని సర్వమానవ సమతా తత్వాన్ని ప్రదర్శిస్తే, మహిళలు తమ కళాచాతుర్యంతో రోజుకొక రకంగా కొలువును తీర్చి తమ ప్రజ్ఞను చాటుతారు

దానధర్మాలు : సంక్రమణంలో దాన ధర్మాలు చేసుకుంటె పుణ్యం ప్రాప్తిస్తుందని వారి భావన ప్రాతఃకాలాన్నే హరిదాసు తన రాగాలాపనలతో ఇంటి ముంగిట ముత్యాల ముగ్గులలో దర్శనమిచ్చి 'హరిలో రంగహరి, అంటూ చిడతలతో మేలుకొలుపు పలికి 'కృష్ణార్పణం' అంటూ సెలవు తీసుకుంటాడు బత్రాజు తన పొగడ్తలతో మనల్ని ఆందలం ఎక్కించి తనజోలి నింపుకుంటాడు గంగి రెద్దుల వాళ్ళు, పగటి వేషగాళ్ళు తమ ప్రతిభను సన్నాయి వాయిద్యాలతో ప్రదర్శించి ఆనందంతో మంచి బహుమతులు అందుకుంటారు

భోగి : పండుగ పది రోజులుండనగానే పిల్లలు ఇంటింటికి వెళ్ళి 'పండుగ వచ్చిందోయి' - అంటూ పాటలు పాడుతూ పుల్లలు దండి భోగి రోజున ఇంటి ముంగిట గాని వీధి చివరగాని భోగి మంటలు వేస్తారు పిల్లలు తెల తెల వారుతూనే అభ్యంగన స్నానాలు చేసి క్రొత్త బట్టలు ధరించి భోగిమంటలను సందర్శిస్తారు చంటి పిల్లలకు ఆరోజు కుడుములు, రేగి పండ్లతో భోగి పళ్ళు పోసి పేరంటం జరుపుకుంటారు

సంక్రాంతి : ఈ రోజు పితృ దేవతలకి తర్పణాలిస్తారు పెద్దపండుగ పెద్దల పండుగ అని బ్రాహ్మణులకు గుమ్మడి, చిలకడదుంపలు, పలురకాల కాయగూరలు, బియ్యం, దక్షిణలతో వారిని సంతృప్తి పరుస్తారు ఇంటిల్లపాది పిండి వంటలతో, క్రొత్త బట్ట తో కళకళలాడుతూ వుంటారు

కనుమ : వ్యవసాయ పనిముట్లకు, పశువులకు పసుపు, కుంకుమలు, పూలతో అలంకరించి పూజచేస్తారు ఎద్దు బండ్లను అలంకరించి పోటీలు నిర్వహిస్తారు కోడి పందాలతో తమ గొప్పతనాన్ని చాటుకుంటారు

సంక్రాంతి లక్ష్మి పంటరాసులపై ప్రజ్వలించి లేవడం సంవత్సర సమృద్ధికి సంకేతం అబాల గోపాలము ఆనందడోలికలలో తేలియాడే తొలకరి పండుగ

"కదలి వచ్చెను భాగ్యాల కడలివోలె
మకర సంక్రాంతి లక్ష్మి హేమంత వీధి

-అంటూ అభివర్ణించారు తుమ్మల సీతారామమూర్తి చౌదరి ఆధునిక నాగరికత పెరిగే కొలది సంప్రదాయాలు క్రమంగా అంతరిస్తున్నట్టే సంక్రాంతి సంబరాలు అదృశ్యమవుతున్నాయి జంగమదేవర శంఖారావం గాని, హరిదాసు రాగాలాపన గాని ఇప్పుడు ఎక్కడైన వినిపిస్తున్నాయా' మారేకాలంతో పాటు ప్రజల్లో పండుగలయందు ఆసక్తి సన్నగిల్లి పోతుంది గ్రామాల్లో ఇంకా సంబరాలు కన్నుల విందు చేస్తున్నా పట్టణాలలో ఇవి కానరావడం లేదు మనకు ఎన్నో విధాల కాంతినిచ్చే సంక్రాంతిని మనం మరువకుండా మన సంస్కృతిని కాపాడే బాధ్యత మనందరిపైన వున్నది

-పొన్నగంటి పార్వతి

సమయంలో నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి! నిన్ను ఎవరైనా కనిపెడుతున్నా రేమో గమనించాలి! ఎవరూ నిన్ను గమనించడం లేదని నిర్ధారించు కున్నాక....."

"......... " ఇదే నువ్వు చెయ్యాల్సిన పని!

అర్థమైందా? ఆ సూట్‌కేస్‌ని మాత్రం ఓపెన్ చేసి చూడద్దు! అలా చూడవుగదూ? ఈ హెచ్చరిక కేవలం నీ మేలుకోరే చెబుతున్నా!

తరువాత సరాసరి నేను వున్న ఈ

గొబ్బెమ్మలను సింగారిస్తున్న ముద్దుగుమ్మ
(ఫోటో : బొనపల్లి మురళి)



అసలు నా మొదటి అనుభవం

అర్ధనగ్నంగా "మొదటి అనుభవం" చిత్రంలో నటించి, సంచలనం సృష్టించిన అభిలాష "అసలు నేను చదువుకునే రోజుల్లోనే ఓ సినిమాలో అనుకోకుండా నటించాను తెలుసాండీ?" అంటూ యిలా వివరించింది. "ఒక రోజు నేను, నా స్నేహితురాండ్రు లీసా, ఫ్రాంసినోతో కలిసి



కాయగూరలు తీసుకురావడానికి మార్కెట్‌కు బయలుదేరాను. దారిలో ఒకచోట చాలామంది గుంపు ఉన్నారు. ఏమిటా అని వెళ్ళి చూశాం. అదొక కన్నడ చిత్రం షూటింగ్. హీరో అంబరీష్, డైరెక్టర్ మమ్మల్ని చూడగానే "ఎవరో ఈ ముగ్గురు అమ్మాయిలూ ముచ్చటగా వున్నారు. వీళ్ళమీద ఒక ఓపెనింగ్ షాట్ తీద్దాం" అన్నాడు కెమెరామన్‌తో. వెంటనే కెమెరా మావైపు తిరిగింది. మా ముగ్గురికీ ఏం చేయాలో తోచలేదు. అలాగే కొయ్యబారి నిలుచుండిపోయాం చేతుల్లోని సంచులతో. "కట్!" అంటూ డైరెక్టర్ "చాలా థాంక్స్ అమ్మాయిలూ!" అన్నాడు. ఆ ఆనందాతిరేకంతో మేం మార్కెట్‌కెళ్ళి కూరగాయలు తేకుండా అలాగే మా మా యిళ్ళకు పరుగులుతీశాం. నిజంగా చెప్పాలంటే నా మొదటి అనుభవం యిదే!"

సూపర్ గర్ల్

ఇంటిదగ్గరికి వచ్చెయ్యి! ఆ సమయంలో మాత్రం నిన్ను నేను కలుసుకోగలను! ఆ సూట్‌కేస్‌ని నాకు అప్పగించ గలవు! నువ్వు నాకు ఈ సాయం చెయ్యడం నిజంగా ఎంత గొప్ప విషయమో తరువాత నీకే తెలుస్తుంది! నాకీ సాయం చేస్తావుగదూ? ప్లీజ్!

"అభాగ్యురాలు"

"రాణి"

ఆ లెటర్‌ని ఆసాంతం చదివి ఆలోచనలో పడిపోయింది కార్తి!

ఎవరీ రాణి? ఈమెని ఇలా బంధించి వుంచిన దెవరు?

ఆ సూట్‌కేస్ ఆమె చేతికి వచ్చినందు వల్ల ఆమెకి కలిగే లాభం ఏమిటి? రోజంతా ఆ ఇంట్లో బందీగా వుండే ఆమె అర్ధరాత్రి స్వేచ్ఛగా తనని ఎలా కలుసుకో గలదు?

ఎంత ఆలోచించినా ఈ సందేహాలకి సమాధానం దొరక్క పోయినా, కార్తి మాత్రం రాణికి ఆమె కోరిన ఆసాయం చెయ్యాలనే నిర్ణయించుకుంది!

'ఆపదలో వున్న వార్ని ఆదుకోవడంలో, వారికి సాయం చెయ్యడంలోనే వుంది అసలైన గొప్పదనం అనే అంకుల్ మాటలు గుర్తువచ్చాయి ఆమెకి!

ఈ సమయంలో అంకుల్ వూళ్ళో వుంటే ఎంత బావుండేది? అనిపించింది ఆమెకి!

కార్తి మెల్లగా తన రూంలో నుండి బయటికి వచ్చి క్రిందకి దిగి తండ్రి బెడ్ రూమ్‌లోకి వచ్చింది! ఆయన కూర్చుని వ్రాసుకునే టేబుల్ సొరుగు లాగింది!అందులో రివాల్వర్ కనిపించింది నల్లగా నిగనిగలాడుతూ!

దాన్ని తీసుకుని తన గదిలోకి వచ్చేసిందామె! ఈ విషయం తల్లి దండ్రులకి తెలిస్తే కాళ్ళు విరగొట్టి గదిలో పారేస్తారు! తొమ్మిది గంటలకంతా ఇంట్లో మమ్మీ డాడీ నిద్రపోగానే మెల్లగా క్రిందికి దిగివచ్చి తలుపుతీసుకుని తన మోపెడ్‌ని బయటికి నడిపించుకుంటూ వచ్చి ఈ సందు చివంన స్టార్టు చేసుకుని వెళ్ళాలి!గట్టిగా నిర్ణయించుకుంది కార్తి!

పున్నమి చంద్రుడు వెండి వెలుగుల్ని వెదజల్లుతున్నాడు! చుక్క కన్నెలు జిలుగు తళుకుల్ని విరజిమ్ముతూ ప్రియుని వైపు ఓరగా చూస్తున్నాయి! ప్రకృతి విశ్రాంతి తీసుకుంటోందా అన్నట్టు వాతావరణం నిశ్శబ్దంగా వుంది! అప్పుడు సమయం పదిన్నర అయివుంటుంది! విచ్చి ముక్కలతో కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఆ పెంకుటిల్లు ఆ కాలనీ చివరగా వుంది! ఆ ఇంటికి దూరంగా అక్కడొకటీ అక్కడొకటీగా విసిరేసినట్టున్న లేబర్ నివసించే గుడిసెలు తప్ప మరే ఇళ్ళూ లేవు!

వెన్నెల వెలుగులో ఆ ఇంటి వైపు చూస్తేనే భయం పుట్టేలా దయ్యాల నివాసం లావుంది! నలుగురు వ్యక్తులు నిశ్శబ్దంగా నడుచుకుంటూ వచ్చి ఆ ఇంటి ఆవరణలో ప్రవేశించారు!

వారిలో ఇద్దరి చేతుల్లో పదును పెట్టిన చాకులు వున్నాయి! మరో ఇద్దరి చేతుల్లో రివాల్వర్లు వున్నాయి! వారికి నాయకుడిలా పొడుగ్గా, చాకు పట్టుకుని వున్న వ్యక్తి తన అనుచరులకి ఏదో సంజ్ఞ చేశాడు! వెంటనే వారిలో ఇద్దరు నిశ్శబ్దంగా చెరో వైపు నుండి ఆ ఇంటి వెనుక వైపుకి వెళ్ళారు!

పొడుగాటి వ్యక్తి ఇంకో అనుచరుడూ పడిపోవడానికి రెడీగా వున్న ఆ ఇంటి తలుపుకి చెరో వైపున నిలబడ్డారు! వాళ్ళు నిలబడిన ఆ తీరు చూస్తుంటే లోపలినుండి ఏ వ్యక్తో ఎక్షణంలోనో బయటికి రావచ్చు నన్నట్టు వెంటనే కసిగా తమ ఆయుదాల్ని ప్రయోగించి ఆ వ్యక్తిని పరలోకానికి పంపాలన్నంత క్రూరంగా చూస్తూ నిలబడ్డట్టుంది! జరగబొయ్యే దారుణ కాండని తను చూడలేడన్నట్టు ఆకాశవీధిలోని జాబిల్లి మబ్బుల చాటుకి తప్పుకున్నాడు! మసకబారిన ఆకాశ వేదికను కనుమరుగయిన ప్రియుని చూసి చుక్క కన్నెలు వెల వెల పోయాయి!

నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వున్న ఆ ఇంటి ఆవరణ ఒక్క సారిగా ఏదో స్కూటర్ స్టార్టయిన శబ్దంతో ప్రతిధ్వనించింది! ఆ ఇంటి ముందు వెనుక జాగాల్లో ఆయుదాలతో సిద్ధంగావున్న ఆ వ్యక్తులు ఉల్కి పడ్డారు! ఆ చప్పుడు ఎక్కడి నుండి . ఏ వైపునుండి వస్తోందో వారు గ్రహించేలోగా రంయ్ మని రాకెట్ వేగంతో వూడిపడటానికి సిద్ధంగా వున్న ఆ ఇంటి తలుపుని ఒక్క ఉదుటున అడ్డు తొలగించుకుంటూ లోపలి నుండి బయటికి వచ్చింది ఆ స్కూటర్! వారు నిర్ఘాంత పొయ్యారు! వారు వూహించని పరిణామం అది!-వారు తెప్పరిల్లి తమ ఆయుదాల్ని ప్రయోగించే లోపల మెరుపులా దూసుకు పోయింది ఆస్కూటర్ మీదిశాలీ! శత్రువుని చాలా తక్కువగా అంచనా వేసినందుకు తనని తానే నిందించుకున్నాడు వారినాయకుడు! ఇంటి వెనుక వైపు వున్న ఆ ఇద్దరు వ్యక్తులూ పరుగెత్తుకు వచ్చారు!

వెంటనే నలుగురూ కలసి బయటికి పరుగెత్తారు! నిముషంలో ఆ సందు చివరికి చేరుకున్నారు వారు! అక్కడవుంది వారు అంతకుముందు వచ్చిన వాహనం!ఎగిరి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు నాయకుడిలా కనిపిస్తున్న వ్యక్తి! మిగతా వాళ్ళు తమ సీట్లలో సర్దుకున్నారు! వెంటనే ముందుకి

సంక్రాంతి శుభాకాంక్షలు అందిస్తుంది

గోదావరి డి.ఎ.పి.





పైరుకు బలం రైతుకు వరం


పైరు బాగా పెరగడానికి, అధిక దిగుబడిని ఇవ్వడానికి నత్రజని, భాస్వరం పోషకాలు చాలా అవసరం. **గోదావరి డి.ఎ.పి.లో** అధికంగా **భాస్వరం** అంటే **46శాతం** మరియు వలసిన **నత్రజని 18శాతం** వున్నాయి. కనుక పైర్లకు కావలసిన పూర్తిపోషకాలను సరియైన సమయంలో **గోదావరి డి.ఎ.పి.** అందిస్తుంది.

పూర్తిగా నీటిలో కరిగే రూపంలో ఉన్న భాస్వరం అధిక శాతంలో ఉండటం వలన వేళ్ళుత్వరగాను బలంగాను వృద్ధిచెంది **కాయలను గింజలను అధికంగా ఉత్పత్తి చేస్తాయి.** అమ్మోనియా రూపంలో ఉన్న నత్రజని నీటిలో కొట్టుకొని పోకుండా **మట్టికణాలకు అతుక్కొని మొక్కలను** ఏపుగా పచ్చగా ఎదిగేలా **చేస్తుంది.**

46 శాతం భాస్వరం, 18 శాతం నత్రజని **అంటే మొత్తం 64 శాతం పోషకాలుగల కాంప్లెక్స్** ఎరువు గోదావరి డి.ఎ.పి. దీనిలో ఉన్నన్ని అత్యధిక పోషకాలు మరేఇతర కాంప్లెక్స్ ఎరువుల్లోను లేవు. అందుకే పైరు వేసే సమయంలో వాడేందుకు అనువైన అత్యుత్తమ కాంప్లెక్స్ ఎరువు గోదావరి డి.ఎ.పి.

ఎరువు విలువను బస్తాబరువును బట్టికాని దానిధరను బట్టికాని నిర్ణయించలేము. ఉదా: ప్రతి 50కిలోల 20:20 కాంప్లెక్స్ ఎరువుబస్తాలో 10 కిలోల భాస్వరం 10 కిలోల నత్రజని అంటే 20 కిలోల పోషకాలు ఉంటాయి. కాని ప్రతి 40 కిలోల **గోదావరి డి.ఎ.పి. ఎరువు బస్తాలో 18.4 కిలోల భాస్వరం, 7.2 కిలోల నత్రజని అంటే మొత్తం 25.6 కిలోల** పోషకాలు ఉంటాయి. అంటే ఇంచుమించు ఒకేధరకు 20:20 కాంప్లెక్స్ ఎరువుబస్తాలో కన్నా అదనంగా **5.6 కిలోల పోషకాలు గోదావరి డి.ఎ.పి.** ఎరువుబస్తాలో లభిస్తాయి. మాపారా బస్తాబరువుకాదు దానిలో వున్న పోషకవిలువను గమనించడం ముఖ్యం.

భారత దేశంలో కెల్లా సరిక్రొత్త కర్మాగారంలో అత్యాధునిక పరిజ్ఞానంతో మన ఆంధ్రప్రదేశ్ లో **తయారయ్యే** మొదటి డి.ఎ.పి. గోదావరి డి.ఎ.పి.



పైరుదిగుబడికి - రైతురాబడికి వాడండి గోదావరి డి.ఎ.పి.



రీగన్, గోర్బచేవ్‌లు కవలలు!!

రోనాల్డ్ రీగన్, మిఖయిల్ గోర్బచేవ్‌లకు పోలిక లేదని, ఇద్దరూ పరస్పర విరుద్ధ రాజకీయ విశ్వాసాలకు చెందిన వాళ్ళని అందరూ అనుకుంటారు. కాని వాళ్ళిద్దరూ ఒకే తల్లి కడుపున పుట్టారు! ఔను, నిజంగానే 1987 డిసెంబర్ 8 గాలినా సఖరోవ్ మాస్కోలో రీగన్‌కూ, గోర్బచేవ్‌కూ ఒకేసారి జన్మనిచ్చింది!

అమెరికా అధ్యక్షుడు రీగన్, రష్యా అధినేత గోర్బచేవ్ అణుక్షిపణుల తగ్గింపు ఒప్పందం మీద సంతకం చేస్తూ ఉన్న సమయానికి మాస్కోలోని స్టార్టవయా (ప్రారంభం) వీధిలో ఉన్న ఒక ప్రసూతి గృహంలో శ్రీమతి "గాలినా" ప్రసవ వేదన అనుభవిస్తోంది. కవల శిశువుల జననం, రేడియోలో అగ్ర నాయకుల ఒప్పందం ప్రకటన కలగలసి వచ్చాయి. కవలలకు రోనాల్డ్ రీగన్, మిఖయిల్ గోర్బచేవ్‌ల పేర్లు పెట్టాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. రీగన్ పది నిమిషాలు ముందు పుట్టాడని, గోర్బచేవ్ రీగన్ కన్న అర కిలో ఎక్కువ బరువు తూగాడని తల్లిదండ్రులు చెప్పారు. 30 ఏళ్ళ వయసున్న గాలినా, 31 ఏళ్ళ వయసున్న వ్యాచెస్లావ్‌లు ఇద్దరూ వంత వైద్యులుగా పని చేస్తున్నారు. తమ పిల్లలు వైద్యులు అనుకున్న దానికన్నా వేగంగా పెరుగుతున్నారని వాళ్ళన్నారు

★ మీరు కవలపిల్లలా? (66వ పేజీ చూడండి)

సూపర్ గరల్

దూకింది జీపు! ఐదునిముషాల తరువాత కనబడింది వారికి దూరంగా..... వేగంగా వెళుతున్న స్కూటర్! అక్కడి నుండి ప్రారంభమయింది పరుగుపందెం!

★ ★ ★ ★ ★

అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తూ అమిత వేగంగా డ్రైవ్ చేస్తోంది కార్తి! తను తీరా బయలు దేరబొయ్యే ముందు మనసు మార్చుకుని మంచి కండిషన్‌లో వున్న తండ్రి స్కూటర్ తెచ్చిందామె! అదే తన కీలుగుర్రం అయ్యివుంటే ఖచ్చితంగా శత్రువుల చేతికి చిక్కడం ఖాయం! ఇంత స్పీడు పోవటం తన పాత కీలుగుర్రమ్మీద కుదరదు! అయినా రాణి ముందుగానే వూహించింది.... శత్రువులు తనని గమనించవచ్చని! ఎలా పసిగట్ట గలిగారు వాళ్ళు తను ఈ ఇంటి దగ్గరికి వచ్చే విషయం?

మొత్తానికి ఏదో అనుమానంతో ముందు జాగ్రత్త కోసం తను స్కూటర్‌ని సరాసరి లోపలికి తీసుకెళ్ళి పెట్టుకోవడం ఎంతో మేలయింది! వీళ్ళని తప్పించుకుని రాణిని కలుసు కోవటం ఎలా?

కార్తి తల తిప్పి వెనక్కి చూసింది!దూరంగా జీపు హెడ్‌లైట్ల కాంతి కనబడుతోంది! శత్రువుల్ని తప్పు దోవ పట్టించాలి!

కార్తి సర్రున ప్రక్కకి కోసి స్కూటర్‌ని ఎడమవైపు సందులోకి మళ్ళించింది! అంత దూరంలో కనిపించిందామెకి ఎత్తైన ఓ చెత్త కుండి! స్కూటర్‌ని సరాసరి వెనక్కి తెచ్చి ఆపి తను దిగి చప్పుడు కాకుండా దాని వెనక నక్కింది కార్తి! ఆమెగుండె దడ దడ లాడుతోంది! అది భయమో మరేమిటో తెలీని స్థితి! ఏం జరుగుతుందో తెలీని ఏదో జరుగుతుందని మాత్రం తెలిసి. జరిగే దాని కోసం ఎదురు చూసె టెన్షన్!

కార్తి ఎత్తు ఫలించింది! శత్రువులు ఆమె వూహించినట్టే తప్పు దారి పట్టారు!రెండు నిముషాల తరువాత ఆ సందులోకి ప్రవేశించిన జీపు ముందుకి సాగి పోయింది!ఓ అయిదు నిముషాలు ఆగి లేచి స్కూటర్ స్టార్ట్ చేసింది కార్తి... థాంక్ గాడ్..." అనుకుంటూ!!

నిజంగా ఈ అడ్వెంచర్ చాలా థ్రిల్లింగ్‌గా వుంది ఆమెకి! స్కూటర్‌ని ఆ సందులో నుంచి ముందుకి తెచ్చి సూటిగా దూసుకు పోసాగిందామె!

శత్రువులకి తను ఇప్పుడు రాణి ఇంటికి వెళ్ళి ఆమెని కలుసుకునే విషయం తెలిసివుంటే, వారు తమ పొరబాటుని గ్రహించి తనని వెంబడించే లోపల తను రాణిని కలుసుకుని సూట్ కేసు ఆమెకి అప్పగించి బయటపడవచ్చు!

కార్తికి హుషారుగా అనిపించింది! సన్నగా ఈలపాట పాడసాగింది! నాలుగేళ్ళ క్రితం అంకుల్ కొని ఇచ్చిన మోపెడ్ పుణ్యమా అని . డ్రైవింగ్‌లో ఆమెకి వున్న నైపుణ్యం ఇప్పుడు ఈ విధంగా ఈ అవసరానికి ఉపయోగపడింది! ఆమె ఎంత హైస్పీడ్‌లో వచ్చిందంటే మరో ఇరవై నిముషాల తరువాత రాణి ఇల్లువున్న వీది మొదట్లో వుంది!

కార్తి స్కూటర్‌తో సహా రాణి ఇంటి దగ్గరికి వెళ్ళదలచుకోలేదు! అక్కడ కూడా శత్రువులు కాచుకుని వుండరన్న నమ్మకం ఏమిటి?

ఆమె స్కూటర్‌ని ఆ వీధి మొదట్లోనే వున్న ఓ బంక్ చాటున వదిలేసి ఎర్రని ఆ సూట్‌కేస్‌ని అందుకుని చకచక నడుస్తూ రాణి ఇల్లువున్న సందు మొదట్లోకి చేరుకుని ఒక్క నిముషం ఆగింది! స్ట్రీట్ లైట్లు కూడా వెలగని ఆ సందులో వెన్నెల్లో మసగ్గా కనబడుతోంది దూరంగా రాణి ఇల్లు! ఇంట్లో పట్టపగల్లా దీపాలు వెలుగుతున్నాయి! అంటే... రాణి తనకోసం ఎదురుచూస్తోందన్న మాట?

చప్పుడు కాకుండా వేగంగా నడుస్తూ ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది కార్తి! ముందుకి నడిచి ఇంటి ముఖద్వారం దగ్గరకి చేరుకుందామె! కార్తి కాలింగ్ బెల్ నొక్కదలచుకోలేదు! రాణి ఎలాగూ తనకోసం ఎదురు చూస్తూ వుంటుంది! ఒక్క సారి చిన్నగా తలుపు మీద చప్పుడు చేస్తే చాలు, ఇంట్లో లైట్లన్నీ వేసుకుని ఎదురు చూస్తూ కూర్చునివున్న ఆమె వెంటనే తలుపు తీస్తుంది! కార్తి చుట్టూ పరిసరాల్ని పరిశీలనగా చూసింది!

అక్కడ ఏదో అసహజత్వం గోచరించిందామెకి! ఒక్క క్షణం ఆమెశరీరం మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి! మరుక్షణం ధైర్యం తెచ్చుకుంటూ తలుపు తట్టిందామె! కానీ, తలుపులు ముందుకి వేసి వున్నట్టు ఆమె చెయ్యి తగలగానే వెంటనే తెరుచుకున్నాయి! ఒక్కక్షణం అలాగే నిలబడి పోయింది ఉలిక్కిపడిన కార్తి!

ఆమె మనస్సు కీడుని శంకించ సాగింది! ఒక్కక్షణం వెనక్కి తిరిగి వెళ్ళిపోదామా అనిపించిందామెకి! కానీ, వెంటనే మొండి ధైర్యం ప్రవేశించిందామెలో! ఏదైతే అదవుతుందన్న తెగువ! చప్పున పాంటు జేబులో నుండి రివాల్వర్‌ని బయటికి తీసింది-కార్తి! మరుక్షణం తలుపుల్ని నెట్టుకుని లోపలికి ప్రవేశించిందామె! అంతే ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టు అక్కడే నిలబడిపోయింది కార్తి!

అక్కడ హాలుమధ్యలో భయంకరమైన దృశ్యం! రాణి రక్తపు మడుగులో పడిఉంది! ఆమె గుండెల మధ్యగా లోపలికి దిగి పోయిన పదునైన కత్తి! నిశ్చేష్టురాలైనట్టు నిలబడి పోయిన కార్తికి రాణి శవం ప్రక్కన రక్తంతో వ్రాసిన అక్షరాలు... కనపడ్డాయి! అమ్మయ్యో గుండె ఝల్లు మంటోంది!

(ఇంకా ఉంది)


ఆరోగ్యానికి సప్త గుళికలు

ooooooo

డాక్టర్ బి.జి.వి. నరసింహారావు

రెండవ గుళిక

సూర్యరశ్మి



'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అన్న ఆర్యోక్తి అక్షర సత్యం.

సహజ వెలుతురు సోకటం వలన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. శరీరంపై వీలైనన్ని తక్కువ బట్టలను వేసుకొని సూర్యరశ్మిలో ఉండటం మంచిది. దీనినే సూర్యస్నానమంటారు. ఉదయం తొమ్మిది గంటల లోపు గాని సాయంత్రం నాలుగు గంటల తర్వాత గాని సూర్యస్నానం చేయాలి. మరీ ఎండలో ఎక్కువసేపు ఉంటే ముఖం మాడిపోవటం, చర్మ కేన్సరు, చర్మం ముడతలు పడటం వంటి ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది. కాబట్టి ఎప్పుడు బడితే అప్పుడు సూర్య స్నానం మంచిది కాదు.

సూర్య స్నానం చేసే ముందు ఒక గ్లాసు మంచినీరు తీసుకోవటం మంచిది. వయసు మీరిన వారు సూర్య స్నానం చేసే సమయంలో తడి గుడ్డను నెత్తిపై ఉంచటం మంచిది.

సూర్యకాంతిలోని అతినీలలోహిత కిరణాల ప్రభావం వలన చర్మంలో రసాయనిక మార్పులు జరిగి 'డి' విటమిను ఉత్పత్తి అవుతుంది. ఎముకల లోపాల నుంచి, వ్యాధుల నుంచి రక్షించేది 'డి' విటమినే. సూర్యకాంతి వలన కండరాలకు, రక్త ప్రసరణకు లాభం. ఈ కాంతి వలన రోగ కారక క్రిముల నుంచి తప్పించుకోగలము. ఉదయపు కాంతి కిరణాలు నాడీ మండలానికి ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కల్గిస్తాయి.

(వచ్చేవారం మూడవ గుళిక)

ఆడదాని మనసు

లక్ష్మీ గాయత్రి



సినిమా థియేటరు ముందు నిలబడి సినిమాకి వెళ్ళడమా మానడమా అని ఆలోచిస్తున్నాడు సత్యమూర్తి. అతను కంపెనీ పని మీద ఆ వూరొచ్చి నాలుగు రోజులైంది. ఆరోజుతో పని అయిపోయింది! రాత్రి పదకొండు గంటల ట్రెయినులో బైలుదేరి తన వూరికి వెళ్ళి పోతున్నాడు. ఈ మధ్యకాలాన్ని ఎలా గడపాలా అన్నది అతని ఆలోచన. ముందుగా హోటల్లో కాఫీ త్రాగి, సిగరెట్టు కాల్చుకుంటూ బైటికి వచ్చాడు. హోటల్‌కి దగ్గరగానే వున్న సినిమా థియేటర్ చూడగానే, "ఫస్ట్ షో చూసి వెళ్ళే టైము ఎటూ వుంది గదా, పోనీ సినిమా చూస్తేనో" అనిపించింది. తీరా సినిమా థియేటర్ దగ్గర కొచ్చాక, "వెధవ సినిమాలు ఎప్పుడూ చూసేవే గదా. అలా నాలుగు వీధులూ జాలీగా తిరిగొస్తే బావుంటుందేమో" అనిపించింది. చివరికి థియేటర్ ముందు నిలబడి సిగరెట్ పొగ తాలూకు తన్మయత్వాన్ని అనుభవిస్తూ, సినిమాకి వెళ్ళాలా వద్దా అన్న డైలమాలో పడ్డాడు.

ఆలోచిస్తూనే సిగరెట్ కాల్చి, పీక విసిరెయ్యబోతూ తల తిప్పిన సత్యమూర్తి షాక్ తగిలినట్టు ఖిన్నుడై పోయేడు!

ఎదురుగా సుజాత!

చంకలో పిల్లనో, పిల్లవాణ్ణో ఎత్తుకుని, తలవంచుకుని గబగబా వస్తోంది!

తను చూస్తున్నది నిజమేనా, కలా అన్నంత విభ్రమంలోంచి సత్యమూర్తి తేరుకునే సరికి సుజాత దగ్గర కొచ్చేసింది.

దగ్గరనించి మరోసారి 'ఆమె సుజాతే' అని నిశ్చయించుకోగానే "సుజా" అంటూ అప్రయత్నంగానే పిలిచేశాడు.

సుజాత ఉలిక్కిపడి తలెత్తింది!

ఎదురుగా కనిపిస్తున్న సత్యమూర్తిని చూడగానే సుజాత కళ్ళు కూడా ఆశ్చర్యంతో పెద్దవయాయి.

ఇంకా నమ్మలేనట్టు "సత్యం, నువ్వా?!" అంది.

సుజాత పలకరింపుతో సత్యమూర్తి తేరుకున్నాడు.

'సుజా' అంటూ పిలిచేశాడే గాని తీరా ఆ ముక్క నోటి నించి జారిపోయాక సుజాత తనని గుర్తు పడుతుందో పట్టదో, గుర్తు పట్టినా పలకరిస్తుందో పలకరించదో, ముభావంగా, "ఓహో సత్యమూర్తిగారా" అంటుందేమో – యిలా లక్ష అనుమానాల్తో సతమత మవుతున్న సత్యమూర్తిని ఆప్యాయతతో కూడిన సుజాత పలకరింపు హాయిగా సేద దీర్చింది.

"సుజా, నువ్వుంటున్నది యిక్కడేనా? నాకు మాట మాత్రం తెలియదు సుమా! ఇంతకీ మీ యిల్లెక్కడ? మీ ఆయన ఏం ఉద్యోగం చేస్తున్నాడు? ఈ పిల్లాడెవరు?" ఎన్నాళ్ళు గానో తన మనసులో పేరుకు పోయిన ప్రశ్నలన్నీ గబగబా అడిగేశాడు.

అతని ఆఖరి ప్రశ్నకి నవ్వింది సుజాత. "అదేం ప్రశ్న సత్యం? ఎవరి పిల్లాణ్ణో నేను ఎత్తుకుని

వస్తున్నానను కుంటున్నావా? నీకు అక్షరాలా నా కొడుకో అంది పిల్లవాడి వైపు ఆప్యాయంగా చూస్తూ

ఓహో సుజాత జవాబుకి ఏమంత ఆనందించని సత్యమూర్తి పిల్లవాణ్ని మాత్రం పరీక్షగా చూశాడు సుజాత పోలికలో తెల్లగా బాగానే వున్నాడు కాకపోతే కొంచెం నీరసంగా వున్నాడు

అతడి చూపుల్ని గమనించినట్టు, నీరసంగా వున్నాడు కదూ' నాలుగు రోజుల్నించి జ్వరం! యివేళే కాస్త తగ్గింది! ఏం చెయ్యను, పాలా నేతా మంచి తేల్చే శక్తి లేని వాళ్ల యింట పుట్టాడు మరి! వున్నంతలోనే అపురూపంగా పెంచుకొస్తున్నాను! అంటూ నవ్వింది సుజాత ఆనవ్వులో అనుభవిస్తున్న కష్టాల తాలూకు ఆవేదనతో బాటు భవిష్యత్తు మీది ఆశ కూడా మెరుస్తూ ఇంద్ర ధనస్సులా వెలిగింది

సుజాత కళ్ళు ఒక్క నిమిషం సత్యమూర్తి వేసుకున్న ఖరీదైన బట్టల్ని పరికించి చూశాయి ఆ చూపుల్ని సత్యమూర్తి కూడా గమనించాడు

అంతలో హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్టు, అయ్యో టైం ఆరయి పోయిందా అంది

సత్యమూర్తి తన ఇంపోర్టెడ్ వాచీలో చూసి, ఆరు దాటుతోంది' అన్నాడు

అయితే నేనిప్పుడే అలా వెళ్లి వస్తాను! ఈ వీధి చివరే వున్న డాక్టరే మా అబ్బాయిని చూస్తున్నాడు! గబగబా వెళ్లి చూపించేసి వస్తాను ఆరు దాటితే రష్ పెరిగి పోతుంది' అంటూ ఒక్క క్షణం ఆగి,

'నువ్వింకా వుంటావా? లోపలికి వెళ్లిపోతావా?' అంది

ఏ లోపలికి? అన్నాడు

"థియేటర్లోకి! సినిమా చూడటానికి రాలేదూ, నువ్వు? అసలింతకీ నేను అడగటమే మర్చిపోయేను! నువ్వూ ఈ వూళ్లోనే వుంటున్నావా? అంది

'ఊహూఁ లేదు!" అంటూ తన వివరాలు చెప్పేడు సత్యమూర్తి

అలాగా! అయితే మరో నాలుగ్గంటల్లో వెళ్లిపోతావన్న మాట! అంది

అవునన్నట్టు తలూపేడు సత్యమూర్తి.

'నువ్వు యిప్పుడు హోటల్‌కి వెళ్లిపోతావా, ఎక్కడికేనా వెళ్తావా?

ఏం?

ఏం లేదు నువ్వు హోటల్‌కే వెళ్తానంటే, హోటల్ యిక్కడే గదా, నేను పిల్లాణ్ని డాక్టరుకి చూపించేసి నీ రూమ్‌కి వస్తాను! మనం కాస్త వివరంగా మాట్లాడుకోవచ్చు' అంది

సత్యమూర్తి గుండె ఒక్కసారి ఎగిసి పడింది! తన ఉద్రేకాన్ని కనబడ నివ్వకుండా, నువ్వు వస్తానంటే ఎక్కడికీ వెళ్లను! రూమ్‌లోనే వుంటాను!' అన్నాడు

సుజాత కృతజ్ఞతగా చూసింది "అయితే నేను తొందరగా వెళ్లి వచ్చేస్తాను' రూమ్ నెంబరెంత? అంది

'నేను దగ్గరుండి తీసికెళ్తాలే' గేటు దగ్గరే వుంటాను' అన్నాడు సత్యమూర్తి

సుజాత మరోసారి కృతజ్ఞతగా చూసి గబగబా వెళ్లింది!

సుజాత కనుచూపు మేరదాటాక మరో సిగరెట్ వెలిగించుకుని తాపీగా హోటల్ వైపు నడవసాగాడు సత్యమూర్తి

అతడి మనసు సుమారు నాలుగైదేళ్ల క్రిందటి సుజాత రూపాన్ని, ఆమెతో పరిచయాన్ని, ఆమెతో జరిగిన సంఘటనలను గుర్తు తెచ్చుకోసాగింది!

ఐదేళ్ల క్రితం సత్యమూర్తి బి ఇ పాసై ఖాళీగా వుంటున్న రోజులవి!

సత్యమూర్తి యింటికి నాలుగిళ్లవతల ఓ పెంకుటింట్లో వుండేవారు సుజాతా వాళ్లూ ఎప్పుడో ఏ పేరంటాల్లోనో కలుసుకుని 'బావున్నారా' అంటే 'బావున్నారా' అనుకునేవారు సుజాత తల్లీ, సత్యమూర్తి తల్లీ ఇక సత్యమూర్తి తండ్రికి సుజాత తండ్రి ఎలా వుంటాడో కూడా సరిగ్గా తెలీదు పై అధికారులతో మీటింగులనీ, సెండాఫ్ పార్టీలనీ, కేంపులనీ రాజకీయాలనీ సత్యమూర్తి తండ్రి బిజీగా వుంటే, ఈ ఒక్కగంటా మాత్రం విశ్రాంతి అని ఎందుకు పడుకోవాలి? ఈ కాస్త టైములో ఏ కొట్లో నన్నా పద్దులు రాసినా మరికాస్త సుఖంగా గడుస్తుంది' అనుకుంటూ యిరవై నాలుగు గంటలూ స్ట్రగుల్ ఫర్ లివింగ్‌తో బిజీగా వుండేవాడు సుజాత తండ్రి

అటువంటి రెండు కుటుంబాలకి వారధి సత్యమూర్తి చెల్లెలు రేణుక

"అమ్మా, ఆ పెంకుటింట్లో అమ్మాయి ఎంత బాగా పాడుతుందో! రోడ్డు మీద వెళుతుంటే వినిపిస్తుంది! అంటూ సుజాతతో స్నేహం చేసిన రేణుక సుజాత ఎంత బాగా ఎంబ్రాయిడరీ చేస్తుందో?! అబ్బ తను వేసే ముగ్గులు ఎంత బావుంటాయో అంటూ మురిసి పోతూ సుజాతని అప్పుడప్పుడు తమ యింటికి లాక్కొస్తూ వుండేది!

స్నిగ్ధంగా మంచులో తడిసిన తెల్ల గులాబీలా వున్న సుజాత కళ్లనీ, పొడుగాటి ఆమె వాలుజడనీ, ఒక్క పిడత లాంటి ఆమె పెదవుల్నీ దొంగతనంగా చూస్తుండేవాడు సత్యమూర్తి

సుజాత మాత్రం ఎప్పుడూ అనవసరపు బిడియాన్ని ప్రదర్శించేది కాదు రేణుకతో ఎంత నిర్మలంగా మాట్లాడేదో సత్యమూర్తితోనూ అంత స్నిగ్ధంగానే మాట్లాడేది ఎప్పుడైనా రేణుక మాటల మధ్యలో లేచి వెళ్లినప్పుడు మరికాస్త చొరవ తీసుకుని సుజాతతో మాట్లాడుతూ వుండేవాడు సత్యమూర్తి

ఇలా కొన్నాళ్ళు గడిచే సరికి సుజాత మీది వ్యామోహం భరించ లేనంతగా పెరిగి పోయింది సత్యమూర్తికి

ప్రతి శనివారం తెలతెలవారుతూ వుండగానే సుజాత తమ ప్రక్క వీధిలోనే వున్న వెంకటేశ్వర స్వామి కోవెలకి వెళుతుందని సత్యమూర్తికి తెలుసు



నెం. 1 గ్రాఫీ

సియోల్ ఒలింపిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన అమెరికాకు చెందిన టాప్ అథ్లెట్ గ్రిఫిత్ జాయనర్ సోవియెట్ వార్తాసంస్థ టాస్ జరిపిన అభిప్రాయ సేకరణలో ఈ ఏటి మేటి అథ్లెట్‌గా ఎంపికయింది. తూర్పు జర్మనీకి చెందిన స్విమ్మర్ క్రిస్టిన్ . ఓట్టోకి రెండో స్థానం, పశ్చిమ జర్మనీకి చెందిన టెన్నిస్ రాణి స్టెఫీగ్రాఫ్‌కి మూడో స్థానం లభించాయి. మొదటి మూడుస్థానాలను మహిళలే గెలుచుకోవడం ఒకవిశేషమని టాస్ అంటోంది-అంతేనా ఈ ముగ్గురూ నాన్ రష్యన్‌లే కావటం మాటేమిటి?

ఒక శనివారం పొద్దున్నే తనూ గుడికి వెళ్ళాడు!

సుజాత అప్పుడే వచ్చి ప్రదక్షిణలు చేస్తోంది!

సత్యమూర్తిని చూసి పలకరింపుగా నవ్వింది! సత్యమూర్తికి కాస్త ధైర్యం వచ్చింది!

"సుజాతా! దర్శనం అయిన తర్వాత వెళ్ళిపోకు! నీతో కొంచెం మాట్లాడాలి!" అన్నాడు ఆమెతో బాటు ప్రదక్షిణ చేస్తూ.

సుజాత ఆశ్చర్యంగా చూసింది! కాని సత్యమూర్తి ఆమె వైపు చూడకుండా గబగబా ప్రదక్షిణ చెయ్యసాగాడు!

ఇద్దరూ విడివిడిగా శివ దర్శనం చేసుకున్న తర్వాత సుజాత సత్యమూర్తి కూర్చున్న చోటికి వచ్చింది.

ఆ తర్వాత యిద్దరికీ జరిగిన సంభాషణ వివరంగా సత్యమూర్తికి జ్ఞాపకంలేదు. కాని సారాంశం గుర్తుంది.

"సుజా, నిన్ను పెళ్ళి చేసుకోవాలని నా కోరిక!" అని సత్యమూర్తి అనగానే, సుజాతలోని కన్నెపిల్ల ముందు సిగ్గు పడింది.

సిగ్గులోంచి తేరుకుని వాస్తవంలోకి రాగానే, "అది ఎలా సాధ్యం సత్యం? మన కులాలు అంతస్తులు రెండూ వేరే నన్న సంగతి మర్చిపోతున్నావా?" అంది.

"అదంతా నా కొదిలెయ్యి! ముందు నీకు నేనంటే యిష్టమేనా చెప్పు!" అన్నాడు పెద్ద హీరోలా మొహంపెట్టి.

సుజాత సిగ్గుగా నవ్వింది. "ఇష్టమే అనుకో...." అంది నసుగుతూ.

"మరింకేం ...." సత్యమూర్తి చప్పున సుజాత చెయ్యి అందుకోబోయాడు.

సుజాత చప్పున వెనక్కి తగ్గుతూ, "నువ్వు అందమైన వాడివి. నువ్వంటే నాకు యిష్టం అంతమాత్రాన మన పెళ్ళి నిశ్చయమైపోయినట్టు కాదు సత్యం!" అంది.

సత్యమూర్తి కాస్త కోపంగా, "అంటే నా మీద నీకు నమ్మకం లేదా?" అన్నాడు.

సుజాత నవ్వింది. "మనుషుల మీది నమ్మకాలతో పనులన్నీ నిర్విఘ్నంగా జరిగి పోయేటట్టుంటే ఈ లోకంలో యిన్ని కష్టాలు వుండేవే కావు! నువ్వు ముందు మీ వాళ్ళతో సంప్రదించు! అన్నింటి కంటె ముందు నువ్వొక ఉద్యోగం సంపాదించుకో! ఆ తరువాత, మీ వాళ్ళను ఒప్పించో, ఎదిరించో నువ్వు నన్ను చేపట్టడానికి సిద్ధ పడితే నేను సమస్త ప్రపంచాన్నీ ఎదిరించి అయినా నీ దగ్గరికి రావటానికి సిద్ధంగా వుంటాను!" అంది.

ఆ తర్వాత కథ మామూలే. సత్యమూర్తికి ముందు ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత అతను సుజాత విషయం యింట్లో ప్రస్తావించటం, యింటిల్లిపాదీ పెదవులు పెడబొబ్బలు, తిట్లు, శాపనార్థాలు. వగైరాలన్నీ పెట్టటం సుజాత విషయమే మర్చిపోయి తమ బంధువుల పిల్లనే చేసుకుంటానని సత్యమూర్తి ప్రమాణం చెయ్యటం యివన్నీ క్షణాల మీద జరిగిపోయాయి.

సత్యమూర్తి ఉద్యోగ రీత్యా వేరే ఊరు వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు కూడా సుజాతని కలుసుకోవాలని ప్రయత్నించలేదు. కొడుకు ఎప్పుడైనా శలవులకి ఆ వూరొచ్చి సుజాతని చూసే అవకాశం కూడా లేకుండా చెయ్యటం కోసం సత్యమూర్తి తండ్రి కూడా వేరే వూరికి బదిలీ చేయించుకున్నారు. తర్వాత సత్యమూర్తి పెళ్ళి కూడా రంగరంగ వైభోగంగా జరిగింది.


మళ్ళీ యిన్నాళ్ళకి చంకలో ఏణ్ణార్థం పసివాడితో సుజాతని యిలా చూడటం అపురూపమైన విషయంలా వుంది సత్యమూర్తికి.

ఈ ఐదేళ్ళలోనూ సుజాత కాస్త ఒళ్ళు చేసి మరికాస్త రంగొచ్చింది! కళ్ళలో అదే నైర్మల్యం! మొగుడు కూడా పెద్ద సంపాదనా పరుడు కానట్టు సుజాత మాటలే చెబుతున్నాయి. మనిషి వేషం కూడా సాదా సీదాగానే వుంది. మెళ్ళో పుస్తెలతాడు తప్పించి ఒంటి మీద చిన్న మెత్తు బంగారం కూడా లేదు.

ఈ ఐదేళ్ళలోనూ తనెంత మారాడో తలచుకున్నాడు సత్యమూర్తి. యిదివరకటి కంటె కాస్త ఒళ్ళు చేశాడు. చిన్న బొజ్జ కూడా వచ్చింది. మిత్రులతో పార్టీలు బాగా అలవాటయాయి. పెళ్ళాంతో దెబ్బలాడి నప్పుడూ, పెళ్ళాం పుట్టింటికి వెళ్ళినప్పుడూ, వెరైటీ కోసమని మగువ, మధువు కూడా బాగా అలవాటుయాయి.

"ఐదేళ్ళ క్రితం కంటె యిప్పుడు నాకు బాగా ధైర్యం వచ్చింది!" అనుకున్నాడు సత్యమూర్తి. ఐదేళ్ళ క్రితం సుజాత చెయ్యి పట్టుకోబోయాడు గానీ యిప్పుడు సుజాత వూహించే లోగా ఆమెని తన కౌగిలిలోనే బంధించగలడు.

ఆలోచనల్లోనే హోటల్ చేరుకుని గేటు దగ్గర నిలబడ్డాడు సత్యమూర్తి. అతని ఆలోచనలు మళ్ళీ సుజాత మీదికే తిరిగాయి. సుజాత ఎందుకు వస్తానంది? ఊరికేనా? హోటల్ రూంకే వస్తానని నిస్సంకోచంగా చెప్పింది. వివరంగా మాట్లాడుతుందిట. ఏం మాట్లాడుతుంది? తన బీద మొగుడితో జీవితం ఉప్పుకారం లేని కూరలా వుండి వుంటుంది. "నిన్నే చేసుకుని వుంటే బావుండేది సత్యం!" అంటుందా?! యిందాక తననీ తన బట్టల్నీ ఎలా చూసిందో?! సుజాత మనసు ఏ కాస్త బైట పడినా, తను యిది వరకులా కాదు. యిప్పుడు సర్వస్వతంత్రుడు. సుజాతని తేలిగ్గా అందుకోగలడు. సుజాత ఒప్పుకుంటే, తను కంపెనీ పని మీద తరచూ యిక్కడికి వస్తూనే



వుంటాడాయె.... వచ్చిన ప్రతి సారీ సుజాతతో.... ఓహ్.... సుజాతకి డబ్బు యిబ్బందీ వుండదు, తనకి సుజాత మీది వ్యామోహమూ తీరుతుంది.

సిగరెట్ చురుక్కు మనటంతో ఈ లోకంలోకి వచ్చాడు సత్యమూర్తి. అతడి మనసు గాలిలో తేలిపోసాగింది.

మరో పావు గంటలో సుజాత రానే వచ్చింది. "చాలాసేపు నిలబడ్డావా, అక్కడ అప్పుడే పది మంది చేరిపోయారు! వెర్రి వెధవ ఏడ్చాడు కూడాను!" అంది కొడుకు బుగ్గలు మృదువుగా నిమురుతూ.

"ఫర్వాలేదులే, రా!" అన్నాడు సత్యమూర్తి లోపలికి దారితీస్తూ.

సుజాత అతని వెనకే నడిచింది.

ఇద్దరూ రూమ్ చేరుకున్నారు!

రూమ్‌బాయ్ చేత కాఫీ, బిస్కెట్లు తెప్పించాడు సత్యమూర్తి.

సుజాత కొడుక్కి రెండు బిస్కెట్లు యిచ్చాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకు సత్యం ?" సుజాత మొహమాటంగా అంది.

"ఫర్వాలేదులే చాలా కాలానికి కలుసుకున్నాం కదా!" కాఫీ కప్పు సుజాత ముందుకి తోస్తూ అన్నాడు సత్యమూర్తి.

సుజాత కాఫీ కప్పు అందుకుంది. "రేణుక బావుందా? పిల్లలెందరు?"

"పెళ్ళయిందా అని అడక్కుండానే పిల్లలెందరని అడుగుతున్నావే?" సత్యమూర్తి నవ్వాడు.

"పెళ్ళి ఎటూ అవుతుందని తెలుసు! మావూళ్ళో వున్నప్పుడే నిశ్చయమైందిగా...."

"ఇద్దరు పిల్లలు. హైదరాబాద్‌లో వుంటోంది!" సత్యమూర్తి చెప్పాడు.

"అది సరే, ఈ ఊరికి నువ్వు తరచూ వస్తుంటావా...."

"ఆఁ.... యించుమించు నెలకి రెండు మూడు సార్లు వస్తాను!"

"ఈ వూళ్ళో చాలా మంది తెలుసా నీకు?"

"ఏదో కొంతమంది తెలుసు! ఏం ఎందుకని....."

"అబ్బే వూరికే అడిగాను.... " అంటూ నవ్వేసి "రేణుకకి నేను గుర్తున్నానా, నన్నెప్పుడైనా తలుచుకుంటుందా?" అంది.

"రేణుకకి అసలు నువ్వెవరో గుర్తుండేగా" అని మనసులో అనుకుంటూ ఆ మాట చెప్పటం యిష్టం లేక, తన పని కూడా కలిసి వస్తుందని, "రేణుక మాటకేం నేను తలచుకుంటున్నాను. నాకు గుర్తున్నావు చాలదూ...." అన్నాడు నవ్వుతూ.

సుజాత అతని వైపు సూటిగా చూసింది. "నీకు అంతగా గుర్తున్నానా?" అంది.

సత్యమూర్తి యింక సందేహించలేదు. "ఎంతలా గుర్తున్నావో చెప్పనా....." అంటూ చెయ్యి జాచ బోయేడు. అతని వూహ కంటే వేగంగా కదిలిన



హరిదాసు
(చిత్రం : దేవుదీక్షితులు)

తెలుగు సంక్రాంతి

ఈరోజు
కొత్త వూపిర్లతో నవనవలాడుతూ
'నా'
ఆశల జీవ జలాలను
సంక్రాంతి విశిష్ట వైభవతను
వేనోళ్ళ చెపుతూ
గొబ్బి పాటల
జాన పద గీతాల
తెలుగింట తెలుగునాడు
తెలుగు గళము
తెలుగు బలము
తెలుగు హలము
తెలుగు కలము
పలుకు తుంది
పరవశపు సంక్రాంతి

–ఉత్పల వరదరాజా

సుజాత మరో కుర్చీలోకి వెళ్ళి కూర్చుంటూ, ఎంత స్పీడుగా వెళ్ళిందో అంత తాపీగా, "ఐదేళ్ళ క్రితం కూడా యిలాగే తొందరపడ్డావు సత్యం!" అంది.

సత్యమూర్తి ఖిన్నుడైపోయేడు.

"నేను నీ రూమ్‌కి వస్తాననగానే నీకు లొంగి పోవటానికే నని నువ్వనుకుంటావని నాకు తెలుసు! ఈ దేశంలో ఆడది మరొక మగవాడితో ఆప్యాయంగా మాట్లాడలేక పోవటానికి కూడా నీలాంటి మగవాళ్ళే కారణం!" అంది.

సత్యమూర్తి మాట్లాడలేదు!

"నువ్వలా అనుకుంటావని తెలిసినా ఎందుకొచ్చేనో తెలుసా?"

ఎందుకన్నట్లు చూసేడు సత్యమూర్తి.

మావారు చేస్తున్నది చాలా చిన్న ఉద్యోగం! బాబు పోషణకి, మాయింటి అవసరానికి ఆయన సంపాదన చాలటం లేదు! నన్నూ, నా కొడుకునీ సుఖపెట్టాలని ఆయన సాయంత్రాలు కూడా మరో చోట రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు! మా కోసం ఆయన కొవ్వొత్తిలా కరిగి పోతుంటే నేనా వెలుగులో సుఖపడలేక పోతున్నాను!" సుజాత కళ్ళల్లో తిరిగిన నీటిని పైట కొంగుతో తుడుచుకుంది. రుద్ధమైన గొంతుని సరిచేసుకుంటూ నవ్వింది. "నేను ప్రైవేట్‌గా బి. ఎ. పాసయాను! టైప్ హయ్యర్ పాసయ్యాను. నువ్వేమో మంచి ఉద్యోగంలో వున్నావు. మీ కంపెనీలో నాకేదైనా చిన్న ఉద్యోగం యిప్పించ గలవేమో నన్న ఆశతో వచ్చాను!" అంది.


సత్యమూర్తి తలెత్తలేక పోయాడు. తన కళ్ళముందే హిమాలయమంత ఎత్తుకి ఎదిగి పోయిన సుజాత ఆ హిమ జలాలతో తన మనసులోని మాలిన్యాన్నంతటినీ కడిగి వేస్తున్నట్లుగా అనుభూతి చెందాడు.

"ఏం, సత్యం? నీకు వీలులేని కోరిక కోరానా? లేక నువ్వు కోరుకున్నది నీకు దక్కలేదని బాధ పడుతున్నావా?"

సత్యమూర్తి చప్పున తలెత్తాడు. "లేదు.... లేదు.... అంతమాటనకు....."

సుజాత నవ్వింది. "మనం మనుషులం సత్యం! భగవంతుడు వివేకమూ, మంచితనమూ, దయా, క్షమా కలబోసి సృష్టించిన జీవులం! భగవంతుడు యిచ్చిన కాళ్ళూ చేతుల్నీ వుపయోగించు కుంటున్నట్లే వాటినీ వుపయోగించు కోకపోతే యింక వాటికి, మన అస్తిత్వానికి విలువేముంది?"

సత్యమూర్తి కూడా నవ్వాడు ఈ సారి వర్షంలో తడిసిన పువ్వులా స్నిగ్ధంగా! "నిజమే సుజా! నా పలుకుబడి నంతటినీ వినియోగించి నీకు ఉద్యోగం వచ్చేలా చేస్తాను! మీ జీవితాలు మరింత సౌఖ్య వంతంగా నడిచేలా చూస్తాను! నీ స్నేహితుడిగా నీకు చెయ్యగలిగినదంతా చేస్తాను!" అన్నాడు ఆత్మ విశ్వాసంతో. ●



(గత సంచిక తరువాయి)

ఆదేమి విచిత్రమో చూడామణితో పరిచయమైన తరువాత సులోచన మనసు తేలిక పడింది. ఆమెను ఆమె ప్రవర్తన చూసిన తరువాత ఆమె మీద ద్వేషం కానీ అసూయగాని కలగటం లేదు సులోచనకు. చూడామణి అందం ముందు తన అందాన్ని పోల్చి చూసుకుంది. మెరుపు తీగ వంటి ఆమె అందం ముందు తను ఎపాటి. ఒక్కసారి చూసిన వాళ్ళకు పదే పదే చూడాలనిపించే ముఖం. ఆమెతో పరిచయమైన వాళ్ళు ఆ పరిచయం పది కాలాల పాటు లతలా [illegible] వర్ధిల్లాలని కోరుకుంటారు. అందానికి తగిన పొందికైన శరీరం, సంస్కారం, సౌజన్యం... ఆమె అందానికి వజ్రాలు పొదిగిన బంగారం [illegible] వన్నె తెస్తున్నాయి.

తనే ఇలా భ్రాంతిలో మునిగిపోతే ఇక మగవాళ్ళ సంగతేమని చెప్పాలి. అందుకే తన భర్త ఆమె అందానికి వివశుడై, [illegible] తను ఓ ఇల్లాలికి భర్తనని, ఇద్దరు బిడ్డలకు తండ్రినని, సమాజంలో తను చులకనై పోతానని తెలిసి కూడా ఆమెను భార్యగా స్వీకరించాడు.

కానీ ఈ నిజం ఆ నిర్భాగ్యురాలికి తెలిసినట్టు లేదు. తెలిస్తే ఆమె గుండె బ్రద్దలవుతుంది. ఆమె అసలే సునిసిత మనస్కురాలి వలె వుంది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? ఆమెను ఆ భగవంతుడే కాపాడాలి!

సులోచన తన ఆలోచనకు తనే నవ్వుకుంది. తన గురించి తన బ్రతుకు గురించి. బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించటం మాని ఒక పరిచితురాలి కోసం, ఆమె భవితవ్యం కోసం ఆరాటపడుతోంది.

ఆమె ఆలోచనల నుంచి తేరుకోకుండానే "సులోచనా! సులోచనా" అంటూ కిషోర్ రానే వచ్చాడు.

"ఏమిటండీ వస్తూనే నామస్మరణ?" అంది నవ్వుతూ. సులోచన ప్రసన్న వదనాన్ని చూసి "అమ్మయ్య ఈ లోకంలో పడింది. ఇక పరవాలేదు" అనుకున్నాడు స్వగతంలో

"ఏమిటి సింహాచలం వెళ్ళావా? దర్శనం బాగా అయిందా?" అన్నాడు.

"బాగానే అయింది. అనుకున్నంత రష్ లేదు."

"దేవుడిని ఏ వరాలు కోరావు?"

"అది రహస్యం ఎవరికీ చెప్పకూడదు" అంది కొంటిగా.

"దేవుడు నీకు ఏ వరాలు ప్రసాదించాడో నాకు తెలియదు గాని, నువ్వు మాత్రం, సంతోషంగా ఎప్పటి సులోచన వలే వున్నావు. గుడికి వెళ్ళకుండానే దేవుడు నాకు కోరుకున్న వరం ప్రసాదించాడు" అన్నాడు.

"నా సుఖసంతోషాల కోసం అంత వర్రీ అయిపోతున్నారా?" అంది. ఆ మాటకు కిషోర్ నొచ్చుకున్నాడు. "అదేం మాట సులోచనా! నీ గురించి నేను కాకపోతే మరెవరు వర్రీ.. అవుతారు" అన్నాడు.

"వట్టినే.. నేను వేళాకోళానికి అన్నాను.. మరీ అంత ఫీల్ కాకండి" అంది సులోచన చిరునవ్వుతో.

"ఇంకా ఏమిటి విశేషం?"

"ఆ! చెప్పటం మరిచాను. అక్కడ ఒకావిడ పరిచయమైంది. సుమారుగా నా వయసే వుంటొచ్చు. ఎంత అందంగా వుందని. చూస్తుంటే ఆడదానికి నాకే అసూయ పుట్టింది."

ఊరకనే అనలేదు. ముందు అసూయ పుట్టి తరువాతే ఆడవాళ్ళు పుట్టారని."

"నేనేం అసూయపడి పోవటం లేదులెండి. ఆవిడతో పరిచయం పెంచుకోవాలని. మంచి స్నేహితురాలిగా వుండి పోవాలని నిర్ణయించుకున్నాను."

"అది నీ సంస్కారానికి గీటురాయి."

"మళ్ళీ ఆదివారం వాళ్ళింటికి వెళుతున్నాను. దొరగారు అనుమతిస్తే... ఆవిడ మరీ మరీ రమ్మని ఆహ్వానించింది."

సులోచన మాటలకు కిషోర్ పడి పడి నవ్వాడు.

"మీ ఆడవాళ్ళకు జోహార్లు. బస్సుల్లోను, ట్రైన్సులోను కలుసుకుని స్నేహితులై పోతారు. ఎంత తొందరగా స్నేహం చేస్తారో అంత తొందరగానే విడిపోతారు" అన్నాడు.

"ఎందుకలా హేళన చేస్తారు. మా స్నేహం అంత తొందరగా విడిపోదు" అంది... 'అది విడదీయటానికి ప్రయత్నించినా విడరాని బంధం' అని లోలోన అనుకుంది.

"ఒకసారి నా మద్రాసు ట్రిప్పులో జరిగిన సంఘటన గుర్తు వచ్చి నవ్వాను."

"ఏమిటది?"

"మద్రాసు నుంచి వాల్తేరు వస్తున్నాను. నేను వున్న ఫస్టుక్లాస్ కాబిన్‌లో నాతో పాటు ఇద్దరు మధ్య వయస్కులైన స్త్రీలు ఎక్కారు. ఆ కేబిన్ మొత్తానికి మేము ముగ్గురమే. సీట్లో కూర్చోగానే పరిచయాలు చేసుకుని వెంటనే స్నేహితులై పోయారు. ఎన్ని ఏళ్ళ నుంచో స్నేహితులైనట్టుగా కబుర్లు మొదలు పెట్టారు. ఒకరి కుటుంబం గాథలు మరొకరికి వినిపించటం, ఎవరి ఆడపడుచుల్ని అత్తగార్లను వాళ్ళు రాక్షసులగా వర్ణించుకుని తిట్టుకుని తృప్తి పడటం. తెల్లవార్లు నన్ను కూడ నిద్ర పోనివ్వలేదు. తెల్లవారి ఏలూరులో దిగి పోవలసి వచ్చింది ఒకావిడ. అప్పుడు చూడాలి వాళ్ళిద్దర్నీ. కావలించుకుని ఏడ్చుకుంటూ విడిపోలేక విడిపోయారు. మళ్ళీ వాళ్ళు జీవితంలో కలుసుకున్నారో లేదో తెలియదు" కిషోర్ చెప్పిన కథ విని సులోచన నవ్వు లేకుండా వుండలేకపోయింది.

"మేము అలాంటి స్నేహితులం కాదులెండి."

"ఇంతకీ ఆవిడ పేరు ఎడ్రసు తెలుసుకున్నావా?"

"మణి అని చెప్పింది."

సులోచన నోట మీద 'మణి' అన్న మాట వినగానే కిషోర్ ముఖం నల్లగా మాడిపోయింది. సులోచన గమనించక పోలేదు.

"వట్టి మణేనా ఇంకా ఏమైనా వుందా?"

"నాగమణి కాబోలు!" భర్త అవస్థ చూసి కావాలనే అబద్ధం చెప్పింది. అతని ముఖంలోకి తిరిగి రక్తం ప్రవహించి వికసించినట్లయింది.

"సరే. ఆ రోజు నేను కూడా ఊళ్ళో వుండనుగా. నీకు కూడా కాలక్షేపం కూడా బాగా అవుతుంది" అన్నాడు కిషోర్.

* * * *

జరిగిన కథ– 7: చూడామణికి మద్రాసులో ఉద్యోగం వస్తుంది. జయంతి భర్త రామచంద్రరావుకు, తనపై కోరిక ఉన్నదని తెలియడంతో చూడామణి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని బొంబాయి వెళుతుంది. అక్కడి నుంచి విశాఖకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. కిషోర్ చూడామణిని రహస్యంగా పెళ్ళి చేసుకుంటాడు. సులోచనకు చూడామణికి అనుకోకుండా పరిచయమవుతుంది.

ఆదివారం ఎనిమిది గంటలకే చూడామణి తలంటు పోసుకుని, పూజ ముగించింది... వచ్చే గెస్టుల కోసం టిఫిన్‌లు చేసి రెడీగా వుంచింది. దగ్గరలో వున్న స్వీట్ స్టాల్ నుంచి రెండు రకాల స్వీట్లు తెచ్చి రెడీగా వుంచుకుంది. అనుకున్న టైము కంటే ముందుగానే ఎల్లల్ని ఇద్దర్ని వెంట బెట్టుకుని ఆటోలో దిగింది సులోచన. చూడామణి వాకిట్లో ఆటో ఆగిన శబ్దం విని బయటకొచ్చి సులోచనను రిసీవ్ చేసుకుంది.

"మీరు నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు చాల థాంక్సు" అంది చూడామణి.

"దానికి థాంక్సు చెప్పటం ఎందుకు మనిద్దరం స్నేహితురాళ్ళం" అంది సులోచన.

చూడామణి సురేష్‌ను ఎత్తుకుని లోపలికి నడిచింది.

"వీడిని మీరు చూడలేదు కదూ మా పెద్దవాడు రమేష్. ఒరేయ్ రమేష్ ఆంటీకి గుడ్‌మార్నింగ్ చెప్పు" అంది సులోచన.

"గుడ్‌మార్నింగ్ ఆంటీ" అన్నాడు.

రమేష్ చిన్నారి చేతులను దగ్గరకు తీసుకుని ముద్దాడింది చూడామణి.

"మీకు ఎల్లలంటే చాలా సరదాలాగుంది?"

"సరదా కాదు. ప్రేమ.. చిన్నప్పటి నుంచి ఏ అనురాగానికీ నోచుకోని జన్మనాది.

ఇద్దరూ లోనికి వెళ్ళి కూర్చున్నారు చూడామణి ఫలహారాల ప్లేట్లు తెచ్చి ముందు పెట్టి "మీరు టిఫిన్ చేస్తూ వుండండి. నేను ఈలోగా కాఫీ కలిపి తెస్తాను" అని వంటింట్లోకి నడిచింది.

"చుప్ రే! ఇన్ని రకాలే..." అంది సులోచన.

"ఫరవాలేదు వంటయ్యేసరికి అలస్యం అవుతుంది. మీ భోజనం కూడా ఈ వేళ ఇక్కడే" వంట ఇంట్లోంచే సమాధానం ఇచ్చింది. సులోచన గదంతా పరిశీలించింది. డబల్ కాట్ బెడ్, సోఫా సెట్టు, టు. ఇన్. వన్, టి. వి. అన్నీ చక్కగా పొందికగా అమర్చి వున్నాయి. గది చిన్నదయినా చాలా అందంగా తీర్చిదిద్దింది.

అనుకోకుండా ఆమె దృష్టి టేబిల్ మీద ఫ్రేమ్‌లో బిగించబడిన చూడామణి పెళ్ళి ఫోటో మీద కెళ్ళింది. తను ఆ రోజు ఆయన కోటు జేబులో చూసిన ఫోటో కాపీ అది. దాన్ని చూడగానే తుళ్ళి పడింది సులోచన. రమేష్‌కు ఊహ వస్తున్నది ఫోటోలో వున్న తనతండ్రినిగుర్తించి "డాడీ! డాడీ" అని ఎక్కడ గోల చేస్తాడోనని. వెంటనే అక్కడ నుంచి లేచి ఆ ఫోటో డైరక్షన్ మార్చింది పిల్లల కంటబడకుండా.

అంతలో చూడామణి వంటింట్లోంచి రానే వచ్చింది" అది మా పెళ్ళి ఫోటో" అంది.

"చూశాను. మీ వారు చాల అందంగా వున్నారు" అంది సులోచన. చూడామణి సిగ్గు పడింది.

"అఫ్ కోర్సు మీ కంటే అందంగా మాత్రం కాదు లెండి" అని మరో కామెంట్ పాస్‌చేసింది.

పిల్లలిద్దరూ మంచం మీదికి ఎక్కటం దుమకటం సోఫా చుట్టూ పరుగులు తీయటం. కొత్త చోటు వాళ్ళకు చాలా ఆనందంగా వుంది. సులోచన పిల్లల్ని కోప్పడింది.

'వాళ్ళను ఏమీ అనకండి. పిల్లలు అల్లరి చేస్తేనే ఆనందం, ముచ్చట" అంది చూడామణి.

టిఫిన్ల కార్యక్రమం పూర్తయింది. చూడామణి టి. వీ ఆన్ చేసింది ఏదో కార్టూన్ స్టోరీ వస్తోంది పిల్లలిద్దరూ బుద్ధిగాకూర్చుని చూడసాగారు.

"మీ పెళ్ళి ఎక్కడ జరిగింది?" సులోచన అడిగింది.


"సింహాచలంలో."

"చాలా ఘనంగా జరిగి వుండాలి?"

"లేదండి. చాల గోప్యంగా రహస్యంగా జరిగింది పెళ్ళయినా ఇద్దరం భార్యాభర్తల వలే బయట ఫ్రీగా కూడా తిరగలేకపోతున్నాం." చూడామణి చాలా బాధపడుతున్నట్టుగా ముఖం పెట్టింది.

"అదేమిటి?"

"మాది కులాంతర వివాహం. మా వివాహం వాళ్ళ తల్లికి ఇష్టం వుండదని. ఎదిరించి చేసుకోవటానికి ఆమె ఆరోగ్యం కూడా బాగా లేదట బ్లడ్ ప్రెషర్, హార్ట్ ఎటాక్, సుగర్ కంప్లయింట్ అన్నీ వున్నాయట. ఈ విషయం ఆవిడకు తెలిస్తే ఆమె గుండె పగిలి చనిపోతుంది. మా పెళ్ళి వృద్ధురాలైన ఆమె మరణానికి కారణం కాకూడదని రహస్యంగా వుంచమన్నారు ఆమెకు ఆరోగ్యం కుదుట పడిన తరువాత నచ్చ చెప్పి తనే తన తల్లికి పరిచయం చేస్తానన్నారు '



హౌస్ వైఫ్

సులోచన ఆమె చెప్పిన మాటలు విని ఆవాక్కయిపోయింది ఆడది అబద్ధం ఆడితే గోడ కట్టినట్టు వుంటుందంటారు అలా అన్న వాళ్ళు నిజంగా మూర్ఖులు ఒక అమాయికమైన ఆడపిల్లను మభ్య పెట్టి మోసగించి తన స్వార్థానికి ఉపయోగించుకోవటం కోసం ఆమె జీవితంతో ఆటలాడుకునేందుకు మగవాడు ఆడే అబద్ధాలు కాంక్రీటుతో పునాది వేసి ఎన్నటికీ కూలిపోని కాంక్రీటు స్తంబాల వంటివి సులోచనకు అప్రయత్నంగా కళ్ళనీళ్ళు తిరిగాయి చూడామణి గమనించకుండా ముఖం పక్కకు తిప్పుకుని తుడుచుకుంది

'మరి మీ వాళ్ళు కూడా ఎవరూ పెళ్ళికి రాలేదా?

నా అనేవాళ్ళు ఎవరూ నాకు లేరు చిన్నప్పుడె తల్లి చనిపోయింది నాటితో తండ్రికూడా ఆమెను అనుసరించాడు ఉన్న ఒక్క అన్నా ఇల్లు వదిలి దేశాలు పాలయ్యాడు వాడు ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో తెలియదు అందుకే నా అనే వాళ్ళు లేక ఆత్మీయతకు అనురాగానికి ముఖం వాచి వున్నాను సాధారణంగా ఎవరి తోటీ పరిచయం పెంచుకోను స్నేహం చేయను కాని మిమ్మల్ని కలసిన క్షణం ముహూర్తబలం ఏమిటో ఏదో తెలియని ఆత్మీయత పెనవేసుకుపోయింది అందుకే మిమ్మల్ని వదల లేకుండా వున్నాను మీ స్నేహంతో నా జీవితంలోకి ఏదో కొత్త వెలుగు ఊపిరి వచ్చినట్లయింది చూడామణికి కళ్ళనీళ్ళు ఎంత ప్రయత్నించినా ఆగటం లేదు

చేతగానితనం

ఊటలు సెలయేర్లవుతూ
నన్ను చూసి ముసి ముసిగా నవ్వాయి
సెలయేర్లు కాలువలవుతూ
పంటలు పండించుకోమన్నాయి
కాలువలు నదులవుతూ
డాములు కట్టించుకోమన్నాయి
నదులు సముద్రంలో కలుస్తూ
నన్ను చూసి అపహాస్యం చేశాయి!

అడిగోపుల వెంకటరత్నమ్

సులోచన ఆమె జీవిత గాధకు ఆత్మీయతకు ఆకులా చలించిపోయింది ఆమెలో ఏదో ఆవేశం ఆవహించింది చూడామణి రెండు చేతులు దగ్గరకు తీసుకుని కళ్ళనీళ్ళు తుడిచింది "ఈ క్షణం నుండీ నువ్వు నాకు కేవలం నా స్నేహితురాలివి మాత్రమే కాదు సోదరివి నీకు అభ్యంతరం లేకపోతే చెల్లీ అని పిలుస్తాను అంది

"అంత కన్నా భాగ్యమా! అక్కా" అంది చూడామణి

'చెల్లీ! ఈ పెళ్ళిలో ఏదైనా మోసముందేమోనని సందేహం కలుగలేదా నీకు '

లేదు. ఆవగింజంత అనుమానం కూడా కలుగలేదు ఆయన అలాంటి వారు కాదు ఆయనను చాలా కాలం నుంచి గమనిస్తున్నాను సత్ప్రవర్తనకు, సచ్ఛీలతకు పెట్టింది పేరు" అంది చూడామణి నమ్మకంగా

ప్రతీ ఆడదీ అలాగే అనుకుని పొరబడుతూనే వుంటుంది తన భర్త శ్రీరామచంద్రుడనీ, తనను తప్ప పరాయి స్త్రీని కన్నెత్తి చూడడనీ అనుకుంటూ తనను తాను మోసం చేసుకుంటూ భ్రమలో వుండిపోతుంది కానీ మగవాడి జీవితం విశాలమైనది ఇంటిలో కంటే బయటే ఎక్కువ కాలం గడుపుతాడు అనేక రకాల పరిచయాలు స్నేహాలు ఏర్పడుతాయి కానీ ఆడ జీవితం వేరు తాను గీసుకున్న పరిధిలో తను వుండిపోతుంది. తన ఇల్లు భర్త, పిల్లలు, సంసారం అనే పరిధిలోనే 'లిమిటెడ్' అయిపోతుంది అందుకే ప్రతీ భార్య తన భర్త శ్రీరామచంద్రుడనే భ్రమలోనే వుండిపోతుంది ఆ భ్రమలో వుండటమే ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీకి మంచిదేనేమోననిపించింది సులోచనకు.

"మీ వారి మీదున్న నమ్మకానికి నాకు చాల

[illegible]


రజని (శశికళ)


2. సిల్క్ స్మిత


3. కె. ఆర్. విజయ


4. సరిత


5. శారద


6 అంబిక


7. రాధ


8. రాధిక


9. అనూరాధ

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన ఆముదము



అమృతాంజన్ లిమిటెడ్ 42-45, లజ్ చర్చ్ రోడ్డు, మద్రాసు 600 004

Amrutanjan Limited

753-TG

హౌస్ వైఫ్

సంతోషంగా వుంది" చూడామణి తిరిగి అదే ప్రశ్న వేసింది "మీ వారి మీద నీకు అంత నమ్మకం లేదా అకా అంది.

"ఎందుకు లేదు. నీ కంటే ఎక్కువగానే నాకు నమ్మకముంది. ఆ నమ్మకమే లేకపోతే సంసారంలో సుఖం ఎక్కడ వుంటుంది?" అంది సులోచన.

"మరి మీ వారు రోజూ వస్తూ వుంటారా?" తిరిగి సులోచనే అడిగింది.

"రోజూ రారు. వారి తల్లికి అనుమానం కలుగకుండా వారానికి ఏ రెండు రోజులో వచ్చి నాతో గడుపుతారు" చూడామణి చెప్పింది.

ఆ రోజు చూడామణి ఇంటనే భోజనం చేసి సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరింది. చూడామణి జంక్షన్ వరకూ వచ్చి సులోచనను పిల్లల్ని ఆటో ఎక్కించింది.

"తప్పక ఆదివారం మా ఇంటికి వస్తావుగా చెల్లీ!" అంది సులోచన.

"తప్పకుండా! ఆ రోజున మా వారు కూడా ఆఫీసు పని మీద మద్రాసు వెళతారు" అంది చూడామణి.

ఆటో కదిలిపోయింది. కనుదూరమయ్యే వరకూ సులోచన చేయి ఊపుతూనే వుంది.

* * * *

"రాణీగారు నిన్నంత స్నేహితురాలితో గడిపినట్టున్నారు. ముఖం వెలిగిపోతోంది" అన్నాడు అప్పుడే క్యాంపు నుంచి వచ్చిన కిషోర్.

"అవును చాల సరదాగా గడిచిపోయింది" అంది సులోచన.

"అంత సరదాగా గడిచిందా. నన్ను కూడా మరిచిపోయినట్టున్నావు?"

"ఆమెను విడిచి రావటం కష్టమనిపించింది."

"పాపం అక్కడే వుండిపోలేకపోయావా? అంత కష్టమైతే.." నిష్ఠూరంగా అన్నాడు కిషోర్.

"నిజమేనండి. ఈ కొద్ది పరిచయంలో నే నాకు ఆత్మీయురాలైంది. నన్ను 'అక్కా' అని ఎంతో ఆత్మీయంగా పిలిచింది."

"అప్పుడే వరసలు కూడా కలిపేసుకున్నారన్న మాట. నీ మనసును ఆకట్టుకున్న నీ చెల్లెల్ని ఒక్కసారి చూపించు."

"సమయం వచ్చినప్పుడు తప్పక చూపిస్తాను. ఆమె ఎంత సౌందర్యవతో మీ కళ్ళతో నే చూద్దురు గాని."

"అంత అందగత్తా..?"

"ఆమె అందానికి ఎంతటి మగవాడైనా సరే పాదాక్రాంతుడు కావల్సిందే."

"నేను మాత్రం కాను. ఎందుకంటే నా కంటికి నీవు తప్ప మరో స్త్రీ అందం నన్ను ఆకర్షించలేదు" అన్నాడు.

సులోచన చిరునవ్వు నవ్వింది హేళనగా! "పాపం శ్రీరామచంద్రులు" అంది.

"ఏం నీకు అనుమానమా! నా గుండెల మీద తలపెట్టి చూడు. నా గుండె చప్పుడు కూడా సులోచనా, సులోచనా' అని ఆక్రందిస్తుంది అన్నాడు.

"ఆ యుగంలో శ్రీరామచంద్రుడు ఈ యుగంలో శ్రీశ్రీ కిషోర్‌బాబు ఏకపత్నీవ్రతులన్న మాట' సులోచన చిలిపిగా నవ్వింది.

సులోచన పైకి చిరునవ్వుతో వున్నా లోలోన భర్త ఆడుతున్న నాటకానికి, అందమైన మోసానికి మంటలు రగులుతున్నాయి. కానీ ఈ నాటకం ఎంతో కాలం సాగదు ఏదో ఒక రోజున తెరపడి తీరుతుంది నిజం బయటపడకమానదు అప్పుడు అగ్నిపర్వతం బ్రద్దలవుతుంది. ఆ జ్వాలల్లో ఎవరో ఒకరు ఆహుతి కాక తప్పదు

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ అప్పుడే సీరియస్ అయిపోయావు."

'ఆవిడ ఆదివారం మన ఇంటికి వస్తోంది నేనే ఆహ్వానించాను. ఏ రకం చీర కట్టుకుందామా అని ఆలోచిస్తున్నాను."

"అబ్బ! మీ ఆడవాళ్ళకు చీరల గురించి ఆలోచించటమే పెద్ద సీరియస్.." అన్నాడు


'ఆ రోజు మీరు కూడా ఇంటి దగ్గర వుండండి."

'సారీ సరిగ్గా ఆ రోజునే నాకు మద్రాసులో బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ మీటింగ్ వుంది. ఇంపార్టెంటు ఇన్ఫర్మేషన్ తీసుకెళ్ళాలి. నీ స్నేహితురాలిని మరో సారి పరిచయం చేద్దువు గాని లేవోయ్" అన్నాడు

(ఇంకా ఉంది)

సందేహం

రూపు లేనివనిత యాధి పతివ్రత
నీటులేని వాడు పోటు బంటు
తెలుపవచ్చువాడు దేవతాబంధువౌ
విశ్వదాభిరామ వినురవేమ.



11 మనశాస్త్రవేత్తలు

గణించదగ్గ విహంగశాస్త్రవేత్త జహంగీరు!

కళా పోషకులుగా, రాజనీతిజ్ఞులుగా, పరిపాలనా దక్షులుగా, సామాజిక సంస్కరణాభిలాషులుగా మొగలాయి ప్రభువుల గురించి చెప్పుకుంటామే కాని మూర్తీభవించిన శాస్త్రవేత్తలు కూడా వారిలో ఉన్నారని ఎక్కువగా చెప్పుకోము.

సాహసిగా, కళా పిపాసిగా, ప్రేమికుడిగా, పరిపాలకుడిగా జహంగీర్ చక్రవర్తిని గురించి చరిత్రకారులు పదే పదే చెబుతారు కాని ప్రకృతి పరిశీలకుడిగా జీవశాస్త్రజ్ఞుడిగా నిత్య పరిశోధకుడిగా సత్యసంశోధకుడిగా ఆయనకు ఉన్న స్థానం గురించి మాత్రం పెద్దగా చెప్పరు. దీనికి కారణాలు ఏవైనా జీవశాస్త్ర వేత్తగా జహంగీర్ చక్రవర్తికున్న స్థానాన్ని మాత్రం ఎవరూ కదలించలేరనేది విస్పష్టం.

ప్రముఖ విహంగ శాస్త్ర నిపుణుడు స్వర్గీయ సలీమ్ అలీ మాటల్లో చెప్పాలంటే జహంగీర్ పొందుపరచిన ఆలోచనలు, నివేదికలు, శైల వర్ణ చిత్రాలు ఆయన కాలం నాటి భారతీయ జీవశాస్త్ర చరిత్రను తెలుసుకోవడానికి ఎంతయినా సహకరిస్తాయి" అనే చెప్పవలసి వస్తుంది.

మొగల్ ఆస్థాన వేటగాడు ఒక రోజున ఒక పక్షిని తీసుకొని వచ్చి ఆ పక్షి ఆడదో, మగదో సరిగ్గా తెలియడం లేదని- ఆ పక్షిని చూచి అది ఏ పక్షో చెప్పవలసిందిగా జహంగీర్‌ను కోరాడట. జహంగీర్ చిరునవ్వుతో ఆ పక్షిని తీసుకుని రెండు, మూడు క్షణాలు పరిశీలించి "ఇది ఆడపక్షి" అని గిరిగీచినట్లు చెప్పాడట. ఆయన చెప్పింది నిజమో, కాదో తెలుసుకోవడం కోసం ఆ పక్షిని కోసి చూడడం కూడా జరిగిందట. ఆ పక్షి గర్భకోశంలో గుడ్లు బయట పడడంతో అది ఆడపక్షే అని తేలిపోయిందట. చక్రవర్తి ఈ విషయాన్ని ఎలా గుర్తించగలిగారని ఆ వేటగాడు అడిగితే "ఏముంది. పక్షి ముక్కును బట్టి చెప్పాను. సన్నగా, చిన్నదిగా ఉండడం వల్ల ఆడపక్షే అని చెప్పాను" అని సమాధానం చెప్పాడట జహంగీర్ చక్రవర్తి. ముక్కు ద్వారా పక్షుల సెక్స్‌ను నిర్ణయించడం ఆధునాతన పద్ధతి అని అనుకుంటున్న వారికి ఈ సంఘటన ఎంతయినా విస్మయాన్ని కలిగించవచ్చు. ఈ విషయం నిత్యం ఎన్నో వ్యవహారాలతో సతమతమై పోతూ ఉండే జహంగీర్ చక్రవర్తికి తెలియడం మరింత ఆశ్చర్యంగా తోచవచ్చు. విహంగశాస్త్ర నిపుణులలో జహంగీర్ కూడా గణించదగ్గ వాడు అని నేడు శాస్త్రవేత్తలే అంగీకరిస్తున్నారు.

ఆగస్టు 30, 1569 న మొగలాయి ప్రభువుల్లో ఎదురులేని వాడని ప్రశంసించబడుతున్న అక్బర్‌కు, అంబర్ రాజపుత్ర ఆస్థానాధీశుడు రాజా భర్ మల్ కూతురుకు జన్మించిన వాడు జహంగీర్ అని చరిత్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అక్టోబర్ 24, 1605 న గద్దె ఎక్కిన జహంగీర్ అక్టోబర్ 28, 1627 న మరణించే వరకు- ఎన్నో రకాల రాచ కార్యాలతో విసిగి వేసారి పోతున్నా- జీవశాస్త్రాధ్యయనాన్ని మానకపోవడం వల్లే ఆయనలో ఉన్న శాస్త్రవేత్త నేటికీ నిలిచి పోగలిగాడని చెప్పవచ్చు. ఆయన పరిశీలనలన్నీ "తుజుక్-ఇ- జహంగీరి" గ్రంథంలో కొంతవరకయినా పొందుపరచబడి ఉన్నాయి.

వృక్షాలను, జంతువులను, పక్షులను- ఎంతో నిశితంగా జహంగీర్ పరిశీలించే వాడు. ఫ్లోరి కెన్, డిప్పర్, గద్దలా కనిపించే కోకిల, ఒక రకం పిల్లి, ఒక జాతి కోతి- వీటి గురించి సమగ్రమైన వివరణలను జహంగీర్ ఇచ్చాడు. ఏనుగులలో గర్భధారణ జరిగాక ప్రసవమయ్యే వరకు తీసుకునే వ్యవధి రమారమిగా 18 నుంచి 19 మాసాల వరకు ఉంటుందని ప్రాయోగికంగా తప్పు లేకుండా చెప్పిన వాడు జహంగీరే. ఈ విషయం 19 వ శతాబ్దం మధ్యకాలం వరకు కూడా జంతు శాస్త్రజ్ఞులకు కచ్చితంగా తెలియకపోవడం చిత్రంగానే అన్పిస్తుంది.

పక్షులలో ప్రేమానురాగాలు ఉంటాయని చెప్పిన తొలి వ్యక్తి కూడా ఈయనే. పరిశీలనలు జరిపి వాస్తవాన్ని రాబట్టి విషయాన్ని కూడగట్టడం వల్ల ఈయన మాటలు శాస్త్రీయ సత్యాలుగా జీవం పోసుకోగలిగాయి. ఆడ, మగ పక్షులకు కేవలం గుడ్ల మీద, తమ పిల్లల మీదే కాకుండా పరస్పరం కూడా వాత్సల్యాభిమానాలు ఉంటాయని నిరూపించాడు.

జహంగీర్ ఎన్నో ప్రయోగాలు చేసాడు. అహమ్మదాబాద్‌లోని వాతావరణం కన్నా మహమ్మదాబాద్‌లోని వాతావరణం ఆరోగ్యకరమైందని ప్రయోగ పూర్వకంగా నిర్ధారించాడు. సూర్య, చంద్ర గ్రహణాలపై నిర్దుష్టమైన పరిశీలనలను కూడా ఈయన చాలానే నిర్వహించాడు. తోక చుక్క వెలిసినప్పుడు దాని తోక భాగం పెరుగుదల,తగ్గుదల గురించి ఎంతో కూలంకషంగా చర్చించాడు. జునిపెర్, పైన్ వంటి వృక్షాలను మైదానాల్లో పండించాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈయన సూచించాడు. వాటిని పెంచి తన సూచనలు విలువైనవని కూడా నిరూపించుకున్నాడు.

అరుదైన పక్షులు, జంతువులు కనిపించినప్పుడు వాటి బొమ్మలను గీయించి పెట్టేవాడు జహంగీర్.



జహంగీర్ చక్రవర్తి

ఈయన గీయించిన ఎన్నో బొమ్మలు - మొక్కలు, పువ్వులు, వృక్షాలకు సంబంధించినవి- మన దురదృష్టవశాత్తూ మనకు లభ్యం కాకుండా ఉన్నాయి. ఐవనోవ్ అనే రష్యా దేశపు శాస్త్రవేత్త 1958 లో డోడో పక్షి బొమ్మను గుర్తించినప్పుడు శాస్త్రలోకం ఎంతగానో స్పందించింది. ఈ డోడో పక్షి మూడు శతాబ్దాల కితమే విలుప్తమైనట్టిది. చిత్రమేమిటంటే నేడు సోవియెట్ అకాడమి ఆఫ్ సైన్సెస్ వారి దగ్గర ఉన్న డోడో చిత్రం జహంగీర్ ఆస్థాన చిత్రకారుడు ఉత్సద్ మన్సూర్ వేసిందేనని తేలిపోయింది. 1624 లోనే డోడో పక్షికి సంబంధించిన పరిజ్ఞానం జహంగీర్‌కి తెలుసునన్న విషయం కూడా స్పష్టమైంది. ఇది మనకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు కాని వన్యప్రాణి సంరక్షణా కేంద్రాన్ని కూడా స్వంతంగా నిర్వహించిన జహంగీర్ చక్రవర్తికి ఒక లెక్కలోకి రాకపోవచ్చు.

ఇలాగ జీవశాస్త్ర చరిత్రలో జహంగీర్ చక్రవర్తి స్థానం, డోడో పక్షి స్థానం చెక్కుచెదరకుండా నిలిచే ఉంటాయని చెప్పడానికి ఎవరూ సందేహపడనక్కరలేదు.

–డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

డోడో పక్షి (మధ్యలో ఉన్నది) వర్ణచిత్రం



సౌందర్యదీపం

చల్లా ఝాన్సీరాణి



చలికాలంలో శరీరంలో ఉండే నూనె గ్రంధులు సరిగా పని చెయ్యకపోవడం వల్లనే పగుళ్ళు – దురదలు వస్తాయి అలాగే శరీరంలోని సన్నటి రక్తనాళాలు కూడా చలికి బిగుసుకు పోయినట్లుయి రక్తప్రసరణ సరిగా జరగదు. అందుకే వ్యాయామం చాలా అవసరం

ముఖసౌందర్యానికి కొన్ని ఎక్సర్సైజులు.

రోజూ స్నానానికి ముందు కోల్డ్‌క్రీంనో– లేదా ఆలివ్ ఆయిల్‌నో– ఏదో ఒక నూనెని ముఖానికి పట్టించడం మంచిది కోల్డ్‌క్రీం రాసుకుని ఎండలోకి వెళ్ళకూడదు కేవలం రాత్రుళ్ళు – ఇంట్లో ఉన్నప్పుడు మాత్రమే దీన్ని వాడాలి ముఖానికి ఎక్సర్సైజు చేసేటప్పుడు డ్రైగా లేకుండా ఏదో ఒక కీం పాలమీగడయినా ఫర్వాలేదు ముఖానికి రాసుకోవాలి

1 నోటిని బాగా తెరిచి నాలుకని గుండ్రంగా పెదవులకి అంటేలా తిప్పండి

2 కళ్ళని గట్టిగా మూయండి ఆ తర్వాత మీ రెంత వెడల్పుగా కళ్ళని తెరవగలరో అంత వెడల్పుగా తెరవండి

3 కనుబొమల్ని బాగా పైకెత్తి కిందికి దించండి

4 ముఖంలోని కండరాల్ని కొంచెంగా బిగబట్టి– ఇఇ, ఎ, హెచ్, ఓఓ అని సాధ్యమైనంతగా నోటిని సాగదీస్తూ అనాలి

5 అద్దం ఎదురుగా నిటారుగా కూర్చుని మెడ బాగా వెనక్కి వంచి పైన సీలింగ్‌కేసి చూడండి మెడని అలాగే వెనక్కే ఉంచి మెల్లగా పక్కకి వంచి మీ ఎడం భుజాన్ని చూడండి మళ్ళీ మెడని మధ్యలోకి తెచ్చి మీ కుడి భుజాన్ని చూసుకోండి ఆ తర్వాత తలని తిన్నగా పైకెత్తి మళ్ళీ వెనక్కి వంచండి. ఇలా రోజూ చేస్తే డబుల్‌చిన్ (గడ్డం కింది ముడతలు) పోతుంది

6 బుగ్గల నిండా గాలి తీసుకుని దాన్ని బయటికి రాకుండా కుడి నుంచి ఎడమ – ఎడమ నుంచి కుడికి మెల్లగా మార్చాలి ఇలా ఓ పదిసార్లు చెయ్యాలి.

7 అద్దం ముందు కూర్చుని పళ్ళు బిగబట్టి పెదవుల్ని సాధ్యమైనంతగా తెరవాలి. అలా ఒకటి నుంచి ఆరువరకూ అంకెలు లెక్క పెట్టి వదిలెయ్యండి ఇలా అయిదు సార్లు చెయ్యండి

8 నాలుకతో మీ ముక్కుని అందుకునే ప్రయత్నం చెయ్యండి – కొద్దిసేపు

9 పెదవుల్ని మూసి బాగా సాగదీస్తూ నవ్వండి తర్వాత నోటిని సున్నాలా(ం షేప్) చుట్టండి

10 అద్దం ముందు కూర్చుని పెదవుల్ని మూసి కుడివేపుకి ఎత్తి (ఓ వక్కగా నవ్వినట్టు) మళ్ళీ మామూలు చేసి – ఎడం వేపుకి ఎత్తండి ఇలా ఐదుసార్లు చెయ్యాలి ఈ ఎక్సర్సైజ్ వల్ల బుగ్గలు పల్చబడతాయి

11 బొటన వ్రేళ్ళతో కళ్ళ కిరుపక్కలా ఉన్న ముక్కు పైభాగాన్ని పట్టుకుని– ముక్కు ఎముకకేసి కొంచెం గట్టిగా నొక్కండి

12 మెడకాస్త పైకెత్తి నోరు తెరవండి మళ్ళీ మెల్లగా మూయండి గడ్డం కింది ముడతలు తగ్గుతాయి ●

ఎవరు శాసించిన శిక్ష!

కుసుమరాజు వెంకట మహాలక్ష్మి

"లతా! యివిగో - సంతకాలుపెట్టు" అన్నాడు హేమంత్.

ఆ పిలుపుకి వులిక్కిపడిన లత వెర్రిదానిలా భర్తని చూస్తూ అతనందిస్తున్న కాగితాల్ని అందుకుంది.

"నీ పేర బ్యాంకిలో యాభైవేల రూపాయలు వేసాను. అదికాక నెలనెలా నీ తిండికి, యితర ఖర్చులకి ఎంతకావాలో చెప్పు - పడేస్తాను. ఈ కాగితాలమీద సంతకాలు పెట్టావంటే నా వరపతి వుపయోగించి నీ కేంకావాలన్నా చేస్తాను" అంటూ ఠీవిగా నిల్చబడి అడుగుతున్న హేమంత్‌ని సూటిగా చూడలేక తల దించుకుని లోపలికెళ్ళిపోయింది లత.

కట్టలు తెగిన గోదావరిలా పొంగుకొస్తున్న కన్నీటిని ఆపుకోలేక వెగుపులు. ఏడుపు పైకి వినపడకుండా కొంగు నోట్లో కుక్కుకుని కుమిలిపో సాగింది లత.

ఓదార్చేవాళ్ళూ, వూరుకోబెట్టేవాళ్ళూలేని ఆ కొంపలో తనని తనే ఊరడించుకుని, హేమంత్ యిచ్చిన కాగితాలని తీసి చదవసాగింది. లత.

అది లాయర్‌చేత రాయించుకొచ్చిన విడాకుల నోటీసు.

దేశంలో ఎందర్నో విడాకులు తీసుకున్నవారిని చూసింది. కానీ తనకేసు మాత్రం చాలా విచిత్రమైంది.


పెళ్ళయిన కొత్తలో లతా, హేమంత్‌లని చూసినవారు మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనేవారు. ఆ దంపతుల అందచందాలు, అన్యోన్యతచూసి ఆనందించేవారు కొందరయితే, అసూయపడేవారు మరి కొందరుండేవారు. ఆ దాంపత్యాన్నిచూసి ఓర్వలేనివారిలో నేనూ వున్నానంటూ అగ్నిహోత్రుడు ఓరోజు వంట చేస్తున్న లతని ఆక్రమించుకుని మాంసం ముద్దని చేసినాడు. కొద్దినెలలపాటు ఆసుపత్రిలో వున్న లత ఆకారం మారిపోయి ప్రాణాలతో మాత్రం తిరిగొచ్చింది. శరీరమంతా ముడుచుకుపోయి, కాలిపోయిన మచ్చలతో వికృతంగా తయారయింది. వేలకివేలు ఖర్చుపెట్టి ఎంతో బాధ్యతగా వైద్యం చేయించి, బ్రతికించి యింటికి తీసుకొచ్చిన భార్యతో మాత్రం యిదివరకులా వుండలేకపోతున్నాడు హేమంత్. ఈ సంఘటన జరిగిన కొద్దికాలం తరవాత తీసుకున్న నిర్ణయానికి ఫలితమే ఈ విడాకులు.

'నా భార్య అంటే నా హోదాకు తగినట్లు వుండాలి. పార్టీలకి, ఫంక్షన్లకి వెంట తీసుకువెళ్తే నిన్ను నలుగురూ చూసి 'హేమంత్‌కి తగిన భార్య' అని అనాలి. నీ యీ అనాకారత్వాన్ని ఏ ఒక్కరూ సానుభూతితో గానీ, జుగుప్సతో గానీ చూస్తే నేను సహించలేను. నిన్ను నా వెంట తీసుకెళ్తే, వాళ్ళు నిన్నుచూసే ప్రత్యేకమైన చూపుల్ని చూస్తూ నేను తట్టుకోలేను. కాబట్టి నేను నీతో కాపరం చెయ్యలేను." అన్న హేమంత్ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ మాటల్ని అమలుపరుస్తూ గత కొద్దిరోజులుగా తనతో కారులో రోజూ ఓ అమ్మాయిని తీసుకొస్తున్నాడు. తనఎదుటే వాళ్ళిద్దరూ చనువుగా మసలడం సహింపరానిదయింది. ఇద్దరూ సినిమాలకి, షికార్లకి తిరగడమే కాకుండా త్వరలో పెళ్ళిచేసుకోబోతున్నట్లు కూడా నిర్భయంగా చెప్పిన హేమంత్ మాటల్ని మూగదానిలా వింది.

లత ఆలోచనలు ఒకసారిగా కొన్నేళ్ళ వెనక్కి పరిగెత్తాయి.

జ్ఞానంలేని వయసులో తల్లిని పోగొట్టుకున్నా, ఆ లోటుని కనపడకుండా తండ్రి లతని అరిచేతుల్లో పెట్టుకు పెంచిపెద్దచేసాడు. ఆమె ఆడింది ఆట, పాడింది పాటగా సాగిన ఆమె జీవితంలో ఎన్నడూ దేనికీ కష్టపడి ఎరగదు.

తండ్రి కూతురికోసం మళ్ళీ పెళ్ళి కూడా చేసుకోకుండా అతని జీవితాన్నంతా తనకే ధారపోసాడన్న అభిమానంతో నయినా తండ్రికోరిక తీర్చలేదు. అదే తండ్రి తన్ని డాక్టర్ని చెయ్యాలన్న కోరిక. డాక్టర్ అవడం, అవకపోవడం మాట అటుంచి అసలు చదువంటేనే అయిష్టత చూపే లత పదో క్లాసు దాకా బలవంతాన్ని స్కూలు కెళ్ళి, యింక చదవనని మంకుపట్టుపట్టడంతో కూతుర్ని నొప్పించడం యిష్టంలేక, ఒప్పించలేక ఓడిపోయిన తండ్రి ఆమె భవిష్యత్ తీర్చిదిద్దడానికి మార్గాన్నాలోచించి, ఓ బీదింటి నుంచి డిగ్రీ చదువుతున్న అబ్బాయిని చూసి తెచ్చి అతనికి తన కూతుర్నిచ్చి



ఇదేమార్పునా? డా॥ సి. నారాయణరెడ్డి

ఎప్పుడూ లేను నేను ఇలా బితుకు బితుకుమంటూ
ఉరకలెత్తేవి కుందేళ్ళూ నక్కలూ
ముదురు తుమ్మ చెట్ల గుబురు నీడల్లో
పలికేవి గువ్వలు పగటి వేళల్లో
అరిచేవి గుడ్లగూబలు అర్థరాత్రుల్లో
ఎగిరేవి గద్దలూ రాబందులూ గగనసీమల్లో
ఇంతలో ఎంత మార్పు?
ముల్లేమూటా సర్దుకుని
వెళ్ళిపోయింది ప్రతిప్రాణి
ఈ చోటుకు చీటీ యిచ్చి
ఇంకా ఇక్కడే వున్నారు ఒక కొందరు
పాపం బతికుండగానే చచ్చి
ఇక్కడ పాడదిప్పుడు ఒక్క కీచురాయైనా
అడ్డంగా నిలువుగా చీల్చేశాయి నన్ను తారు రోడ్లు
వెర్రెత్తిపోతోంది నాకు
కిర్రు చెప్పుల సవ్వడి వినాలని
విహ్వలత పెరుగుతోంది నాకు
వేణునాదాల జడిలో తడవాలని
కానీ నన్ను చరుస్తున్నాయి – వడగాలీ
కారు నలుపు బొగ్గు పొడీ శ్వేతభస్మధూళీ
ఇక్కడ దిక్కులేక పడున్నాను నేను
నెత్తురూ సత్తువా కోల్పోయి
ఈ చెట్లూ జంతు జాలాలూ
ఈ కాల్వలూ నదీనదాలూ
అన్నీ ఇంకిపోయిన ఈక్షణం
నన్నింకా చేరదేమి మరణం?

(హరికృష్ణ పాఠక్ గుజరాతీ కవితకు అనుసృజనం)

ఎవరు విధించిన శిక్ష?

పెళ్ళిచేసి ఎమ్మెస్సీ, ఆపైని ఎం. బి. ఏ ను చెప్పించి తన ఆస్తిలో కొంత అమ్మి కారు పార్టుల వ్యాపారం పెట్టించి, మిగిలిన ఆస్తంతా కూతురిపేర రాసి వారి అభివృద్ధి, అన్యోన్యతనిచూసి కొన్నాళ్ళకి నిశ్చింతగా కళ్ళుమూసాడు

వ్యాపారం కాస్త పుంజుకుని మంచి లాభాలు రావడంతో వందల్ని వేలు, వేలని లక్షలు, లక్షల్ని కోట్లు చెయ్యాలన్న ఆలోచనలు రాసాగాయి హేమంత్‌కి దాంతో లత ఆస్తంతా కూడా అమ్మి పెట్టుబడిపెట్టడమేకాకుండా, వ్యాపారాన్ని హైదరాబాద్, ఢిల్లీలవంటి పట్టణాలకి తరలించి అక్కడ మంచిలాభాలు రావడంతో మకాం కూడా ఢిల్లీకి మార్చేసాడు. ఇప్పుడు ఢిల్లీలో పెద్దమేడ కొన్నాడు కారులో తప్ప పూళ్ళో తిరగటంలేదు. విమానాల్లో తప్ప వూళ్ళు వెళ్ళడంలేదు. ఇల్లంతా విదేశీ సామాన్లతో కలకల్లాడిపోతోంది అనందం, ఐశ్వర్యం అంతా లతా హేమంత్‌ల మధ్యే బంధింప బడివుందా? అన్నట్లుంది వారి సంసారం.

ఆ ముచ్చటైన సంసారంలో వారిప్రేమ పంటగా వుదయించిన చిన్నారికి 'వసంత్' అని పేరు పెట్టుకున్నారు.

వసంత్‌కిప్పుడు అయిదో ఏడు. తెలిసీ తెలియని వయసు తల్లి నీ స్థితిలో చూసి కొన్నాళ్ళు భయపడి దగ్గరకిరాలేదు. తరవాత తల్లిని వదలకుండా అంటిపెట్టుకుని తిరగసాగాడు. ఈమధ్య తల్లి దిగులుగా కూర్చోడం, కుమిలి, కుమిలి ఏడవడం ఆ పశిహృదయాన్ని పిండసాగింది. చిన్నారి చేతులతో తల్లి నూరడించే కొడుకుని అక్కునచేర్చుకుని మరింత బాదపడేది. లతమీద ప్రేమ తగ్గిన హేమంత్ వసంత్‌ని కూడా యిదివరకులా చేరదీయడం మానేసాడు. అది గ్రహించిన వసంత్ తండ్రిని చూడగానే బెదిరిపోయి తల్లి దగ్గరకెళ్ళిపోయేవాడు.

లత అందిచ్చిన విడాకుల కాగితాలని ఆనందంగా అందుకున్న హేమంత్ మరికొద్ది కాలానికే తన పి. ఎ. శిరీషని రిజిస్ట్రీ మేరేజ్ చేసుకొని తన మేడ లాన్‌లోనే పెద్ద ఎత్తున డిన్నర్ ఏర్పాటు చేసాడు. ఢిల్లీలోని పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, ఉద్యోగస్తులు, మంత్రులు వచ్చి వారికి కానుకలిచ్చి, అభినందించి వెళ్తున్నారు. వీడియో తీస్తూ కొందరు, ఫోటోలు తీస్తూ కొందరు, హడావిడిగా తిరుగుతున్నారు.

ఆ ఇంటి వెనకే గేరేజ్ పక్కన కట్టిన రెండు గదుల్లోకి కొడుకుతో మారిన లతకి బైట జరుగుతున్న హడావిడంతా వినపడి ఎవరో గుండెల్ని

క్రీడారంగం క్విజ్-3

జవాబులు

(1) ఎడ్వర్డ్.ఎఫ్. ఈగన్. అమెరికాకు చెందిన ఇతను 1920లో లైట్ హెవీ వెయిట్ బాక్సింగ్ టైటిల్‌ని గెలిచాడు. 1932 శీతాకాలపు ఒలింపిక్స్‌లో "ఫోర్‌మాన్ బాబ్" టైటిల్ గెలిచిన టీమ్ సభ్యుడు.
(2) భారత్‌కు చెందిన శాంతారంగస్వామి.
(3) మార్టినా నవ్రతిలోవా. 1984 లో ఆడిన 87 మ్యాచ్‌ల్లో ఒకటి మాత్రమే ఓడిపోయింది.
(4) విలియం మోర్గాన్
(5) సపారో (జపాన్)
(6) విల్సన్ జోన్స్
(7) జిమ్మి కానర్స్
(8) ఎస్కేప్ టు విక్టరీ
(9) గారీ కాస్పరోవ్
(10) జాలాలుద్దీన్ (పాకిస్తాన్)

- జె. కె.

పిండేస్తోన్నట్లవుతోంది కట్టు గుడ్డకి, కడుపు నిండా తిండికి ముఖం వాచినతన్ని తీసుకొచ్చి, యింతటి వాడిని చేసినందుకా ఈ ప్రతిఫలం?" అనుకుంది. "నా డబ్బుతో కొన్న యిల్లు, నా ఆస్తి అమ్మి పెట్టుబడి పెట్టిన వ్యాపారం. ఈనాడీ స్థితిలో హేమంత్ వుండడానికి నేనూ, నా తండ్రీ కారకుల మన్న విషయం గుర్తుందా? ఈ విషయాలు ఆ మనిషిని నిలబెట్టి అడగాలనుకున్నా అడగలేక పోవడానికి కారణం భర్తని నమ్మి తన ఆస్తంతా అతని చేతిలో పెట్టడమే! ఆ తప్పే తన్నీనాడు ఈ నిస్సహాయ స్థితికి దిగజార్చింది. ఇప్పుడు యిల్లు, వ్యాపారం అంతా అతని పేర మీదే వుంది. 'నాదీ' అని ఋజువుపర్చడానికి ఎక్కడా ఆస్కారం లేకుండా అయింది. ఈనాడు దయాధర్మంగా ఓ యాభై వేలు తన పేర వేసి, నెలకో అయిదొందలు ఖర్చులకిచ్చి, వెనక పనివాళ్ళకని కట్టిన గదిలో వుండమని పంపేసి చేతులు దులిపేసుకున్నాడు. ఇలాంటి విశ్వాస ఘాతకుడికి వెనక వెం గుర్తుంటాయి??

ఆనాడు తండ్రి చదువుకోమని బ్రతిమాలినప్పుడు తను తిరస్కరించిన దానికి ఫలితం ఈనాడు బాగా 'అనుభవిస్తోంది. తనకే చదువుంటే యింత ఆస్తి పోయినా, అతడిచ్చే డబ్బు విసిరికొట్టి ఏ వుద్యోగమో చేసుకుని "నీ లెక్కెంత"ని బ్రతికి చూపించేదాన్ని" అంటూ బాధపడసాగింది లత

ఆట నుంచి పరిగెత్తుకొచ్చిన వసంత్ "అమ్మా! నాన్నాగారింట్లో అందరూ బోల్డు స్వీట్లు తింటున్నారమ్మా! మనం కూడా వెళ్దామా?" అని అడగడంతో వెర్రిదానిలా కొడుకుని చూసి "అవి మనకి కాదమ్మా! ఆది ఆంటీ కోసం" అన్న తల్లి మాటలకి "మరి నాన్నారు కూడా ఎందుకు దండలు వేసుకున్నారు?" అని అడుగుతున్న వసంత్‌ని మరిపించాలని అతని చెయ్యి పట్టుకుని వంటింటి వైపుకి నడిచింది లత

కాలం పరుగెడుతోంది ఏళ్ళు దొర్లిపోతున్నాయి హేమంత్ వయసు ముళ్ళసాగింది వసంత్ దొండ మామిడికాయలా ఎదగసాగాడు చదువులోనూ అంత చురుగ్గానూ రాసాగాడు అన్నింటిలోనూ ఫస్ట్! అతనికి చదువు, తల్లి తప్ప మరో ప్రపంచం లేదు తల్లి కోరిక మేరకు మెడిసిన్‌లో చేరి, పూర్తి చేసి గోల్డ్ మెడల్ పొందాడు ఓ పక్క ఉద్యోగం వచ్చింది మరో పక్క ఎం ఎస్ కి సీటొచ్చింది. తల్లి సలహా ప్రకారం ఎం ఎస్ లో చేరి రెండేళ్ళలో ఆ డిగ్రీ కూడా పొందాడు

డిగ్రీ పొందక ముందే వుద్యోగం వెతుక్కుంటు వచ్చిందా అదృష్టవంతుడికి. పాతికేళ్ళు నిండిన వసంత్ డాక్టర్‌గా ఆసుపత్రికెళుతున్న మొదటి రోజు తల్లి కాళ్ళకి మొక్కుతూ "అమ్మా! యిదంతా నీ కృషి ఫలితమమ్మా!" అని కౌగిలించుకున్నాడు

డాక్టర్ హోదాలో దర్జాగా నిలబడ్డ వసంత్‌ని సూటిగా చూస్తే దృష్టి తగులుతుందేమో అని తల దించుకొని "వెళ్ళిరా బాబూ! మానవ సేవే మాధవ

పాఠకులకో సవాల్!

3

టిట్ ఫర్ టాట్!

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహం పడక మళ్ళీ ప్రయత్నించండి!

ఒన్ టూ త్రీ ఫోర్ రెడీ.... లైట్సాఫ్

★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ.

"ఇది రాత్రి కాదు గురూ! పగలు" -పంపినవారు : కె. శృతి (కంభంపాడు)

★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ

"హేండ్సప్. హనుమంతుడి ముందు కుప్పి గంతులా?"

–యస్. పి. కిరణ్ (తుని)

★ మరికొన్ని వాగ్బాణాలు.

"ఓ.కె. స్టార్ట్ యాక్షన్...." -పంపిన వారు : విశ్వామిత్రుడు (నాకపాలెం).

"చీకట్లో చిందులాట కదా మన సినిమా పేరు?!" –ఎల్. ప్రఫుల్ల చంద్ర (ధర్మవరం)

"ఇక్కడి నా కెమెరా కనబడ్డం లేదు నాయనో!" –ప్రకాశరావు (రాజమండ్రి)

ఇంకా హీరోయిన్ రాలేదండి! –యస్. భూమారెడ్డి (బెల్లంపల్లి)

చంపేశావు పో... నా కసలే రేచీకటి! –కె. కారంచేటి (హైదరాబాద్)

ష్. మనం దొంగతనానికి వచ్చాం. కాస్త మెల్లిగా.

–సోమయాజుల సోదరులు (హైదరాబాద్)

అరె! నిరోధ్ పాకెట్ కనపట్టం లేదే!!" –జి. అశోక్ చంద్ర (మెట్‌పల్లి)

వాగ్బాణాలు దూసిన మరికొందరి "లక్కీ" పేర్లు : తులసి (హైదరాబాద్), టి. యన్. కృష్ణమోహన్ (అనకాపల్లి), పి. పార్వతి (విజయనగరం), ఎస్. జ్ఞానేశ్వరి (ఖమ్మం), జె. ఉమామహేశ్వరరావు (పాలకొల్లు), వి. వీరారెడ్డి (పొద్దుటూరు) గాదె వెంకట రామారావు (అమలాపురం), పులివర్తి పూర్ణకుమారి (అల్లవరం), కోలపల్లి ప్రియ (నెల్లూరు), ఎం. శ్రీనివాసరావు (విశాఖపట్నం), ఎస్. వి. వి. మురళీకృష్ణ (గవరకంచర పాలెం), సి. ఎచ్. శరత్ (ఆదోని), వి. జగదీశ్ (వరంగల్), ఎ. ఎస్. ఎస్. శంకరరావు (రేపల్లె), తుర్లి రాజగోపాల్ (రాజమండ్రి), రామరాజు (శ్రీకాకుళం)

"ఏం గురూ గెడ్డం పెంచుతున్నావ్! మళ్ళీ మీ ఆవిడ...."

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్టవచ్చినట్లుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!– ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం. సంచిక విడుదలైన వారంలోగా పంపాలి.మర్చిపోకండి. –సం.

ఎవరు విధించిన శిక్ష?

సేవ. శత్రువు వచ్చినా సరే డాక్టర్‌గా వైద్యం చేసి నీ బాధ్యత కర్తవ్యం నెరవేర్చుకో. పెద్ద డాక్టర్‌గా పేరు తెచ్చుకో బాబూ!" అంటూ సాగనంపింది.

ఆసుపత్రిలో చేరిన కొద్ది కాలానికే వసంత్ మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్నాడు. "డాక్టర్ వసంత్ శెలవుమీదున్నా"డనగానే అయనెప్పుడు వస్తారు? ఆయనొచ్చాక వస్తాం!" అని కొందరు రోగులు తిరిగి వెళ్ళిపోయేవారు.

ఉదయం ఆసుపత్రిలో అడుగెట్టిన వసంత్ డాక్టర్లు అటూ యిటూ పరుగెలెత్తడం చూసి కారణం అడిగాడు. ఓ పెద్ద పారిశ్రామికవేత్తని బి. పి. చాలా ఎక్కువగా వుండటంవల్ల ఆసుపత్రికి తీసుకొచ్చారని, సీరియస్‌గా వుందని, నీకోసమే చూస్తున్నారని, త్వరగా రమ్మని చెప్పగానే వెళ్ళాడు వసంత్. ఎదురుగా హేమంత్! అతని శరీరమంతా అసహ్యంతో కుతకుత ఉడికిపోతోంది. అయాసంతో స్మిమితంలేకుండా కొట్టుకుంటోన్న అతన్ని చూసి పకపకా నవ్వాలనిపిస్తోంది. కానీ తానున్న పరిసరాలు అందుకంగీకరించవు. పైగా తల్లి చెప్పిన సూక్తులు గుర్తొచ్చాయి. ఇప్పుడు తను డాక్టరు – అతను రోగి అంతే అనుకుని తమాయించుకుని తన కర్తవ్యాన్ని నిర్వర్తించసాగాడు. రక్తపోటు చాలా ఎక్కువగావున్నందువల్ల పక్షవాతం వచ్చేసూచనలు కనపడసాగాయి. ఈ విషయాలు బైట నిలబడ్డ శిరీషకి కబురంపాడు.

సాయంకాలం శిరీష లాయర్‌తో వచ్చింది. ఏమాత్రం దయాదాక్షిణ్యాలు కనపర్చకుండా మూలుగుతున్న హేమంత్ చేత ఏవేవో కాగితాలమీద సంతకాలు పెట్టించుకుంది. జాగ్రత్తగా వాటిని పర్సులో దాచుకుని వెళ్ళిపోయింది.

మర్నాటికి డాక్టర్లు చెప్పినట్లే బి. పి. ఎక్కువయి పక్షవాతం వచ్చి హేమంత్ కుడికాలూ, చెయ్యి పడిపోయాయి. డాక్టర్లు చెయ్యగలిగింది చేసి కొన్నాళ్ళతరవాత యింటికెళ్ళొచ్చని చెప్పేసారు.

ఆస్తంతా రాయించుకున్న శిరీష మళ్ళీ ఒకసారి తప్ప హేమంత్‌ని చూడటానికి రాలేదన్న విషయం హేమంత్‌ని బాధించసాగింది. వేరే దిక్కులేని హేమంత్ తనని తనింటివద్దర దింపెయ్యమని అక్కడున్న డాక్టర్ని అడిగాడు. డాక్టరు ఓ బోయ్‌నిచ్చి హేమంత్‌ని కారులో యింటికి పంపేశు.

గేటుకి పెద్ద తాళంకప్ప కనపడటంతో బోయ్ వెళ్ళి పక్కింటామెని అడిగాడు. వారం రోజుల నుంచి శిరీష యింటికి రావటంలేదని చెప్పిందామె.

బోయ్‌నోట ఆ మాటలు విన్న హేమంత్ మొదలు నరికిన మానులా కూలబడిపోయాడు. బుర్రలో కొట్టానుకొట్ట ఆలోచనలు స్థిమితంలేకుండా చేస్తున్నాయి. 'ఆస్తంతా రాయించుకుని ఈ అవిటివాడు యింకెందుకని ఎటో వుడాయించిం దన్నమాట' అనుకున్నాడు. చేసిన తప్పులు, కాదు కాదు పాపాలు ఒక్కటొక్కటే గుర్తొస్తున్నాయి. 'నాదంతా ఆ మహాయిల్లాలి వుసురే!' అనుకున్నాడు.

ఆసుపత్రిలో తన కొడుకే తనకి వైద్యం చేస్తున్నాడని హేమంత్‌కి తెలుసు. కానీ సిగ్గుతో తనో రోగిగా "డాక్టర్" అని సంబోధిస్తూ మాత్రం అతనితో మాట్లాడాడేతప్ప, తండ్రిగా కొడుకుని పలకరించలేదు. వసంత్ కూడా తనపట్ల అలాగే ప్రవర్తించడం గ్రహించకపోలేదు. మొదట్లో అతని తల్లికి చేసినదానికి తన్ని ఏ విషమో యిచ్చి చంపేస్తాడని భయపడ్డాడు. ఇప్పుడలా చేసినా బాగుండేదనిపిస్తోంది. తల్లికిచేసిన అన్యాయానికి వసంత్ తన్ని చంపి కసి తీర్చుకోలేదు. కానీ దేముడు కాలూ, చెయ్యి లేకుండాచేసి తన్ని చావకుండా, బ్రతక్కుండా వదిలేసి ప్రాయశ్చిత్తం చేసాడు. 'లతకి అనాకారత్వం వచ్చిందని విడాకులిచ్చాను. నా కాలూ, చెయ్యి, మూతి వంకరపోయి యిప్పుడు ఎంతో వికృతంగా తయారయ్యాను. పైగా వసంత్ ఎదురుగా యిలా అవిటిగా, అనాకారత్వంతో పడుండం అవమానంగా, బాధగానూవుంది. నా ఈ అవతారం చూసే శిరీష అసహ్యించుకునుంటుంది. నేను చేసినపనే శిరీషచేస్తే తనలో చలనం కలిగింది. బాధపడుతున్నాను."

"ఎక్కడదింపమంటారు సార్" అన్న బోయ్ మాటలకి ఉలిక్కిపడ్డ హేమంత్‌లో ఏదో ఆశ చిగురించింది.

వసంత్‌కి నామీద కనికరంపాటు నాను నిర్మలమైన మనసుతో వైద్యం చేసాడు. వసంత్‌ది కూడా తల్లి లాంటి దయా హృదయమే! తల్లిపోలికే! వెళ్తే యిద్దరూ కాదనరు' అనుకుంటూ "వెనక చిన్న యిల్లువుంది. కారు అటుపోనీ" అన్నాడు.

నెమ్మదిగా కారు తీసుకెళ్ళి ఆ యింటిపక్కగా ఆపుచేసి తలుపుతీసాడు. ఆ యింటి తలుపులు తెరిచేవున్నాయి. 'ఏ ముఖంపెట్టుకుని లోపలికెళ్ళాలి?' అని సందేహిస్తున్నాడు. ఆ యింట్లోంచి మాటలు గట్టిగానే వినపడుతున్నాయి. ఇద్దరి ఆడవాళ్ళ గొంతుకలవి. బాగాపరిచయమైనవే!

"లతగారూ యిది మీది. మీ సొంతం. నేను మీకు దానం, ధర్మం చేయ్యటంలేదు. మీది మీ కివ్వడానికి వచ్చాను. ఏదో ఆవేశంలో, యవ్వనపు వేడిలో చాలా తప్పుపనిచేసాను. హేమంత్ మీకు చేసిన అన్యాయానికి దేముడాయనకి చేసిన శాస్తి కళ్ళారా చూసాను. ఆ సంఘటన నాకు షాక్‌లా తగిలింది. అదే నాకళ్ళు తెరిపించింది. ఆ వెంటనే నామీద నాకే అసహ్యంపుట్టింది. వెంటనే బుద్ధితెచ్చుకుని లాయర్‌చేత కాగితాలు రాయించి ఆయనచేత సంతకాలు పెట్టించితీసుకున్నాను. అవి నా పేర కాదు, మీ పేర, మీ వసంత్ పేర రాయించాను. హేమంత్‌చేసిన పాపిష్టిపని నేను చెయ్యను. మీ సొమ్ముతిని నేనూ హేమంత్‌లా శిక్ష అనుభవించదల్చుకోలేదు. హేమంత్ రోగమే నా కళ్ళు తెరిపించి, ఈపని చేయించింది. ఈ రోజు మీ ఆస్తి మీకు అప్పచెప్పడానికి వచ్చాను. నా వుద్యోగం నాకుంది. నా బ్రతుకు నేను బ్రతుకుతాను అంటున్న శిరీష మాటలువిన్న హేమంత్ సిగ్గుతో కుంచించుకుపోయాడు.

'ఇప్పుడే ముఖంపెట్టుకుని ఈ యింటిలోపలికి అడుగెట్టగలను? శిరీష కూడా నా కంటే నీతిగల మనిషి. నేనెంత నీచుడినో పూర్తిగా అర్థమయింది'.

"బోయ్! కారు తొందరగా యిక్కడినుంచి తీసికెళ్ళిపో" అన్నాడు ఎవరేనా తన్ని చూస్తారేమో అన్న కంగారుతో కారులోకి ఒదిగిపోయి కూర్చుంటూ.

"ఎక్కడికిసార్!" అన్నాడు హేమంత్‌వైపు ఆశ్చర్యంగా చూస్తూ, అతనిప్రవర్తనకి, మాటలకి అర్థంతెలియని బోయ్!

"ఎక్కడికో తరవాత చెప్తాను. ముందిక్కడినుంచి త్వరగా కారుతీసుకుపో" అంటూ కంగారుపెడుతున్న హేమంత్‌ని విచిత్రంగా చూస్తూ కారెక్కాడు బోయ్.


"ఎక్కడికిసార్!" అని మళ్ళీ అడిగిన బోయ్‌తో –

"మనదేశంలో ఎక్కడేనా ఓల్డేజ్ హోంమ్సు వున్నాయా బోయ్?" అన్నాడు దీనవదనంతో హేమంత్.

"ఉన్నాయి సార్" అనగానే "అయితే అక్కడికి పద" అన్నాడు నీరసంగా వెనక్కువాలిపోతూ హేమంత్. ●

అంచనాలను మించి యిచ్చేది గ్రోమోర్

35759




ఎందువల్లనంటే, దమ్ములోనే కాక పైరు మీద కూడా వేయుటకు అమవైనది.

అంతేకాదు....

- భాస్వరం, నత్రజని అత్యధికంగా సమపాళ్ళలో వున్న ఒకే ఒక ఎరువు.
- ప్రతి గ్రోమోర్ 28-28-0 బస్తాలోను 50 కిలోల ఎరువు! చాలా వాటిలోలా 40 కిలోలు కాదు.
- ప్రతి గ్రోమోర్ 28-28-0 బస్తాలోను 28 కిలోల పోషక పదార్థాలు ఏ ఇతర కాంప్లెక్స్ ఎరువులోను లేనంత నత్రజని 14 కిలోలు. కనుక శ్రేష్ఠమైన బంగారు పంట రాలగలదు.
- గ్రోమోర్ 28-28-0లో నత్రజని అమ్మోనియా రూపంలోనేగాక అమైడ్ (యూరియా) రూపంలో కూడా వుంది. అందువలన, నత్రజని అమ్మోనియా రూపంలో ఎక్కువ కాలం మొక్కలకు లభ్యమవుతూ వుంటుంది.

గ్రోమోర్ 28-28-0 **చేనుకు చేవ, రైతుకు రొక్కం - గ్రోమోర్**

OBM 829 TG/A



సీరియల్

ఆడపిల్లలు - అనుభవాలు

హరికిషన్

(గత సంచిక తరువాయి)

ప్రశ్నలు - జవాబులు

'శ్రీవిద్య మనస్సు కొన్ని విషయాలు విన్నపుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. కొన్ని విషయాలు విన్నప్పుడు మానసిక సంఘర్షణకూ, వత్తిడికీ తట్టుకోలేక, ఆ తప్పు చేసిన వ్యక్తిని ముఖానే నాలుగూ అడిగి కాస్త ఉపశమనం కలిగించుకుంటుంది. ఆ తరవాత నిదానంగా ఆలోచించుకుంటే తను తొందరపడటం తప్పేనని తెల్సుకుంటుంది. మళ్ళీ తన అనుభవాలు చెప్పటానికి హేమంత్ ఎప్పుడు హేమలత ఇంటికి వస్తాడో తను అడగలేదు, అతను చెప్పనే లేదు.

తన జీవిత కథను హేమంత్ చెప్తున్న కొద్దీ శ్రీవిద్యకు సందేహాలు ఎక్కువ అవుతున్నయ్యి. ఆ సందేహాలు అన్నీ ఒక కాగితం మీద రాసుకున్నది.

1. ఆ నవలలో ఒక పేజీలో రాసిన అక్వెశ్చనీర్ ఫారం ఎందుకు రాశాడు ఆ ఫారం ఉద్దేశ్యం ఏమిటి?

2. ఏ ఏ బి బి సి సి డి డి అసలు పేరు ఏమిటో?

3. పొడుపు కథలు

4. పాస్ పుస్తకంలో అంత డబ్బు ఎందుకు వేశాడు?

5. ఇంత మంది అమ్మాయిలతో ప్రేమ జీవితం గడిపిన వాడు, తనను కూడా పెళ్ళి చేసుకుని మోజు తీరాక మోసం చేస్తే?

6. తన శరీరం మీద పుట్టు మచ్చలూ, పులిపిరి కాయ ఎట్లా తెలిసినయ్యి?

7 స్వర్ణకుమారి, అనుపమ, అనూరాధలతో అతని ప్రేమకలాపాలు అంతం అయినట్లేనా? ఇంకా ఇంకా సాగిస్తున్నాడా మరికొందరితో?

ఆలోచిస్తూనే హేమలత ఇంటికి వెళ్ళింది శ్రీవిద్య అతను మూడు రోజుల నుంచీ ఇక్కడే ఉంటున్నాడు.

"గుడీవినింగ్ సర్, ఎంత సేపయింది వచ్చి."

చదువుతున్న ఇంగ్లీషు నవల మూసి టేబుల్ మీద పడేసి, పదిహేను సెకండ్లు శ్రీవిద్యను చూసేడు

"అట్లా చూస్తున్నారేం, వంట్లో బావుండలేదా."

"చాలా బావున్నది, నిన్ను చూస్తుంటే కొరుక్కు తినాలనిపిస్తున్నది, యు డెవిల్, ఇడియట్, ఫూలిష్ లవర్ ఆన్ ది ఎర్త్, మూడు రోజుల్నుంచి ఇక్కడే నీ కోసం వచ్చి ఉంటే ఇప్పుడు రావటం, నువ్వు కాబోయే భార్యవా, అయిన ప్రియురాలివా" కాస్త కోపాన్ని మిళితం చేసి అన్నాడు హేమంత్. అంత కోపం ఎందుకు వచ్చిందో శ్రీవిద్యకు అర్థం కాలేదు.

"నా కోసం మూడు రోజుల నుంచీ ఇక్కడే ఉన్నారా, సారీ సర్, కబురు చేస్తే బావుండేది" నెమ్మదిగా అన్నది. కుర్చీలో కూర్చున్నది. "మీతో పరిచయం వల్ల నేను నేర్చుకున్నది ఎల్. ఎం. ఎల్" అన్నది సీరియస్‌గా చూస్తూ, అర్థం కాక చూసేడు. "ఎల్. ఎం. ఎల్ అంటే లేటెస్ట్ మోడల్ లవ్" అన్నది.

"నెత్తి మీద లక్ష రూపాయలు పెడితే పాతిక వేలు ఖరీదు చెయ్యని నీ కోసం నేను కబురు చెయ్యాలా? ఏదో కాస్త అందంగా ఉన్నాదనీ, ఫిజికల్ స్ట్రక్చర్ బావున్నదని, ఉండవలసిన చోట పుట్టు మచ్చలు ఉన్నయ్యనీ, అసలిత కన్యామణివనీ భావించి, భ్రమించి, నిన్ను ప్రేమిస్తే, కంధ కావరంతో, వయసు పొంగుతో, అధిక తెలివి తేటల ఆలోచనలతో, శరీరంలో నిండి ఉన్న నవయౌవ్వనపు గర్వంతో, నా జీవిత కథను వినే నెపంతో, నా గుట్టుమట్టు తెల్సుకొని, నేను పరస్త్రీ వ్యామోహితుడననే ముద్ర వేసి, ఈ ప్రేమ పిచ్చివాడు, పాస్ పుస్తకంలో అంత డబ్బు జమ చేసిన వాడు, ఒక ప్రియురాలి మరణానికి కారణభూతుడై, మనోవ్యాకులతతో జీవితంలో మరి ఏ యువతికీ అన్యాయం చెయ్యకూడదని నిశ్చయించుకొన్న వాడు, మరో అమ్మాయి తన మనస్సులోకి రాకూడదని మనస్సుకు బుద్ధి చెప్పుకున్న వాడు, ప్రేమించి పెళ్ళి చేసుకొనే ఈ జీవన్మరణ సమస్యలో తనకే పూర్తి స్వాతంత్ర్యమూ, హక్కు కావాలని తల్లిదండ్రులతో చర్చించి, తర్కించి, వాదించి, వారి సంపూర్ణ ఆమోదాన్ని పొందిన వాడు, కట్నకానుకలను అసహ్యించుకునే వాడు, ఈ ఏఏ బిబి సి సి డిడి హేమంత్ నా కోసం వేచి ఉండక ఎక్కడికి పోతాడు, అనే యౌవ్వనానంద మదోన్మత్త, సంజనిత, సంభావిత, గర్వాంబర వీధిలో, అంబర చుంబిత, దివ్య భావ్య హర్మ్యాలతో విహరిస్తూ, అస్మితా నందపు సంతోష, సంరంభంలో, ప్రేమామృతాన్ని గ్రోలుతూ, నువ్వు నన్ను చూసీ చూడనట్లు చూసి, నటిస్తూ, నా మనస్సును కష్టపెట్టి, నా ప్రేమను రెచ్చగొట్టి, నన్ను అనుమానించే, నా చర్యలను అవమానించి, నన్ను డెబ్భై రెండు గంటల నుంచీ వ్యథిత మనస్కుడిని చేస్తావా శ్రీవిద్యా" పౌరాణిక నాటకంలో ఏకపాత్రాభినయపు డైలాగ్ చెప్పినట్లు సాగదీసి అన్నాడు హేమంత్ చప్పట్లు చరిచింది శ్రీవిద్య.

"వన్స్‌మోర్" అన్నది.

"ముయ్యి నోర్. శ్రీవిద్యా, మొన్న సాయంత్రం వస్తావనుకున్నాను'.

మాట్లాడలేదు శ్రీవిద్య. ఇంట్లోకి వెళ్ళాడు. కాఫీ కప్పు తెచ్చి ఇచ్చాడు, తీసుకున్నది, అతను తాగి కప్పు టీపాయ్ మీద ఉంచాడు. శ్రీవిద్య కాఫీ తాగలేదు.

"చల్లారి పోతుంది తాగు"

మౌనంగా చూస్తున్నది.

'ఏం కోపమొచ్చిందా, అప్పుడే వరుడు తనంతట తాను ప్రేమించిన మలకన కాదె, ఏ పెళ్ళికాని ఆడపిల్ల కయినన్."

మూతి బిగించిన చిరునవ్వు.

"పోనీ పాలు తాగుతావా పసిపిల్లా"

అక్కర్లేదన్నట్లు తల తిప్పింది

"కథ చెప్తాను, కాఫీ తాగు పిల్లా"

మౌనం, నవ్వుముఖం, మూతి బిగింపు.

"కాఫీ తాగుతావా, లేకపోతే నీ అధర సుధామృతాన్ని నేను ఆస్వాదిస్తాను, జాగ్రత్త. మనస్సు తిరగబడితే, చూడూ, పెదవులు యుద్ధం చేస్తయ్యి."

ఆ పుస్తకం మీద రాసి చూపించింది "ముయ్యి నోర్" అన్నారుగా– అందుకని మాట్లాట్టం లేదు. కాఫీ తాగింది.

"శ్రీవిద్యా, అనూరాధ చావుకు కారణం మా సాంగత్యం అని నేను చెపితేనేగా నువ్వు విన్నది ఆ

జరిగిన కథ– 34: హేమంత్ తనకు అమ్మాయిలతో పరిచయాలు చెప్తుంటాడు. అనూరాధతో అనుభవం గురించి విని శ్రీవిద్య ఆవేశపడుతుంది. సత్యభామ అంతరంగ విశ్లేషణ చేస్తూ, హిత బోధతో ఒక ఉత్తరం వస్తుంది. సత్యభామ అభిలాష్‌ను తన వెంట తిరగమని కోరుతుంది. కోసలరామ్ తనకు, వినీతకు మధ్య జరిగిన సంఘటనలు సావిత్రికి చెప్తాడు.

రోజున చాలా కోపంతో నన్ను నాలుగూ తిట్టి వెళ్ళిపోయావు. సాటి ఆడదాని మీద అంత గౌరవం ఉన్నప్పుడు ఆ మాత్రం కోపం రావటం నీలాంటి వారికి చాలా సహజమే. కాని తప్పంతా మగవాడిదే అనుకోవటం కూడా చాలా పొరపాటు, నీ కామెంట్స్"

లేచి ఇవతలికి వచ్చి వంటింట్లోకి వెళ్ళింది, పెరట్లోకి వెళ్ళింది, డాబా మీదికి వెళ్ళి చూసింది ఆలోచిస్తూ మెట్లు దిగి వచ్చింది. గది గుమ్మం ఇవతలే నిల్చున్నది. క్షణం అతని వైపు చూసి,


"శలవు, వెళ్ళొస్తాను" అన్నది.

"మనం మాట్లాడుకోవలసిన 'మాటల్లో' ఏభై పధాలన్నా కాలేదు, అప్పుడే వెళతానంటారే, కారణం" అన్నాడు.

"మనిద్దరం ఇక్కడ వంటరిగా కూర్చుని మాట్లాడుకోవటం, హేమలత గారు లేనప్పుడు, నాకిష్టం లేదు "

"ఐసీ, నేను నిన్ను ఏదయినా చేస్తానేమోనని నీ భయం, ఆ మాత్రం భయం ఆడపిల్లకు ఉండటం చాలా ఆరోగ్యకరం. కాని నేను అటు హీరోనీ కాదు, ఇటు విలన్నీ కాదు, మనస్సు తెల్పుకుని, అభిప్రాయాలు కలబోసుకుని, మర్యాదకరంగా ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, పలచి పలవింప చేసుకుని, నాకు నచ్చిన శ్రీవిద్యను పెళ్ళి చేసుకోవాలనుకున్న హేమంత్‌ని."

తలవంచుకుని అన్ని మాటలూ విని తల ఎత్తి చూసి, మళ్ళీ తల వంచుకుని "ఆవిడ లేదు, మనం వంటరిగా మాట్లాడుకోవటం సభ్యతగా ఉండదు " అన్నది.



"శ్రీవిద్యా, నీకు మనస్సులో ఆలోచనల ద్వారా తెలిసిన, ఊహా జనితమైన సభ్యత, సంస్కారం మాత్రమే తెలుసు. లోనెక్ చోళీ వేసుకుని, నేలను తాకుతూ జీరాడే లంగానో, చీరనో కట్టుకుని, తల వంచుకుని రోడ్డు మార్జిన్లో నడుస్తూ, అంటీ ముట్టని భావాలతో ఉన్న ఆడపిల్లలందరూ సభ్యత, సంస్కారం కలవారని అనుకోవటం చాలా పొరపాటు" ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"సార్, ఆడపిల్లల మనోభావాల మీద, సభ్యత సంస్కారం మీద, మీరేదో సర్వ సద్గుణ సంపన్నురాలా కామెంట్లు విసురుతున్నారు, మీ దృష్టిలో అందరూ స్వర్ణకుమారిలా, అనుపమలా, అనూరాధలా కనిపిస్తున్నారా" కుడి కాలి బొటన వ్రేలితో నేలమీద రాస్తూ అన్నది

చిరునవ్వుతో కుర్చీలో నుంచి లేచి నిల్చున్నాడు "నేను చేసే కామెంట్ నిన్ను చూసే శ్రీవిద్యా, ఆ చీర అంచులు చూడు ఎంతగా నేలమీద జీరాడు తున్నాయో, ఎక్కడి కెయ్యది ప్రస్తుతమో అక్కడికే మాటలాడు అన్నట్లు, ఎక్కడ ఎట్రాక్షన్ ఉంటుందో అక్కడ చూసి చూడనట్లు, ఇతరుల దృష్టిలో పడేటట్లు వదిలేస్తారు, కాలి నీల మండలు కనిపిస్తే కాళ్ళ జెర్రి పాకినంత ఫీలింగ్, సరే నువ్వు నాతో మాట్లాడవలసిన అవసరం చాలా ఉన్నది. నీ అనుమానాలు తీర్చుకోవాలంటే గుమ్మం దాటి ఇవతలికి వచ్చి కూర్చో, నా మీదనే నీకు అనుమానంగా ఉంటే నువ్వు వెళ్ళిపోవచ్చు, కాకపోతే నీలాంటి అమ్మాయి కోసం మళ్ళీ మళ్ళీ

ప్రయత్నించాలి, మరో సంవత్సరం ప్రయత్నించాలి,' సరేనీ ఇష్టం."

పమిటి నిండుగా మరోసారి కొంగు సవరించి కప్పుకుని, చీరె కుచ్చెళ్ళు నీల మండల వరకూ ఎత్తి పుచ్చుకుని, గుమ్మం దాటి లోపలికి వచ్చి, గది మధ్యలోకి కుర్చీని లాక్కుని కూర్చున్నది.

"వెరీగుడ్, పిల్లకో ప్రేమ, పిల్లాడికో భామ అన్నట్లు, స్వచ్ఛమైన నీటికి రంగు, రుచి, వాసన లేనట్లు, స్వచ్ఛమైన ప్రేమకు భయం అనేది ఉండ కూడదు, సరే ఇక నీ ప్రశ్నలు, నా సమాధానాలూ." ఆడగ మన్నట్లు చూశాడు.

"అడుగుతాను, కోపం తెచ్చుకోరు కద" అన్నది.

"చూడూ, మగవాడికయినా, ఆడదాని కయినా పాతిక పాళ్ళు కోపం, పాతిక పాళ్ళు ప్రేమ, పాతిక పాళ్ళు ఇతరులకు చేతనయిన సహాయం చెయ్యాలనే సద్భావం పాతిక పాళ్ళు స్వార్థం ఉండి తీరాలి. లేకపోతే ఆ వ్యక్తిని సంఘం అప్రయోజకుడిగా ముద్ర వేస్తుంది" అన్నాడు.

"మీకు చాలా మంది ఆడపిల్లలతో కాస్త పరిచయం ఉన్నది. అనూరాధతో శారీరక సంబంధం ఉన్నది. కారణాంతరాల చేత ఆమె చని పోయింది, పాప, పుణ్యాల సంగతి నేను మాట్లాట్టం లేదు. పెళ్ళయి సంసార జీవితాన్ని సౌఖ్యంగా గడుపుతున్నా, ఆ దారుణ సంఘటన మీ మనస్సులో చోటు చేసుకొని, మీ మనస్సుని కలవర పెట్టదంటారా?" అన్నది శ్రీవిద్య.

కుడిచేతి బొటన వ్రేలితో గడ్డాన్ని రాచుకుంటూ కూర్చున్నాడు.

"చాలా చక్కని ప్రశ్న వేశావు. చాలా సంతోషం. పుట్టిన బిడ్డ ఏడాది పెరిగి చనిపోతాడు. ఆ భార్యా భర్తలు ప్రేమానురాగాలతో మళ్ళీ సంసారం చేస్తున్నారు. అంటే ఆ చనిపోయిన బిడ్డను గురించి విచారపడకుండా, వాళ్ళు తమ స్వార్థంతో జీవిస్తున్నట్లేనా?"

"నా ప్రశ్నకూ మీ సమాధానానికీ సంబంధం లేదు."

"ఉన్నది, ఆ భార్యా భర్తలు సుఖ సంతోషాలతో కాపరం చేస్తున్నా, ఆ చనిపోయిన బిడ్డ వారి మనస్సును కలవర పెడుతూనే ఉంటాడు. నా విషయంలో అనూరాధ కూడా అంతే శ్రీవిద్యా."

కళ్ళు మూసుకుని తలవంచు కున్నాడు. రెండు నిమిషాలు గడిచాయి. కళ్ళు తెరిచాడు. ఆ కళ్ళలోని ఆర్ద్రతను చూసింది శ్రీవిద్య.

"కన్న బిడ్డను మరిచి పోలేక పోవటం కడుపు తీపిచేత, అది చాలా సహజమైన ప్రేమాను బంధం, కాని ప్రియురాల్ని మరిచిపోలేక పోవటం పరస్త్రీ వ్యామోహానికి పరాకాష్ఠ" అన్నది. అతను కళ్ళు తుడ్చుకొన్నాడు.

"శ్రీవిద్యా, మనిషి సన్మార్గ దుర్మార్గ స్వభావానికి కారణం, కొంతవరకూ పరిస్థితుల ప్రభావం. ఆర్థిక సమస్య. నేను కేవలం స్త్రీలోలుడిని, చాలా అనుభవం సంపాదించిన వాడిని, అనే ఏహ్యాభావం, అసంతృప్తి నీలో ఉంది. నిన్ను వేధిస్తుంటే, నన్ను పెళ్ళి చేసుకోమని నిన్ను నేను అడగను, మనస్సు విప్పి ప్రతి విషయం చెపుతున్నపుడు, ఒక చేసిన తప్పును గురించి పదే పదే తర్కించటం భావ్యం కాదు. పవిత్రత, సచ్ఛీలం అనేది ఒక్క శరీరానికే కాదు కావాల్సింది. మనస్సుకూ, ఆలోచనలకూ కూడా కావాలి. నేను ఎస్. బి. ఎకౌంట్సులో వేసిన పాతిక వేలూ, నువ్వు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసుకున్నావంటే, నువ్వు నాకు అమ్ముడు పోయినట్లే కద, శారీరకంగా పవిత్రురాలివే కాని, మానసికంగా కాదు. నీ మీద నాకు అనుభవించటానికి హక్కున్నది. కాదని మనస్సాక్షిగా ఆలోచించి సమర్థించుకో చూద్దాం. ఈ రోజు కాదు, వారం రోజుల తరవాతనే, నీ వాదన వినిపించు. సరే, ఇంకా నువ్వు తీర్చుకో వలసిన సందేహాలు" అన్నాడు హేమంత్. కాస్త ఖంగు తిన్నది శ్రీవిద్య. ఆలోచన మనస్సుని చితక పొడిచింది. ఇక టాపిక్ మార్చక తప్పలేదు. లేకపోతే డబ్బు తిరగి ఇవ్వాలి కద!


"ఆ ఇంగ్లీషు నవలలో ఓ క్వశ్చనీర్ ఫారం రాశారు, దానికి కారణం, మీకు పరిచయం అయిన ప్రతీ ఆడపిల్లనూ ఆ ఫారంలో బిగిస్తారా" అన్నది.

ఆ నవల ఎప్పుడు చూసిందా అని ఆశ్చర్య పోయాడు.

"నాకు పరిచయం అయిన ఆడపిల్లల్ని గురించి నా అభిప్రాయాల్ని ఆ ఫారంలో నోట్ చేస్తాను. నీ చరిత్రా ఉన్నది" తన హ్యాండ్ బ్యాగ్‌లో నుంచీ డైరీ తీశాడు. డైరీ పాకెట్‌లో ఒక కాగితం శ్రీవిద్య చేతికి ఇచ్చి చదువుకో మన్నాడు.

పర్టిక్యులర్స్

1. శ్రీవిద్య – వయస్సు 19 సంవత్సరాలు.
2. ఇంటర్మీడియెట్.
3. స్వకులము.
4. పరువు మర్యాదలు కలదాన్ననే భేషజం కాస్త ఉన్నది.
5. పొందికయిన అవయవాలు. పొడుగాటి పర్సనాలిటీ, అందం 60%, చందం 20%.
6. కాలేజీకి కాలినడకన జూలియెట్‌లా వెళ్ళుతుంటే చూశాను. నడకలో నాజూకయిన దర్పం ఉన్నది.
7. మా అక్కయ్య హేమలత గారింట్లో.
8. బీచ్‌లో ముద్దు, చెంప దెబ్బ.
9. ప్రేమను గురించి థీరిటికల్‌గా చాలా తెల్సు, చాలా మాటకారి
10. స్వీటిస్ట్ కబుర్లు, అభిప్రాయాల్ని మార్చు చేసుకోగల నేర్పరి, తొందర పడదు.
11. స్నేహాన్ని సాగదీసి అన్ని వివరాలూ తెల్సుకొని పెళ్ళి చేసుకోవాలి అనే కోరిక గల ఆడపిల్ల.
12. పుటకలో వచ్చిన సెక్సందము, తెచ్చి పెట్టుకున్న సెక్సందం కాదు.
13. ఆర్థిక స్తోమతలేని కుటుంబంలో



కోట ప్రసన్నలక్ష్మి-కందుకూరు

ప్ర : మహనీయుడైన ప్రతి మగవాని వెనకా ఒక స్త్రీ ప్రభావం ఉంటుందంటారు. మరి పతనమైనప్రతి మగవానికీ ప్రేరణ కూడా ఆడదే నంటారా?

జ : మనిషి పతనానికిగాని, ఔన్నత్యానికి గాని బాగా ఆలోచిస్తే ఎవరూ ఎవరికీ ప్రేరణ కాదు. ఈ రకమైన ప్రేరణ అనేది నిందారోపణ చెయ్యటానికి ఉపకరించేది. నింద వేయటానికి పనికొచ్చే సామెత. కర్మ ప్రభావాన్ని ఒప్పుకోలేక, నమ్మకం లేక ఇలాంటివన్నీ అంటూ ఉంటారు.

పల్లె వసంత- ముత్యాలంపాడు

ప్ర : నేటి యువతపై నవలల ప్రభావం ఎలా ఉందో రచయితగా మీ అభిప్రాయం తెలుపండి.

జ : చాలా ప్రభావం ఉన్నది. ఆ ప్రభావం ఎలా ఉన్నదో మీరే గ్రహించి తెల్సుకోండి.

నున్న సుబ్బలక్ష్మి-నర్సీపట్నం

ప్ర : ఉత్తమ చిత్రం, ఉత్తమనవల, ఉత్తమ ప్రశ్న అంటూ ఉంటారు కదా, అసలు 'ఉత్తమ' అంటే అర్థం ఏమిటి?మీకు ఉత్తమ ప్రశ్న అనిపించింది, మాకు పరమ చెత్తగా అనిపించవచ్చు. ఉత్తమ ప్రశ్నని ఏ విధంగా నిర్ణయిస్తారు?

జ : మా నదవగాహన మీకు పరమ చెత్తగా అనిపించినప్పుడు ఆ చెత్తని చెత్తగానే మనస్సులో నింపుకోండి.

ఎ.సురేష్ కుమార్-హైదరాబాద్

ప్ర : మనిషి జీవితంలో ప్రతీ ఓటమి, ఓ గెలుపుకు నాంది అంటారు కదా అది ఎంత వరకూ నిజం? ఇలాంటిది మీ జీవితంలో జరిగిందా?

జ : చేసిన తప్పు చెయ్యకుండా అదొక హెచ్చరిక. అందరి జీవితాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి.

● ఈ వారం ఉత్తమ ప్రశ్నగా ఏదీ ఎంపిక కాలేదు.

నెస్టమ్® బేబీ సిరియల్ - రైస్

మీ పాపాయి యొక్క ఆదర్శప్రాయమైన తొలి ఘన ఆహారం

వాడి చూడండి!

నెస్టమ్ బేబీ సిరియల్ని పాలలో కలిపినప్పుడు అది అన్నానికి గల తేలిగ్గా జీర్ణమయ్యే గుణం, పరిపూర్ణ పోషకాహారపు మంచితనం అందజేస్తుంది 4 నెలలు వయసు వచ్చాక పాపాయి ఆహారంలో మీరు ఘన పదార్థాలు ప్రవేశ పెట్టేటప్పుడు, నెస్టమ్తో ప్రారంభించండి బియ్యంతో తయారు చేయబడిన నెస్టమ్, తేలిగ్గా జీర్ణయం అయ్యేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది అంతేకాదు, నెస్టమ్, ఇనుము, విటమిన్లతో మరింత బల వర్ధకం చేయబడింది



నెస్టమ్ని తయారు చేయడం ఎంతో సులువు దీనిని ముందుగా కాచిన వెచ్చటి పాలల్లో కలపండి అంతే, పాపాయికి తినిపించేందుకు ఆహారం తయారు!

నెస్టమ్ పాలు లేకుండా అందుబాటులో ఉన్న ఒకే ఒక సిరియల్ మీరు మీ పాపాయి ఆహారంలో వివిధ రుచులు తెచ్చేందుకు ముందుగా ఉడికించి యింట్లోనే తయారు చేసిన మెత్తటి గుజ్జుగా చేసిన కూర ముక్కలు, పప్పు, పండ్లు నెస్టమ్లో కలపండి

కేవలం
రూ 9/-* కే
డబ్బాలో
200 గ్రా.
సంచీ



* స్థానిక పన్నులతో సహా

ఉచితం !


నెస్టమ్ రెసిపి బుక్ లెట్
ఈ చిరునామాకు వ్రాయండి
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం 6016
న్యూ ఢిల్లీ 110 008

Nestlé®

ప్రస్తుతం ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే దొరుకుతోంది

R K SWAMY:FSL5327 TEL

నలభీమపాకం




మటన్ బిర్యాని

మా వారు శ్రీ కె. ఎం. రెడ్డి మిలటరీలో పని చేశారు కాబట్టి ఆయనకు అన్ని వంటలు వచ్చు. అందులో ఆయనకు మిక్కిలి యిష్టమైనది "మటన్ బిర్యాని". దానిని మా వారు నెలకొక సారైనా వండి మా యింటిలో వారందరికి పెడతారు ఒకసారి చేసి తినండి.

కావలసిన వస్తువులు :- పలావు బియ్యం (లేకపోయినచో మసూరి బియ్యం వాడవచ్చు.) మాంసం, పచ్చికొబ్బరి, యాలకులు, లవంగాలు, చెక్క, కొత్తిమిర, పుదీన, పచ్చిమిరపకాయలు, అల్లం, నెయ్యి (లేకపోయినచో డాల్డా) ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు, ఉప్పు, మసాలా ఆకు.

బియ్యాన్ని నానబెట్టి శుభ్రంగా కడిగి నీళ్ళు లేకుండా వంచి పెట్టుకోవాలి. మాంసాన్ని పెద్ద, పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు, పుదీనాను వేరువేరుగా వీటిలో వేసి దంచి పెట్టుకోవాలి. యాలకులు, లవంగాలు, చెక్క, అల్లం నూరి పెట్టుకోవాలి. పచ్చి కొబ్బరి మాత్రం రోటిలో వేసి మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. పచ్చిమిర్చిని పొడవుగా దబ్బలు తీసి పెట్టుకోవాలి. కొత్తమిరి, కొన్ని ఎర్రగడ్డలను తరిగి పెట్టుకోవాలి.

పొయ్యి మీద బాణలి పెట్టి డాల్డా వేసి కాగిన తరువాత మాంసం ముక్కలు వేసి వేయించవలెను. కొంచెం సేపయిన తరువాత అందులో ఉప్పు కొంచెం పసుపు పొడి, మిరప పొడి, ధనియాల పొడి, నూరిన ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు వేసి కలియబెట్టి కొంచెం సేపు ఉడికించి వేరుగా పెట్టుకొనవలెను.



తరువాత పొయ్యి మీద వెడల్పు మూతగల పాత్రను పెట్టి నెయ్యి వేసి కాగిన తరువాత తరిగి పెట్టుకున్న ఎర్రగడ్డలు వేసి దోరగా వేయించి అల్లం, పుదీన, కొత్తిమిర, పచ్చి మిరపకాయలు వేసి వేగిన తరువాత బియ్యానికి సరి పడా నీరు కొలిచి పాత్రలో పోసి మూత పెట్టవలెను. కొంచెం సేపయిన తరువాత రుబ్బి వుంచుకున్న కొబ్బరి, మసాలాకు వేసి నీటిని బాగా మరగబెట్టాలి. నీరు వెళ్ళిన తరువాత అందులో బియ్యం వేసి, గరిటతో కలబెట్టి మూత పెట్టాలి. కొంచెం సేపయిన తరువాత మాంసం ముక్కలను అందులో వేసి కలబెట్టి సన్నగా సెగ పెట్టి ఉడికించాలి. బియ్యం ఉడికిన తరువాత చూసి పొయ్యి మీద నుంచి దించి పెట్టుకోవాలి. దీనికి తోడుగా పెరుగు చట్నీ చేసుకుని వేడి వేడిగా రెండు కలిపి తింటే చాలా రుచిగా వుంటుంది. ఇది కట్టెల పొయ్యి మీద వండినది.

గ్యాస్ కుక్కర్ అయితే :- మొదటి బాణలిని గ్యాస్ పొయ్యి మీద పెట్టి నెయ్యి వేసి కాగిన తరువాత మాంసపు ముక్కలు వేసి వేయించి ఉప్పు, పసుపు, కారం మిగతా మసాలా వస్తువులన్ని వేసి కలియబెట్టి దానిని వేసి కుక్కర్‌లో వేసి కడిగిన బియ్యాన్ని, బియ్యానికి సరిపడా నీరుపోసి, కలియబెట్టి కుక్కర్ మూత బిగించి గ్యాస్ పొయ్యి మీద 10 నిమిషాలు అయ్యేంత వరకు ఉడికించి కాసేపు అయిన తరువాత వేడివేడిగా తింటే బాగుంటుంది.

(పంపిన వారు : శ్రీమతి అన్నపూర్ణ)

ఆడపిల్లలు - అనుభవాలు

జన్మించిన ఆడపిల్ల, ఫ్రీగా వచ్చే పదవయితే ఛీఫ్ సెక్రటరీ చేసే భర్త కావాలనే కోరిక కలది.

14. ధనాశలేని ఆడపిల్ల కాదు, డబ్బుకోసం తొందరపడే వ్యక్తి కాదు, మనస్సుకు లొంగుతుంది గాని డబ్బుకు లొంగదు, కాని డబ్బు కావాలి.

15 ది ప్యూర్ అండ్ ఫ్రెష్ వర్జిన్ గరల్‌ననే అహంభావం కాస్త ఎక్కువ.

జనరల్ రిమార్క్స్.- కష్టపడి ప్రేమిస్తే కసిరి కొట్టినా, మళ్ళీ ప్రయత్నించ తగిన అమ్మాయి. థీరిటికల్‌గా గొప్ప అనుభవశాలి, ప్రాక్టికల్‌గా జీరో. పెళ్ళాడ తగిన పిల్ల డబ్బు మీద ఆశ ఉన్న మగువ ...

"వెరిమెనీ థాంక్స్ ఫర్ యువర్ గుడ్ వొపీనియన్ ఆన్ మి" ముక్తసరిగా అని ఆ కాగితాన్ని అతనికి ఇవ్వబోయింది అతను తీసుకోలేదు

"నా రిమార్క్స్ బావున్నయ్యన్నావు, అంటే అటు నించీ ఆలోచిస్తే నన్ను పెళ్ళి చేసుకోవడం నీకు ఇష్టమేగా" మరోసారి ఫారం చదువుకున్నది.

"కసిరి కొట్టినా కత్తిలేని పిల్ల కాబట్టి, కష్టపడి ప్రేమించినా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించ తగిన అమ్మాయి, అన్నారు. మీరు చేసిన తప్పుకు ఇంకా మీరు కష్టపడాలి" అన్నది ఆ కాగితాన్ని టేబుల్ మీద ఉంచి. గోరు కొరుక్కుంటూ చూశాడు.

"నేను ఫారంలో రాసిన రిమార్క్స్‌కి, నువ్వు చెప్పిన మాటకీ కాస్త తేడా ఉన్నది, నాతో స్నేహం చేశాక కాస్త కల్తీ భావాలూ, కల్తీ మాటలూ, ఆల్‌రైట్, కావమ్మ మొగుణ్ణని అందరూ అంటే కామోసు అనుకున్నాను, కాదంటే కర్రా బుర్రా పారేసి పోతాను అన్నట్టు వెనకటికో ప్రబుద్ధుడు కొన్నాళ్ళు కావమ్మతో కాపరం చేసి. నష్టం కావమ్మకే గాని, ఆ మొగుడికి కాదు. పాతికవేలూ ఫిక్సెడ్ డిపాజిట్ చేసుకుంటే, నన్ను ప్రేమించటానికి వొప్పేసు కున్నావను కున్నాను. కాదంటావా నీ ప్రేమను సారీ, నా ప్రేమను వడ్డీతో సహా రిటరన్ చేసెయ్, ఆ ఫిక్సెడ్ డిపాజిట్ డబ్బు కూడా ఇవ్వాలి పాతిక వేలు జమ కట్టి, ఒక్కసారి ముద్దు పెట్టుకుని, ఒక్క చెంప దెబ్బ తిన్న నేను, మళ్ళీ నీ మీద చెయ్యి వెయ్యలేదు" అన్నాడు కాస్త ఆవేశపడుతూ. అతని మనస్సు మరోసారి అర్థం చేసుకున్నది.


"సారీ సర్, మీ మనస్సును బాధ పెట్టాను మనస్సు బాధపడిన కొద్దీ ప్రేమ, అభిమానం ఆకాంక్ష, కోరిక చక్కగా, ఏపుగా ఎదిగి పెద్ద వవుతయ్యి. రేపు మా ఇంట్లో మీకు డిన్నరిస్తాను. తప్పక రావాలి. మిమ్మల్ని కాబోయే అల్లుడుగా మా అమ్మకు పరిచయం చేస్తాను. అంత మందిలో మీరు జీవితాంతం మరువకుండా గుర్తు పెట్టుకునే ముద్దిస్తాను. ఇంకా నా మనస్సులో ఆరు ప్రశ్న లున్నయ్యి" అన్నది శ్రీవిద్య.

"వప్పుకున్నాను, కాని నేను కాకినాడ వెళ్ళాలి, వచ్చే సోమవారం పదకొండు గంటలకు డిన్నర్ ఏర్పాటు చెయ్యి. ఓ. కే."

"ఓ. కే. బాస్. సోమవారం ఉదయం పదకొండు గంటలకు డిన్నర్ ముహూర్తం" అన్నది శ్రీవిద్య.

(ఇంకాఉంది)

దశదిశలకి గోదావరి ఎరువుల ఖ్యాతి!





ఎమ్. గోపాలకృష్ణ (ఐ. ఏ. యస్)

"గోదావరి" డి. ఏ. పి.

చాలా కాలంగా మన ఆంధ్రా అంటే "ఏ. పి. పంటలకే ప్రసిద్ధి అని అందరికి తెల్సు. ఇప్పుడదె డి. ఏ. పి.కి కూడా బాగా ప్రసిద్ధి. డి. ఏ. పి. అంటే డై అమ్మోనియం ఫాస్ఫేటు ఎరువు. దీన్ని "గోదావరి డి. ఏ. పి.గా యు. పి., రాజస్థాన్, బీహార్, పంజాబ్‌లలో రైతులు మక్కువతో ఎక్కువగా వాడుతున్నారు.

దక్షిణ "గంగా" నదిగా వాసికెక్కిన 'గోదావరి' నదీమ తల్లి పేరిట, తూర్పుగోదావరి జిల్లాలోని ప్రశాంతమైన చక్కని తీరనగరం కాకినాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం– "ఇఫ్‌కో"కి సంస్థలు సంయుక్తంగా నెలకొల్పిన యీ ఎరువుల కర్మాగారం యీ తరహా ఫ్యాక్టరీలలోనే పెద్దదని మానేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎమ్. గోపాలకృష్ణ వివరంగా చెపుతూ వుంటే గొప్ప హాయిగా వినవచ్చును. అనుకున్న సమయంలో అనుకున్న ఖర్చుతో యీ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేసి యివాళ మూడు పూలు ఆరు కాయలుగా దీని ఉత్పత్తిని కొనసాగిస్తూ వున్నదీ యీ గోదావరి డి. ఏ. పి. కర్మాగారమూ అంటే అదంతా "సిబ్బంది" గొప్పతనం అని ఎం. డి. అంటే కాదు మా గోపాలకృష్ణగారి "సమర్థత" అని వారంటున్నారు.

రోజుకి 1000 టన్నులు

మొత్తం మీద కాకినాడకి పదికిలోమీటర్‌లలో వున్న యీ ఎరువుల కర్మాగారం యిప్పుడు రోజుకి వెయ్యిటన్నుల డై అమ్మోనియం ఫాస్ఫేటు" ఎరువుని తయారు చేసి ఒక ప్రక్కన మన రాష్ట్ర అవసరాలకు లారీలలో నలభై కే. జీల బస్తాలుగాను రెండో వైపు 50 కే. జీల బస్తాలతో యితర రాష్ట్రాలకు రైలుబండ్లలో ఒకేసారి పంపించేస్తుంటే చూడ ముచ్చటు వేస్తుంది!

పైర్లు దిగుబడికి నత్రజని భాస్వరం రెండూ చాలా అవసరం వాటిని పుష్కలంగా యిచ్చే యీ డి. ఏ. పి. గోదావరిని "దుక్కి"లోగాని, 'దమ్ము'లో గాని వేసుకున్న రైతు తన 'కలలు' పొలంలోనే పండించుకుంటాడని యీ ఫ్యాక్టరీ యాజమాన్యం వాగ్దానం చేస్తున్నది.

చక్కగా నడుస్తున్న ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీ అంతా చూడటానికి రెండున్నర గంటల కాలం పట్టింది. ఉత్తరార్థగోళం, దక్షిణార్థగోళం లాగ రెండు పెద్ద గోళాకార పాత్రలు దూరం నుంచే మనల్ని ఆకర్షిస్తాయి. వీటిలో "విశాఖ" నుంచి సొంత రైలు టాంకర్‌లలో తెచ్చుకున్న "అమ్మోనియాని ద్రవరూపంలో వుంచుతారు. ఫాస్ఫారిక్ యాసిడ్‌ని కూడా విశాఖపట్నం నుంచి తెచ్చుకుంటారు. ఈ రెండూ కూడా 'గోదావరి' వారు దిగుమతి చేసుకుంటున్నారు– అందుకనే యిప్పుడు– ఫాస్ఫారిక్ యాసిడ్‌ను తయారు చేసే కర్మాగారం స్థాపించాలని కూడా యీ సంస్థ యోచిస్తున్నది. అమ్మోనియా ఫాస్ఫారిక్ యాసిడ్‌ల కలయిక మొదలు, ఎరువు పూర్తి అయి పొడి పొడి రవ్వగా బస్తాలలో చేరేదాకా కూడా అంతా యంత్ర సహాయంతోనే జరుగుతున్నది. అధునిక పరికరాలు, కంప్యూటర్‌ల వాడకం విరివిగా వుంది.

మార్కెటింగ్‌లో కింగ్

ఈ సంస్థ మార్కెట్ మీద యిప్పటికే మంచి అజ్మాయిషీ సంపాదించింది. 64 శాతం డి. ఏ. పి. మార్కెట్ వీరిదే. ఈ సొంత ఎరువునే గాక యీ సంస్థ తనకున్న మార్కెట్ సౌకర్యాల దృష్ట్యా యూరియా,

అమ్మోనియం నైట్రేట్ జింక్ సల్ఫేట్ వగైరా అన్ని రకాల ఎరువులను కూడా పంపిణీ చేస్తున్నది. దీనివల్ల ఒకే చోట రైతుకి అవసరమైన ''ఎరువుల'న్నీ దొరికే అవకాశం వచ్చింది.

ఈ ఫ్యాక్టరీ విస్తరణ కార్యక్రమం కూడా చాలా పెద్దదే అన్నింటికన్నా ముందు దీని ఉత్పత్తి శక్తిని యిప్పటి మూడు లక్షల టన్నుల నుంచి ఆరు లక్షలకి చేయ సంకల్పించామని, శ్రీ గోపాలకృష్ణ (ఐ. ఏ. ఎస్.) చెప్పారు. రాజమండ్రి నుంచి సహజ ఇంధన వాయువును తెచ్చుకొని, దాని సాయంతో ''యూరియా'' తయారు చేసే ''ప్లాంట్'' కోసం ప్రయత్నం చేస్తున్న యీ గోదావరి ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ సంస్థ– ఒక ''ప్లాంట్''గా గాక ఒక వట వృక్షంగా విస్తరిల్లి మన రాష్ట్రానికి దేశానికి కూడా రైతులపాలిట కల్పతరువు కావాలని ఆశిస్తాను.

ఫ్యాక్టరీని చూపించిన అధికార్లంతా– సంస్థ పట్ల ఎంతో ప్రేమాభిమానాలున్నవారు ఆటు తరువాత పత్రికా సంపాదకుల గోష్ఠిలో ఎం. డి. తో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ ఏ. సి. దొర, ప్రత్యేకాధికారి శ్రీ వెంకటేశ్వరరావులు కూడా పాల్గొన్నారు. సంస్థ చీఫ్ పి. ఆర్ ఓ. శ్రీ సూర్యనారాయణ అతని బృందం కూడా కర్మాగార చాయా చిత్రాలు, వివరాలు వగైరాలను అప్పటికప్పుడు అందించారు.

ఏ. పి.లో మొదటి డి. ఏ. పి. గోదావరి ముఖ్యాంశాలు

1. గోదావరి ఎరువుల సంస్థ– ఆంధ్రప్రదేశ్‌లో సంయుక్త రంగంలో నెలకొల్పబడిన అతి పెద్ద సంస్థ.

2. గోదావరి ఎరువుల సంస్థ– రైతులు, సహకార సంస్థలు, ప్రవాస భారతీయులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, సంస్థ డీలర్లు, భారత ప్రజల భాగస్వామ్యం వహిస్తున్న ఏకైక సంస్థ.

3. గోదావరి ఎరువుల సంస్థ– ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద పెట్టుబడి (రు. 108 కోట్లు) గల సంయుక్త సంస్థ.

4. గోదావరి ఎరువుల సంస్థ– ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన సంస్థలన్నింటి కంటే ఎక్కువగా రైతులు, సహకార సంస్థలు, ఎరువుల డీలర్లు, తదితర భారతీయులు వాటాదార్లుగా (93263) గల సంస్థ.

5 గోదావరి ఎరువుల సంస్థ– ప్రజల వాటాధనంగా రు. 15 75 కోట్లను సేకరించి 1986వ సంవత్సరంలో దేశం మొత్తం మీద అతిపెద్ద మొత్తాన్ని విజయవంతంగా సమీకరించుకున్న సంస్థ

6. గోదావరి ఎరువుల సంస్థ– డి. ఎ. పి. ఎరువును తయారు చేసే మొట్ట మొదటి కర్మాగారాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన సంస్థ.

7. గోదావరి ఎరువుల సంస్థ– కర్మాగారాన్ని అనుకొన్న కాలపరిమితికి ముందుగానే అంచనా ఖర్చులను మించకుండా నిర్మించుకున్న ఏకైక సంస్థ.

8. గోదావరి ఎరువుల సంస్థ– ఫాస్ఫారిక్ ఏసిడ్‌ను రవాణా చేయడానికి స్వంతంగా స్టెయిన్‌లెస్‌స్టీల్ రైలు వ్యాగన్‌ల సమూహాన్ని కలిగి, రైలుద్వారా ఫాస్ఫారిక్ ఏసిడ్‌ను రవాణా చేస్తున్న ఏకైక సంస్థ.

9. గోదావరి ఎరువుల సంస్థ– విశాఖపట్నం రేవు చరిత్రలో ప్రప్రథమంగా ఫాస్ఫారిక్ ఏసిడ్‌ను, అమ్మోనియాను విశాఖపట్నం రేవులో దిగుమతి చేసుకున్న సంస్థ.

10 గోదావరి ఎరువుల సంస్థ– తమ కర్మాగారంలో డి. ఎ. పి. ఎరువును ఉత్పత్తి చేయకముందే, ఆంధ్రప్రదేశ్‌లో అతి ఎక్కువ అమ్మబడిన డి. ఎ. పి. బ్రాండ్ గోదావరి డి. ఎ. పి.

11. గోదావరి ఎరువుల సంస్థ– సాలుకు మూడు లక్షల టన్నుల ఎరువును ఉత్పత్తి చేసే తన కర్మాగారం ఉత్పత్తిని ప్రారంభించక ముందే, మూడు లక్షల టన్నుల అమ్మకాన్ని అధిగమించిన సంస్థ.

–వీరాజీ

వ్యాఖ్యపోటీ

9–12–88 సంచికలో ప్రచురించిన ఫోటోకు ప్రతి స్పందనగా ఎంతో మంది పాఠకులు వ్యాఖ్యలు పంపారు. రెండు మాసాల పాటు ఉచితంగా ఆంధ్ర సచిత్ర వారపత్రిక అందుకునే బహుమతిని కె. వి. మధుసూదనరావు (కాకినాడ) గెలుచుకున్నారు.

గమనిక
సర్క్యూ... కారణంగా
తపాలా సౌకర్యాలు
దెబ్బతిన్నందు వల్ల
వ్యాఖ్య పోటీ-1 ఫలితాలు
కొంచెం ఆలస్యంగా ప్రకటిస్తు
న్నాము

బహుమతి పొందిన వ్యాఖ్య :

సినీ ప్రేయసీ ప్రియులకు ఇదో ఫంక్షన్
మన ప్రేక్షకుల నరాల్లో అదో టెన్షన్.



మా ఎన్నికలో నిలిచిన మరి నాలుగు వ్యాఖ్యలు :

★ అగ్నికి తోడు గాలి
ప్రేమాగ్నికి తోడు నీడ

పంపిన వారు : కె. రామారావు (హైదరాబాద్)

★ చిట్టి చిటి చినుకు– చిరుజల్లులోన
చిన్నారి మేనితో – సన్నాయి మ్రోగ
నడ్డి పట్టు దొరక – హాయిరా నీకు
బొడ్డు కనిపిస్తేనే – పదివేలురా
మాకు
ప్రియా విజయీభవ!

–పంపిన వారు : వక్కలంక రామారావు (అనపర్తి)

★ కూడు గుడ్డ గూడు సరిగా లేని
దేశంలో
ప్రేమతీర్చే దాహంతో బతుకు
గడుపుకోవాలి మరి!

–పంపిన వారు : కె. కారంచేటి (హైదరాబాద్)

★ తనువులు తాపంతో కాగ
వలపుల వానజల్లు కురవ
కాగిన తాపం చల్లారి
మనసుల్లో మోహంబు నిండె!

–పంపిన వారు : శరగడం నరసింగరావు (విశాఖపట్నం)

దూరదర్శనం

లత

బుధవారం వస్తున్న సుగుణాల బుట్ట హిమబిందు. అన్నీ మంచిగుణాల్లు. సాహస విక్రమార్క. ఆ సమాసం తప్పా? కావచ్చు! నాటకం అలాగే వుంది మరి – బిందు లలలా – అహ బిందు లలలలా నాలగా లగలగా లలాలాలా.. ఆశయాల సింధువులో కొత్త అలవు నీవు లలలా. ఇది సిగ్నేచరు పాట – కులదినాలుతో కొట్టుకొంటున్న ఒక నాయకుడి కొడుకుని మరో కులంవాళ్ళు తల పగలగొడతారు. ఆ సందర్భంగా ఆ కులపువాళ్ళు రక్తం ఇవ్వరు కాని హిమబిందు రక్తం ఇస్తుంది. తల పగిలినవాడు తన చెల్లెలి లవరు – కాస్త రక్తం యిచ్చి అతని తండ్రిని ఒప్పిస్తుంది. ఇదే బాగుంది – శాకలో చెల్లెలు పెళ్ళి అయింది అంత ఆశయాల సింధువు.... ఆ హిమబిందు అదండీ కధ.

వార్తలు

ఈనాడు జితేంద్ర – వెంకటేశ్వరి అనే న్యూస్ రీడర్లు కాల్చుకుతిన్నారు. జితేంద్ర ఆపినప్పుడు ఆ వెంకటేశ్వరి అందుకోలేదు. ఖంగారుపడి ఒదిలేసిన వాక్యాన్ని జితేంద్ర చెప్పాడు. ఈ అమ్మాయి కోపంగా, విసుగ్గా – ఈ ప్రేక్షకులకు వార్తలు చెప్పడం గొప్పతప్పుగా భావించి.. వాళ్ళకి పనిష్మెంటు ఇవ్వాలని తప్పులు చదివి కక్ష తీర్చు కుంటున్నట్లున్నది. . న్యూస్ డైరెక్టరూ ఆ అమ్మాయిని చిరునవ్వు నవ్వమనీ, తప్పులు చదవొద్దనీ చెప్పండి వార్తల్లో వెంకట్రామన్‌గారు కలంతో వ్రాయాలన్నా – చీపురుకట్టతో తుడవాలన్నా.... నాయినా జితేంద్రా ఏమిటి దీని అర్థం?

★ ★ ★

శుక్రవారం రామాయణం వస్తున్నసంగతి టి.వి. ప్రేక్షకులకు తెలుసు. ఈ వారం గరుత్మంతుడు కాస్త గర్విస్తాడు. రామలక్ష్మణుల నాగపాశాలు తనే విడిపించానని, నారదుడు అదేదో తెలుసుకోవడానికి శివుడు దగ్గరకు పొమ్మంటాడు శివుడు నీలశైలంలో కాకిరాజు ఒకడు మహాభక్తుడు అక్కడికి వెళ్ళి రామభక్తి సుధసేవిస్తే మంచిదంటాడు. ఇది ఏ రామాయణంలో ఉందో మరి? సరే ఎగురుతూ మన గరుత్మంతుడు వెళతాడు. కాకిరాజూ పక్షిరాజూ పరస్పరం అభినందించుకుని కొద్దిగా మాట్లాడుకున్నాక కాకిరాజు దివ్యదృష్టితో చూసి నారదుడు వాల్మీకి దగ్గరకు వెళ్ళాడంటాడు. సీతలా వాల్మీకిని చూపించి హృదయంలో జ్యోతి వెలిగించి ఈ వారానికి ఆపేశారు. అయ్యో ఉత్తర రామాయణం విక్రమ్ ఔర్ భేతాళ్ లాగా తయారవుతున్నదని చెప్పటానికి విచారిస్తున్నాను. రామపాదారవిందాలు నా హృదయంలో ఉన్నాగాని.... రామానందసాగర్‌ని ఇక మెచ్చుతేం అనుకుంటా!

వేదాంతం రాఘవయ్య

దర్శక వైతాళికులు వేదాంతం రాఘవయ్య గారిమీద కార్యక్రమం వ్యాఖ్యాత కోడి రామకృష్ణ దేవదాసు, చిరంజీవులు, రాజనందిని, అనార్కలి, ఋణానుబంధం, బాలనాగమ్మ – మొదలైన చిత్రాలకు శ్రీ రాఘవయ్యగారు దర్శకత్వం వహించారు. చిన్నతనంలో.... హృదయం యింకా కరుడుకట్టనప్పుడు – మెత్తదనం – సుతిమెత్తని భావాలు ఇంకా ఉన్నప్పుడు దేవదాసు చిత్రం చూసి దుఃఖపడ్డాను. ఈ రోజు కీర్తిశేషుడైన కళాతపస్వి ఆ కూచిపూడి విప్రుని తలుచుకున్న రామకృష్ణగారు అభినందనీయులు – ఆశ్చర్యం ఆనాటి నటయవ్వనం... ఘోరంగా వృద్ధులయారు యిప్పుడు. ఈ వార్ధక్యపు ముడతలు శారీరక కళాకారులకే. రచయితలు వృద్ధులైనకొద్దీ పండుతారు. ●





యాభై నెలలకు పైగా సాగిన శ్రీమతి యిందిరా ప్రియదర్శిని హంతకుల కేసుకు– జనవరి 6న నేరస్థులు కేహార్ సింగ్, సత్వాంత్ సింగ్‌లు ఉరితీయ బడటంతో తెరపడ్డది. అయితే వారి "చితాభస్మం" కేసు మళ్ళీ సుప్రీంకోర్టు కెక్కింది.

వారఫలం

13-1-1989 శుక్రవారం మొదలు 19-1-1989 గురువారం వరకు

మేషం: వార విశేషం, ఏరే గ్రహిస్తారు, ఏమనుకొన్నారు, ఏమి జరిగింది, ఎవరో మేలు చేస్తారను కొన్నారుగా మొండి చేయి చూపిస్తారు. అంతా మానవ యత్నం గాదు, "గురుస్థితి" రాశికి మూడింటి స్థితి మేలుగాదు ఆర్థికంగా మేలు లేదు స్త్రీలకు: చేసిన ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి

వృషభం: రాజకీయంగా మీకు ఎలాంటి మేలు జరుగదు. మీ యత్నాలు సానుకూలం అయ్యే మార్గం లేదు. అంతా గ్రహ విశేషాన ఆధారపడియే ఉంటాయి ఏ వ్యవహారాన్నయినా దీక్షతో సాధింప యత్నించండి స్త్రీలకు పుట్టిన యింటి ఆస్థి భాగం కొందరకు కొంత అయినా గిట్టుబాటు అవుతుంది అయిన వారి సహాయం ఆశించి బంగపడుతారు

మిథునం: ఉద్యోగార్థులు, ప్రయత్నాలు సానుకూలం కాపటంతో, యింటర్వ్యూ దాకా వ్యవహారం అనుకూలిస్తుంది వాతావరణం సుఖ దాయకం దూర ప్రయాణాలు రానున్నాయి, సాగించండి, మేలున్నది స్త్రీలకు: సర్వాభీష్ట దాయక వారం ఆర్థికానంద దాయకం.

కర్కాటకం: ఆలస్యంగానయిన ఒకానొక కుటుంబ వ్యవహారం మీకు అనుకూల దాయకం. వృత్తి యందు చెప్పుకోదగిన వికాస మున్నది. ఉన్నతస్థాయి గల వ్యక్తులతో, సన్నిహిత సంబంధాలుంటాయి. స్త్రీలకు రాజకీయ వాదులకు అనుకూల సమయం ప్రయత్నాలకు ఉద్యుక్తులు కండి.

సింహం: మీ పట్టుదల, కార్యదీక్ష వాచా చాకచక్యం, సమయస్ఫూర్తి వలన కొన్ని వ్యవహారాలు నిర్ణయ ప్రకారం సానుకూల మవుతాయి ఈ వారాన భారీ ప్రణాళికలు చేపట్టకండి మానవ యత్నాలు సాగాలంటే, దైవ బలం కావాలి. పిల్లల సమస్యలు కొంత బాధాకర మవుతాయి స్త్రీలకు అవసరాలకు ఏదో విధంగా డబ్బు వారమంతా అందుతూనే ఉంటుంది ఆరోగ్యం జాగ్రత్త!

కన్య: ఈ వార పరిస్థితులు, స్థితిగతులు, గత వారానికన్నా మేలుగా ఉంటాయి అపుడపుడు కొంత ఇబ్బంది తటస్థ మవుతుంది పట్టుదల, సమయస్ఫూర్తి అవసరం రాజకీయాలు కలసిరావు, వృధా ప్రయాస స్త్రీలకు, వృత్తియందు, ఉద్యోగ మందు, వ్యాపారరీత్యా కొందరకు అనుకూలం, గ్రహించాలి

తుల: గ్రహానుకూలత యున్నది ఒక్క శని భగవానుడు చాలడా మీకు కళాసాహితీ రాజకీయ, నాట్య నాటక వ్యాపార రంగాలందు అనుకూలించుటకు "త్రి షట్ ఆయః, స్థితి శనికి ఏర్పడుట విశేష లాభదాయకం, ఆనంద దాయకం, ఆరోగ్యదాయకం, గ్రహించాలి స్త్రీలకు వృత్తియందు, ధనలబ్ధికి అనుకూలం

వృశ్చికం: మీరు బహు చాకచక్యంతో కార్యసాధన గావించుకో గలరు మీ శ్రద్ధాసక్తులే "మీకు శ్రీరామ రక్ష" కార్య సాధన యందు అశ్రద్ధ చేయకండి, అప్పులుంటే సాధించుకో యత్నించండి స్త్రీలకు ఇరుగు పొరుగు గొడవలు రాకుండా చూచుకోండి కార్యక్రమాలు ఎలాంటి వయినా మందకొడి నడక, నత్త నడక

ధనుస్సు: వారమంతా ఎలాగో, మొత్తం మీద హాయిగా ఆనందంగా గడచి పోతుంది తలపెట్టిన ప్రతి కార్యం ఒకటి రెండు రోజులు ఆలస్యమయినా మేలుగా సాగిపోతాయి, ఆదాయ లోపం లేదు ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయం, వృత్తిరీత్యా మేలు, స్త్రీలకు సుఖశాంతులు, పిల్లల వలన మేలు, అవివాహితులకు కల్యాణ ప్రయత్నాలు

మకరం: కుటుంబానందం, కుటుంబ వ్యక్తులను ఉత్సాహపరుచుటకై, అధిక వ్యయం కాని వర్గ మున్నది, జాగరూకతతో వారాంతం వరకు ప్రవర్తించాలి. పిల్లలను గూర్చిన వ్యవహారాలు మిమ్ము ఆకర్షించి, వారికి మేలు చేయ యత్నిస్తారు. సభలందు, సమావేశాలందు ప్రోత్సాహకరం, స్త్రీలకు: వృత్తియదు పెంపు, ఆదాయ వృద్ధి, గ్రహించాలి:

కుంభం: 'శని' వారాన మీరు యత్నించి, సానుకూలం గావించుకొనని వ్యవహారా లుండవు సాహితీ రంగాన మీ ప్రతిభ రాణిస్తుంది నూతనావకాశాలు లభిస్తాయి దైవానుకూలత వలన కొన్ని గడ్డు సమస్యలు సుకరంగా సానుకూల మవుతాయి స్త్రీలకు, ఉద్యోగం కొరకు యింటర్వ్యూకు వెళ్ళిన వారికి కాలం కలసి వస్తుంది

మీనం: ఈ వారంలో మీరు పెద్ద ప్రణాళికకై యత్నించటం న్యాయం గాదు గ్రహానుకూలత అంత క్షేమదాయకం గాదు అవసరాలకు డబ్బు అందటంలో ఏమాత్రం లోపం లేదు వివాహాది శుభ కార్యాన్వేషణకు, కాలం కలసి వస్తుంది స్త్రీలకు పట్టుదలతో, సమయస్ఫూర్తితో, ముందు వెనుకల ఆలోచనలతో అన్ని వ్యవహారాలు సానుకూల మవుతాయి, గ్రహించండి

– విద్వాన్ కోట సత్య రంగయ్యశాస్త్రి

పెద్ద కథ ప్రారంభం
చచ్చి ఏం సాధిస్తావ్?
వచ్చే సంచికలోనే

1989లో మీ 'రాశి' లాభనష్టాలు!

మేషరాశి

(అశ్వని, భరణి, కృత్తిక 1పా, జన్మ తారీకు మార్చి 21-ఏప్రిల్ 21 మధ్య)

జన్మించిన వారు, 'మేషరాశి' జాతకులు. ఇది నూతన ఆంగ్ల వత్సరం. ఈ రాశి జాతకులు తామ్ర వర్ణం గలవారై, బలశాలురై, పట్టుదలగలవారై, సామాన్యంగా జంకని ప్రకృతిగలవారై యుంటారు. స్ఫురద్రూపులై గణిత శాస్త్ర ప్రజ్ఞ, వ్యాపార దక్షత, రక్షక భట సంప్రదాయకులై దేశ రక్షణాదక్షులై యుంటారు మొదటి మూడు నెలలు దాటగనే, గురుడనుకూలుడు సుఖ స్థానస్థితి, శుక్రుడు అనుకూలుడైనందున దన, కనక, వస్తు, వాహనములకు చక్కని అవకాశాలుంటాయి. సంవత్సర ప్రారంభాన్నే, 12 నెలలు శుభదాయకమై, వృత్తియందు అనుకూలవంతమై, సుఖంగా సాగిపోతుందని గ్రహించగలరు. నాలుగో, ఏప్రిల్‌కు ముందే 'శుక్ర' అంతకు ముందే 'అష్టమ రాశి' దాటటంతో సర్వ విధాలా అనుకూలమై, మే, జూన్, జులై, నెలలు ఆనందదాయకములై, చిత్ర రంగ అనుకూలత గలిగినందున కొందరకు, వ్యాపారానుకూలత కొందరకు రాజకీయ రంగాన ప్రసిద్ధి కొందరకు, నూతనోద్యోగాలు ఫలితానికి రావటం చెప్పక తప్పదు. 'జులై, ఆగస్టు' నెలలందు వ్యాపార రీత్యాగాని, వ్యవహార రంగానగాని, ఆశించినంతకన్న అధిక పంట యింటికి రావటం, ధాన్యలక్ష్మి నిత్య నివాసానికి ఆస్కారమేర్పడుతుంది, ఈ రాశి స్త్రీలకు 'నవంబరు 14 తా. నుండి సంవత్సరాంతము కొరకు, అవివాహితులకు, కల్యాణ వైభవం. వ్యాపార రంగాన శ్రమించు వారికి అనుకూలం, ఉద్యోగ యత్నాలకు దిగిన వారికి అనుకూలత, చిత్ర రంగానుభవం గల వారికి చక్కని అవకాశాలు లభిస్తాయి వ్యయానికన్న ఆదాయం అధికం, అవమానానికన్న పూజ్యతకే అధిక్యత, సర్వ శుభదాయక వత్సరం 1989.

వృషభరాశి

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1పా, ఏప్రిల్ 22- మే 21)

పై నక్షత్రములందు జన్మించిన వారు, ఆ

విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

తారీకులందు పుట్టిన వారు 'వృషభరాశి' జాతకులు అందచందాలతో, ఆనందంతో, సుఖ సంపదలతో, కొత్త వచ్చినట్లు కనిపించే ఆకార సౌష్టవంగల వారు ఈ రాశి జాతకులు. స్త్రీలు, పసి నిమ్మ పండు చాయ, ఆకార సౌష్టవం, నాట్య నాటక చిత్ర రంగ ప్రసిద్ధిగలవారై వలచి వలపించు ప్రకృతిగలవారై ఉంటారు.

పన్నెండు రాశులందు 'వృషభరాశి' స్త్రీ పురుషాదులకు ప్రసిద్ధి యున్నది. 'శుక్రుడు' అధిపతి అయిన రాశి. 1989లో మార్చి 21 తా.నుండి వీరి ప్రతిభ, లాభం, అందం, ఆనందం, వృత్తి పెంపు. వ్యాపార రంగానుకూలత, ఆరోగ్య వృద్ధి, అప్రయత్న ధనలక్ష్మికి అవకాశం.

సంవత్సరమంతా లాభదాయకంగా ఉండగలదని ఏప్రిల్ 14 నుండి గ్రహింపగలుగుతారు. శ్రద్ధాసక్తులతో తెలివి తేటలతో మే, జూన్, జూలై నెలలందు 'శని, గురు' గ్రహాల వలన వ్యాపారాన, వ్యవహార రంగాన చిత్ర రంగాన, చివరకు రాజకీయ రంగాన సదవకాశాలు లభ్యమవుతాయి. పై పై మెరుగులతో కొందరు ఆగస్టు, సెప్టెంబరు నెలలందు తారసిల్లుతారు ఎంత జాగ్రత్తగా ఉండే అంత లాభదాయకం. రాజకీయాలందు మీ శక్తి యుక్తులు పలువురతో ప్రశంసింపబడుతాయి. అక్టోబరు, నవంబరు నెలలు, చిత్ర నిర్మాణదక్షులకు, గాయక వర్గానికి, చిత్ర రంగ రచయితలకు, పాత్రికేయులకు సదవకాశాలుంటాయి, తద్వారా ధనలబ్ధి.

డిశంబరు నెల యందు 'జాయింటు వ్యాపార' దక్షులకు సదవకాశాలు, కొందరకు నూత్న నిర్మాణానుకూలత, వాహన లాభం, రాశికి రెంట స్థితుడైన 'గురుని' వలన ఏదో విధంగా ధనలబ్ధి, ఆరోగ్యవృద్ధి. మొత్తమునకు 1989, సర్వ విధాలా శుభదాయకమై, లాభదాయకమై, గౌరవ ప్రదమై, ప్రసిద్ధులను కలసి కొనలరు. రాజ పూజ్యావమానాలు, ఆదాయ వ్యయాలు సమపాళ్ళలో లభ్యం కాగల వత్సరం 1989

మిధునరాశి

(మృగశిర, ఆర్ద్ర 3, 4 పా, పునర్వసు 1, 2, 3 పా, (మే 22- జూన్ 22తా) లందు జన్మించిన వారు 'మిధున రాశి'కి చెందినవారే)

రాశి చక్రంలో 'మిధునం' మూడవరాశి రాశి నాధుడు 'బుధుడు' జాతకులంతా, అనగా స్త్రీ, పురుషాదులందరు బుధ ప్రభావితులు బుద్ధియందు బృహస్పతి సమానులు, విద్యా వంతులు, సత్ప్రవర్తకులు, వ్యాపారదక్షులు

1989 సం ఈ రాశివారికి అందంగా, ఆనందంగా ఎలాంటి ఒడిదుడుకులు లేక, లాభదాయకంగా, వ్యాపార రీత్యా అనుకూలంగా, శుభావేగాహంగా, సుందరంగా, సర్వాభీష్టదాయకంగా జరుగుట నిశ్చయం. పూర్వార్ధానికన్నా ఉత్తరార్ధం ఆనందదాయకం 'శని' 7వ రాశి యందు, గురుడు వ్యయ, రాశులందు స్థితుడు. సర్వాభీష్ట దాయకులు, ఒక వేళ ఖర్చు అధికంగా కనిపించినా 'శుభ కార్య నిమిత్తమో, నూతన వ్యాపార నిమిత్తమో, వృత్తి పెంపునకో అగుట, గమనింప దగిన ముఖ్యాంశం.

బుధ, శుక్ర గ్రహాలు కూడ జూన్ నుండి అనుకూలురు. ఈ సమయాన్నుండి వ్యాపార వ్యవహారాలందు కొందరకు, ఆరోగ్య భాగ్యమందు కొందరకు. దీర్ఘ వ్యాధుల నివారింపబడుటకు ఆస్కారం కొందరకు లభ్యమగును, జూలై 15 తా నుండి ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలోగా చాల మంది ఈ రాశివారు, వృత్తి పెంపొందుటో, నూతన ఉద్యోగావకాశములో లభ్యం కాగలవు నవంబరు, డిశంబరు నెలలోగా చాల మంది, వివాహయోగ్యతగలవారికి, బంధు సంబంధములు నిశ్చయమగుట, బహు ధన ప్రాప్తి, సౌభాగ్యం, భాగ్య యోగ్యత సంక్రమించును

కొందరకు ఈ రాశి జాతకులకు, స్త్రీ పురుషాదులకు విదేశీయానం చెప్పదగిన ముఖ్యాంశం

చలన చిత్ర రంగానుభవం గలవారికి, అప్రయత్నంగా సదవకాశాలు, ధనలబ్ధి, నిర్మాతలకు చక్కని అవకాశాలుంటాయి దర్శకులకు చక్కని అవకాశాలు, రచయితలకు ఆనందదాయకములైన అవకాశాలు, పాత్రికేయులకు నిశ్చయంగా ధన లబ్ధిగల వత్సరం నూతన ఆంగ్ల సంవత్సరం 'విజయీభవ'

(ఇంకావుంది)

Printed and Published for Nageswararao Estates Private Ltd; by S. Nageswararao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Chief Editor : S. Radhakrishna, Advisory Editor: Veeraji,
Editor. M Madhavarao
Phones. Bussiness 61247, 61248, 75569 and Editorial 75667


మంగళ సౌభాగ్య చిహ్నం
ఐటెక్స్
మాట్ షేడ్ తిలకం
EYETEX
ఐటెక్స్ 48 సంవత్సరములుగ మీ
నమ్మకానికి పాత్రమైన ఉన్నతమైన చిహ్నం
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు 600 033
Imageads 2800 Tel



యూదుల పెళ్ళి గోరింటాకు పండుగ!

కెనడాలో పుట్టి పెరిగిన యువతికీ, యెమెన్‌లో పుట్టి పెరిగిన యువకుడికీ ఇజ్రాయిల్‌లో పెళ్ళి జరిగింది. ఆ యువతీ యువకులు ఇద్దరూ యూదులు కావడం, వారి వివాహం సాంప్రదాయిక యెమెన్ యూదుల ఆచార వ్యవహారాల ప్రకారం జరగడం ఒక విశేషం కాగా, 'హెన్నా' అనే పేరుగల ఈ యెమెన్ యూదుల సాంప్రదాయం మన సాంప్రదాయంలోని పెళ్ళికూతురిని చేయడం, గోరింటాకు పెట్టడం వంటి పద్ధతులకు దగ్గరగా ఉండడం మరొక విశేషం.

విశ్వవిద్యాలయంలో థియేటర్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన రోజ్ వోల్ఫ్‌మాలిచి తన పెళ్ళి యెమెన్‌లో స్థిరపడిన యూదుల ఆచార వ్యవహారాలలో జరుగుతుందంటే ఆనందంగా, అది ఒక అసాధారణ అనుభవంగా ఆహ్వానించింది. పూర్వకాలపు యెమెన్‌లోనైతే వధూవరులకు 'హెన్నా' అలంకరించే ఈ ఉత్సవం, అసలు పెళ్ళి (చుపా) కన్న వారం ముందు నుంచే జరిగేది. రోజ్ పెళ్ళిలో మాత్రం చుపా ముందు రోజు హెన్నాకు కేటాయించారు.


సాయంత్రం 5 గంటలకు రాచెల్ వివాహ గృహంలోకి వచ్చింది. ఆమె వయసు 70 పైచిలుకే. ఆ పండు ముసలి యూదు కుటుంబాల పెళ్ళికూతురిని అలంకరించే "అలంకరణవేత్త".

రాచెల్ రోజ్ మెడచుట్టూ మొదట నాలుగు మడతల గుడ్డ చుట్టింది. తర్వాత నల్లని అల్లికం పనితనంగల దుస్తులు తొడిగింది. ఆ దుస్తులే దాదాపు 5 కిలోల బరువుంటాయి. తర్వాత ఛాతీమీద ఏవో ఆభరణాలు అలంకరించింది. ఆపైన ముత్యాల గొలుసులు, వెండి పతకాలు, సూత్రాలు, కంకణాలు, దాదాపు వంద ఉంగరాలు బైటికి తీసింది. మెడలో ఒక దాని వెనుక ఒకటిగా గొలుసుల్ని అలంకరిస్తూ పోయింది. ఆభరణం ఆభరణానికీ దీవిస్తూ ఆమె అలా అలంకరించినవి మొత్తం 22 ఆభరణాలు! తర్వాత ఒక్కో చేతికి ఐదు కంకణాలు, ఒక్కో వేలికి రెండు ఉంగరాలు...! తర్వాత బంగారు నగిషీలతో అలంకృతమైన శిరో ఆభరణాలు తీసి దాని నుంచి సాగే బంగారు గొలుసులు గడ్డం చుట్టూ అల్లింది.

అలా మొత్తం 17 1/2 కిలోల ఆభరణాలు అలంకరించుకున్న రోజ్‌ను నవవధువుగా, యెమెనైట్ మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాలతో బైటికి తీసుకొచ్చాక వివాహ తంతు ప్రారంభమైంది.

రాత్రి 11 గంటలకు 94 సంవత్సరాల వృద్ధురాలు నవవధువును ఆశీర్వదించే 'హెన్నా' (గోరింటాకు) కార్యక్రమం మొదలయింది. హెన్నా మొక్క గింజలను నూరి ముద్ద చేసి, ఆ ముద్దను చర్మంపై పెడితే, చర్మం మీద నారింజ రంగులో గాని, ముదురు ఎరుపులో గాని మచ్చ నిలిచిపోతుంది. ఆ మచ్చ రెండు వారాలపాటు ఉంటుంది. ఈ మచ్చ ఆ వ్యక్తుల చేతుల మీద, హృదయాల మీద ఒక మాసిపోని బంధంగా ఉంటుందని వాళ్ళ విశ్వాసం.

ఇలా గోరింటాకు పండుగతో రెండు పరస్పర విరుద్ధమైన ప్రపంచాలు ఏకమయ్యాయని రోజ్ భావిస్తున్నది!



టెన్నిస్ 1988

1988లో అంతర్జాతీయ టెన్నిస్ రంగంలో అనేక సంచలనాత్మకమైన సంఘటనలు జరిగాయి.

స్వీడన్ ఆటగాళ్ళు అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లు నెగ్గడం, పశ్చిమ జర్మని మొదటిసారిగా డేవిస్ కప్ నెగ్గడం, స్టెఫీగ్రాఫ్, టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ సాధించడం మొదలగునవి టెన్నిస్ ఆటలో ఐరోపా దేశాల క్రీడాకారుల ఆధిక్యతను రుజువు చేస్తున్నాయి.

మొదట జరిగిన గ్రాండ్‌స్లామ్ టోర్నమెంటయిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఈసారి కొత్తగా నిర్మించబడిన ఫ్లిండర్స్ పార్క్ స్టేడియంలో జరిగింది. ఇందులో దరిదాపు ప్రపంచములోని ప్రముఖ ఆటగాళ్ళందరు

మాట్స్‌విలాండర్





స్టెఫీగ్రాఫ్

పాల్గొన్నారు. స్వీడిష్ ఆటగాడు మాట్స్ విలాండర్ మేటి ఆస్ట్రేలియన్ ఆటగాడు పాట్‌కాష్ నోడించి మూడవసారి ఆస్ట్రేలియన్ సింగిల్స్ పదవిని నెగ్గాడు. తర్వాత జరిగిన ఫ్రెంచి ఓపెన్‌లో అందరు నెగ్గుతారనుకున్న ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు ఇవాన్ లెండిల్ అసలు సెమీఫైనల్సుకు కూడ రాలేదు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్స్‌లో మాట్స్ విలాండర్ తలవని తలంపుగా ఫైనల్స్ కొచ్చిన ఫ్రెంచి ఆటగాడు హెన్రీ లెకొంటెను వరుస సెట్లలో ఓడించి ఫ్రెంచి టైటిల్ కూడ మూడవసారి నెగ్గాడు. ఇక తర్వాత జరిగిన ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ టోర్నమెంటు గురించి రకరకాల ఊహాగానాలు చెలరేగాయి.

ఆస్ట్రేలియన్ మరియు ఫ్రెంచి ఓపెన్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన మాట్స్ విలాండర్ ఈసారి వింబుల్డన్ కూడ నెగ్గగలడా లేదా, గత రెండేళ్ళ నుండి ఫైనల్స్ కొస్తున్న ఇవాన్ లెండిల్ ఈ సారి గట్టి పట్టుదలతో ఆది నెగ్గగలడేమో అని అందరి అంచన. రెండు సార్లు వింబుల్డన్ నెగ్గిన బోరిస్ బెకర్ వింబుల్డన్‌కు ముందు జరిగిన క్వీన్స్ క్లబ్ టోర్నమెంటులో స్టెఫాన్ ఎడ్‌బర్గ్ నోడించి మంచి ఫారం చూపించాడు– ఇది చూచి అందరూ బోరిస్ బెకర్ నెగ్గే అవకాశాలు బాగున్నాయని అంచనా వేశారు. కాని మొదటి నుండి అంచనాలు తారుమారయ్యాయి.

అలి అక్బర్

మేటి ఆటగాళ్ళు గోవిందా!

సీడెడ్ ఆటగాళ్ళు జిమ్మీకానర్స్, జాన్‌మెకెన్రో, పాట్‌కాష్, హెన్రి లెకొంటె ముందురౌండ్లలోనే ఓడారు. ఈసారి వింబుల్డన్ నెగ్గొచ్చు అనుకున్న విలాండర్ క్వార్టర్ ఫైనల్స్‌లోనే మెసిర్ (చెకొస్లావేకియా) మీద ఓడి పోయాడు. చివరకు జర్మన్ ఆటగాడు బోరిస్ బెకర్ మరియు స్వీడన్ ఆటగాడు స్టెఫాన్ ఎడ్‌బర్గ్ ఫైనల్స్‌లో తలబడ్డారు. ఒక గట్టి పోటీ తర్వాత ఎడ్‌బర్గ్ మొదటి సెట్ ఓడినా తర్వాత మూడు సెట్లు నెగ్గి మొదటి సారిగా వింబుల్డన్ సింగిల్స్ పదవి నెగ్గాడు. ఈవిజయంతో

ఇవాన్‌లెండిల్



వింబుల్డన్ సింగిల్స్ పదవి కూడ స్వీడన్ దేశానికి దక్కింది. ఇక చివర జరిగిన అమెరికన్ ఓపెన్‌లో కూడ ఆశ్చర్య కరమైన ఫలితాలు వచ్చాయి. వింబుల్డన్‌లో బాగా ఆడిన ఎడ్‌బర్గ్, బోరిస్ బెకర్, మెకాసా వే మెయర్ సెమీఫైనల్స్ కూడ చేరలేక పోయారు. గత మూడేళ్ళుగా అమెరికన్ ఓపెన్ గెల్చుతున్న ఇవాన్ లెండిల్ మళ్ళీ వరుసగా ఆయిదవసారి ఫైనల్స్ కొచ్చారు. అటు మాట్స్ విలాండర్ తన ప్రత్యర్థు లందరిని సునాయాసంగా ఓడించి వరుసగా రెండవసారి ఫైనల్స్ కొచ్చారు. అయిదు గంటల సేపు హోరాహోరిగా జరిగిన ఫైనల్స్‌లో విలాండర్, లెండిల్‌ను అయిదు సెట్లలో ఓడించి మొదటిసారిగా అమెరికన్ సింగిల్స్ పదవిని నెగ్గారు. అసలు అమెరికన్ సింగిల్స్ పదవిని నెగ్గిన మొదటి స్వీడిష్ ఆటగాడు విలాండరే! ఈ విజయంతో విలాండర్, లెండిల్‌ను త్రోసి ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను ఆక్రమించుకున్నారు. (లెండిల్ అమెరికన్ ఓపెన్ కనుక నెగ్గియుండి జిమ్మీకానర్స్ 157 వారాలు ప్రపంచ నంబర్ వన్‌గా వున్న రికార్డును ఆధిగమించి యుండేవాడు.) అయితే విలాండర్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచి, అమెరికన్ సింగిల్స్ పదవులను నెగ్గటం అతని ఆటలోని ప్రగతికి నిదర్శనం. వింబుల్డన్ కూడ నెగ్గియుంటే గ్రాండ్‌స్లామ్ చేసిన ఘనత సంపాదించి యుండేవారు. తోటి స్వీడిష్ ఆటగాడు స్టీఫెన్ ఎడ్‌బర్గ్ వింబుల్డన్‌ను నెగ్గటంతో స్వీడన్ దేశం గ్రాండ్‌స్లామ్ చేసినట్లయింది. ఇకసోల్ ఒలింపిక్స్‌లో అరవై నాలుగేళ్ల తర్వాత మళ్ళీ నిర్వహించ బడిన టెన్నిస్ అంశంలో చెక్ ఆటగాడు మిలోసావ్ మెసిర్ బంగారు పతకాన్ని నెగ్గాడు.



స్టెఫీగ్రాఫ్

టెన్నిస్ 1988

బోరిస్ బెకర్ ప్రతిభ

ఆటీవల న్యూయార్క్‌లో జరిగిన మాస్టర్స్ టోర్నమెంటులో జర్మన్ ఆటగాడు బోరిస్ బెకర్ ఒక గట్టి సంఘర్షణ తర్వాత ఇవాన్ లెండిల్‌ను అయిదు సెట్లలో (అందులో ఆఖరి సెట్టు టైబ్రేకర్) ఓడించడమే గాకుండా పరిపడి 45 లక్షల రూపాయల ప్రైజ్ మనీ కూడ సంపాదించాడు. బోరిస్ బెకర్ ప్రభావం వల్ల పశ్చిమ జర్మనీ టెన్నిస్ ఆట ఆధిక్యతకు చిహ్నమైన డేవిస్ కప్ కూడ నెగ్గింది. గత మూడేళ్లనుండి డేవిస్ కప్ విజేతగా వున్న స్వీడన్‌ను ఓడించి మొదటి సారిగా డేవిస్ కప్ నెగ్గింది. (అంతకు ముందు రెండుసార్లు ఫైనల్స్ కొచ్చింది)

బోరిస్‌బెకర్



వెనకబడ్డ అమెరికా

1988 సంవత్సరంలో డేవిస్ కప్, ఫెడరేషన్ కప్‌తో పాటే అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లు యూరోపు ఆటగాళ్ళే నెగ్గారు. కొన్నేళ్ళకు ముందు టెన్నిస్ ఆటలో బాగా ముందున్న అమెరికా ఆటగాళ్ళు ఈ సంవత్సరం ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నమెంటు నెగ్గలేదు. అమెరికా యువ ఆటగాడు ఆండ్రె అగాస్ ఫ్రెంచి మరియు అమెరికన్ టోర్నమెంట్లలో సెమీ ఫైనల్స్ కొచ్చారు. ప్రస్తుతం అతను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడవ స్థానంలో వున్నారు. డేవిస్ కప్ పోటీలో అమెరికా 16 దేశాలుండే గ్రూప్‌లో రావడానికి కూడ అగాసి తోడ్పడ్డారు. వయసొళ్ళ మైకెల్ ఛాంగ్, డెరిక్ రోస్టాగ్నోలు మంచి సామర్థ్యాన్ని చూపెట్టారు– వీరు గాకుండ ఎమిలియోసాంఛెజ్ (స్పెయిన్) కార్ల్‌స్టెన్ (పశ్చిమ జర్మని) మైకెల్‌హౌవ్ ఎస్ట్రాన్ బర్గ్ (ఆస్ట్రేలియా) మంచి ప్రదర్శనలిచ్చారు.

స్త్రీలు

ఈ మహిళల విభాగంలో 1988 సంవత్సరం స్టెఫీగ్రాఫ్‌కు చెందినదని చెప్పొచ్చు. ఈ పశ్చిమ జర్మని బాలిక ఆస్ట్రేలియన్, ఫ్రెంచి, వింబుల్డన్ మరియు అమెరికన్ ఓపెన్ నెగ్గి టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ చేయడమేగాక సోల్ ఒలింపిక్స్‌లో కూడ బంగారు పతకాన్ని నెగ్గింది. క్రిస్ ఎవర్ట్, మార్టినానవరతిలోవ, పామ్‌ష్రైవరల ప్రతిభతో ఎప్పుడు ముందుండే అమెరికా 1988లో వెనకబడింది. స్టెఫీగ్రాఫ్ గాకుండ హెలెనసుకోవ (చెకోస్లొవెకియ) నటాలియ జ్వెరవ, లారిస సావ్‌చెంకో (రష్యా) ఆరాంట్స సాంఛెజ్ (స్పెయిన్) మంచి ప్రగతిని సాధించారు. వీరుగాకుండ అర్జెంటినా బాలిక గాబ్రియెల సబాటిని తన అందంతో, టెన్నిస్ ఆటతో పెద్ద సంచలనం కలిగించింది. స్టెఫీగ్రాఫ్‌ను రెండుసార్లు ఓడించడమే గాకుండ ఇటాలియన్ సింగిల్స్ టైటిల్ మరియు వర్జీనియా స్లిమ్స్ మాస్టర్స్ టోర్నమెంటు కూడ నెగ్గింది. 1989లో ఈ అర్జెంటిన సుందరాంగి కలకా ఘన విజయాలను సాధించవచ్చు.

1988లో భారత దేశం టెన్నిస్ ఆటగాళ్ళ ప్రదర్శన చెప్పుకోదగ్గదిగా లేదు. మన ప్రముఖ ఆటగాడు రమేష్ కృష్ణన్ సంవత్సర ఆరంభంలో న్యూజిలాండ్ జాతీయ ఛాంపియన్ షిప్పు నెగ్గాడు. ఆ తర్వాత మళ్ళీ మరో టోర్నమెంటు నెగ్గలేదు– మన యువ ఆటగాడు జీషాన్ అలీ జపాన్‌లో కొన్ని సాటిలైట్ టోర్నమెంట్లు నెగ్గారు. కాని ఇంతవరకు అనుకున్నట్లు ప్రగతి సాధించ లేదు. ఇక డేవిస్‌కప్ పోటీల్లో ఇజ్రాయిల్ మీద ఆడడానికి తిరస్కరించి నందుకు అంతర్జాతీయ టెన్నిస్ సంఘం ఇండియాను నుండి బహిష్కరించి తర్వాత జరిమానాతో వదిలింది. 1988 సంవత్సరంలో ప్రొఫెషనల్ టెన్నిస్ ఆటగాళ్ళు 1990 నుండి తమకు అనుకూలమైన టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడడానికి తీసుకున్న నిర్ణయం గమనార్హం.